సంస్థాపకులు
కీ॥ శే॥ వి.వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి
రాఘవయ్య

జ్యోతి
సచిత్ర మాస పత్రిక

ఫిబ్రవరి 1979

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 17 — సంచిక 1

విషయ సూచిక

పదబంధ ప్రహేళిక	14	శ్రీశ్రీ
రసవద్గీత	16	అవసరాల రామకృష్ణారావు
ప్రేమసింహాసనం (సీరియల్)	18	యద్దనపూడి సులోచనారాణి
మయసభ	29	ఎ. రామసంజీవి
పులలకు మనసులుండవా....అంకుల్	33	"రేవతి"
రాజ'కీ'యం	41	టి. విమల
జెయిల్లో చందమామ	50	ఏ. యస్వీ. రమణారావు
పూలూ—ముళ్ళూ (సీరియల్)	55	ఐ.వి.యస్. అచ్యుతవల్లి
నాలుగు పాదాల ధర్మాసుపత్రి	68	సి. వి. రమణ
కాచేదీ కవితకి అర్థం	71	పి. వి. ఆర్. శివకుమార్
దేవుడే శిక్షించాడు	78	ప్రఫుల్ల చంద్ర
జాగా	89	పి. శ్రీనివాసశాస్త్రి
గ్రేట్మైన్థింకెలైక్	95	శ్రీరాజ్
తిరుగులేని తీర్పు	106	యామిజాల పద్మనాభస్వామి
ఈ తరం స్త్రీ	110	రాజ్యలక్ష్మి
సినిమా	119	యస్వీనారాయణ

ఇంకా కవితలూ, కార్టూన్లూ, జయదేవ్ (వి)చిత్ర విజ్ఞానం!

నవలానుబంధం
నెవర్ లీవ్ మీ—మ్యూర్

ముఖచిత్రం:
'అందమైన అనుభవం'లో కమలహాసన్-జయప్రద, కమలహాసన్, జయప్రద.

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, P. B. నెం. 2650, మద్రాసు-600 024.
ఫోన్: 423123. సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో రు. 42/)


దాసరి నారాయణరావు
శ్రీ లలితా ఎంటర్‌ప్రైజెస్
కోరికలే గుర్రాలయితే?
కలర్
నిర్మాత జి. జగదీశ్‌చంద్రప్రసాద్ B.A
Nandi
JAGAPATHI
అన్నపూర్ణ విడుదల

తొలిమాట

ఏది ఉత్తమ సాహిత్యం? ఏది కాదు?—ఈ ప్రశ్నకు జవాబు రకరకాలుగా ఉంటుంది. సామాజిక స్పృహతో, సమాజానికి ఉపయుక్తమయే అంశం గల రచనల్ని ఉత్తమ సాహిత్యం అని కొందరంటారు. ప్రముఖ ఆంగ్ల రచయిత ఆస్కార్ వైల్డ్ మంచి కథలు, చెడ్డ కథలూ అంటూ వేరే ఉండవు, బాగా రాయబడ్డవీ, రాయబడనివీ మాత్రమే ఉంటాయి [దేరార్ నో మోరల్ స్టోరీస్ ఆర్ ఇమ్మోరల్ స్టోరీస్, స్టోరీస్ ఆర్ వెల్ రిటెన్ ఆర్ బాడ్లీ రిటెన్] అంటారు. మానవత్వపు విలువల్ని ప్రస్ఫుటింపజేస్తూ చేయబడ్డ ప్రతి రచనా మంచిదే అంటారు కొందరు. ఇలా ఉత్తమ సాహిత్యం అంటే రకరకాల నిర్వచనాలతోనిండి ఉంది.

ఇప్పుడు మరో ప్రశ్న తలెత్తింది. పాప్యులర్ పీరియాడికల్స్ ద్వారా ఉత్తమ సాహిత్యం రాదు (?) అన్నది ఒక విమర్శ. ఆ విమర్శను మేం ఒప్పుకోలేకపోతున్నాము. పత్రికలు నడపడంలో అలా నడిపే వారందరిదీ 'కేవలం' వ్యాపార దృక్పథమే అనుకోవడం పొరపాటు. ఆ మాటకొస్తే రచయితలు, రచయిత్రులు 'అందరూ' కేవలం ప్రతిఫలాపేక్షతోనే రాస్తున్నారనుకోవాలా? పత్రికలు వ్యాపార దృక్పథంతో కూడా ఉంటాయి. అది నిజం. ఈ విషయాన్ని ఇదివరకు మేం వివరించి ఉన్నాంకూడా. పత్రిక ప్రాచుర్యానికి, సర్క్యులేషన్ పెంచటానికి చాలా మంది కాలక్షేపపు రచనలుగా భావించే రచనలు (ఎక్కువమంది పాఠకులకు నచ్చేవి) ప్రచురించటమూ జరుగుతుంది. అయితే ఏ ఎడిటరైనా తన చేతికివచ్చిన మంచి రచనలను వదులుకోడు. పత్రికలలో ప్రచురించబడే ప్రతి రచనా ఎవరికి వారు నిర్వహించుకొనే 'ఉత్తమ సాహిత్యపు' పరిధిలోనికి రావాలనుకోవడం అత్యాశే అవుతుంది. నిరంతరం సాహిత్యమథనం చేస్తాయి పత్రికలు. ఎవరి నిర్వచనానికైనా అందే ఉత్తమ సాహిత్యం—తక్కువ శాతంలోనైనా—ప్రతి పత్రికలోనూ ప్రచురించబడుతుంది.

ప్రముఖ రచయితలుగానే గాక, ఉత్తమ సాహిత్య సృష్టికర్తలుగా పేరొందిన కీ॥ శే॥ గోపీచంద్, శ్రీ కొడవటిగంటి కుటుంబరావు, శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారల రచనలు ఎక్కువగా పత్రికలద్వారా వెలువడినవే గదా!

ఇది మేము రాయడానికి కారణం—శ్రీమతి మాలతీచందూర్ తెలుగు నవలలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాసిన వ్యాసంలోని ఈ దిగువ వాక్యాలు:

"మన వారపత్రికల్లోంచి, మాస పత్రికల్లోంచి ఉత్తమ సాహిత్యం రాదు. వ్యాపార ధోరణికీ, సాహిత్య విలువలకీ పొంతన కుదరదు. ఉత్తమ సాహిత్యం రావాలంటే, ఉన్నత ప్రమాణాలు గల నవలలు రావాలంటే మనకి లిటరరీ అసోసియేషన్స్, బుక్ క్లబ్బూ రావాలి. తద్వారా మంచి రచనలూ-రచయితలూ వచ్చే అవకాశం ఉంది తప్ప మన పాప్యులర్ పీరియాడికల్స్ ద్వారా మటుకు కాదు."

ఈ విషయంగా పాఠకుల నుంచీ, రచయితలనుంచీ అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాము.

26 జనవరి

పవిత్ర వార్షికోత్సవం—ముమ్మాటికి శుభదినం

ఈనాడు, 49 సంవత్సరాలక్రితం, మనం పూర్ణ
స్వరాజ్ సాధిస్తామన్న దృఢసంకల్పాన్ని ప్రకటించాం

ఈనాడు, 1950 లో రిపబ్లిక్‌గా, మనం ప్రకటించుకున్నాం.
న్యాయము, స్వేచ్ఛ, సమానత సౌభ్రాతృతలను పొందు
పరుస్తూ రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాము.

రెండేండ్ల క్రితం దాదాపు ఇదే దినాల్లో రాజ్యాంగ హామీ
పొందిన ప్రజాస్వామ్య పునఃస్థాపన కృషి ప్రారంభించాం.

ఈ వార్షికోత్సవ సందర్భంగా—

మన స్వేచ్ఛను తిరిగి స్థాపించుకోగలిగినందుకు
ధన్యవాదాలు తెలుపుకుందాం.

స్వేచ్ఛ, సమానతల సాధనలో అసువులు
బాసిన వారి కలలు పండేట్టు కృషిచేద్దాం.

సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని
త్వరలో సాధించేందుకు పునరంకిత మవుదాం.

●

davp-78/408


డి.రామానాయుడు
సమర్పించు
వెంకటేష్ ఎంటర్‌ప్రైజెస్
ఎంకి
నాయుడు బావ
నిర్మాత: డి.వెంకటేష్
దర్శకత్వం బోయిన సుబ్బారావు
పాటలు ఆచార్య ఆత్రేయ సంగీతం కె.వి.మహదేవన్
ఆంధ్ర-సీడెడ్ నవయుగ నైజాం విజయా సురేష్ పిక్చర్స్

ఉత్తరాలు

ముందుగా వచ్చిన జనవరి సంచికలో "రాబందుల రెక్కల చప్పుడు" కథ హైలైట్.

తరువాత రచయితలకు సందేశాన్నివ్వాలని ఒక ఉద్యమాన్ని తీసుకొని రచించిన "పిచ్చి దానిగీత" 'శైలకుమార్'గారి కథ చాలాబాగుంది. రచనాశైలి పాఠకుడిని ఆగనివ్వదు. కానీ ఇంకా కొన్ని విషయాలను క్లియర్‌గా చెప్పి వుంటే ఇంకా బావుండేది.

మంచి సాహిత్యాన్ని అందిస్తున్న జ్యోతికి మా హృత్పూర్వక శుభాకాంక్షలు. ప్రేమ పిపాసి బోర్‌గావుంది. మంచి కవితలు అందించండి.

—జ్యోతిరమణ, హైదరాబాద్.

డిసెంబర్ '78 'జ్యోతి'లో వినయ్‌గారి 'శేషప్రశ్న' కథ మంచి ప్రయత్నమే. దొరలు చేస్తున్న జులుం పోలయ్యలాంటి పల్లెవాసులకు తెలియడంలేదు. కాని "ఎండిపోయిన చెరువు పల్లెప్రజల మెదళ్ళులాగే వుంది" అనడం సబబు కాదు. తరతరాల అణచివేతలో, దోపిడీలో నలిగిపోయి అనుభవం పొందిన ప్రజలు రచయిత అనుకున్నంత అజ్ఞానులుకారు. ఎప్పటి అనుభవాలూ, జ్ఞాపకాలో ఎందుకు: ఇపుడు కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని తెలుసుకుంటే చాలు; పుస్తకాలచదువు రాకున్నా, దేవుడ్ని గుడ్డిగా నమ్మకోవడం మానకున్నా, ప్రజలు ఎంతశక్తి గలవారో తెలుస్తుంది. ప్రజలను నిందించే, ఎగతాళిచేసే,

రచనలు సమగ్రతకూ, సామాజిక ప్రయోజనానికి దూరంగా వుంటాయి.

"సిద్ధాంతాల్లాగా వున్నాయి అక్కడొకటీ, ఇక్కడొకటీ మబ్బులు. అవి ఎప్పటికయినా వర్షమంటూ కురిసినా, ఆ చెరువు నిండటం కష్టమే" అన్నారు రచయిత. మనచుట్టూవున్న సమస్యలనుంచి, మెజారిటీ ప్రజలకోసం, పుట్టిన సిద్ధాంతం ప్రజలకు పనికి వచ్చేదిగానే వుంటుంది. ప్రజాసమస్యలకూ, వాటి పరిష్కారానికీ, దూరంగా ఆకాశంలో తేలే సిద్ధాంతాలు కళ్ళునెత్తికెక్కిన వాళ్ళకే కనిపిస్తాయి. వాటిని ప్రజలకు పనికివచ్చే సిద్ధాంతంతో జత చేసి చూడడం అశాస్త్రీయం.

"అక్కడా ఇక్కడా ఏదో ఒకటి ఏరుకొని తింటున్న పశువులు విప్లవకవుల్లాగా వుండుండి ఓ అరుపు అరుస్తున్నాయి" అనడం విప్లవ కవులమీద రచయితకున్న అక్కసును మాత్రమే చూపడంలేదు; తన కథలో రచయిత చూపిన దయనీయ పరిస్థితిలో విప్లవం (మార్పు) రావాలనికోరే కనీస బాధ్యతకూడా రచయితలో లోపించడాన్ని చూపిస్తున్నది. విప్లవకవులు పోలయ్యలకు అన్యాయం చేయడానికి రాస్తున్నారా? దొరల కాళ్ళొత్తే కవిత్వం రాస్తున్నారా? సుబ్బారావు పాణిగ్రాహిలాంటి కవులు పెన్నుతో గన్నుసైతం పట్టగలిగినా, మిగతా విప్లవ కవులు "కాగితం మీద ఒక మాటకు (అయినా) బలి" (శ్రీశ్రీ) అవుతున్నారు గదా? వాళ్ళుచేసిన ప్రజాద్రోహం యేమిటి? "అక్కడా యిక్కడా ఏదో ఒకటి యేరుకొని తింటున్న" కలంగారడీకైతల వలలల్లే కవులు వినయ్‌గారికి "పశువులు"గా కనిపించకుండా పోయారా? వీళ్ళ దోమలసంగీతాన్ని/సామ మనకు" అని కాళోజీ హెచ్చరిస్తూనేవున్నాడు.

ఇక—రుదయం, సుబ్బులు, చెబుతాను, మాఁవా, పనిజేస్తోందో, ఎంటో (ఏంటో)— అనే మాటలు తెలంగాణా మాటలుకావు.

—విజయ్, వరంగల్.

"పడమట సంధ్యారాగం" సీరియల్ మొదలుపెట్టుట చాలా బాగుంది. కాని ఎండింగ్ ఏమి బాగాలేదు. అపుడే అయిపోతుంది అనుకో

లేదు. ఇందులో అసలు శ్రీవల్లి గురించి ఒక బస్సులో తప్పిపోవడం తప్పించి ఇంక ఎక్కడ శ్రీవల్లి గురించి ఎత్తలేదు. శ్రీవల్లి ఏమైందో తెలీదు. మీరు రాసిన చివరిభాగంలో లోయలో చూసిన దంపతులని చూసి యింక యింటికి వెళ్ళడు. ఆ దంపతుల్లోగాని శ్రీవల్లి లేదుకదా! మేము అనుకోడం ఆమె శ్రీవల్లి అని. న్యాయంగా సత్యమూర్తి జాతక చక్రం చూస్తే శ్రీవల్లి యింక కనిపించదు కదా! ఏమైనా ఎండింగ్ మమ్మలని చాలా నిరాశపరచింది. ప్రియంవద కొడుకు ఏమైనట్టు? మళ్ళీ మీరు దానిని పొడిగించి యింకా రాస్తే బాగుంటుం దని మా అభిప్రాయం. ఇందులో తప్పుగా యేమైనా రాసివుంటే క్షమించవలెను. ఇది రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తిగారికి తెలుపవలెను.

-జి.ఆర్. మోహన్‌రాయ్, విశాఖపట్టణం.

"పడమట సంధ్యారాగం"లో కొన్ని అసహజ సంఘటనలున్నాయి. వాటిలో కన్నబిడ్డను (పసిపిల్లను) భార్య ప్రేమయొక్క మత్తులో పడి ద్వేషించడం, కఠిన పాషాణ హృదయుడిలా పిల్ల ఫోటోను చింపి పారవేయడం అసహజం గానూ, ఒకవేళ యెక్కడో వున్నా చదవడానికి వెగటుగానూ వుంది. రచయిత శైలికి చదివించే శక్తి వుంది. ముఖ్యంగా హిందూ మతానికి క్రిష్టియన్ మతానికి ఉన్న తేడాను హిందూ మతంయొక్క ప్రత్యేకతను, చాలామందికన్న బాగా చెప్పారు రచయితగారు. జ్యోతికి అభినందనలు.—పి. రామలక్ష్మి, ఛత్రపూర్.

జయప్రద ముఖచిత్రంతో వెలువడిన జనవరి, "జ్యోతి" సంచిక జ్యోతిలాగా ఎంతో కాంతివంతంగా వెల్గి, మా హృదయాలను యిట్టే లాగేసిందంటే నమ్మండి?

"పూలూ-ముళ్ళూ", "ప్రేమ సింహాసనం" సీరియల్స్ యెంతో యింటరెస్టుగా ముందుకు సాగిపోతున్నాయి. "అలజడి", "దేవుని ముగింపు", "పరమపద సోపానం" 3 కథలూ మాకుఒక్కొక్కరికి ఒక్కొక్కథ బాగానచ్చాయి.

ఇకపోతే....తోటకూర ఆశాలతగారి "ప్రేమ పిపాసి" నవల మాత్రం మా ముగ్గురిని ఎంతో ఆకట్టుకొంది. రచయిత్రిగారికి, ప్రచురించి మా కందించిన "జ్యోతి" ఎడిటర్‌గారికి, మా హృదయపూర్వక అభినందనలు.

—కాయితాపురం ఉపేందర్‌రెడ్డి,
పోట్ల శ్రీనివాసరావు,
కల్యాణం వెంకటయ్య, జనగామ్.

జ్యోతి సచిత్ర వారపత్రిక ప్రచురించేందుకు మేము డిక్లరేషన్ పొందియున్నాము. మద్రాసులోని చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు **R. DIS. No. 6070/78** గల నెంబరుతో డిక్లరేషన్ చెయ్యబడినది.

ఇటీవల తెలుగు పత్రికలతో విజయవాడ నుండి జ్యోతి వారపత్రిక పేరిట వస్తున్న ప్రకటనలతో మాకెట్టి సంబంధమూ లేదు. మేము తీసుకొని రాబోవు జ్యోతి సచిత్ర వార పత్రిక మద్రాసు నుండి ప్రచురించబడును. జ్యోతి సచిత్ర వార పత్రికను ప్రచురించే హక్కు మాకు మాత్రమే ఉన్నది. జ్యోతి సచిత్ర వారపత్రిక పేరుతో ఇతరు లెవరయినా పత్రికను ప్రకటించినా అందుకు మా బాధ్యత ఉండదు. వారిపై చర్యతీసుకునే హక్కు కూడా మాకుంటుంది.

మేనేజర్,
జ్యోతి సచిత్ర మాస పత్రిక,
మద్రాసు-600 024.


దానిని నేటివరకు కొనకుండుటకు నాకు ఒకేఒక కారణం వుండేది. అది యిపుడు మాయమైపోయింది

సువేగా డీలక్స్ జంట సీట్లు—రెండు విధాల పొదుపు సాధింపవచ్చు.
ఇక మనము భేదాలను పరిశీలిస్తాము.

మోపెడ్స్ అన్నియు ఒకే విధంగా ఉత్పత్తి కాలేవని మీకు తెలుసు గదా
సువేగా భేదాలను గమనించండి,

* సువేగా—పొదుపుగల మోపెడ్. ఇందలి సరిక్రొత్త ఎస్ ఎన్ సీరీస్ కార్బొరెటర్ ఒకే ఒక లీటరుతో మిమ్ము 70 కిలో మీటర్లు తీసుకొని పోగలదు.
* సువేగా—భద్రతగల మోపెడ్. అధిక స్థిరత్వమునకు చెయిన్ ప్రయాణము మరియు లోవైపున బలమైన పెట్టె రూపమున సెక్షన్ ఫ్రేము గలిగివుంది.
* సువేగా—మన్నికగల మోపెడ్. ఇందు దిట్టమైన క్రోమ్డ్ అల్యూమినియం మిశ్రమ సిలిండర్లు గలవు. ఇవి వెనుకవైపు తాకిడికి తట్టుకొని గతుకులుగల రోడ్లలో కదలకుండా సుఖంగా ప్రయాణం చేయుటకు మా డీలక్సునందు అమర్చబడి యున్నవి. మెయింటినెన్సు మరియు మరామత్తుల ఖర్చు తక్కువ
* సువేగా-తేలికగా బయలుదేరు మోపెడ్. ఇది ఒకే ఒక దెబ్బతో బయలుదేరుతుంది.

వెనుకచూపు వద్దు—సువేగా కొనండి. సువేగా డీలరును కలుసుకోండి.



సువేగా డీలక్స్ యిపుడు రెండు సీట్లు గలది.

Suvega

సువేగా సాటిలేని మోపెడ్‌కు మరొకపేరు.

మోపెడ్స్ ఇండియా లిమిటెడ్,
తిరుపతి, ఆంధ్రప్రదేశ్.

SAA/MIL/122/TEL

మీరా

మీరా

మీరా

మీరా

మీరా

ఇంటింటా మార్మోగబోతున్న పేరు మీరా

జ్యోతి పరిచయం చేస్తున్న

నూతన రచయిత్రి

లక్ష్మి

అందిస్తున్న

కొత్త సీరియల్

మీరా

వచ్చే సంచిక నుంచే ప్రారంభం!

పలురంగాలలో ఆంధ్ర ప్రముఖులు

స్టాక్ అండ్ షేర్స్‌లో బ్రోకరేజి వ్యాపారాన్ని చేపట్టి విజయం సాధించిన తొలి ఆంధ్రుడు శ్రీ జె. వి. సోమయాజులు. ఈ వ్యాపార నిర్వహణకు కేవలం పట్టుదలే చాలదు. మార్కెట్లో వ్యాపారం స్థితి ఎలా ఉన్నదీ, దేశంలో రాజకీయ వాతావరణం ఏ విధంగా ఉన్నదీ, ఇంకా ఎన్నో ఇతర విషయాలపై సంపూర్ణమైన అవగాహన కావాలి. అవన్నీ కలిగి ఉండటం మూలాన్నే ఆ వ్యాపారంలో విజయం సాధించీ, ఇప్పటికీ విజయవంతంగా నిర్వహిస్తున్నారీయన.

కృష్ణాజిల్లా కలువపాములలో జన్మించి గుడివాడలో, నెల్లూరులో, అన్నామలై యూనివర్సిటీలలో విద్యాభ్యాసం చేసిన శ్రీ సోమయాజులు 'బాట్లీవాలా అండ్ కరాని'అనే సంస్థ (బొంబాయి)లో స్టాటిస్టీషియన్‌గా పని చేశారు తొలుత. తర్వాత తన సంస్థ 'సోమయాజులు అండ్ కో' ప్రారంభించి మద్రాసులో స్థిరపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతి ఆశాజనకంగా లేదని బాధపడే యీ వ్యాపారవేత్త కోట్లాది పెట్టుబడితో పెద్ద సంస్థలుగాగాక స్థానిక వనరులతో చిన్న పరిశ్రమలను ప్రోత్సహించడం అవసరమని అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వనరులకు లోటు లేదనీ వాటిని సరియైనరీతిలో ఉపయోగించుకోగలగటంలోనే మనం కృషి చేయవలసి వుందనీ అంటారు శ్రీ సోమయాజులు.

'కొన్ని సీజన్లలోనే పనులు లభించే వ్యవసాయ కార్మికులకోసం కుటీరపరిశ్రమలు అభివృద్ధి చేయాలి. చదువుకొని నిరుద్యోగులుగా వున్నవారికోసం స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించాలి' అన్నారు శ్రీ సోమయాజులు నిరుద్యోగ సమస్య గురించి ప్రస్తావించినప్పుడు.


శ్రీ సోమయాజులు ప్రతిభకు గుర్తింపుగా ఆయనను యెన్నో సంస్థలలో డైరెక్టరుగా నియమించింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. ఆర్థిక విషయాలపై పత్రికలకు వ్యాసాలూ, రేడియోలో ఉపన్యాసాలూ యెన్నో చేశారు శ్రీ సోమయాజులు. 25 మంది సభ్యులుగల 'నాన్ అఫిషియల్ ట్రేడ్ డెలిగేషన్' శ్రీ సోమయాజులు నాయకత్వంలో జపాన్, ఫార్ ఈస్ట్ దేశాలు పర్యటించి కేంద్రప్రభుత్వానికి ఆ దేశాలకూ, భారతదేశానికి మధ్య వ్యాపారాభివృద్ధికి అవసరమైన సూచనలు చేసింది.

వ్యాపార విషయాలలో తీరికలేని వ్యక్తి అయినా, సాంస్కృతిక విషయాలపై అమితాసక్తిని చూపిస్తారు శ్రీ సోమయాజులు. చెన్నపురి ఆంధ్ర మహాసభతో ఇరవై సంవత్సరాలుగా సంబంధంగల వ్యక్తి ఈయన. మద్రాసులో ప్రారంభించబడ్డ ప్రతి సాంస్కృతిక సంస్థతోనూ సంబంధం గలిగి ఉన్నారీయన.


శ్రీ సోమయాజులుకు అయిదుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. అందరూ విద్యాధికులే!

తమిళనాడు రాష్ట్రంలోని తెలుగువారందరూ కలిసేలా 1979లో ఒక కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నారు శ్రీ సోమయాజులు. అనేక విషయాలపై ఒకరితో ఒకరు చర్చించుకొనే అవకాశం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకొనే అవకాశం కలుగుతాయని ఆశిస్తున్నారీయన, ఈ కార్యక్రమం గురించి వివరిస్తూ.

—పి. సరళా సూర్యారావు



శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు ఫిబ్రవరి '79

అడ్డం:

1. చంద్రుడి ఒక భార్య
4. వన వర్ణనకి ప్రారంభం (మన ప్రబంధాలలో చేరుతు)
7. మూకీలు మొగాలమీద కనిపిస్తాయి.
8. కొస చిరిగిన కంచుకం
10. దీని తర్వాత శుభం
11. సాహిత్య విమర్శ
13. మేఘం ఎగిరేది
14. కవిత్వం లాగ కరతాళ ధ్వనులు
15. బాక్సాఫీసు బద్దలు కొడతాయి
16. ఒక విభక్తి ప్రత్యయం
18. ఆకలి (దానికే ఇది తెలియదు)
21. నిశిలో, రోదసిలో కనిపించేది
22. వచనానికి అప్పకవి
24. కొందరి బ్రతుకులు
25. యౌవనము (కొద్దిగా వెడింది)

నిలువు:

1. చలించక
2. ఉజ్వాలాగమనం
3. పెట్టుబడిదారు?
4. బహువచనంలో 23
5. తోక తెగిన దుష్టుడు
6. అప్పకవి ఒప్పుకోనిది

9. సాధారణంగా గ్రంధాలలో కన్పించేది
10. వ్యక్తిత్వం చాటుకో
12. నూరు కాకుల్ని తిన్న రాబందు
15. 1, 2, 3, 4, వగైరా: ఎలాగున్నాయి?
17. శుభకార్యాలలో పంచిపెట్టేది.
19. భరతుడికి రాముడు, సహదేవుడికి భీముడు.
20. అనసూయకు లేనిది
22. అర్థంలేని అక్షరాలు మంచి గదుల్లోనే:
23. ఏకవచనంలో 4 నిలువు.

జనవరి పదబంధ ప్రహేళికకు సమాధానం:

అడ్డం: 1. ఏరువాక 4. న్యస్తాక్షరి 7. పిల్లనగ్రోవి 8. కోవ 10. మట 11. ళ్ళు సంకె 13. విధులు 14. మంకెన 15. కైసేత 16. యక్షిణి 18. వాన 21. కరం 22. తనుత్రాణము 24. లుక లాపు 25. తరువాత.

నిలువు: 1. ఏటికోళ్ళు 2. వాపి 3. కల్లరి 4. న్యగ్రోధం 5. స్త్రావి 6. రివటలు 9. వసంతసేన 10. మధు మక్షిక 12. సంకెళ్లు 15. కైవారాలు 17. ణిరంగిత 19. నునుపు 20. కణత 22. తలా 23. మురు.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి జనవరి 27 వ తేదీలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడు తుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.


జనవరి పదబంధ ప్రహేళిక విజేతలు:

(1) కె. ముత్యాలు, ఏలూరు (2) ఎ. వెంకటసుబ్రహ్మణ్యం, గారా (3) ఎ. హెచ్. రావు, హైదరాబాదు (4) ఎమ్. భాస్కరరావు, హైదరాబాద్ (5) టి. సుధాదేవి, హైదరాబాద్ (6) కె. పద్మావతి, హైదరాబాద్ (7) ఎన్. సిహెచ్. జగన్నాధాచార్యులు, కొత్తగూడెం. (8) వి. వెంకటరాజు, కాకినాడ. (9) కె. యల్. నరసింహమూర్తి, కూరెళ్ళ (10) పి. సరస్వతి, మలికి పురం (11) ఆర్. శ్రీమన్నారాయణశర్మ, నల్లగొండ (12) వి. రంగాచార్యులు, నల్లగొండ (13) ఎమ్. విజయభాస్కరరెడ్డి, నెల్లూరు (14) ఐ. వి. రఘురామమూర్తి, నెల్లూరు (15) తోట రామలక్ష్మి, ప్రొద్దుటూరు (16) టి. నరసింహారావు, పందిళ్ళపల్లి (17) ఎ. కోదండరావు అండ్ సుబ్బారావు, రాజమండ్రి (18) ఎ. వెంకటసుబ్బారావు, నందివెలుగు (19) పి. వి. క్రిష్ణయ్య, వాత్తేరు (20) దయానిధి పాత్రో, విశాఖపట్నం 21. కె. వెంకటరావు, విశాఖపట్నం. (22) అధికార్ల శారదాదేవి, విజయనగరం (23) కె. శివప్రసాద్, వేములవాడ (24) బి. శారద, హైదరాబాదు (25) ఎ. నరసింహాచార్యులు, ఖర్గపూరు (26) ఎన్. కె. రామారావు, నల్లగొండ, (27) టి. రాములు, విజయనగరం. వీరందరికీ బహుమతి పంచి పంపిస్తున్నాము.

సూక్తి విద్యా సుహాస్యయోగం

కుర్రతనం చేత కొట్టి పారేస్తాంగానీ,
పెద్దల నీతుల్లో ఎంత ప్రయోజనం ఉందనీ!
సూర్యానికి తన మూడో భార్యామణి లెటరు
"శ్రీవారికి——అందుకోండి మీ శ్రీమతి కబురు.
ముసలివారు, తమవల్లను, ఏ సుఖమూ ఎరగ.
అనేవారు గుర్తుందా, 'జీవితమో బుడగ,
తనకు తాను వెదకందే, ముక్తిబాట ఎక్కడిది!'
అయ్యా, మీ జ్ఞానబోధ సారం నాకెక్కినది.
పక్కయింటి పంకజ్‌తో పట్నం నే పోతున్నా
మీ మేలును మరచిపోను, ఎక్కడ నే ఉంటున్నా."
వాల్తేర్ ఔటర్ సిగ్నల్ దాపున పరికించుము
ఏనాడో తెలుగుభాష చేసుకున్న పుణ్యము
పెద్ద పెద్ద అక్షరాలు, 'బొగ్గు పొదుపు చేయుము'
ఆ నాడే రైల్వేలో జాయినయిన ఓ డింగరి
అరగక అది అడిగి చూసె: దేనికి ఆ అష్టాక్షరి?
రిటైరయిన ఓ ఎస్. ఎమ్. నవ్వి యిట్లు వివరించిరి:
'పడిన బొగ్గు మనదేలే! ప్రజాసేవ లైను యిదే
రైల్వేలో పని అంటే రాజుగారి బామ్మరిదే!'
పలుమతాలు బోధించే పరమ ధర్మ సూక్ష్మమదే:
'ఒకరి కొకటి యిచ్చావో ఆ పుణ్యం వీడదులే
నాల్గింతలు నీ యింటికి నడచివచ్చు త్వరలోనే!'
నాస్తికులై నమ్మరు మరి, జరిగిన కాదనగలరా?
మే మెరిగిన చలపతి కథ మీ వరకూ రాలేదా?
కాళ్లు కడిగి కన్య నిచ్చి పెళ్ళి చేసి పంపేదా,
ఉద్యోగం ఊడిపోయి అతగాడూ అమ్మాయీ
ఇద్దరు పిల్లలతో తన ఇల్లు చేరుకోలేదా!

కర్మాగారంలో మిషన్ ఆపరేటర్ యాదగిరి, అనుకోకుండా కలిగే ప్రమాదాల వల్ల సులభ రీతిలో రక్షణ కోసం ఆర్థిక సహాయం కావాలనుకున్నాడు.



ఆంధ్రా బ్యాంక్ సంక్షేమ పథకం అతనికి తగిన పథకం. ఈ పథకంలో యాదగిరి పొదుపుచేసే ధనం ఆకర్షణీయమైన వడ్డీతో తిరిగి లభించడమే గాక, అతనికి రూ. 12,000/-ల విలువ వరకూ, ప్రమాదాల వల్ల ఆర్థిక రక్షణ కల్పిస్తుంది.

ఇదివరకు తాను మిషన్‌వద్ద పనిచేస్తూండగా ఎదురైన కొన్ని పెద్ద ప్రమాదాలనుంచి రెప్పపాటులో తప్పించుకున్నాడు యాదగిరి. ఆ అనుభవాలే అతనిని బీమా పథకం గురించి ఆలోచించ చేశాయి. కాని అతను తనకువచ్చే చిన్న జీతంలో పెద్ద మొత్తాలు ప్రీమియం చెల్లించే స్థితిలోలేడు. ఆ సమయంలోనే ఆంధ్రా బ్యాంక్ బహుళ ప్రయోజన పథకం "సంక్షేమ" అతనికి అండగా నిలిచింది. సంక్షేమలో ప్రతి నెలా పొదుపుచేసే అతి చిన్నమొత్తం వడ్డీతోసహా మీకు తిరిగి లభిస్తుంది. అంతే కాక, రూ. 12,000/-ల విలువ వరకూ ప్రమాదాలవల్ల ఉచితంగా రక్షణ కల్పిస్తుంది "సంక్షేమ"

ఈనాడు యాదగిరే కాక అతనివంటి వేలాది కార్మికులు, ఉద్యోగులు సంక్షేమ పథకంలో వున్నారు.

దాదాపు 55 సంవత్సరాల అపారమైన అనుభవం గడించి, 640కు పైగా శాఖలతో దేశమంతటా విస్తరించిన ఆంధ్రా బ్యాంక్ అనేక యితర పథకాలను కూడా ప్రవేశపెట్టింది. అవే- కల్పతరువు, భాగ్యలక్ష్మి, సంరక్ష, కిడ్డీ బ్యాంక్, గృహకల్ప, జనసహాయ, కర్షక సహాయ మరియు మహిళా సంక్షేమ పథకాలు. ప్రతి పథకం ప్రత్యేకమైనదే. ఒక్కొక్క సమస్యను తీర్చడానికి ఒక్కొక్క పథకం.

అంతేకాదు, కీలక రంగానికీ, బలహీన వర్గాలకు కూడా ఆంధ్రా బ్యాంక్ ఆర్థిక సహాయం చేస్తోంది.

ప్రజావసరాలకై పాటు పడేది - ఆంధ్రా బ్యాంక్.

ది ఆంధ్రా బ్యాంక్ లి.

కేంద్ర కార్యాలయం, సుల్తాన్ బజార్,

హైదరాబాద్-500 001.

ఓ. స్వామినాథ రెడ్డి : ఛైర్మన్

KIRON/AB/78/19

సీరియల్

ప్రేమసింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

స్వప్నకి ఒళ్ళంతా నలక్కొట్టినట్టుగా వుంది! కళ్ళు భారంగా వున్నాయి! ఎంతో సేపటినుంచి మెలకువ, నిద్రమధ్య వూగిసలాడుతున్నట్టుగా వుంది! కళ్ళముందు తండ్రి ఆఫీసుకు వెళుతున్న దృశ్యం, తనకి మొదటిసారి సైకిలు నేర్పుతున్న దృశ్యం కన్పిస్తోంది! ఆ వెంటనే తల్లి గుండెలుబాదుకుంటూ పిచ్చిదానిలా, 'నేనెందుకు బ్రతికానే స్వప్నా' అని ఏడుస్తూ నిలబడుతోంది. స్వప్న ఏం చెయ్యలేక పోతోంది! తల్లిని ఓదార్చాలని, 'అమ్మా! నీకు నేనున్నాను. బాధపడకు' అని చెప్పాలని ఎంతగానో అన్పిస్తున్నా, పెదవులు కదపలేక పోతోంది!

ఎంతోసేపు యీ పెనుగులాట జరిగిన తర్వాత, స్వప్న కళ్ళు భారంగా,తెరుచుకున్నాయి. 'స్వప్నా! స్వప్నా' ఎదురుగా లక్ష్మీరంజనంగారు మంచంమీద కివంగి చూస్తున్నారు.

“అమ్మ ఏదీ?” అస్పష్టంగా అడిగింది.

“స్వప్నా! నా తల్లీ!” ఆయన ఏడుపు ఆపుకుంటూ, స్వప్న నుదుటిమీద చిందరవందరగావున్న జుట్టు సరిచేసారు. స్వప్న మంచం పక్కనవున్న స్టూలుమీద యింకో బట్టతలవ్యక్తి కూర్చుని వున్నాడు. ఆయన స్వప్న చెయ్యిపట్టుకుని నాడి చూస్తున్నాడు. ఆయన మెడలో స్టెతస్కోప్‌వుంది. ఆయన్ని చూడగానే స్వప్న లేవబోయింది. “నేనెక్కడున్నాను! ఇదేమిటి?” ఆయన స్వప్నని భుజంపట్టి వెనక్కువాల్చి పడుకోబెట్టాడు.

జరిగిన కథ :

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నగురించి ఆలోచనలలో ఉండగానే మరదలు విమల బర్త్‌డే పార్టీకి పిలిచింది సుధీర్‌ను. స్వప్నకు సీరియస్‌గా ఉందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు.

"డోంట్ వర్రీ మై బేబీ! ఈ మీసాలాయన ఎవరో చెప్పగలవా?" లక్ష్మీరంజనంగారి వైపుచూపిస్తూ అన్నాడు.

"మామయ్య!"

"గుడ్!" ఆయన స్టెతస్కోప్‌తో స్వప్నని పరీక్షచేసారు. "నౌ యువార్ ఆల్ రైట్. మమ్మల్ని గాభరా పెట్టేశావు. నా చెయిజారిపోయావనే అనుకున్నాను! థాంక్‌గాడ్."

ఇంజక్షన్ యివ్వగానే స్వప్న నుదుటిమీద అలుముకున్న చిరు చెమటలు ఆయన తుడిచారు. నర్స్‌ని పిలిచి హార్లిక్స్ తెమ్మని స్వప్ననిలేపి కూర్చోబెట్టి తాగించారు!

హార్లిక్స్ తాగిన తర్వాత స్వప్నకి బాగా, మెలకువ వచ్చినట్టుగా, తనున్న పరిసరాలు చూడగలుగుతున్నట్టుగా అనిపించింది.

డాక్టరుగారు లేచారు. స్వప్న భుజంమీద తడుతూ, "బాగా రెస్టు తీసుకో! ఎక్కువ మాటాడకు" అని హెచ్చరించి వెళ్ళిపోయాడు.

స్వప్న అలాగే కూర్చుంది. "స్వప్నా! ఒంట్లో బాగా తేలికగా వుందా?" లక్ష్మీరంజనంగారు డాక్టరుగారు ఖాళీచేసిన స్టూలుమీద కూర్చుంటూ అడిగారు.

స్వప్న తలెత్తలేదు. ఆయనవంక చూడలేదు. స్వప్నకి మెల్లమెల్లగా గుర్తుకు వస్తోంది. మామయ్యతో వూరు రమ్మంటే, తను రానని మొండిగా తిరస్కరించటం, ఆయన 'సరే' మీ అత్తయ్యని తీసుకుని నేనే యిక్కడకి వస్తానని వెళ్ళటం, ఆయన వెళ్ళగానే, అమ్మకి అదివరకు డాక్టర్ యిచ్చిన స్లీపింగ్‌పిల్స్ తను తీసుకు మింగటం, మత్తులాటిది రావడం, అంతా గుర్తుకు వచ్చింది! లక్ష్మీరంజనంగారు స్వప్న చేయి పట్టుకుని ఆప్యాయంగా చూస్తూ అన్నారు. "స్వప్నా! ఎందుకింత పనిచేసావు! ఆత్మహత్య ఎంత మహాపాపమో తెలుసా?"

"పాపమా! హు! గత్యంతరం లేనప్పుడు, ఏ పాపమైనా చేయక తప్పదు

మామయ్యా! అమ్మ చచ్చిపోయింది! నేను హంతకినని లోకం దూషిస్తోంది! ఇంకే ముఖం పెట్టుకుని నేను బ్రతకాలి. బ్రతికి ఏంచెయ్యాలి? బ్రతికివుండి పడే యీ నరకంకంటె, చచ్చిపోయిన తర్వాతపడే ఆ నరకమే నయం అనిపించింది! నేను బ్రతికినా, చచ్చిపోయినా ఎవరికి కావాలి అసలు?''

"నేనులేనా స్వప్నా!''

"నువ్వున్నావు! కానీ అత్తయ్య నిన్ను మమ్మల్ని చూడనీయదుగా! అత్తయ్యంటే నీకు భయమయ్యె!''

లక్ష్మీరంజనంగారు గుటకమింగి, ఈ విసురు తట్టుకున్నారు. ఆయనప్రసంగం మారుస్తూ, 'ఆరోజు రైలు తప్పిపోయి, తను యింటికి రాగానే స్వప్న పడివున్న తీరుచూసి ఎలా ఖంగారు పడిందీ, చివరకి ఏమీతోచక సుధీర్‌కోసం ఫోన్‌చేస్తే, యింట్లో నౌకరు అతను ఎక్కడో పార్టీకి వెళ్ళాడని చెబితే, అక్కడకి ఫోన్‌చేసి, అతన్ని పిలిపించి, అతను రాగానే, అతని కారులో తీసుకువచ్చి యీ నర్సింగ్ హోంలో చేర్పించిన వైనం అంతా చెప్పారు. డాక్టరు శివానందంగారుకూడా ముందు ధైర్యం చెప్పలేదు. ఆరాత్రి 1 గంటవరకూ, తనతోపాటు, సుధీర్ యిక్కడే వున్నాడు.

స్వప్న మౌనంగా ఇదంతా వింది. చివరికి అంది. "నన్ను బ్రతికించి, నాకు వుపకారం చేసామని మీరు అంతా అనుకుంటున్నారేమో! మీరు నాకు ఉపకారం ఏం చెయ్యలేదు!'' ఆవేశంగా, కళ్ళనీళ్ళతో అంటున్న స్వప్న గుమ్మంలో అలికిడి అయితే తిరిగి చూసింది. గుమ్మంలోనుంచి సుధీర్ లోపలకు వచ్చాడు! అతని చేతిలో ప్లాస్టిక్ బుట్టనిండా, పళ్ళు, హార్లిక్స్ బాటిల్, బిస్కెట్ పాకెట్స్ వున్నాయి.

మంచంమీద లేచి కూర్చునివున్న స్వప్నని చూడగానే అతని కళ్ళలో ఆనందం తళుక్కుమంది!

తడి కళ్ళతో తలతిప్పి చూసిన స్వప్న అతన్ని చూడగానే నిటారుగా అయింది. వెంటనే కొంగు లాక్కుని కళ్ళు తుడుచుకుంది.

లక్ష్మీరంజనంగారు లేచి సుధీర్‌కి ఎదురు వెళ్ళారు.

"రా! సుధీర్! డాక్టర్‌గారు యిప్పుడే వచ్చివెళ్ళారు. స్వప్నని నాలుగురోజుల పాటు రెస్ట్ తీసుకోమని చెప్పారు. యిక ఫర్వాలేదని చెప్పారు!''

సుధీర్ చేతిలో బుట్టని ఆయనకి అందించాడు. అయినా అతని చూపులు స్వప్న ముఖంమీదనే వున్నాయి! అలా సజీవంగా, మళ్ళీ మామూలుగా కూర్చునివున్న స్వప్నని చూస్తుంటే, అతని గుండెల్లో చెప్పలేని సంతోషం పొంగుకెత్తినట్టుగా వుంది! అతనికి అతిక్లిష్టమైన కేసు గెలిచినంత తృప్తిగా, ఆనందంగా అనిపించింది. మంచం దగ్గరగా వచ్చాడు.

"ఇప్పుడెలా వుంది స్వప్నా?'' ఎంతో మృదువుగా అడిగాడు.

JYOTHI

స్వప్న జవాబు చెప్పలేదు.

తల దించుకుని వూరుకుంది.

"నీ ఋణం జన్మలో తీర్చుకోలేను. నేను చెబుతున్నానుగా!" అన్నారు లక్ష్మీ రంజనంగారు.

"నేను ఋణపడ్డానని అనుకోవటానికి యిక్కడ నా కెవరూ వుపకారం చేయ లేదు!"

"ఓ.కె! ఓ.కె! యూ ఆర్ కరెక్ట్! మాస్టరుగారికి ఏం తెలియదు! ఆయన చాదస్తం మనిషి! ప్రతి చిన్నదానికీ పెద్ద పెద్ద మాటలు చెబుతారు. అవంతా నువ్వు పట్టించుకోవద్దు! నువ్వు రెస్ట్ తీసుకో!"

"మామయ్యా! నేను యింటికి వెళ్ళిపోతాను. డాక్టరుగారికి చెప్పు. నాకు బాగానే వుంది!"

లక్ష్మీరంజనంగారు నిస్సహాయంగా చూసారు.

ఇంతలో నర్స్ వచ్చింది.

సుధీర్‌ని చూడగానే "గుడ్ యీవినింగ్ సర్" అంది.

"గుడ్ యీవినింగ్. డాక్టర్‌గారేం చేస్తున్నారు?"

"బిజీగా వున్నారు."

"ఖాళీ అవగానే చెప్పు. నేను వచ్చి మాట్లాడుతాను."

"అలాగే సర్." నర్స్ స్వప్నచేత మందు తాగించి వెళ్ళిపోయింది.

"డాక్టర్‌గారు ఏమన్నా, నేను యింటికి వెళ్ళిపోయేది ఖాయం!" అంది స్వప్న.


"స్వప్నా! మొండిగా చెయ్యకు" లక్ష్మీరంజనంగారు మందలించారు.

"నేను డాక్టర్‌గారితో మాట్లాడతాను. ఆయన యింటికే వచ్చి చూస్తారేమో అడుగుదాం!" అన్నాడు సుధీర్.

"నాకు బాగానే వుంది! యింకేం వైద్యం అవసరం లేదు."

"ఆ మాట డాక్టర్‌గారు చెప్పితే అందరకీ సంతోషమే?" సుధీర్ అక్కడినుంచి వెళ్ళిపోతూ అన్నాడు.

స్వప్న మొండితనంచూస్తే, అతనికి మళ్ళీ ఆ అమ్మాయి ముఖం చూడకూడ దన్నంత చిరాకు వేస్తోంది! కానీ లక్ష్మీరంజనం మాస్టారికోసం తప్పడంలేదు! ఆ అమ్మాయే గనక చచ్చిపోయి వుంటే ఆయన ఎంత దెబ్బతినేవారో సుధీర్‌కి బాగా తెలుసు! ఆయనకి స్వప్నపట్ల వున్న అభిమానంలో వెయ్యోవంతుకూడా, స్వప్నకి ఆయనమీద గౌరవం లేదు! ఆయన భార్యకి ఎదురుచెప్పలేక పోవడంవల్లనే తమకి యిన్ని కష్టాలు వచ్చాయనే అభిప్రాయం స్వప్న మనసులో బాగా నాటుకుపోయింది! స్వప్న ఆయన నిస్సహాయత్వాన్ని అర్థం చేసుకోలేకపోవటంకూడా సుధీర్‌కి కోపంగా వుంది!


పరిమళానికి
సరికొత్త భావన
తులసి
దర్‌బార్
బత్తి
నిరంతరం పరిమళాన్ని
వెదజల్లే అగరబత్తీ
TULASI DURBAR BATHI
నవరాత్రి, సుగంధ సారథి,
తులసి జవాజి అగర్‌బత్తీలు
తయారుచేయువారు.
సారథి పర్‌ఫ్యూమరీ వర్క్స్
గానిగర్ పేట బెంగుళూరు 560002

అరగంట తర్వాత - సుధీర్, డాక్టర్‌గారిని వెంటపెట్టుకుని, స్వప్న గదిలోకి వచ్చారు. డాక్టర్ శివానందంగారు ఎప్పుడూ ఎదుటివారిని ఏదో ఒకటి అంటూ వినోద పరుస్తూ వుంటారు. వైద్యంలో ఆయనకి వున్న ప్రతిభతోపాటు, మాటల్లో యీ చమత్కార ధోరణి వుండటంతో, రోగులు ఆయనంటే అమితంగా అభిమానిస్తారు.

ఆయన గదిలోకి వస్తూనే, స్వప్నని చూస్తూ, "మా ఫైయిర్ లేడీ ఏంచేస్తోంది?" అన్నారు.

పడుకునివున్న స్వప్న లేచికూర్చుంది.

"ఫైయిర్ లేడీ యింటికి వెళ్ళిపోతానని గొడవచేస్తోంది" అన్నాడు సుధీర్.

"ఇంటికా! వాట్?" ఆయన కళ్ళు పెద్దవిచేసి చూసారు. స్టూల్‌మీద కూర్చుని స్వప్న చేయి పట్టుకుని నాడిచూస్తూ, "ఇంటికి వెళ్తాను అని నువ్వు అన్నప్పుడల్లా, యింకో వారం యిక్కడ వుంచే పనిష్‌మెంట్ ఏర్పాట్లు చేస్తాను! అంతేకాదు! నిన్ను యీ స్పెషల్ రూమ్‌లో నుంచి జనరల్ వార్డ్‌లోకి మారుస్తాను! అక్కడ రకరకాల పేషంట్స్ వుంటారు! వాళ్ళ బాధలు చూడలేక, నువ్వే యాతనపడతావు! జాగ్రత్త!" ఆయన చూపుడువేలుతో స్వప్నని బెదిరించి, పక్కకు తిరిగిచూస్తూ, "సుధీర్! యిప్పటికి ఎన్నిసార్లు అంది యీ మాట?" అన్నారు.

"ఒక్కసారి."

"అయితే ఒక్కవారం. మళ్ళీ అన్నావో వారాలు పెరిగిపోతాయి" బెదిరించారు.

"నాకు బాగా కులాసాగానే వుంది!" అంది స్వప్న.

"నిజంగానా!" ఆయన ఆశ్చర్యంగా నటిస్తూ చూసారు.

"నిజంగానే!"

"ఒ.కె! అయితే మనిద్దరం ఒక పందెం పెట్టుకుందాం!" అన్నారాయన.

స్వప్న ఏమిటి అన్నట్టు చూసింది.

"నువ్వు యీ మంచం దిగి, మా ఎవ్వరి సాయం లేకుండా, ఆ గుమ్మంవరకూ నడిచివెళ్ళి, తిరిగి యిక్కడికిరా! నీకు కళ్ళు తిరగకుండా వుంటే, నేను నిన్ను యిప్పుడే, యీ క్షణంలోనే యింటికి పంపిస్తాను! సరేనా!"

స్వప్న అలాగే అన్నట్టు చూసింది.

"కానీ ఒక్క షరతు. నువ్వు అలా నడవలేనట్టయితే, నేను వుండమన్నన్ని రోజులు మళ్ళీ మాట్లాడకుండా యిక్కడ వుండాలి."

స్వప్న తలూపింది.

లక్ష్మీరంజనంగారు కుతూహలంగా చూస్తున్నాడు.

స్వప్న మంచం దిగింది! ఆ దిగటంలోనే ఒళ్ళు తూలింది. కానీ మంచం పట్టుకుని ఎలాగో ఆపుకుంది. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్ళలో బలంలేనటుగా, నీళ్ళ

బుగ్గల్లా వణికిపోతున్నాయి. అయినా సరే; స్వప్న పళ్ళబిగువున గుమ్మంవైపు నడవ సాగింది. సుధీర్‌కూడా అక్కడే నిలబడి చూస్తున్నాడు!

ఎంతో కష్టంమీద, పళ్ళు బిగబట్టి శక్తితెచ్చుకున్నట్టుగా, స్వప్న గదిమధ్య వరకూ రాగలిగింది! ఆ తర్వాత యిక శక్తిలేకపోయింది! గుండె వేగంగా కొట్టుకుంటోంది! గదిలో ఏ వస్తువూ స్పష్టంగా కనిపించడంలేదు. ఒళ్ళు అతి తేలికగా మారిన వస్తువులా, స్వప్న అదును తప్పిపోయినట్టుగా, తూలిపోయింది! పడిపోతున్న తనని తను ఆపుకుంటున్నట్లుగా స్వప్న గోడమీద చేతులువేసి ఆసరా అందుకోబోయి, ఆ ప్రయత్నంలో సుధీర్ నిలబడిన చోటు దగ్గరగా వచ్చింది.

సుధీర్ పట్టుకోబోయినట్టయితే, క్రిందపడేదే!

సుధీర్ స్వప్నని గట్టిగా పట్టుకున్నాడు!

వూపిరికోసం, ఆరాటపడ్తున్న స్వప్నా అతనిమీద ఒరిగిపోయింది.

సుధీర్ స్వప్నని క్రిందపడకుండా, ఆపి పట్టుకున్నాడు. ఆ ప్రయత్నంలో స్వప్న అతని మెడదగ్గరికి వచ్చింది! 'స్వప్న' అతని పెదవులు అస్పష్టంగా పలికినాయి.

సుధీర్ స్వప్నని రెండునిముషాలు అలాగే పట్టుకుని నిలబడ్డాడు. స్వప్న కాస్త తేరుకున్న తర్వాత, చేయిపట్టి ఆసరాయిచ్చి తీసుకువచ్చి మంచంమీద కూర్చోపెట్టాడు.

డాక్టరు చప్పట్లుకొట్టారు. "ఇప్పుడు ఓడిపోయినట్టేనా!" స్వప్న మాట్లాడలేదు. యింకా ఒగరుస్తోంది! ఇదేం అలసట! శరీరంలో ప్రాణమేలేనట్టు విస్త్రాణగావుంది! ఒంటినిండా చెమటలు కార్తున్నాయి!

లక్ష్మీరంజనంగారు స్వప్నని వెనక్కువాల్చి పడుకోబెట్టారు.

"మై ఫెయిర్ లేడీ! యింక యింటికి వెళ్తానని అనకు! తెలిసిందా!" డాక్టరుగారు లేచారు. వెళ్తూ, "సుధీర్! నర్స్‌ని పంపిస్తాను! ఒకకప్పు వేడివేడి హార్లిక్స్ త్రాగించండి! ఆ అమ్మాయి చాలా వీక్‌గా వుంది! కనీసం యింకో వారం అయినా హాస్పిటల్‌లో వుండాలి!" అన్నారు.

"ఓ.కె. డాక్టర్! లక్ష్మీరంజనంగారిని నచ్చజెప్పమని చెబుతాను" అన్నాడు సుధీర్.

డాక్టర్ వెళ్ళి నర్స్‌ని పంపారు. నర్స్ ఏ పనిలో వుందో వెంటనే రాలేదు. సుధీర్ ఫ్లాస్క్‌లో వేడినీళ్ళు కప్పులో పోసి, తనే హార్లిక్స్ కలిపి తెచ్చియిచ్చాడు.

"తీసుకోమ్మా. తీసుకో!" అన్నారు లక్ష్మీరంజనంగారు.

"వద్దు వద్దు. నాకేం వద్దు. నన్ను నా మార్గాన పోనీయండి! నాకు బ్రతకాలని లేదు! నన్ను బాధపెట్టకండి!" ఆ మాటలు ఆక్రోశంలా వచ్చినాయి.

లక్ష్మీరంజనంగారు ఏం మాట్లాడలేదు!

సుధీర్ క్షణంసేపు స్వప్నని నిశితంగా చూసాడు!

తర్వాత చేతిలో కప్పు స్టూల్‌మీద పెట్టాడు.

వంగి, స్వప్నని రెక్కపట్టి లేవదీసాడు. హార్లిక్స్ తీసి బలవంతంగా స్వప్న నోటికి అందించాడు.

స్వప్న కప్పుని తోసేయబోయింది!

సుధీర్ స్వప్న జబ్బని గట్టిగా పట్టుకున్నాడు. "చిన్నపిల్లలా చెయ్యకు! అంతా నీ యిష్టం అని అనుకోకు! నువ్వు చచ్చిపోదలచుకుంటే, యీ హాస్పిటల్‌నుంచి వెళ్ళిపోయిన తర్వాత, ఎన్నో మార్గాలున్నాయి! నిన్ను బ్రతకనివ్వటం మా తప్పు అని నువ్వు అంటే, యింకోసారి యీ తప్పు మేము చెయ్యం. సరేనా!"

అతను తీవ్రంగా అన్న తీరుకి స్వప్న తెల్లబోయినట్టు చూసింది.

సుధీర్ హార్లిక్స్ కప్పు చేతికియిచ్చాడు.

"స్వప్నా! జీవితంలో నీకేదో అన్యాయం జరిగితే, ఆ కోపం మా అందరిమీద చూపించటం అది ప్రశంసించతగ్గ విషయంకాదు! ఆత్మహత్య చేసుకోవటం అనేది పిరికివాళ్ళ లక్షణం! ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, బ్రతగ్గలగటం అనేది ధైర్యవంతులు చేసే పని! ధైర్యం వున్నవాళ్ళకి అదృష్టం, ఎప్పుడూ సాయపడుతుంది! అది గుర్తుంచుకో!"

అతని మాటల్లో తీరు ఏమిటోగానీ స్వప్న యీసారి హార్లిక్సు తోసేయలేదు. మెల్లగా తాగసాగింది. (సశేషం)



మీ అందానికి తగిన
మిల మిల మెరిసే చీరెలు!
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి పట్టు చీరెలు!!
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మి జనరల్ స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్స్: శిష్ట్లా, ఫోన్: 73467, 77052

పొదుపు చేసిన సొమ్మును
పెట్టుబడి పెట్టండి

**పోస్టాఫీస్
టైమ్
డిపాజిట్స్‌లో**

ఇప్పటి వడ్డీ రేట్లు	
కాలము	రేటు
1. సంవత్సరము	7.0%
2. సంవత్సరములు	7.5%
3. సంవత్సరములు	8.0%
4. సంవత్సరములు	10.0%

పెట్టుబడికి గరిష్ఠ పరిమితి లేదు. ప్రతి సంవత్సరం వడ్డీ చెల్లిస్తారు. అవసరమయితే 2, 3, 5 సంవత్సరాల ఖాతాలను ఒక సంవత్సరం గడిచినతర్వాత నగదు చేసుకోవచ్చు.

కొత్త ఆకర్షణ : 5 సంవత్సరాల టైమ్ డిపాజిట్ ఖాతామీద ప్రతి సంవత్సరం వచ్చే వడ్డీతో మీరు 5 సం॥ రికరింగ్ డిపాజిట్ ఖాతాను కొనసాగించవచ్చు. దానివలన:

ఎ. సాలుకు 9.25% వంతున చక్రవడ్డీ లభిస్తుంది.

బి. 12 నెలల వాయిదాలను ముందుగా డిపాజిట్ చేస్తే మీకు రిబేట్ లభిస్తుంది.


సి. కొన్ని షరతులకు లోబడి మీకు ఉచితంగా 'జీవిత భీమా' ఏర్పడుతుంది.

ఇతర సదుపాయాలు : సాలుకు రు. 3,000 వరకు పన్నులేని వడ్డీ (ఇతర ఆమోదిత పెట్టుబడులతో కలుపుకుని) ఖాతాదారు మరణిస్తే వెంటనే నామినీదానిని నగదుగామార్చుకోవచ్చు.

నేషనల్ సేవింగ్స్
ఆర్గనైజేషన్

davp 78/368

పోస్ట్ బాక్స్ 96, నాగపూర్ - 440 001.



మయసభ

"స్వర్గంలో వున్న ఓ తండ్రీ! ఇవ్వాళ్టికి నా పాపాలను క్షమించు. నా రేపటి జీవితం హాయిగా క్షేమంగా వుండేలా దీవించు...." అని ఉదయాన్నే ప్రార్థనలు చేస్తుంటారు కొంతమంది. ఈ విధమైన స్మాల్ సేవింగ్స్ ధోరణిలో కాకుండా కొంతమంది ఫైన్డు డిపాజిట్ ధోరణివారుంటారు. వాళ్ళే మో ముమ్ముందుకు పనికి వస్తుందికదా—అని ప్రతి మూడోనెల తిరుపతికి వెళ్ళి జుత్తు సమర్పించి వస్తుంటారు. ఎవరి ధోరణి వారిది; ఎవరి ప్రార్థన వారిది. నా మట్టుకు నేను మాత్రం— "ఇవాళ ఉదయం లేవగానే చెడువార్తలేమీ లేకుండా ఈనాటి పత్రికను ప్రసాదించవయ్యా ఎడిటర్ జీ!" అని కోరుకుంటూ వుంటాను. కాని ఏనాడూ కూడా ఈ కోరిక నెరవేరలేదు. ఏనాటి పత్రిక చూచినా వరదలు, భూకంపాలు, హత్యలు, లాఠీచార్జీలు, హైజాకింగ్‌లు, మానభంగాలు, అవిశ్వాస తీర్మానాలు.... ఇవే ప్రత్యక్షమవుతుంటాయి. ఏం చేస్తాం.... సర్వస్వతంత్రాలు కలిగిన పౌరులున్న ప్రజాస్వామ్యం యొక్క లక్షణం ఇంతే కాబోలునని సరిపెట్టుకుని ఆఫీసులకెళ్ళిపోతాం. అక్కడ ఆఫీసు వేళలో తీరిగ్గా కూర్చొని ప్రజా జీవితంలో నైతిక పతనంగురించి చాల తీవ్రంగా చర్చించి కేంటీన్‌కు వెళ్ళిపోతాం.

ఈ విధంగా అష్టకష్టాలనూ ఓర్చుకుంటూ, ప్రజాస్వామ్యంతో రాజీపడి బ్రతుకుతుండగా హఠాత్తుగా ఒకనాటి ఉదయం పత్రికలో ఒక వార్త వచ్చింది.

"ఫలానా నాయకుడుగారు నిన్న సాయంత్రం బాత్‌రూములో జారిపడ్డం వలన వారి తొడ ఎముక కొద్దిగా చీలింది. వెంటనే వారి చీఫ్ ఫిజిషియన్-కమ్-ఆర్తోపిడీషియన్ డా॥ జ్ఞానేశ్వర్రావ్ ఎక్స్‌రే తీసి ప్లాస్టర్ వేశారు. మరొక్క ఆరు వారాలదాక నాయకుడుగారు ఏ కార్యక్రమాలలోను పాల్గొనబోరు—" అని సచివాలయంనుండి విడుదలయిన ప్రత్యేక ప్రకటనలో పేర్కొన్నారు.

శుక్రవారం, ఉదయాన్నే శుభమా అని పేపర్ తెరవగానే ఇదండీ వార్త!

ఈ వార్తను వినగానే శ్రీవారి భక్తకోటి, భక్త అణువులు, పరమాణువులూ వారికి తమ మొహం చూపించాలని తహ తహ లాడి పోయారు; కాని వారిని చూడడానికి వీలులేదని నిషేధించారు; కాని అశేష భక్తకోటియొక్క భక్తి తీవ్రతకు తట్టుకోలేక మంత్రిమండలి ఒక అసాధారణ సమావేశం ఏర్పాటు చేసింది; ఒక అత్యవసర తీర్మానం చేసింది. దానికొరకు శ్రీవారి విరిగిన తొడయొక్క ఎక్స్-రే ఫోటోను గాజుపెట్టెలో వుంచి, దానిని సిటీ హాలులో వుంచారు. కాపలాకి ప్రత్యేక సాయుధదళాల

ఏ. రామసంజీవి

నుంచారు. అక్కడనుండి ఇహ చూచుకోండి, ప్రజాస్వామి భక్తులు లక్షలకొలది పోగై, పదేసి గంటలు క్యూలో నిలబడి ఆ ఏక్స్‌రే ఫొటో యెదుట సాష్టాంగ దండాలు చేసి, ఆ పెట్టెకు పువ్వులు, కుంకుమ, రూపాయనోట్లు సమర్పించి, దానికి ప్రదక్షిణలుచేసి తమ ప్రేమానురాగాలను ప్రదర్శించారు. ఈ మహత్తరమైన చరిత్ర అంతా భవిష్యత్తరాలవారికి అందకుండా పోతుందేమోనని ప్రభుత్వ సమాచారశాఖ వారీ మనోహర దృశ్యాన్ని రంగుల ఫిలిం తీశారు. ఆ హాల్‌లోనే ఒక మూలగా కూచుని—ఈ విధంగావచ్చినవారిలో ఎం.పి లు ఎంతమంది, ఎం.ఎల్.ఏ.లు, ఐ.ఎ.ఎస్.లు ఎంత మంది—అని జాగ్రత్తగా రాసుకుంటున్నాడొకాయన....రాష్ట్రమంతటా శ్రీవారి తొడ ఎముక క్షేమంకోసం పూజలు జరిగాయి.

ఈ విధంగా ఆ "స్వామి ప్రజం" వర్ధిల్లుతోంది.

నాలుగయిదు వందల సంవత్సరాల క్రింద "వేమన" అని ఒక వామపక్ష ఉగ్రవాద విప్లవ కవి వుండేవాడు. ఆయన సినీమా పాటలేవీ వ్రాయలేదు కాని ఏదో పద్యాలు రాశాడు.


"కలవాడి వీపుమీద కురుపయితే దిన పత్రికలకు పతాక శీర్షిక అవుతుంది కాని లేని వాడి ఇంట వివాహమయినా వార్త అవదూ–" అన్నాడాయన ఒక పద్యంలో.

అపుడు ప్రజాస్వామ్యం, దిన పత్రికలు లేవు గనుక ఆ మాట అనగలిగాడాయన. ఇపుడు ప్రజాస్వామ్యంలో వుంటూ ఆ మాట అనే హక్కు మీకులేదు. "అందరి తొడలూ ఒకటే కదా, నా తొడ విరిగితే ఆస్పత్రి గేటు దగ్గర రోజున్నర పడిగాపులు కాస్తానే, మరి నా ఓటుతో గెలిచిన అతగాడి తొడ కింత గడబిడ ఏల?" అని వడిగా మాట్లాడితే మీకు ప్రజాస్వామ్యం అర్థంకాలేదు అనుకోవలసి వస్తుంది. 21 సంవత్సరాలు నిండిన భారత పౌరుడిగా మీకు ఎన్నికల్లో నిలబడి నాయకుడయ్యే అవకాశం వుంది. కనుక ఎన్నికల్లో పోటీ చేసి గెలవండి; మంత్రి అవండి; అప్పుడిహ మీ ఇష్టం. ఎక్కడయినా జారి పడండి. ఆ వార్తను వేయకపోతే పత్రికలను, ప్రసారం చేయకపోతే ఆకాశవాణిని విమర్శించండి. "కొందరు, మిగతా అందరికన్న ఎక్కువ సమానులు—" అన్న ఆంగ్లనానుడిని తెలుసుకోండి.

అనటోల్ ఫ్రాన్స్—అన్న రచయిత ఇలా సెల విచ్చాడు:"నికార్సయిన ప్రజాస్వామ్యంతో అందరికీ సమాన హక్కులున్నాయి. పేదవాడికీ ధనికుడికీ కూడా రోడ్డువారగా పడుకోవడానికి సమాన హక్కుంది." నిజమే కదా మరి.... కొంతమంది ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు, బూజుపట్టిన బూర్జువాలు, అభ్యుదయ నిరోధక కూటములు, తిరోగమన ప్రతిక్రియ పోస్టర్ వాదులు రోడ్ పక్కన పడుకోవడం లేదు అంటే సాంఘిక చైతన్యం కలవారంతా అందు నిమిత్తం ఒక ఉద్యమం లేవదీయాలి. సమాన హక్కుల అమలుకై ఉద్యమం చేపట్టాలి. అమృతం తాగి అయినా సరే, ఆమరణ నిరాహార దీక్ష పూనాలి. బుల్‌డోజర్లతో యిళ్ళు ధ్వంసం చేయాలి. తర తమ భేదాలు లేకుండా జాతి యావత్తు రోడ్లపక్కన, మురికి కాల్వల ఒడ్డున పడుకునేలా చేయాలి. ముఖ్యంగా మేధావు లందరూ ముందుకు ఉరకాలి. అంతే కాని కోడంబాకంలోనో, అమీర్ పేటలోనో కూర్చొని "మందే చంద్రుడు—కాలే కలువ పువ్వు" అని కావ్యాలు రాయకూడదు."శ్రీమతే రామానుజాయ నమః" అని అవార్డులకోసం చిప్ప చేతబట్టుకుని తిరగకూడదు. అందరూ ఆ విధంగా కృషిచేస్తేనే తప్ప నీ తొడ వాడి తొడకు సమానంకాదు. ఆ కృషి లేనంత కాలం వాడి ఎముక విగ్రహం అవుతుంది. నీ తొడ బూడిద అవుతుంది....అదీ అసలు రహస్యం.

అయితే ఇవన్నీ తెలిసికూడా మిత్రుడు బసవరాజు ఒక పాయింటు లేవదీశాడు. ఈ విధంగా "స్నానాల గదిలో జారి పడడం"లేదా, 'స్నాగజాపం' అనే అంశంమీద అతడు బోలెడంత భోగట్టా సమీకరించాడు.నిజానికి అందుకే అతనికో గౌరవ డాక్టరేటు పట్టం పారేయ వచ్చు.

ఇంతకూ బసవరాజు అడిగిందేవిటంటే—



"1947 నుండి 1978 దాక సేకరించిన గణాంకాల్ని గనుక చదివినట్లయితే మన నాయకులలో ఏడాదికి నలుగురికి తక్కువలేకుండా స్నాగజాపం పాలవుతున్నారు. జవర్లాల నెహ్రూ దగ్గర నుండి స్థానిక నాయకుడు జనార్దన మూర్తివరకూ స్నాగజాప బాధితులే! ఏవిటి దీనికి కారణం? మన శైశవ ప్రజాస్వామ్యానికిదేమన్నా శాపమా?" అని ప్రశ్నించాడు బసవరాజు.

నిజమే!

ఈ నాయకులు జారిపడ దలచుకుంటే ఎన్ని చోట్లు లేవు?

హిమాలయ సానువులు మొదలు చార్మినార్ మెట్లదాక, తాజ్‌మహల్ నుండి తాండూర్ సిమెంట్ ప్లాంట్‌దాకా సువిశాలమయిన దేశం వుండగా వెళ్ళి వెళ్ళి స్నానాల గదిలో జారి పడుట ఏల?

ఒకవేళ వాళ్ళ జాతకంలో శని వక్రించితే ఇలా జరుగుతుందా? ఆ మహానుభావులు ముచ్చట తీర్చడానికి కావాలంటే ఆరో ప్రణాళికలో జిల్లాకొకటి చొప్పున స్కేటింగ్ లింక్‌లు తయారుచేయ వచ్చునే....అలాటివారు పడక పడక "స్నాగ"లో "జాప" మెందుకు?

వారి స్నానాల గదుల నేల వారి ప్రసంగాల వలె అంత జిడ్డుగా వుండునా? ఉండినచో పబ్లిక్ హెల్తు సర్వీస్‌వారు ఏమి చేస్తున్నట్లు?

అసలు విషయం అదికాదు. నిన్న మొన్నటి దాక చిన ముషిడివాడలో పంటకాల్వలో మునిగినవాడెల్లా ఇవాళ మంత్రయిపోయి 'ఫైవ్‌స్టార్' హోటల్స్ లాటి ప్రజాస్వామ్య సోషలిస్టు భవంతులలోకి వచ్చేయడంతో, మట్టిమీద నడిచిన పాదాలకు ఈ పాలరాతి పలకలనేల అలవాటు లేకపోవడంవలన స్నాగజాపమా?

అబ్బెబ్బే....అదేమీ కాదండీ! ఈ నాయకులనేవారి జీవితం యెంత కష్టంగా, విశ్రాంతి లేనిదిగా వుంటుందో మీకు తెలియదు; వాళ్ళు పొద్దున లేవక ముందే వారి రోజు ప్రారంభం అవుతుంటుంది; పడకమీద పడుకున్నాక కూడా కొనసాగుతుంటుంది. వాళ్ళు యింట్లో వున్నా, కారెక్కినా, విమానం దిగినా, రైలుస్టేషను కెళ్ళినా, మీటింగుకు వెళ్ళినా, వాకింగ్‌కు బయలుదేరినా వారి వెంటే బాజాలవాళ్ళు, భజన పార్టీలు, వినతి పత్రాలవాళ్ళు, వీపు గోకే వాళ్ళు బారులు బారులుగా వుంటారు. వారికి ఏ కాంతయినా లభిస్తుందిగాని ఏకాంతం మాత్రం లభించదు. అటువంటి మహానాయకులకు



శ్రీశ్రీ సాహిత్యంపై పరిశోధనకు డాక్టరేట్ !

శ్రీశ్రీ కవిత్వంలో వస్తువూ సంవిధానమూ (A study of Sri Sri's poetry with special reference conto - tent and technique) అనే అంశం మీద థీసిస్ సమర్పించి ఆంధ్రా యూనివర్శిటీచే డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని పొందారు శ్రీ మిరియాల రామకృష్ణ.

డా॥ రామకృష్ణ జ్యోతి ప్రతినిధితో ముచ్చటిస్తూ అన్నట్లు "శ్రీశ్రీ ఈ నాటికీ, ఏ నాటికీ మేటికవి. జానపదాలకూ, నాగరికులకూ కూడా ఏకైక కవి. ఎన్ని తుపానులూ, నూతన కవితోద్యమాలూ వచ్చినా చెక్కుచెదరని చేవ గల భద్రపీఠం ఆయనది" ఇప్పుడు విపులంగా శ్రీశ్రీ రచనలు చర్చించబడి డాక్టరేట్ సంపాదించిన థీసిస్ శ్రీశ్రీ కీర్తికిరీటానికే మరో వజ్రపు పొడి.

సప్రమాణికమైన, సజీవమైన వ్యావహారిక భాషలోవున్న యీ థీసిస్ ముద్రించి సాహిత్యాభిమానులకు అందేలా చేయవలసిన బాధ్యత ప్రభుత్వమో, సాహిత్య అకాడమీనో లేదా అభిరుచి, అర్థబలం కూడా ఉన్న ఏ సాహిత్యసంస్థో చేపట్టవలసి వుంది.

—ఎడిటర్

దొరికే నిరుపహతి స్థలంబు ఒక్కటే: అదే స్నానాల గది.

అంచేత స్నాగలోకి వెళ్ళగానే వాళ్ళు మహా చెడ్డ ఆనందం పొందుతారు. అక్కడి కెళ్ళగానే పొడుగు కోటు, పొన్నుకర్ర, తెల్ల టోపీ, నల్ల నవ్వు అవన్నీ విసిరి అవతల పారేస్తారు. ఆ బరువంతా పోయేసరికి చాల తేలికగా ఫీలయి, ఆ నిలువు టద్దాలలో తమ్ము తాము చూచుకుంటూ "హే గోపాలా!" అని పాడుకుంటూ ఆనంద నృత్యంలాటి దేదయినా చేస్తారు కాబోలు; ఆ తరంగం మధ్య నట్టువంగం కాస్త తడబడి స్నాగజాపం అవుతోంది కాబోలు—అన్న సిద్ధాంతంకూడా లేకపోలేదు.

మనలాటి ఆర్డినరీ మార్టల్స్—అనగా అల్పాయుష్కులైన సామాన్యులు యింత అగాధమైన విషయంమీద ఏవో మన స్థాయికి తగ్గట్టుగా ఊహలు అల్లగలరుగాని "స్నాగజాపానికి కారణం ఇది" అని బల్లగుద్ది చెప్పలేము.

—అని ముగించాడు బసవరాజు.

"అబ్బా.... ఇది చాల పెద్ద సబ్జెక్టేనయ్యా! దీని అధ్యయనం చేయడానికని ఏ యునెస్కోవాడినో ధన సహాయం పొంది ఒక ప్రత్యేకమైన యూనివర్సిటీ పెడితే బాగుంటుంది...." అన్నాను నేను.

"అబ్బే! యూనివర్సిటీ అనగానే మా వూళ్ళో పెట్టండి అంటే మా ఫిర్కాలో పెట్టండి అని తాంత్రపాడు వాళ్ళు తణుకు వాళ్ల గొడవలు చేస్తారు. కనుక దీన్ని స్టడీ చేయడానికి ఒక ఎంక్వైరీ కమిటీ వేయాలి...." అని రాజు సలహా ఇచ్చాడు.

మరే! కమిటీవేస్తే వాని అధ్యక్షత పదవికి అంటూ ఓ బావమరదీ, మెంబర్ షిప్‌లకోసం అల్లుళ్ళూ వుండే వుంటారు. కొంతవరకు దేశంలో నిరుద్యోగ సమస్య అయినా తీరుతుంది.

అంచేత బ్రదర్స్! చీకటిని తిట్టకూడదు. అది వుంటేనే చిన్న కమిటీ దీపమయినా వెల్గించగలం. దేర్‌ఫోర్ లాంగ్ లివ్ చీకటి!! □



"రేవతి"

గవర్నమెంట్ డాక్ బంగ్లాలో కూర్చుని తీరికగా ఆలోచిస్తున్నాడు ఫారెస్టు ఆఫీసర్ రంగారావు. రంగారావుకి "టైగర్ రంగారావ"నే పేరుంది. కారణం—ఒకటి—అతనెప్పుడూ డ్యూటీ విషయంలో చాలా కఠినంగా ఉంటూ ఉంటాడు. రెండు: పులివేట అంటే అమితమైన ఉత్సాహం చూపిస్తాడు. అతని ఐదేళ్ళ సర్వీసులోనే కనీసం డజన్‌పైగా పులుల్ని వేటాడేడు. అంత చక్కటి గురి అతనిది.

ఎంతో గడసరి మెకాల్ని సైతం ఒచేఒక్క గుండు దెబ్బతో నేల జారేట్లు కొట్టడం అతని అద్భుతమైన "షికారీ"కి నిదర్శనం. ఇంత వరకూ కూడా వేటలో రెండవ గుండు ఉపయోగించిన పాపాన్ని పోలేదు.

పెద్ద పెద్ద ఆఫీసర్లు సైతం పులి వేటలో అతనికున్న నైపుణ్యాన్ని చూడ్డం కోసం అతనితో రాత్రుళ్ళు అడవిలో మంచెమీద కూర్చుని పడిగాపులు పడతారు.

తన వయసిప్పుడు ఏభై దాటుతున్నా కూడా ఇప్పటికీ పులివేట అంటే అతనికి అమితమైన సరదా.

పనిలో అతి కఠోరంగా వుండే అతను కష్టపడి పనిచేసేవారంటే భలే ఇష్టపడతాడు. అందుకనే ఐ. ఎఫ్. ఎస్. పాసయి క్రొత్తగా జాయిన్ అయిన జానకిరావ్ తనకి చేరువ కాగలిగేడు. పనిలోనే ఛలాకీగా తిరుగుతూ పని చెయ్యడంలోనే విశ్రాంతి తీసుకోగల మన సత్వం గల జానకిరావ్‌ని అత్యంతమైన అనురాగంతో చూడగలిగేడు.

జీవితంలో పున్నమి వెన్నెల వెలుగునీ అమావాస్య కటిక చీకటి గల కాళరాత్రులనీ సమానంగా రుచి చూసిన రంగారావుకి జీవితంలో కన్నుల వెలుగు లావణ్య.

లావణ్య ఎవరో కాదు. అనూరాధ తనకి జీవితంలో ఆనందాలని పంచియిచ్చిన రోజుల అందాల గురుతు లావణ్య. చిట్టితల్లి లావణ్యని తనకి వదిలేసి అనూరాధ అనంతవిశ్వంలో కలిసిపోయింది.

అప్పటినుండి లావణ్యని అరిచేతులమీదుగా పెంచి పెద్ద చేశాడు. అనేకమంది అగమ్యమైన జీవన మార్గాన్ని సరిచేసుకోడానికి మరో జీవన సహచరిని చూసుకోమని ఎన్నోవిధాల నచ్చ జెప్పడానికి చూశారు.

కాని, ఆ వచ్చే స్త్రీమూర్తి లావణ్యని ఏ దృష్టితో చూస్తుందో చిట్టితల్లికి తల్లిగా రావడానికి ఒప్పుకుంటుందో లేదో అన్న భయంతోనూ జీవితంలో ఒకరికిచ్చిన మనస్సుని వాళ్ళే మళ్ళీ యింకొకరికి ఇవ్వడానికి మనస్సంగీకరించకా-ఒక స్త్రీ స్పర్శకి అలవాటు పడిన శరీరం మరో స్త్రీకి పంచి యివ్వలేకా పునర్వివాహ ప్రస్తావనని సున్నితంగా తిరస్కరించేరు రంగారావుగారు.

లావణ్యని విశాఖపట్నంలోనే ఓ బోర్డింగ్ స్కూల్‌లో జాయిన్‌చేసి అడవే తన స్వర్గంగా, విధి నిర్వర్తించడం కోసమే జీవిస్తున్నట్లుగా జీవితాన్ని క్రమబద్ధంగా కొన్ని నియమాలకి కట్టుబడి నడిపిస్తూ "టైగర్ రంగారావ్" అనే పేరు సార్థకం చేసుకున్నారు.

లావణ్యని చూడాలనుకొన్నప్పుడు తన జీప్‌లో క్షణాలమీద వాలేరు చేరుకునేవాడు. ప్రతి సెలవులకీ లావణ్యని "ఇంద్రపురి" మన్యాలకి యింటికి తీసుకుని వచ్చేవారు. ప్రతిక్షణం లావణ్యలోనే అనూరాధను చూసుకుంటూ బ్రతుకే లావణ్యగా, లావణ్యే తన బ్రతుకుగా కాలం గడిపేరు.

ఆ అడవిలో శరద్రాత్రుల్లో ఎన్నో పున్నమి రాత్రులు వెన్నెల వెలుగుల్లో మంచె మీద కూర్చుని గతాన్ని నెమరువేసుకుంటూ వన్య మృగాలని చూడటం అతనికి ఆనందంగా వుండేది. ఒక్కోసారి వేటాడ్డం సరదా అనిపించేది.


పులిని ఒకే ఒక్క గుండుతో నేల కొరిగేలా చెయ్యడం వేటలోని అతని నేర్పరితనానికీ, నిశ్చలమైన గురికీ, లక్ష్యశుద్ధికీ నిదర్శనం. రెండో గుండు వుపయోగిస్తే ఈ రంగారావు "టైగర్ రంగారావు" కానే కాడని సగర్వంగా చెప్పుకునేవారు.

నిజానికి జానకిరావ్ డ్యూటీలో చాలా సిన్సియర్‌గా ఉండేవాడు. డ్యూటీ విషయంలో జానకిరావ్ టైగర్ రంగారావుకి అనుచరుడనే అందరూ అనుకునేవారు.

ఈ నిర్జనారణ్యంలో జానకిరావ్ వచ్చిన తరువాత తనకి ఓ తోడు దొరికినట్లుగా ఫీలయ్యారు. అంతకు ముందు ఎందరో అసిస్టెంట్స్ మారేరు. కాని జానకిరావ్‌లాగా ఇంత చేరువ కాగలిగిన వ్యక్తి ఏ ఒక్కరూ తారసపడలేదతనికి.

డ్యూటీ అంటే ఏదో కర్తవ్యంలా చేసుకుపోయేవారేగాని ప్రైడ్ అఫ్ వర్కింగ్‌తో పని చేసే జానకిరావ్ అంటే తనకి ఎంతో గౌరవం. అందుకే జానకిరావ్‌ని ఓ అసిస్టెంట్ అన్న భావంతో గాకుండా ఓ మంచి స్నేహితుడిలాగా ఆత్మీయునిలాగా చూడసాగేరు. ఇన్నేళ్ళ ఒంటరి జీవితంలోనూ సరైన తోడు దొరికినట్లుగా ఫీలయ్యారు.

జానకిరావ్‌తో ఏర్పడిన ఈ బంధం అతని పెండ్లి అయిన తరువాత మరింత గట్టిపడింది.



మాలతి జానకీరావ్ జీవితంలో ప్రవేశించి అస్తమానం తనని బాబాయ్, బాబాయ్-అంకుల్ అ‌ః పిలుస్తూ జీవితంలో లావణ్య దూరంగా వున్న రోజుల్లో కూడా లావణ్యని మరపింప జేసింది.

ఒక్కో-రోజు లావణ్య దగ్గర లేనప్పుడు రాత్రుళ్ళు భయంకరమైప ఒంటరితనం తనని తినేస్తున్న సమయాల్లో తలగడాలో ముఖం దూర్చి సైలెంట్‌గా ఏడ్చుకునేవాడు అనూరాధ తనకు వేసిన శిక్షకు కుమిలిపోతూ.

ఒకరోజు ఇటువంటి సమయంలోనే మాలతి ఎలా కనిపెట్టిందో ఏమోగాని "ఏం బాబాయ్! నీలో నువ్వే అలా బాధపడుతున్నావ్?" అని తన దగ్గరున్న చనువువల్ల అడిగేసింది.

"అబ్బే! ఏం లేదమ్మా మాలా-నేను బాధ పడ్డం లేదు" అని పేలవంగా నవ్వేశాడు తను.

"కన్నీళ్ళతో తడిసిన తలగడా, ముఖాన బలవంతాన్ని తెచ్చిపెట్టుకొన్నట్లున్న ఆ నవ్వూ అబద్ధం చెప్పవు అంకుల్" అంది మాలతి.

మాలతి మాటలకి హాయిగా నవ్వేస్తూ "టైగర్ రంగారావు కంట ఎప్పుడూ నీరు రావడమమ్మా మాలా" అన్నాడు రంగారావు వాతావరణాన్ని తేలిక పరుద్దామన్న ఉద్దేశ్యంతో తెచ్చిపెట్టుకొన్న గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ.

"అయితే పులులకి మనస్సులుండవా అంకుల్?" అంది మాలతి రెట్టిస్తూ కాస్త సీరియస్‌గానే.

"ఈ విషయం ఇంతవరకూ ఆలోచించనే లేదమ్మా మాలా" అన్నాడు రంగారావ్ హాస్యంగా కొంత ఆశ్చర్యాన్ని అభినయిస్తూ.

"హాస్యం కాదు అంకుల్. లావణ్యని చూడాలనుకుంటే వెళ్ళొచ్చునుగా. రాత్రుళ్ళిలా మీరు నిదురించకుండా ఇలా ఏడుస్తూ కూచుని ఆరోగ్యం పాడుచేసుకుంటే ఎలా చెప్పు?" అని సున్నితంగా మందలించింది.

మాలతి అలవాటే అంత. ఏది చెప్పాలనుకుంటుందో అది సూటిగా చెప్పేస్తుంది.

లావణ్య కూడా అంతే-అదే మంకుపట్టు.

"రాత్రిళ్ళు హార్లిక్స్ త్రాగమంటే ఎందుకు నెగ్లెక్టు చేస్తున్నారు డేడీ? మీరు హార్లిక్స్ త్రాగేవరకూ నేను భోజనం చేసేది లేదు" అని రాత్రికి రాత్రి జీప్ డ్రైవర్ని పట్నానికి పంపించి రెండు హార్లిక్స్ బాటిల్స్ తెప్పించింది.

నిజానికి లావణ్య పరోక్షంలో మాలతిలోనే లావణ్యని చూసుకు బ్రతుకుతున్నాడు.

అలా మరింత గట్టిపడింది జానకిరావ్‌తో తన బంధం మాలతిరాకతో. మాలతికి ఏ కష్టం వచ్చినా సహించేవారు కాదు రంగారావ్‌గారు.

మన్యాలకి క్రొత్తగా కాపురానికి వచ్చిన రోజుల్లో మాలతి డల్‌గా వుండేది. పట్న వాసం నుండి ఒక్కసారిగా అడవుల్లోకి రావటం వలన ఒంటరితనం ఫీలయ్యేది.

"పిక్చర్‌కి తీసుకెళ్ళమని చెప్పండి అంకుల్" అని జానకిరావ్ ఎదుటనే అడిగేసేది నిర్భయంగా తనని.

"అవునోయ్, జానకీ! క్రొత్తగా పెళ్ళయిన జంట కనీసం వీకెండ్స్‌లోనయినా పిక్చర్స్‌కనీ, అలా అలా తిరగొచ్చుకదా! మాలతికి హోమ్ సిక్‌నెస్ రాకుండా చూడు" అని సున్నితంగా మందలిస్తే—

"ఊరుకోండి మామయ్యగారూ! మన్ దేస్‌లో మీ ఇన్‌స్పెక్షన్ ప్రోగ్రామ్స్ అటెండ్ అవ్వాలి గదా. డ్యూటీ ఫస్ట్" అనేవాడు జానకిరావ్.

మాలతి ఉడుక్కునేది.

"ఇలాగయితే నీకు ఛార్జిషీట్ ఇవ్వాల్సి వుంటుంది. ఇకమీదట మాలతి మనస్సు నొచ్చుకోడానికి వీల్లేదు, జాగ్రత్త!" అని వార్నింగ్ జారీ చేసేడు రంగారావ్ తన ఆఫీసర్ హోదాని జానకిరావ్‌కి జ్ఞప్తికి తెస్తూ.

లావణ్యతోకూడా మాలతికి మంచి స్నేహం కుదిరింది.

లావణ్యని చూడ్డానికి వెళ్ళినప్పుడల్లా మాలతి కూడా జీప్‌లో వెళ్ళేది. సెలవుల్లో లావణ్య వచ్చినప్పుడల్లా ప్రాక్టికల్‌గా ఇద్దరూ కలిసే తిరిగేవారు.

ఆ విధంగా ఆ రెండు కుటుంబాల మధ్యా విడదియ్యని బంధం ఏర్పడింది. వారిద్దరిమధ్యా సమ వయస్కులవడంమూలాన ఏ అరమరి కలూ లేకుండా ఒకే కుటుంబంలోని వ్యక్తుల్లా కలిసిపోయారు.


అటువంటి జానకిరావ్ తనకే యింత ద్రోహం తలపెడతాడా?

రంగారావుగారి ఒళ్ళు ఆవేశంతో కుతకుతా వుడికిపోయింది.

ఆ రోజు తన కళ్ళని తనే నమ్మలేక పోయాడు.

మామూలుగా తనకుండే అలవాటు చొప్పున

(వి)చిత్ర విజ్ఞానం



మాల్‌దీవ్ ద్వీప వాసులకు గాలిపటాలంటే తగని పిచ్చి. చిన్నా పెద్ద తేడాలేకుండా గాలిపటాలు ఎగురవేసుకుంటూ సంతోషంగా కనిపిస్తారు. ఒక యాత్రికుడు అక్కడ ఒక పోస్టాఫీసుకు వెళ్ళాడు. అక్కడ స్టాంపులమ్ముతున్న గుమాస్తా తన ఎడమ చేత్తోనే డబ్బులు తీసుకోవడం, అదే చేత్తోనే స్టాంపులు చింపి యివ్వడం చూశాడు. పాపం అతనికి కుడిచేయి లేదేమో ననుకుని కౌంటరులోకి తొంగి చూశాడు యాత్రికుడు. ఆ గుమాస్తా తన కుడిచేత్తో పక్క కిటికీ గుండా ఓ గాలిపటం ఎగరవేస్తున్నాడు.

పున్నమినాటి రాత్రి వన్యమృగాల్ని చూడటం కోసమని సాయంత్రమే జీప్ తీసుకుని బయలేరి మంచెమీద కూర్చున్నారు రంగారావుగారు. అప్పుడే వేసవి సెలవులకని లావణ్య వచ్చి వారం రోజులకు పైగా అయింది.

కొంతసేపు మంచెమీద కూర్చుని కూర్చుని ఆ రోజెందుకో విసుగనిపించి చీకటిపడుతూనే రిటర్న్ అయ్యేరు.

పండు వెన్నెల. మిలమిల మెరిసే నక్షత్రాలతో ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా వుంది.

"అనూ....! నా కెందుకీ ఒంటరితనాన్ని మిగిల్చి వెళ్ళిపోయేవు?" అనుకుంటూ ఉస్సురని నిట్టూరుస్తూ జీప్ గేరేజిలో పెట్టి వరండాలో అడుగు పెడుతూనే కాళ్ళకి బ్రేకులు పడ్డాయి.

లోన తన గదిలో డిమ్ రెడ్‌లేంప్ వెలుగులో రెండు నీడలు....గుసగుసలు....

రంగారావుగారు నవ్వుకున్నారు తన పండు మీసాల చాటున.

"బహుశా నేను లేననుకొని మాలతి-జానకిరావ్....ఓహ్!"

వాళ్ళని డిస్టర్బ్ చెయ్యడం ఇష్టం లేక వెనక్కి తిరిగేరు.

మెట్లు దిగుతూనే రంగారావుగారు నిశ్చేష్టులయ్యేరు.

వెన్నెల వెలుగులో ఎదురుగా వున్న జానకిరావ్ బంగ్లా ఆవరణలో అప్పుడే తెల్లని చీరలో అప్సరసలా వెలిగిపోతున్న మాలతి!

తన కళ్ళని తనే నమ్మలేకపోయారు.

అంటే తన గదిలో జానకిరావ్-లావణ్య!

మళ్ళీ వరండాలో అడుగు పెట్టి నిశితంగా చూశారు.

"హే భగవాన్! ఏమిటీ పరీక్ష?"

లోన తన్మయత్వంలో జానకిరావ్-లావణ్య.

ఇప్పుడు ఏమయినా రచ్చ చేస్తే తన పరువే పోతుంది.

అనాలోచితంగా వరండాలో లైటు ఆన్ చేశారు ఏం చెయ్యడానికి తోచక.

వరండాలో లైటు వెలుగు విరజిమ్మే సరికి లోన వున్న జంటకి డిస్టర్బెన్స్ అయి, పెరటి గుమ్మంలోంచి జానకిరావ్ జారుకున్నాడు చల్లగా.

లావణ్య తొట్రుపాటుతో తలుపు తీస్తూ ఆశ్చర్యంగా "డేడీ?" అంది.

పులిపంజాలో చిక్కుకున్న మేకపిల్ల లావణ్య.

నిశ్చలంగా గంభీరమైన ముద్రతో మౌనంగా తన గదిలో చేరుకుని లైటార్పి పడుకున్నారు రంగారావుగారు.

జీవితంలో లావణ్యకి అన్నీ సమకూర్చేనే అని సంతృప్తిపడ్డ తనకి లావణ్యకి ఈ వయసులో ఇవ్వాల్సింది ఇవ్వలేకపోయేరో రంగారావుగారికి ఇప్పుడర్థమైంది.

ఎదిగిన కూతురికి ఎలా చెప్పడమా అని

మధనపడసాగేరు రాత్రల్లా.

జానకిరావ్ సంగతి తనకి బాగా తెలుసు.

అతనికున్న బలహీనతల్లా స్త్రీలోలత్వం.

ఎన్నోసార్లు తన చెవివరకూ వచ్చిన రిపోర్ట్లని త్రోసిరాజన్నారు రంగారావుగారు. రెడ్ హేండెడ్‌గా కంటబడిన సందర్భాల్లో కూడా తను ఎన్నోసార్లు జానకిరావ్‌ని సేవ్ చేసేరు

"వయసు చాపలత్వాన్ని అదుపులో ఉంచుకోలేకుంటే కష్టాల్ని కోరి తెచ్చుకున్న వాడి వౌతా"వని సున్నితంగా మందలించేరు.

నిజానికి తనేగాని తల్చుకుంటే మొట్ట మొదటే జానకిరావ్‌ని మసిచేసేసి వుండేవారు. కాని, ఎందుకో జానకిరావ్‌పట్ల తన హృదయం సున్నితంగా పనిచేసింది. విధి నిర్వహణ విషయంలో చాలా సిన్సియర్‌గా వుండే అతనంటే ఎందుకో తనకే తెలియని ఆప్యాయత ఏర్పడింది.

మాలతి రాకతో జానకిరావ్ చక్కబడతాడని ఆశించేరు.

మారేడనే అనుకున్నారు.

ఇదేనన్న మాట మాలతి అప్పుడప్పుడూ దిగులుగా వుండటానికి కారణం.

అంటే మాలతి వచ్చినా కూడా తన అలవాట్లని మార్చుకోలేదు జానకిరావ్.

రుచులు మార్చగలిగిన పులి జానకిరావ్.

మేనీటర్....?

ఒక్కసారి మనిషి రక్తాన్ని చవిచూచిన పులి మాటి మాటికీ జనపదాల్నే వెతుకుతూ వుంటుంది.

ఇక ఉపేక్షించి లాభంలేదు. నిప్పు తన ఇంటివరకూ వచ్చింది.

మర్నాడు మార్నింగ్ బ్రేక్‌ఫాస్టు దగ్గర రంగారావుగారు "లావణ్యా!" అని మార్దవంగా పిలిచేరు.

"ఏం డేడీ?" అంది లావణ్య.

అమాయకంగా కనపడే లావణ్య ముఖంలో అనూరాధ నీడలు వెదుకుతూ "అమ్మా లావణ్యా! నిన్న రాత్రి నీతో జానకిరావ్....?"

"ఔను డేడీ! ఐ లైక్ హిమ్ వెరీ మచ్" అంది తడుముకోకుండా.

మిన్ను విరిగి మీద పడినట్లయింది రంగారావుగారికి.

లావణ్య చెంప ఛెళ్ళుమంది.

"నువ్వేం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా? ఏది మంచో ఏది చెడో తెలుసుకోలేని వయస్సు నీది. జానకిరావ్ పెళ్ళి చేసుకున్నవాడు. నీకు తగిన సంబంధం చూసి పెళ్ళి చేస్తాను. అంతవరకూ నీ హద్దుల్ని తెలుసుకుని ప్రవర్తించు. కూతురికి తల్లి చెప్పాల్సిన నీతులు, నేను నీకు చెప్పాల్సి వస్తుందని అనుకోలేదు. ఐయాం సారీ...." అంటూ బైటికి వెళ్ళిపోయారు విసురుగా.

ఉపాయంతో ఈ సమస్య పరిష్కరించాలి. అంతేగాని చెప్పి ప్రయోజనం లేదనుకున్నారు రంగారావుగారు. పైకి మాత్రం జానకిరావ్‌తో చనువుగానే వుంటున్నారు.

రంగారావుగారి మస్తిష్కం ఆలోచనల తీవ్రతకి వేడెక్కిపోయింది.

హృదయం తనపట్ల జానకిరావ్ చేసిన ద్రోహచింతనకి మండిపోతోంది.

"దొరా! చింతలతోపుల్లో మెకం తిరుగుతోంది దొరా! మాటి మాటికీ మా పల్లెమీద పడి మడుసుల్ని తింటోంది" అంటూ ఓ ఆటవికుడు చెప్పిన మాటల్తో ఈ లోకానికి వచ్చేరు రంగావ్‌గారు. తన ఆలోచనల గొలుసు తెగిపోయింది.

డాక్ బంగ్లా ఆవరణలో తను కూర్చున్న కుర్చీకి ఎదురుగా సవినయంగా చేతులు కట్టుకుని ఒంగి నిల్చున్నాడు ఆ అడవి మనిషి.


"ఏంటీ? మేనీటర్! ఎక్కడరా?" అని అడిగేరు.

పులి వేట అంటే సరదా వేసింది!

"చింతలతోపుల్లో దొరా! గరిభీరగెడ్డ ఒడ్డున నిన్న ఉేల యిద్దర్ని యేసేసింది దొరా!"

"సరే పద. చూపెట్టు దారి" అంటూ జీప్ తీసేరు రంగారావుగారు.

ఓ గంటలో ప్రదేశం పరిశీలించి పులి అడుగుజాడల్ని చూసి, అనువైన చోట ఎదురెదురుగా వున్న రెండు చెట్లమీద రెండు



మంచెలు కట్టించేరు. భారమంతా ఒకే త్రాటి మీద వచ్చేలాగా ప్రత్యేకంగా కట్టించేరు.

ఈ రోజు వేటలో పులి పడిపోయి తీరాలి.

జానకిరావుని కూడా ఆహ్వానించేరు పులి వేటకి.

జానకిరావ్ పులివేట గురి రంగారావుగారి దగ్గర నేర్చుకున్నాడు. రెండు మూడు సందర్భాల్లో రంగారావుగారు "మొదట నువ్వెయ్యి-తప్పించుకుంటే నేను చూసుకుంటాను" అని చెప్పి జానకిరావ్ లక్ష్యశుద్ధిని ఇంప్రూవ్ చేశారు.

సాయంత్రం మునిమాపువేళకి జీపులో ఫ్లాష్‌లైట్లు, గన్స్, తూటాలు, టార్చిలైట్లు. ఫ్లాస్క్ నిండా టీ, బిస్కెట్లు పట్టుకుని నిర్దేశించిన స్థలానికి చేరుకున్నారు.

రాత్రి సుమారు ఎనిమిది అవుతోంది.

ఫుడ్ స్నేక్స్ కానిచ్చేసి జానకిరావ్‌ని ఎలర్ట్ చేసి ఎదురుగా వున్న మంచెమీదికి ఎక్కించి తను ఇవతలి మంచెమీద మాటువేసి కూర్చున్నారు.

రెండు మంచెలకీ మధ్యన అనువైన చోట ఓ చెట్టుకి ఒక మేకపోతు బలి కట్టబడింది.

నిశ్శబ్ద నిశీధిలో ఉండుండి వన్యమృగాల అరుపులు గుండెలదిరేలాగా వినిపిస్తున్నాయి. మిణుగురు పురుగులు మిలమిలా మెరుస్తూ రాత్రికి మరింత శోభని చేకూరుస్తున్నాయి.

బలికి కట్టబడిన మేకపోతు గిలగిలా కొట్టుకొంటూ హృదయవిదారకంగా అరుస్తోంది.

రేడియం డయల్ వాచ్‌లో టైం చూసేరు రంగారావుగారు.

ఒంటిగంట దాటుతోంది.

నిద్రజోగు రాకుండా టీ త్రాగేరు.

ఉండుండి శ్వాస ఆగిపోయిందా అన్నట్లుగా గబ్బుకంపు.

పొద చాటున చిన్న అలికిడి.

రెండు కళ్ళు మిరుమిట్లు గొలిపేలా పొద చాటునుండి పొంచి చూస్తున్నాయి.

అంటే చారల మెకం వచ్చిందన్న మాట. వేటమీదికి వురికే ముందు "ఫ్రీజ్" అయిపోయి పరిసరాలు తనకి అనుగుణ్యంగా ఉన్నాయో లేదో అని పరిశీలిస్తోంది అనుకుంటూ ఊపిరి తీసుకుని రైఫిల్ అందుకు

న్నారు రంగారావ్‌గారు.

బలికి కట్టబడిన మేకపోతు కూడా ఆపద పసిగట్టిందో ఏమోగాని దాని అరుపులు మరింత ఎక్కువయ్యాయి.

ఉన్నట్లుండి ఒక నిశ్చయానికి వచ్చిన వాడిలా 'ట్రిగ్గర్' మీద వ్రేలుంచేరు.

ఈ దెబ్బతో పులి పడిపోవాలి-అనుకుంటూ నిశీథిలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని "ట్రిగ్గర్" నొక్కేరు.

గురి తప్పలేదు.

అనుకున్న ప్రకారమే ఎదురుగా వున్న మంచెకి కట్టబడిన బలమైన త్రాటి ముడికి తగిలి మంచె తిరగబడింది.

అంతే తృటి కాలంలో పులి క్రిందపడింది.

మనిషి రక్తానికి అలవాటు పడిన మేనీటర్ బలికి కట్టబడిన మేకను వదిలి క్రిందపడిపోతూ ఆర్తనాదం చేసిన జానకిరావ్‌ని నోట కరచుకుంది.

ఒకే ఒక్క పంజా దెబ్బతో రంగారావ్ గారిని పట్టుకున్న సమస్య వదిలిపోయింది.

ఈ సారి రెండవ గుండు ఉపయోగించక తప్పిందికాదు రంగారావ్‌గారికి.

వెన్నెల వెలుగుతో చారల మెకం నోట గిలగిలలాడుతున్న జానకిరావ్ క్లియర్‌గా కనిపించేరు. నోట కరచుకుని ఒక్క వురుకు వురికింది చారల మెకం. ఉరికిన పులి నేలని ముట్టకుండానే రంగారావుగారి రైఫిల్ రెండవ గుండు విడిచింది.

అంతే....పులి నేలకొరిగింది భీభత్సంగా అరుస్తూ.

మేక "సేవ్" అయింది.

రకగారావుగారు మంచె దిగేరు.

కొన వూపిరితో వున్న జానకిరావ్ "మామయ్యగారూ...." అని పడిపోయేడు.

ద్రోహచింతనతో తనకే ద్రోహం తలపెట్టినందుకు శిక్ష విధించినా ఓ ప్రక్క మాలతి గుర్తుకి వచ్చి అంతరంగంలో లావణ్య మెదుల్తుండగా ఓ కంట నీరూ ఓ కంట రక్తం చిందిస్తూ "క్షమించమ్మా మాలా...." అనుకుని జీప్ బంగ్లావైపు పోనిచ్చేరు.

క్షణాలమీద మాలతిని, లావణ్యని వెంటబెట్టుకొని ఆ స్థలానికి వచ్చేరు రంగారావ్‌గారు.

ఆ రాత్రి వెన్నెల వెలుగులో మాలతి తన భర్త శవంమీద పడి హృదయవిదారకంగా ఏడుస్తుంటే...."మేక గురించని పులిని వేటాడక తప్పదు-క్షమించమ్మా మాలా...." అని మనస్సులోనే విలపిస్తుండగా శిల నుండి రెండు అశ్రువులు రాలేయి, ఎప్పుడూ కంట తడి పెట్టననుకునే టైగర్ రంగారావుకి.

అంతరంగంలో "పులులకి మనస్సులుంటవా అంకుల్!" అంటూ హృదయవిదారకంగా ఛాలెంజ్ చేస్తోంది మాలతి. □

రాజకీయం

టి. విమల

మందు పార్టీ జోరుగా సాగుతోంది.

హైదరాబాదు నుండి వచ్చిన బడా రాజకీయ నాయకుడైన తన ప్రాణస్నేహితుడు కోటిరెడ్డి గౌరవార్థం తమ ఇంటిలో ఆ రోజు భారీ ఎత్తున పార్టీ ఏర్పాటుచేశాడు-ఆ ఊరి పంచాయితీ ప్రెసిడెంటు పాపిరెడ్డి.

పార్టీకి పెద్ద నాయకులతోపాటు పన్నపాటి నాయకులు-మొత్తం ఓ పదిమంది వరకూ హాజరయ్యారు.

అసలు పార్టీ ముఖ్యఉద్దేశం —— సదరు హైదరాబాదు నుండి వేంచేసిన ప్రాణస్నేహితుడి ద్వారా తన కొడుకు సుబ్బారెడ్డికి రాబోయే ఎన్నికల్లో 'సీటు' సంపాదించాలని చోటా రాజకీయాల్లోనే తలనెరిసిన పాపిరెడ్డి దూరాలోచన-దురాలోచన.

సుబ్బారెడ్డి బస్తీ కాలేజీలో చేరి డిగ్రీ పుచ్చుకున్నాడు. పై చదువులు చదవాలనే కోరిక బలంగా వున్నా, అతని తండ్రి ససేమిరా వద్దన్నాడు.

చదువులు వచ్చి కూడు పెట్టవన్నాడు. గుడ్డ పెట్టవన్నాడు. తలదాచుకోడానికి నీడ చూపెట్టలేవన్నాడు. పెద్దపెద్ద చదువులు చదివిన వాళ్ళే కిళ్ళీబడ్డీలు పెట్టుకొని బ్రతుకుతున్నారన్నాడు. ఇంకా చాలా చాలా అన్నాడు. అనీ అని ఆఖరికి, చదువు మానేసి చక్కా ఇంటికి వచ్చేయమన్నాడు. బుద్ధిగా రాజకీయాల్లో జేరిపొమ్మన్నాడు. తనకెలాగూ వయసు అయిపోతోంది గదా-తన తర్వాత తన వారసత్వాన్ని తీసుకోమని హితబోధ చేశాడు. తన తర్వాత పంచాయితీ ప్రెసిడెంటుగిరి ఏకచత్రాధిపత్యంగా నువ్వే ఏలుకోమన్నాడు. తన తండ్రి యింతగా తన మేలు కోరి చెప్పినందుకు ఆలోచనలో పడ్డాడు సుబ్బారెడ్డి.

ఆలోచించాడు——బాగా ఆలోచించాడు.

అక్షరం ముక్కరాని తన తండ్రే అఖండంగా రాజకీయాల్లో వెలిగిపోతున్నప్పుడు—— ఇక, పాలిటిక్స్‌తో బి.ఎ. పాసైన తనెంత అఖిలాండ బ్రహ్మాండంగా వెలిగిపోగలడో ఊహించుకున్నాడు.

ఊహించుకున్నదే తడువుగా పెట్టే బేడా సర్దుకొని, పుట్టి పెరిగిన పల్లెటూరు చక్కా వచ్చేశాడు. రాజకీయాల్లో రంగప్రవేశం చేశాడు. అదీ-సుబ్బారెడ్డి రాజకీయాల్లో చేరటానికి గల పూర్వకథ.

పార్టీ-బిల్డింగ్ పైన ఏర్పాటుచెయ్యబడింది. మూన్‌లైట్ పార్టీకి అన్ని హంగులూ వుండాలని పాపిరెడ్డి అభిప్రాయం.

అందుకే-ఫారిన్ బాటిల్స్‌తో పాటు ఫారిన్ బ్యూటీలను కూడా పిలిపించాలనుకున్నాడు గాని, పరిస్థితులు అనుకూలించనందువల్ల విధిలేక ఆఖరికి మద్రాసు నుండి ఛోటాతారల్ని ఓ ఇద్దర్ని పిలిపించాడు పాపిరెడ్డి. పాపిరెడ్డికి మిత్రుడు కోటిరెడ్డి టేస్టులు బాగా తెలుసు. ఆయనకి ఫారిన్ సరకంటే పిచ్చిమోజు.

ముందుగా 'మందు' పార్టీ మొదలైయింది.

బాటిల్స్ ఓపెన్ అవుతూనే వున్నాయి.

కాక్‌టైల్ చేసుకుని త్రాగేవారు కొందరు-

మత్తుమందుని డైల్యూట్ చేసి త్రాగితే అందులో అసలు థ్రిల్ ఏముందని వొట్టి 'రా' సరుకునే గొంతు మండుతున్నా లెక్కచెయ్యకుండా గొంతుల్లో పోసేసుకుంటున్నారు మరికొందరు.

ఒకప్రక్క త్రాగుతూనే చికెన్‌ఫ్రైలూ,

చికెన్ తండూరాలూ, మటన్ ఫ్రైలూ, మటన్ రోస్టులూ నంజు కింటూ, ఆదే ప్లైంలో రాజ కీయాల్ని కూడా అనర్గళంగా చర్చించు కుంటున్నారు.

అటువంటి సమయంలో—

క్రిందనుంచి ఓ పెద్ద అరుపు వినిపించింది.

ముఖం చిట్లించాడు పాపిరెడ్డి.

ఓ క్షణం త్రాగుతోన్న మందుని ఆపేసి, తింటున్న చికెన్‌రోస్టుని మధ్యలోనే నిలిపేసి, క్రిందనుండి వినిపించిన అరుపు మళ్ళీ వినిపిస్తుందేమోనని చెవులు వేటల్లా చెసుకొని వినసాగాడు.

మళ్ళీ అదే అరుపు—

హృదయ విదారకంగా

"బాబూ! మూడు రోజుల నుండి అన్నం లేదు. పిడికెడన్నం వుంటే పెట్టించండి బాబూ—"

పాపిరెడ్డికి ఒళ్ళు మండింది.

ఖుషీగా పార్టీ చేసుకుంటున్న ఈ ప్రశాంత వాతావరణంలో ముష్టివాడి అరుపులు అమృతంలో చిలికిన హాలాహలంలా తోచింది.

గ్లాసులో మిగిలిన మందుని గుటుక్కున గొంతులో పోసుకుని, చేతిలోవున్న చికెన్ ముక్కని పళ్ళక్రింద యిరికించుకొని కరకరా నములుతూ—

"వెంకన్నా" అని పిలిచాడు. కాదు....కాదు పెద్దగా అరిచాడు.

సదరు వెంకన్న పాపిరెడ్డి ఇంట నౌకరు.

తరతరాలనుండి వస్తున్న బానిసత్వానికి వెంకన్న కుటుంబం ఓ ఉదాహరణ. వెంకన్న తాత పాపిరెడ్డి తండ్రి దగ్గర వెట్టిచాకిరి చేశాడు. వెంకన్న తండ్రి పాపిరెడ్డి దగ్గర వెట్టిచాకిరీ చేస్తూచేస్తూ అకస్మాత్తుగా మరణించడంతో— ఇప్పుడు వెంకన్న ఆ పని చేస్తున్నాడు-వారసత్వాన్ని భుజాన వేసుకొని. కాబట్టి వెంకన్న కుటుంబ సభ్యులందర్లో ప్రవహించేది బానిస రక్తం అనడంలో ఆశ్చర్యపోవలసిన పనేలేదు.

వెంకన్న చాలా నమ్మకస్తుడు.

ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న కుక్కయినా విశ్వాసాన్ని మరిచిపోయి కరుస్తుందేమోగాని వెంకన్న మాత్రం అలాంటి వాడు కాదు. ఏ పని చెప్పినా నోరుమూసుకొని తల వొంచుకొని చెప్పింది భక్తిశ్రద్ధలతో చెయ్యడమే తెల్సుగాని—ఈ పని ఎందుకు చెయ్యాలి? ఈ పని చెయ్యడం వలన తనకు లాభమా? నష్టమా? అని ఆలోచించే లోకజ్ఞానంగానీ, అక్షర జ్ఞానంగానీ పూర్తిగా వెంకన్నకు లేదు. కూపస్థ మండూకంలా పెరిగాడు. అందుకే అతడికి తెలిసిందల్లా పాపిరెడ్డి ఇల్లూ-ఆ యింట్లోని మనుష్యులు. అయ్యగారు చెప్పారనో లేక అమ్మగారు చెప్పారనో-లేకపోతే ఆ యింట్లో ఎవరో కుటుంబసభ్యులు చెప్పారనో—వాళ్ళు తన యజమానులు కాబట్టి వారు చెప్పిన పని చెయ్యాలి. అలా చెయ్యడమే నౌకరు కర్తవ్యం. అలా చెయ్యకపోతే స్వామిద్రోహం అవుతుంది. కాబట్టి చెయ్యాలి-అనేది వెంకన్న విశ్వాసానికి, స్వామి భక్తికీ నిదర్శనం.

అందుకే—

'వెంకన్నా' అనే అరుపు పైనుండి వినిపించగానే—క్రింద ఇంటిముందు—కుక్కలా కాపలా కాస్తున్న సదరు వెంకన్న రెండంగల్లో మేడమెట్లెక్కి—పరుగులాంటి నడకతో— అయ్యగారు పాపిరెడ్డి ముందు-చేతులు కట్టుకొని-తల వొంచుకొని-అతి వినయంగా నిలబడ్డాడు.

"పిలిచారా అయ్యగారూ"

"అవున్రా! క్రింద ఎవడో ముష్టివాడు అరుస్తున్నాడు వినబడిందా?"-కోపమూ-విసుగూ—అధికారమూ ధ్వనించాయి పాపిరెడ్డి మాటల్లో.

"వినిపించిందయ్యగారూ" — వినయంగా అన్నాడు వెంకన్న.

"ఏవిటీ వినిపించిందీ! మరయితే వాడి నెందుకు మెడపట్టుకొని గెంటలేకపోయావురా 'మాల'నా కొడకా...."

"పొమ్మన్నాను అయ్యగారు. కాని వాడు వినిపించుకోడంలేదు...."

"ఏమంటాడేవిటి?" కాళీ అయిన గ్లాసులో మరికాస్త బ్రాందీ పోసుకొని సిప్‌చేస్తూ అడిగాడు పాపిరెడ్డి.

"మూడురోజుల నుండి అన్నం లేదు.... కడుపులో ఆకలి మండిపోతోంది. నేను కదల్లేను....పార్టీ అయ్యేంతవరకూ యిక్కడే తొంగుంటాను. ఆనక మిగిలిపోయిందేదైనా వుంటే నా ముఖాన పడేయించండి. ఆకలి తీర్చుకుంటాను — అంటున్నాడండి. ఎంత చెప్పినా వినడంలేదండి" భయం భయంగా వున్న విషయాన్ని కాస్తా బయట పెట్టేశాడు వెంకన్న.

"నో....అలా వుండటానికి వీల్లేదు. వెస్టర్న్ మ్యూజిక్ లాగా ఈ పార్టీ జరుగుతూన్నంత సేపూ ఆ ముష్టివాడి అరుపులు వినవలసిందేనా....నో నో....వాడిని వెంటనే మెడపట్టుకొని గెంటేయ్" వెంకన్నతో అని, మళ్ళీ ఒక్క క్షణం ఆలోచించి "వరేయ్ వెంకన్నా! నువ్వొక్కడివే ఏమీ చెయ్యలేవుగాని....ఒరేరే సుబ్బారెడ్డీ! వెంకన్నగాడితో క్రిందికెళ్ళి ఆ ముష్టివాడి కథేదో చూడు" అన్నాడు పాపిరెడ్డి కొడుకు సుబ్బారెడ్డితో.

తండ్రి ఆదేశాన్ని అందుకున్న సుబ్బారెడ్డి, గ్లాసులో సగానికి పైగావున్న మందుని గుటుక్కున గొంతులో పోసుకొని లేచి నిలబడ్డాడు.

అధికారదర్పంతో కదిలాడు.

కోపమైతే సుబ్బారెడ్డికి తెలుసుగాని—ఆ కోపంలో చేసే పనులకి పర్యవసానం ఎలా వుంటుందో లోతుగా ఆలోచించే రాజకీయ పరిజ్ఞానం యింకా అతడిలో చోటు చేసుకోలేదు.

* * *

"లంజాకొడకా! ఏమిట్రా నోటి కొచ్చినట్లు వాగావట. ముష్టెత్తుకొని బ్రతికే ముండా కొడుక్కి, అంత తలపొగరెందుకురా...."

త్రాగిన మైకం తలకెక్కితే అధికారమదం కళ్ళకెక్కి కళ్ళు చింత నిప్పుల్లా నిప్పులు చెరుగుతుంటే తనేం మాట్లాడుతున్నాడో తెలుసుకోలేని ఉన్మాద స్థితిలో సుబ్బారెడ్డి కోపంగా, ఆవేశంగా, పగపట్టిన త్రాచులా, సింహంలా ముష్టివాడి మీదికి లంఘించాడు.

సుబ్బారెడ్డి బూటుకాలు ముష్టివాడి గుండెల్లో బలంగా గుచ్చుకుంది.


ఒక్కసారి కాదు....రెండుసార్లు కాదు.... లెక్కలేనన్ని సార్లు—

అంతే!

మొదలు నరికిన చెట్టులా నేలకొరిగి పోయాడు ముష్టివాడు.

ముష్టివాడి నోటినుండి రక్తం కారుతోంది. గుండె పగిలి రక్తనాళాలు చిట్లి, గుండెల్లోంచి ఏకధారగా, గట్టులేని ప్రవాహంలా ప్రవహిస్తోంది రక్తం—

ఎందరి ఇంటి ముంగిటో నిలబడి, ఎంత మంది చేతనో చీదరింపులూ చీత్కారాలూ చవిచూచి అడుక్కుతిన్న అన్నం ప్రసాదించిన రక్తం—



మానాన్నీ, అభిమానాన్నీ మరచిపోయి, దీనంగా, హీనంగా బ్రతుకీడుస్తూ పెంచుకొన్న శరీరం నుండి కారిపోతున్న రక్తం—

రక్తం!....రక్తం!....

ఎర్రగా....ఎర్రఎర్రగా....రక్తం!!

గొంతుకోసిన కోడిపిల్లలా ముష్టివాడు నేల మీద పడి కొట్టుకుంటున్నాడు.

సొట్టలుపడి, చిల్లులుపడి శిధిలావస్థలోవున్న అల్యూమినియం గిన్నె ఎగిరి అల్లంత దూరంగా పడిపోయింది. ఆ గిన్నెలోవున్న నాల్గు అన్నం మెతుకులూ చెల్లాచెదురై-ఇక ఈ రోజుతో నీకూ మాకూ ఋణం తీరి పోయింది-అన్నట్లు నేలపాలయ్యాయి.

"పొగరు అణిగింది లంజాకొడుక్కి—."

సుబ్బారెడ్డి కసికొద్దీ తిట్టుకొన్నాడు.

అప్పటి వరకూ కోడిపిల్లలా కొట్టు కుంటున్న ముష్టివాడు అకస్మాత్తుగా కొట్టు కోవడం మానేశాడు.

రక్తం గడ్డకట్టింది.

వొళ్ళు చల్లబడిపోయింది.

కళ్ళముందు జరుగుతోన్న తతంగమంతా కళ్ళార్పకుండా చూస్తున సుబ్బారెడ్డి చల్లబడి పోయాడు. కంగారు పుట్టింది. తలకెక్కిన 'నిషా' అరికాళ్ళల్లోకి దిగిపోయింది.

ముష్టివాడికేమైంది? .... ఏమైంది? .... ఏమైంది?....

బుర్ర వేడెక్కింది సుబ్బారెడ్డికి.

అప్పటివరకూ ఒక ప్రేక్షకుడిలా నిలబడ్డ వెంకన్న గుండెల్లో ఎవరో చెయ్యిపెట్టి కెలికి నట్లయింది. కాని తనేమీ చెయ్యలేని నిస్సహా యుడు. అందునే ఏం జరుగుతుందో చూస్తూ వుండిపోయాడు.

"ఏమిట్రా యింకా అలాగే గుడ్లప్పగించి చూస్తున్నావ్....ఆ వెధవకి ఏమైందో చూడు" సుబ్బారెడ్డి అన్నాడు వెంకన్నతో.

వెంకన్న ఉలిక్కిపడి, గబగబా రెండడు గులు ముందుకు వేసి, ముష్టివాడి దగ్గరగా నడిచి, వొంగి, చేత్తో ముష్టివాడి చేతిని పట్టు కొని పామును పట్టుకున్నట్లు తుళ్ళిపడ్డాడు.

ముష్టివాడి చెయ్యి మంచులా తగిలింది.

గుండెలమీద చెయ్యిపట్టి గుండె కొట్టు కుంటుందేమో చూశాడు.

గుండె కొట్టుకోడం లేదు.

ముక్కుదగ్గర చెయ్యిపెట్టి చూశాడు.

ఊపిరి వొదలటం లేదు.

మూసుకున్న వాడి కళ్ళని చేత్తో తెరిచాడు.

తెరుచుకున్న రెప్పలు తెరుచుకున్నట్లే వుండిపోయాయి.

అంటే....అంటే....

వెంకన్న వొంట్లోని రక్తం గడ్డకట్టుకు పోతున్న ఛాయలు.

"ఏమిట్రా! అలా గుడ్లేసుకొని చూస్తావు? ఏమైంది వాడికి?" అసహనంగా అరిచాడు సుబ్బారెడ్డి.

వెంకన్నకు నోట మాట రాలేదు కాస్సేపు.

"బాబుగారూ!....చచ్చిపోయాడు" ఆఖరుకు అతికష్టంమీద గొణిగాడు వెంకన్న.

ఏమిటీ....చచ్చిపోయాడా?....

అంటే....అంటే తను కొట్టిన దెబ్బలకి గుండెపగిలి .... రక్తం కక్కి .... ముష్టివాడు చచ్చాడన్న మాట!....

ఎలా?....ఇప్పుడెలా?....

వాడి మరణానికి కారణం తనే!....

ఆ ఊహ రాగానే వొళ్ళు వొణకసాగింది సుబ్బారెడ్డికి.

గుండెల్లో దడ....వొళ్ళంతా చెమట.

కళ్ళముందు ఏవేవో భయంకరమైన దృశ్యాలు కనబడుతున్నాయి .... భయపెడు తున్నాయి....


కాని-అంతలోనే కోపం—

ఎంత పొగరు? ఆఫరాల్ అడుక్కుతినే వెధవకి ఇంత అహంకారమా?....పొమ్మని చెబితే వినకుండా మొరాయించి యిక్కడే బైఠాయిస్తాడా .... తగిన శాస్తే జరిగింది వెధవకి....

కాని....కాని .... ఇప్పుడు....జరగవలసిన కర్తవ్యం ఏమిటి?

వాడు చచ్చిపోయాడు.

తను కొట్టిన దెబ్బలకే చచ్చిపోయాడు.



అందులో సందేహంలేదు.

తను కొట్టినా-ముష్టివాడు చచ్చిపోయినా పర్వాలేదు. ఈ రహస్యం తనతోనే సమసి పోతుంది.

కాని—కాని—తను కొట్టడమూ — వాడు చావడమూ వెంకన్నగాడు చూశాడు.

వెంకన్నగాడు అందరికీ చెప్పేస్తాడేమో!

ఏడ్చాడు వెధవ!....వాడి మొఖాన కొంత డబ్బు కొట్టి వాడి నోరు మూయించేస్తే సరి పోతుంది....

అంతే!....అంతే!!....

ఆ ఆలోచన రావడమే తడవుగా గబగబ మెట్లెక్కి- తన తండ్రి దగ్గరికి చేరుకున్నాడు సుబ్బారెడ్డి.

* * *

కొడుకు రహస్యంగా తన చెవిలో చెప్పిన మాటలు విని హతాశుడై పోయాడు పాపిరెడ్డి.

గొంతులో పోసుకున్న మందు గొంతు దిగలేదు.

కళ్ళముందు - అందులోనూ 'మందు' మహిమతో మైకం క్రమ్మిన కళ్ళముందు— ఏవేవో దృశ్యాలు అస్పష్టంగా కదులాడు తున్నాయి.

"ఏమిటీ....నిజంగానేనా?" గొంతు ఎంత తగ్గించుకొని మాట్లాడాలని ప్రయత్నించినా సాధ్యపడలేదు పాపరెడ్డికి.

గొంతులో ఆరాటం....వొణుకు....భయం అన్నీ కలిసి ఆ మాటల్ని పెద్దగా అనేసేట్లు చేశాయి.

"అవును డాడీ....పోనీలే డాడీ! వెధవ ముష్టివాడు....ఈ దేశానికి కొంత పీడ విరగ డైంది" ఏదో ఘనకార్యం చేసినట్లుగా చెప్పాడు సుబ్బారెడ్డి. కాని ఆ మాటల వెనుక ఏమవు తుందో నన్న భయం లేకపోలేదు.

నోటిమాట రాలేదు పాపిరెడ్డికి.

తను విన్నది నిజమే. తన కొడుకు అబద్ధం చెప్పడంలేదు.

కాని....ఇప్పుడెలా?....ఇప్పుడెలా?

ఎంత ఆలోచించినా ఈ అపాయం నుండి తప్పించుకునే ఉపాయం కనిపించడంలేదు పాపిరెడ్డికి.

ఆలోచనలు ఆటంబాంబుల్లా ప్రేలు తున్నాయి....

హత్య....హత్య....హత్య....

సాక్ష్యాలూ....కేసులూ....శిక్ష....ఉరిశిక్ష...

అంతలోనే భయం—అంతలోనే ధైర్యం.

ఆఫ్టరాల్ ఒక ముష్టివాడిని చంపితే తన కొడుక్కి ఉరిశిక్ష వేస్తారా? తన పరువూ పలుకుబడీ ఏంగాను?....ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనకాల చావనా?....

ఏమో!....ఏమో!....

కాలం, ఖర్మం కలిసిరాకపోతే తాడే పామై కరుస్తుంది.

తను తీసుకోవలసిన జాగ్రత్తలు తను తీసుకోవాలి.

తప్పదు....తప్పదు....

మొద్దుబారిపోయింది మెదడు పాపిరెడ్డికి.

కొడుకుమీద ఎన్నో ఆశలు పెంచుకున్నాడు తను. ఒక్కగానొక్క కొడుకు. ఎన్నో నోములూ, వ్రతాలూ నోసి కన్న కొడుకు. వాడేదో పెద్ద రాజకీయనాయకుడై తననేదో ఉద్ధరిస్తాడనీ, తన పేరు ప్రతిష్ఠల్ని నిలబెడతాడనీ తనెన్నో కలలు కన్నాడు. తనెన్నో ఆశలు పెంచుకున్నాడు. కాని....కాని ఇప్పుడేమైంది? తన ఆశలన్నీ కూలిపోతున్నాయి. వాడు జైలు కెళితే తనకు దిక్కెవరు? తన తర్వాత తన పదవికి వారసుదెవడు? ఇంతకాలం పెంపుడు కుక్కలా పెంచుకున్న తన పదవిని వేరొకరికి తను ఎలా దానం చెయ్యగలడు? అందుకు తన మనసెలా వొప్పుకుంటుంది?....

హే భగవాన్! ఈ ఆపదనుండి యెలా కాపాడతావో-అంతా నీ మహిమే స్వామీ....

వాపోతున్నాడు పాపిరెడ్డి.

ఆలోచిస్తున్నాడు పాపిరెడ్డి.

అకస్మాత్తుగా అతని బుర్రకు ఏదో ఆలోచన తట్టింది.

కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

ఇప్పుడు కళ్ళముందు ఇంతకు ముందు కనిపించిన ఏ భయంకరదృశ్యాలూ కనిపించడంలేదు... ఓ మనోహరమైన దృశ్యం కనుల కింపుగా కనబడుతోంది.

ఆహాఁ....ఆహాఁ....ఏమి దృశ్యం....ఏమి దృశ్యం....

"పిచ్చినాయనల్లారా! ఎందుకలా భయపడిపోతారు?....నూరుమంది భీష్ములయినా పదివేలమంది కర్ణులయినా మిమ్మల్ని వెంట్రుకవాసి కూడా కదిలించలేరు. భయపడకండి. నేను మీకు అండగా వున్నంతకాలమూ మిమ్మల్ని ఏ శక్తీ జయించలేదు .... భయపడకండి...." అని అభయహస్తం ఇస్తున్నాడు శ్రీ కృష్ణపరమాత్ముడు—భయంతో వొణికిపోతున్న పంచ పాండవులకి.

ఎంత చక్కటి దృశ్యం!

ఎంత మనోహరమైన దృశ్యం!!

అసలు శ్రీకృష్ణపరమాత్ముడి అండదండలు లేకపోతే, కౌరవుల్ని పాండవులు జయించేవారా? ఏమో!....

ఏది ఏమైనా పాండవులకి శ్రీ కృష్ణుని అండదండలున్నాయ్.

మరి తనకు?....

తనకొడుకు నెవరీ ఆపదనుండి రక్షిస్తారు?

"పిచ్చినాయనల్లారా! మీరెంత వెర్రివాళ్ళు. ముంజేతి కంకణానికి అద్దం వెతుకుతున్నారు. నేనుండగా మీరెందుకు అలా కంగారు పడుతున్నారో అసలు అర్థం కావడంలేదు. అసలు నేనంటూ ఒకడ్ని వున్నానని మీరు ఊహించలేదా!....లేక నా శక్తి సామర్థ్యాలను శంకిస్తున్నారా?" అని — అపర శ్రీకృష్ణపరమాత్ముడిలా చిద్విలాసంగా నవ్వుతూ నిలబడి నట్లుంది-తన మిత్రుడు కోటిరెడ్డి.

అవును ఆ ఆలోచనే తనకు తట్టలేదు. తనెంత వెర్రివాడు.

లెంపలేసుకున్నాడు పాపిరెడ్డి. వేసుకొని తక్కున లేచి నిలబడ్డాడు. గబగబ నడుచుకుంటూ వెళ్ళి కోటిరెడ్డి ముందు నిలబడ్డాడు.

అప్పుడు కోటిరెడ్డి తన చేతిలోని మందుని అమృతంలా కొంచెం కొంచెం గొంతులో పోసుకుంటూ, మద్రాసు నుండి తేబడిన సినిమానటి తన స్వహస్తాలతో చికెన్ రోస్టుని కొంచెం కొంచెంగా నోటికందిస్తూవుంటే మరోలోకంలో విహరిస్తూ ఆనందిస్తున్నాడు.

మరికాసేపటికి ఎదురుగా నిలబడ్డ పాపిరెడ్డిని పసిగట్టి విషయం ఏమిటని వరమిచ్చేదేవుడిలా అడిగాడు.

గుక్కతిప్పుకోకుండా అన్ని విషయాలూ విశదీకరించాడు పాపిరెడ్డి.

ఆఖరున-"మిత్రమా! నువ్వే నాకు దిక్కు. నాకు పుత్రభిక్ష పెట్టు" అని కూడా మొరపెట్టుకున్నాడు.

మిత్రుడి ఆరాటాన్నీ, భయాన్నీ, ఆందోళన్నీ కళ్ళారా చూచిన బడారాజకీయనాయకుడు కోటిరెడ్డి ఫెళ్ళున నవ్వాడు.

"నువ్వింత పిరికివాడివని కలలో కూడా అనుకోలేదోయ్ మిత్రమా! ఇంత చిన్న విషయానికి మరీ యింత యిదిగా బెంబేలు పడిపోవాలా?....ఇలాంటి వాడివి యింత కాలం రాజకీయాల్లో ఎలా నెట్టుకురాగలిగావోయ్...." అన్నాడు మరోపెగ్గు నోట్లో పోసుకుని, అతి నెమ్మదిగా, తొణక్కుండా, బెణక్కుండా.

మిత్రుడి మాటలు అర్థంకాలేదు పాపిరెడ్డికి.

ఏమిటీ! తను భయపడుతున్నాడా ఊరికే. ఇది చిన్నవిషయమా? తన కొడుకేదో చిన్న కోడిపిల్లని తమాషాకొద్దీ పీకపిసికి చంపేశాడా ఏమిటి? అసలు ఏమిటి కోటిరెడ్డి ఉద్దేశం??

ఆ విషయాన్నే అడగాలనుకున్నాడు పాపిరెడ్డి.

కాని అడగలేకపోయాడు.

పాపిరెడ్డి ఏది అడగాలనుకుంటున్నాడో కోటిరెడ్డికి అర్థమైంది.

అందరి రాజకీయనాయకుల్లా మాటల్లో స్వర్గాన్ని చూపించాలనుకోలేదు. చేసి చూపించాలనుకున్నాడు. అలా అనుకున్నదే తడవుగా గబగబ అడుగులేసుకుంటూ క్రిందికి నడిచాడు.

ఆయన్ని అనుసరించారు పాపిరెడ్డి, సుబ్బారెడ్డి విషయం అర్థంకాక. ఇక్కడ యింత రభస జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఎవరి 'మందు' ఆనందంలో వారుండిపోయారు.

క్రిందికి దిగొచ్చిన కోటిరెడ్డి ఫోనెత్తుకున్నాడు.

ఏదో నంబర్ డైల్ చేశాడు.

"హలో....ఈజిట్ పోలీస్ స్టేషన్."

"............"

"యస్....నేను .... కోటిరెడ్డిని మాట్లాడుతున్నాను."

"............"

"నేనేనయ్యా. ఏమిటి చెముడేమైనా వచ్చిందా ఏమిటి?....ఎవరనుకుంటున్నావ్.... ఆఁ....ఇంతకీ ఉద్యోగం చేసుకుంటూ పెళ్ళాం పిల్లల్ని పోషించుకోవాలని వుందా లేదా?.... ఆఁ....ఆఁ....అదే చూస్తున్నాను .... త్రాగిన మైకంలో మాట్లాడుతున్నట్లుంది. కాస్త వొళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడు. సరె....సరె.... వెంటనే వున్నపళంగా పాపిరెడ్డి యింటికి బయలుదేరి రా. తర్వాత అన్ని విషయాలూ చెబుతాను....సరే....సరే....క్షమించాల్లేవయ్యా నీ సోదీ నువ్వు ..."

ఫోను పెట్టేశాడు కోటిరెడ్డి.

ముచ్చెమటలు పట్టాయి పాపిరెడ్డికి. మలేరియా జ్వరం వచ్చినవాడిలా వొణికిపోతున్నాడు.

"అదేమిటయ్యా! మహానుభావా! యేదో రక్షిస్తావుగదాని నా గోడు నీకు చెప్పుకుంటే నువ్వు నట్టేట్లో ముంచేటట్లున్నావు. ఇంతకీ ఇప్పుడు రక్షకభటులెందుకయ్యా?" కంగారు కంగారుగా అడిగాడు పాపిరెడ్డి.

పాపిరెడ్డి భుజం మీద గట్టిగా చరిచాడు కోటిరెడ్డి.

"మిత్రమా! రక్షించినా భక్షించినా రక్షకభటులే సమర్థులు....అయినా ప్రజల్ని రక్షించవలసిన పోలీసుశాఖ వుండగా చట్టాన్ని మన చేతుల్లోకి తీసుకోవడం తప్పు కదూ....అయినా చూస్తూవుండు .... యేం జరుగుతుందో...." పక్కా రాజకీయ నాయకుడిలాగే మాట్లాడాడు కోటిరెడ్డి.

నోరు తెరచుకొని చూస్తూవుండిపోయాడు పాపిరెడ్డి.

* * *

మరో పది నిముషాల్లో ఇంటిముందు పోలీసు జీపు ఆగింది. ఆగిన జీపులోంచి కంగారు కంగారుగా దిగి, టోపీలూ, బట్టలూ సర్దుకొన్నారు యూనిఫారంలోవున్న సబిన్స్పెక్టరూ, మరో నలుగురు కానిస్టేబుల్స్.

కోటిరెడ్డికీ, పాపిరెడ్డికీ విష్ చేసి, అతి విన

యంగా నిలబడ్డారు.

ఇనస్పెక్టర్ని ఓ గదిలోకి తీసుకుపోయాడు కోటిరెడ్డి.

విడు నా కొంప ముంచడుగదా-అని ఆలోచిస్తున్నాడు పాపిరెడ్డి.

మరో అయిదు నిముషాలకు కోటిరెడ్డీ, సబ్ ఇనస్పెక్టరు గదిలోంచి బయటికి వచ్చారు. బహుశా వారిద్దరి రహస్య సమాలోచన ముగిసినట్లుంది. కోటిరెడ్డి చిద్విలాసంగా నవ్వుతూ పాపిరెడ్డి ముఖంలోకి చూశాడు.

ఎస్. ఐ. గబగబ మేడమెట్లెక్కి పార్టీ జరుగుతున్న స్థలానికి వెళ్ళాడు. నలుగురు కానిస్టేబుళ్ళూ అయ్యగారిని అనుసరించారు. వారివెనకే పెళ్ళినడక నడుచుకుంటూ కోటిరెడ్డి ఆ వెనక పాపిరెడ్డి—ఆ తర్వాత సుబ్బారెడ్డి.

యస్.ఐ.ని చూస్తూనే 'మందు'లో మునిగి తేలుతున్న పెద్దమనుషులు కొంచెం కంగారు పడ్డారు. అసలు విషయం ఏమిటని తర్వాత నోళ్ళు తెరిచారు. వాళ్ళు నోళ్ళు మూసుకునే లోపలే ఇనస్పెక్టర్ చెయ్యవలసిన పనికాస్తా నిముషాల్లో చేసేశాడు.

ఒక మూలగా ముడుచుకు కూర్చున్న వెంకన్న రెండుచేతులకూ బేడీలు తగిలించబడ్డాయి.

పాపిరెడ్డీ, సుబ్బారెడ్డి నోళ్ళు తెరిచారు.

ఏమైంది!....ఏమైంది?....

అందరిలోనూ గుసగుసలు....కోలాహలం కలకలం....

వెంకన్న ప్రైప్రాణాలు పైనే పోయాయి.

"ఇదేం న్యాయం బాబూ!....న్యాయాన్ని రక్షించవలసిన మీరే ఇంత అన్యాయానికి పూనుకున్నారేమిటి బాబూ!...." నెత్తినోరూ బాదుకున్నాడు వెంకన్న.

"నోర్ముయ్‌రా లంజాకొడకా. క్రింద పాపం అడుక్కుతినే బిచ్చగాడ్ని చంపేసి వచ్చి నంగనాచిలా మాట్లాడుతున్నావట్రా ....పదరా పద....స్టేషన్‌కి పద....నీ చెమ్డాలు వొలిపించేస్తాను" హూంకరించాడు ఇనస్పెక్టర్.

కళ్ళు గిర్రున తిరిగాయి వెంకన్నకు.

ఏమిటీ తను బిచ్చగాడ్ని చంపాడా? ఎంత అన్యాయం. ఎంత ఘోరం.

వెంకన్నకు తన భార్యాబిడ్డలు గుర్తుకొచ్చారు.

భార్య రెండు సంవత్సరాల [illegible]ండి మంచంలో తీసుకుంటోంది. ఎదిగి [illegible]శ్చిడుకొచ్చిన ఆడపిల్లలున్నారు. ఊహ [illegible] తెలీని పసికందులున్నారు. అప్పులున్నాయి[illegible]వస్థలున్నాయి....తను జైలుకెళితే తనవాళ్ళ[illegible]వరు పోషిస్తారు?....దిక్కులేక వీధివెంట ప[illegible]

అయ్యో!....అయ్యో! .... ఎంత అ[illegible] జరిగిపోయింది.

"బాబూ! మీరైనా చెప్పండి బాబు[illegible] కాలం మీ ఉప్పుతింటూ మీ కాళ్ళదగ్గర తొత్తులా పడివున్నాను. ఎప్పుడైనా ఇ[illegible] పనులు చేశానా చెప్పండి బాబూ! [illegible] మీకు తెల్సు. మీరైనా కనికరించండి [illegible]బూ" మాట్లాడుతోన్న వెంకన్న నోటిమీద [illegible]. ఐ. లాఠీదెబ్బ ఫెడేల్‌మని పడింది. [illegible] రక్తం చిమ్మింది.

"ఏమిట్రా దొంగనాయాలా! వాగుత[illegible]వ్! ఎయ్ త్రీ నాట్ ఫైవ్! వీడ్ని లాక్కు[illegible] హుకూం జారీచేశాడు ఎస్. ఐ.


అయ్యగారి ఆజ్ఞ పడగానే వెంకన్నని బలిపశువుని లాక్కుపోయినట్లు క్రిందికి లాక్కుపోయారు పోలీసులు.

హృదయవిదాకరంగా విలపించే వెంకన్న కళ్ళల్లో మెదిలి మనసు చివుక్కుమంది పాపిరెడ్డికి.

కాని—వెంటనే పుత్రప్రేమ అడ్డొచ్చింది. తలొంచుకున్నాడు పాపిరెడ్డి.

* * *

(డియర్ రీడర్స్! ఈ కథ యింతటితో అయిపోయింది. కాని మీలో ఎవరికైనా వెంకన్నను ఎందుకు అరెస్టు చేసిందీ అర్థం కాక, శవంలోని భేతాళుడిలా నన్ను నిలదీసి-'వెంకన్నను ఎందుకు అరెస్టు చేశారు? అతడు చేసిన తప్పేమిటి? తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వెయ్యి వ్రక్కలవుతుంది'_



అని శపించే పాఠకుల సౌకర్యం కోసం— ఈ క్రింది కథను యిస్తున్నాను చదవండి....)

◆ ◆ ◆

కోటిరెడ్డి చిద్విలాసంగా నవ్వి యిలా అన్నాడు పాపిరెడ్డితో—

"చూడ్రా పాపిరెడ్డీ! మనిద్దరిమధ్యా ఎంతో సన్నిహితం వుంది. నేనేది చేసినా నీ మేలు కోరే చేస్తాననే విశ్వాసం నా మీద నీకుంది. కాబట్టి నేను చెప్పేది విను. ముష్టివాడి చావు విషయం తెలిసిన వ్యక్తులు నలుగురు. నువ్వూ నేనూ, సుబ్బారెడ్డీ, మీ ఇంటినౌకరు వెంకన్న. అయితే ఈ నేరాన్ని వెంకన్న మీదికి నెట్టకుండానే సుబ్బారెడ్డిని ఈ ఊబిలోంచి బైటికి లాగొచ్చు. కాని ఈ రహస్యం రహస్యంగా వుంటుందనే నమ్మకం నాకు లేదు. అందుకే కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు. నువ్వెలాకూ తండ్రివి గనుక ఈ రహస్యాన్ని బయటికి చెప్పుకోవు. ఇకపోతే నేను-నీ మిత్రుడిని. ఎన్నికల్లో నీ సహాయసహకారాలు లేనిదే నేను పైపదవిని అలంకరించలేను. కాబట్టి నన్నూ వదిలేయ్. ఇకపోతే — మిగిలింది వెంకన్న. వాడెలాగూ పరాయివాడు. ఈ రోజు నమ్మకంగావున్నా రేపు వుంటాడనే నమ్మకం లేదు. తక్కువ కులంవాడికి తక్కువ బుద్ధులే వుంటాయి. వాడు వుండటం ఎప్పటికైనా మనకి అపాయమే. అందుకే-వాడిమీదే కేసు బనాయించాను. ఇప్పుడిక శాశ్వతంగా వాడి నోరు మూయించవచ్చు. ఇకపోతే సాక్ష్యాలూ ఆధారాలు అంటావా....అవి పుట్టించడం అదేమంత లెక్కలోనిది కాదు. ఒరేయ్ పాపిరెడ్డీ ఓ విషయం చెప్తాను వింటావా! .. కోర్టుకి చెవులే గాని కళ్ళు లేవురా....అదీ విషయం."

అలా చెప్తోన్న కోటిరెడ్డి, పాపిరెడ్డి కళ్ళకి గీతోపదేశం చేస్తున్న శ్రీ కృష్ణపరమాత్ముడిలా కనిపించాడు.

"ఆహా....ఓహో....ఏమి నీ రాజకీయ పరిజ్ఞానం....నీలో ఇంత రాజకీయ చతురత వుంది గనుకనే ఈ నాడు రాజకీయాల్లో నీ పేరు అరచేతి మందాన పేరుకుపోయి, దేదీప్యమానంగా వెలిగిపోతున్నావ్ ...వర్ధిల్లు! ఇంకా వెయ్యేళ్ళు వర్ధిల్లు."

పాపిరెడ్డి రెండుచేతులూ జోడించి మనస్ఫూర్తిగా మిత్రుడికి నమస్కరించాడు.

అంకితం:

('అన్నపూర్ణ'గా వాసికెక్కిన ఈ దేశంలో కూడా 'అన్నమో రామచంద్రా' అని ఆర్తనాదాలు చేసే అన్నార్తులకూ, చెయ్యని నేరానికి బలైపోతున్న 'వెంకన్న'లాంటి అభాగ్యులకూ, ఈ కథ అంకితం— రచయిత్రి)

ఎ.యస్వీ.రమణారావు



జెయిల్లో-చందమామ

ఆ భోగట్టా వొక్కటీ చెప్పేద్దా(వనీ, వెళ్ళానా యింటికి మళ్ళీ-నిజానికి నేను వెళ్ళక్కర్లేదు—

ఆ విషయం తెలుసుకోవాల్సిన అవుసరం వాళ్ళదే-అంచేత వాళ్ళే ఎవరయినా వొస్తారు.

అయినా—

మనకు అక్కర్లేనప్పుడు-మనం చెప్పటమే ధర్మం....

అందువల్ల, మనకు మనం ఆపాదించుకున్న హోదా ఏదో తక్కువయిపోతుందనుకోడం మూర్ఖత్వమే....

వీధిగుమ్మం తలుపులు బార్లా తెరుచున్నాయి—

ఆ గుమ్మంలోంచి చూస్తే, కొసాకీ కని

పెంచే ఆ యింట్లో ఎవరూవున్న సందదేలేదు!

నిన్న సాయంకాలం ఈ పాటికి పదిమందీ తిరుగాడుతూ హడావుడిగా వున్న ఆ యిల్లు ఈ క్షణంలో యింత నిశ్శబ్దంగా వుండటం ఆశ్చర్యం వేసింది నాకు.

"ప్రకాశరావుగారూ" వరండాలో గుమ్మం ముందు నిల్చొని పిలిచాను.

"....... ...."

మళ్ళీ పిలిచాను.

"ఎవరూ?" తియ్యటిగొంతు చాలా లోపల్నుంచి.

ఆ గొంతు నిన్న విన్నదేనా?

అంత గుర్తుండటానికి నిన్నవున్నది ఎంత సేపని?

మాట్లాడించిన మాట లెన్నని?

"ప్రకాశరావుగారున్నారా?"

"లేరండీ" సమాధానంతో పాటు....

పచ్చటి ఆకులసందుల్లోంచి జొరబడిన వెన్నెల కిరణం తాకిడికి ఉలిక్కిపడి విచ్చుకో బోయే మొగ్గలా .... వుందా వొచ్చిన అమ్మాయి.

రాత్రంతా కురిసి వెలిసింతర్వాత, అందమైన పువ్వుమీద మిగిలిపోయిన మంచుముత్యా ల్లాంటి మంచు బిందువుల్లా, స్వచ్ఛంగా, పచ్చగావున్న అందమైన ఆమె మొహంమీద అక్కడక్కడా తళుక్కుమనే నీటి బిందువులు జారి రాలిపోడానికి సిద్ధంగావున్నాయి.

సాయంకాలపుటాకాశపు రంగు ఆమె మొహంమీద ప్రతిబింబించటంతో, మరింత చూడ ముచ్చటగావుంది—

అప్పుడే స్నానం చేసొచ్చిన ఆమె వొంటి మీంచి వొచ్చే పరిమళాలు ఆజాగా అంతా ఆక్రమించుకున్నాయి.

నిన్న చూసిన అమ్మాయి కాదు....

అయివుంటే—నేనివాళ ఇంకో వుద్దేశంతో వొచ్చేవాడిని.

అందంలోనూ, ఆకర్షణలోనూ కాదుగానీ....

చాలా దగ్గర పోలికలున్నాయి!

"కూర్చోండి."

కొత్తమనిషిని చూడగానే అంత విశాలమైన కళ్ళల్లో ఆత్రతరపాటూ అందంగానే వుంది.

నిన్న అంతమందిలో ఈ అమ్మాయిని మాత్రం ఖచ్చితంగా చూడలేదు—

ఒకసారి చూస్తే కొన్ని కాలాలపాటు జ్ఞాపకం వుంచుకోదగ్గ అందమైన ఆ అమ్మా యిని నిన్న చూసుంటే యివాళ మరిచిపోవటం సాధ్యమా!

"మా నాన్నగారు లేరండి....ఓ అరగంట యింది బయటకెళ్ళి .... నిలబడేవున్నారు.... కూర్చోండి" అందా అమ్మాయి.

ఉలుకూ పలుకూ లేకుండా, సభ్యతమరచి, ఆమెని అలా కొన్ని క్షణాలు చూస్తూ నిలబడి పోవటం, ఆ క్షణంలో నా మట్టుకు నాకే సిగ్గని పించింది—

ఎంత భావుకుడ్నయితే మాత్రం, ఇద్దరు పిల్లల తండ్రిని, ఓ వయసులోవున్న పిల్ల ముందు ప్రవర్తించాల్సిన తీరేనా అది? మనసుకు లేకపోతే నా వయసుకేనా వుండొద్దూ మర్యాద?

"ఫర్వాలేదు....మీ నాన్నగారుంటే మాట్లాడుదామని వొచ్చాను....మళ్ళీ వొస్తాన్లే" అని వెనక్కి తిరిగే ప్రయత్నం చేసాను కూర్చోకుండానే.

"ఏమైనా చెప్పమంటారాండీ!"

"ఊ?....అఖర్లేదు....నే నాయన్ని కలు స్తాను" వరండా దాటి వీధిలోకి వొచ్చేసాను.

వెనక్కి తిరిగి మరోసారి చూద్దామనే వుందామ్మాయిని.

బాగోదు కదా—

"ఎవరొచ్చారని చెప్పమంటారు?" వరండా అంచున నిలబడి అడిగింది.

అప్పుడు మళ్ళీ చూసాను—

"నిన్న సాయంకాలం విజయనగరంనుంచి వొచ్చిన వాళ్ళ తాలూకూ ఆయనొచ్చారని చెప్పు" అన్నాను అప్రయత్నంగానే.

ఆ అమ్మాయి కంగారు పడ్డట్టు ఆ కళ్ళు చూస్తే తెలుస్తోంది—

"మా మామయ్యగారింట్లో వున్నారేమో చూసొస్తాను.... ఈ పక్కవీధిలోనే లెండి....

వో క్షణం కూర్చోండి....” అందా అమ్మాయి.

కంగారు గొంతులోనూ తెలుస్తోంది—

ఆ హడావుడిలో ఎవరుంటే వాళ్ళని తీసుకొచ్చేసేలా వుంది—

“ఫర్వాలేదు — వీలుంటే నన్నొయన్ని కలవమని చెప్పు” బలవంతంగా వొచ్చేసాను....

రోడ్డుమీదకొచ్చి, హోటల్లో దూరి, వో కప్పు కాఫీ తాగిందాకా, మనసు స్థిమితపడనే లేదు—

ముగ్గురు అమ్మాయి లున్నట్టు చెప్పాడా ఇంటాయన.

ఆ సందర్భంలో ఈ పిల్ల కనపడలే దెందు చేతో?

కనపడుంటే—మా అందరి దృష్టీ విధిగా ఆ అమ్మాయిమీద పడేదే—

పడుంటే—

ఇప్పటికి సంవత్సరంనుంచీ కుదరకుండా వున్న మా తమ్ముడి సమస్య చప్పున తీరిపోయేదే—

ఇప్పటికైనా మించిపోయిందేం వుందీ.... అడిగి చూద్దాం....కోరి అడిగితే కాదంటాదేవిటి?

ఏ అమ్మాయి అయితేనేం?

ఆ ముక్కే రాసి పడేసాను ఆ రాత్రే విజయనగరంవాళ్ళకి. ఆ మర్నాడుదయమే లేచి ఆఫీసు పనిమీద కేంపెళ్ళిపోయాను.

* * *

రెండు రోజుల్లో అయిపోతుందనుకున్న ఆఫీసు పని నాలుగురోజుల్దాకా తెమల్లేదు—

“మీకోసం ఆ ప్రకాశరావుగారు రెండు మూడుసార్లొచ్చి వెళ్ళారు....ఏదో వొకటి చెప్పేస్తే పోతుందిగా....పాపం ఎందుకలా ఆయన్ని తిప్పడం?”

అప్పుడే యిల్లు చేరిన నాకు కాఫీ యిస్తూ మా అవిడ—

“ఉత్తరాలేవైనా వొచ్చాయా?”

“కవరొచ్చింది....విజయనగరం నుంచి మావగారు రాసినట్టున్నారు — నే విప్పి చూళ్ళేదు.”

నేను విప్పి చూసాను.

“అలా గే చూద్దాం....ఆయన్నడుగేవంటాడో....” ఉత్తరం ఆఖర్న.

“నువ్వేవైనా చెప్పావా ఆ ప్రకాశరావు గారితో?....” అడిగాను మా ఆవిడ్ని.

“మీ మనసులో వుద్దేశాలు యెవరికి తెలుస్తాయి?” అంది మా ఆవిడ తాగేసిచ్చిన కప్పు అందుకుంటూ.

“ఉత్తరం విప్పిచూస్తే తెలిసేవి” అన్నా న్నవ్వుతూ.

విప్పిచూడకపోవడమే మంచిదయింది—

ఎలా చెప్పేదో? అది విని ఆయనెలా అనుకునేవాడో?

ఒక పద్ధతుంది, కొన్ని విషయాలు చెప్పటానికి—వ్యవహారం వ్యవహారంవే కదా—

నేను వూర్లో లేనప్పుడు ఇంటిచుట్టూ తిరిగి నాయన వూళ్ళోకొచ్చి రెండురోజులయినా వొక్కసారీ కంటపడలేదు. నేనే వెళ్దావంటే ఊపిరి సలపని ఆఫీసు పనులతో నాకూ మరోమారు తీరికవలేదు—

* * *

ఆరోజు, ద్వారకానగర్‌లో, మారుమూల వున్న మా బ్రాంచి ఆఫీసు తణికీ పూర్తిచేసుకుని, సాయంకాలం నాలుగ్గంటలప్పుడు, వొక్క నెంబరు సిటీబస్సే అరగంటకి రాని ఆ బస్‌స్టాపులో నిల్చున్నాను. ఊరి చివర్న వున్న బస్‌స్టాపేమో చాలా నిర్మానుష్యంగా వుంది. అయిదు నిముషాల క్రిందటే వో బస్సెళ్ళిపోయిందిట. సోడా తాగడానికని వెళితే ఆ పక్కనున్న కిళ్ళీకొట్టువాడు చెప్పాడు. చేసేదేంలేక వో పుస్తకం తెరిచి బస్‌స్టాపు గట్టుమీద కూర్చున్నాను.

పుస్తకం తెరిస్తే మరో ప్రపంచం అదే నాకు.

“నమస్కారమండీ!”

తియ్యటి గొంతు వినిపించి పుస్తకంలోంచి తలెత్తి, ఆ వినిపించినవేపు చూసాను.

ప్రకాశరావుగారింట్లో ఆ సాయంకాలం చూసిన అమ్మాయి.

విచిత్రంగానే వుంది ఇక్కడ కనపడటం!

గుర్తుంచుకుని పలకరించటవూ! వింతగానే వుంది!

"నమస్కారం....నువ్వు?" తెలిసుండే అడిగాను.

"నే నండీ... ప్రకాశరావుగారి రెండో అమ్మాయిని....ఆ రోజు సాయంకాలం మీరు మా యింటికొచ్చారు కదా?"

"అవునవును....యిలా యెక్కడికొచ్చావమ్మా?" అడిగాను.

"లలిత గుడికొచ్చి, ఈ పక్కన మా స్నేహితురాలిల్లుం టేనూ వెళ్లొస్తున్నానండీ...."

మన గుండెల్లో పీఠం వేసుక్కూర్చున్న అందమైన వొస్తువు యేదన్నా సరే, అనుకోకుంటా కనిపించినప్పుడు, గుండెల పొరల్లో నిక్షిప్తమయివుండే ఆనాటి అనుభూతి పైకెగదన్ని వొక్క క్షణం ఊపిరి సలపకుండా వొళ్ళంతా కమ్మేస్తుంది కాబోలు!

"అలాగా" అంతకన్నా మాటలు రావు కొన్ని క్షణాలు.


"ఆ రోజు మీరిలా వెళ్ళారా....మా నాన్నగారలా వొచ్చారు. చెప్పగానే మీకోసం వెళ్లారు బస్‌స్టాపులో వుంటారేమోనని....లేరుట....ఆ మర్నాడుదయమే మీ ఇంటికెళితే మీరు కేంపెళ్ళిపోయారుట .... నాన్నగారు చెప్పారు...."

అందంగా వున్నవాళ్ళే ఆకర్షణీయంగా మాట్లాడగలరేమో! సాధారణంగా పెళ్ళికాని అమ్మాయిల్లో కనిపించని చొరవ ఈ అమ్మాయిలో చూసి ముచ్చట వేసింది నాకు.

"అవునుట....వచ్చారని చెప్పింది మా ఆవిడ....నేనే వొద్దామనుకుంటే కుదర్లేదమ్మాయి....మీ నాన్నగారూళ్లో వున్నారా?" అడిగాను కూర్చోమంటూ.

"ఉన్నారండీ" అంది కూర్చుంటూ.

వినయమూ అంతే....



''ఏవిటీ ప్రేమలేఖలు నాకు పోస్టు చేస్తావా? చచ్చాం!!''

''ఏం? ఎందుకూ?''

''మా నాన్న పోస్టుమాన్!!''

కొద్దిగా మొహంలో కనిపించే అలసట కూడా అందాన్నే ఇచ్చింది ఆ అమ్మాయికి!

ఇంత దగ్గిరగా మరోసారి చూడ్డంతో మనసులో అంతకుముందునించే మెసిలే అభిప్రాయానికి గట్టి స్థిరత్వమేర్పడిపోయింది.

అనుకున్నట్టూ జరిగితే మా తమ్ముడు అదృష్టవంతుడే—

మరో దీపం మా ఇంటి కాంతిని మరింత ప్రజ్వలింప చేస్తుంది—

"అవునూ, ఆ ముందురోజు మేమంతా మీ యింటికొచ్చినప్పుడు నువ్వు కనపళ్లేదేం వమ్మాయి?"

అప్పటినుంచీ నా మనసులో మిగిలిపోయిన ప్రశ్న అది!

"అలాంటి సందర్భాలలో నే నెదటపడన్లెండి" అందామె.

అలా అంటున్నప్పుడు ఆమె తలొంచుకున్నా ఆ మొహంలో కొద్దిగా బాధ నాకు స్పష్టంగా కనపడింది.

"అదేవీ?" ఆశ్చర్యంగా అడిగాను, అర్థం కాక.

"మా అక్కయ్యకి పెళ్ళిచూపులన్నరోజు నన్ను జెయిల్లో పెట్టేస్తారు మా వాళ్ళంతా కల్సి" నిరుత్సాహంగా నవ్వుతూ....ఇంకా నా కర్థంకాలేదు—

"జెయిలేవిటీ?"

"అర్నెల్లక్రితం, మా అక్కయ్యకి వోసారి పెళ్ళిచూపులప్పుడు అనుకోకుండా ఓ ముచ్చట జరిగింది లెండి...."

"ఏవిటదీ?"

"ఏంలేదూ....పెళ్ళిచూపులంటే హడావిడి గదా....వొచ్చినవాళ్ళకి కాఫీ ఫలహారాలందిస్తూ కాస్త చురుగ్గా తిరిగాను...."

"తిరిగితే...."

"ఇక్కణ్ణించి వెళ్ళి, వాళ్ళేం రాసారో తెలుసాండీ...."

"ఏం రాసేరూ?"

"మీరు చూపించిన అమ్మాయి మాకు నచ్చలేదు....ఆరోజున చలాకీగా తిరిగి కాఫీలూ అవీ అందించిన మీ రెండో అమ్మాయి, మా అబ్బాయికి ఎంతో నచ్చిందీ....మీ కిష్టమయితే రాయండీ...." అని.

ఎవరికయినా అంతే అనిపిస్తుంది మరి అనుకుంటూ, తన చక్కదనాన్ని చక్కగా చెప్పిన ఆ పిల్ల తెలివికి అబ్బురపడ్డాను. ఇంతలోనే ఆ అమ్మాయి అంది:

"ఎవర్నయితే చూడ్డానికొచ్చారో ఆ అమ్మాయి నచ్చితే నచ్చిందనీ, నచ్చప్పోతే నచ్చలేదనీ రాయాలి! అంతే కాని బజార్లో వస్తువుల్ని బేరం చేసినట్లు మా కది నచ్చింది ఇది నచ్చిందీ అని రాసే వెధవల్ని తన్నొద్దండీ...."

"............"

బస్సు వొచ్చేసి నన్ను రక్షించేసిందా క్షణంలో!

సీరియల్



"ఆఁహా ఎంత ఉదార స్వభావులు! ఇన్నాళ్ళకు నేనెందుకు ఎబార్షన్ చేయించుకోవాలి? కేవలం ఆవిడేదో బాధపడిపోతుందనేనా నా కీ సలహా యిచ్చారు! కావాలని కన్నెప్రాయాన్ని దోచుకుని యిప్పుడిలా చచ్చు సలహా ఇస్తారా! నా బిడ్డ మీ బిడ్డ కాకుండా యెల్లా వుంటాడో

నేనూ చూస్తాను. ఇన్నాళ్లు మర్యాద ముసుగుతో చెరలాట లాడారు. మీ మర్యాదలు గౌరవాలు యెల్లాంటివో నేనూ నలుగురికీ తెలియ చెప్పుతాను. మామూలుగానే నా పరిస్థితి చెప్పుతాను. ఆమె అంగీకరించినా సరే! లేదా మీ బ్రతుకులందరివీ బజార్లలో పూరేగుతాయి. కన్నెపిల్ల కమ్మనైన సంగీతం లాంటిదేకాదు కాలం కలిసిరాకపోతే, కాలనాగు అయి విషం చిమ్ముతుంది. గుర్తుంచుకోండి" లేచి నించుంది సుమన. జగన్నాధరావుగారు నిదానంగా సుమన వైపు చూసి భావగర్భితంగా నవ్వాడు.

"సుమా! కంగారుపడకు. నలుగురి నోళ్లలోనూ నువ్వే నానుతావు. మీదీ గౌరవమయిన కుటుంబం. ఈ మచ్చతో మీతల్లితండ్రులుకూడా మానసికంగా క్రుంగిపోతారు. అసలే ఆస్తిపోయి అవస్థలుపడుతున్నారు. సుమా! తొలి రోజుల్లో నీవిచ్చిన సుఖాన్ని, పంచిన అనురాగాన్ని నేనంత తేలిగ్గా మరచిపోలేను. అందుకనే నువ్వు నా సంసారిక జీవితంమీద దెబ్బతీసినా నీకు ఏదోవిధంగా సాయపడదామనుకుంటున్నాను. జీవితంలో నాదే అనుకునే ప్రాణి అవసరం ప్రతి మనిషికీ యెప్పుడో ఒకప్పుడు కలుగుతుంది. నీ బిడ్డను నువ్వు కని ధైర్యంగా పెంచుకుంటానంటే నా అభ్యంతరంలేదు. కాని ఆ బిడ్డను మన బిడ్డగా చేయగలగటం అసహనం కలుగజేస్తుంది నాకు. బాగా ఆలోచించుకో! కొద్దో గొప్పో, నాలుగేళ్ళకాలం మనం దాంపత్య సౌఖ్యం అనుభవించాము. ఇంక పుట్టబోయే బిడ్డే నీ సర్వస్వమూ అనుకోగలిగితే అల్లాగే కానీయి."

"ఆ బిడ్డ మన బిడ్డ యెందుకు కాదు! ఏమిటీ మీ దబాయింపు? తాళి కట్టించుకోనంత మాత్రన తల్లినయ్యే హక్కులేదా?"

"ఎందుకులేదు! అందరికీ అన్నిహక్కులూ వున్నాయి. నన్ను తన్నే హక్కులేదా అంటూ తన్నితే తన్నులు తిన్నవాడు చేతులు ముడుచుకుని కూర్చోడు. పైకి రా ఒకసారి!" అంటూ చరచరా మేడమీదకు వెళ్ళిపోయాడు.

సుమనకు అరికాలులో చమట పోయ సాగింది. నరనరాల్లో వింతగా కదలిక. అది ఒక సన్నని భయంగా మొదలై, వెన్నుపూస మ్మటే ప్రాకి శరీరాన్ని జలదరింప చేసింది. యెల్లానో పైకి వెళ్ళింది. సోఫాలో కూలబడింది.

"ఇదుగో యిది చూడు" అతను మెడికల్ చెకప్ చేయించుకున్న రిపోర్ట్ అది! పరీక్షగా చూసింది. సుమన ముఖం కమలిపోయింది ఆ రిపోర్ట్ చదవగానే!

"ఇంకా ఏం కావాలి?" అన్నాడు జగన్నాధరావుగారు.

సుమన బింకం సడలిపోయింది. చేతుల్లో ముఖం దాచుకుంది. జగన్నాథరావుగారికి జాలివేసింది. ప్రక్కన కూర్చుని సుమన ముఖం మీది చేతులను మృదువుగా తొలగించాడు.

"సుమా! బాధపడకు. నిన్ను బాధపెట్టటం నా అభిమతంకాదు. ముందు నువ్వు ఈ విషయం చెప్పినప్పుడు నాలో ఏమన్నా మార్పు వచ్చిందేమో అని సంతోషించిన మాట వాస్తవమే! అందుకనే మా ఫామిలీ డాక్టర్ వద్దకు వెళ్ళిపోయినాను. అతను నన్ను పరీక్షించి, ఇది జరగటం అసంభవం అన్నాడు. నువ్వు నాతో జీవితం పంచుకోవాలని ఆశపడ్డావు. నీవు నడిచే దారిని రాజమార్గం చేయాలనుకున్నావు. నీ దారిలో నీవే పూలకు బదులు ముళ్లను జల్లుకున్నావు. ఎవరు అతను? బిడ్డ తండ్రిగా ఉండటానికి అతను ఒప్పుకుంటాడా? లేకపోతే నీవు యెక్కడికయినా వెళ్ళటానికి సిద్ధంగా వుండు. నతో జీవితం అంతా నడవాలంటే ఎబార్షన్‌కి సిద్ధంగా వుండు. లేదా, బిడ్డకూ నీకు సరిపడగా జీవనోపాధి కల్పిస్తాను. ఏది ముఖ్యమో నీవు నళిని వచ్చేలోగా ఆలోచించుకో! వారం పదిరోజులు గడువుంది. నీ భవిష్యత్తు నీ చేతుల్లోనే వుంది. బాధపడకు." సుమన కళ్ళు తుడుచుకుంది. లేచి పమిట సర్దుకుంది. జగన్నాధరావుగారు కూడా లేచాడు. "చాలా ఎట్రాక్షన్‌గా వున్నావు. కాని పరాయిదానివి. ఇది నీ నిర్ణయం అని వింటే కాని నీ మీద చనువు ప్రదర్శించలేను. నీ నిర్ణయం

ఏదయినా సహకరిస్తాను మనస్ఫూర్తిగా!" అన్నాడు.

సుమన మాట్లాడకుండా వెళ్ళిపోయింది. డాబాలోకి వచ్చి సుమన తోటలోంచి వెళ్ళుతూంటే చూస్తూ నించున్నాడు.

"ఏమిటీ ఆడపిల్లలు? ఒక్కొక్కళ్ళల్లో ఒకొక్క విధమయిన తెగింపు వుంటుంది. నళిని అన్నాళ్ళు తన తోటలో కాయని పువ్వులా వుండిపోయింది. ఇంత సాహసం ఎందుకు చేయలేదు? అవకాశం లేకా? అవకాశం వుంటేమటుకు ఇల్లా చేస్తారా! సుమనకు వున్న అవకాశం నళినికి వుండదా, అయితే నళిని ఇల్లాంటి పని ఎందుకు చేయలేదు? ఏమో!" ఆలోచనలతో తల బరువెక్కింది అతనికి.

* * *

స్టేషన్‌కి వంటరిగా వచ్చిన జగన్నాధరావు గారిని చూసి తనలో తనే నవ్వుకుంది నళిని. సుమన రాలేదేం? ఏం నిర్ణయించుకున్నారు వాళ్ళు. ఏం నిర్ణయించుకున్నారో తనతో చెప్పరు. ఇద్దరికిద్దరే! గుండెలు లేని బంట్లు! అతన్ని చూస్తే తనకి కోపం రావటంలేదు. ఎంచేత? ఏదో జరగవలసినది జరిగినట్లు తోస్తోంది. ఇన్నాళ్ళకి చూసాను అన్న ఆర్ద్రిత-ప్రేమ-అనురాగం తనలో కదలాడటంలేదు. మనస్సంతా ఎండిపోయింది. పగుళ్ళు విచ్చింది. ఆ మనస్సులో ఇంత సున్నితమైన భావాల పుష్పాలు వికసించవు. ఇద్దరిమధ్య అనురాగం ఆత్మీయత, ప్రేమ మొదలయిన అతి సుకుమారమైన బంధాలు లేవు. గౌరవం, మర్యాద, ఆర్థిక సుస్థిరత మొదలయిన కఠినమయిన వాస్తనాలకు కట్టుబడివుంది. ఈ దాంపత్య బంధం, ప్రేమ ఆప్యాయత, మమత, మమకారం సున్నితమైన జరీదారాలయితే మిధ్యాగౌరవం, కుటిల మర్యాద, సంఘపరమైన అపవాద భీతి కఠినమైన చేంతాడులు అయివుంటాయి అనుకుంది. రాజేశ్వర్, సూట్‌కేస్ బెడ్డింగ్ ఇంకా చిన్న చిన్న సామాన్లు దింపాడు. నళిని ప్రక్కన పైజామా లాల్చీలో గౌరవంగా వినయంగా నించున్న రాజేశ్వర్‌ని కళ్ళజోడులోంచి నిశితంగా చూసేడు జగన్నాధరావుగారు.

"ఒకరికొకరు పరిచయం చెయ్యాలా!" అంటూ నవ్వింది నళిని.

"నీకోసం అన్నగారు కాక వేరెవరు వస్తారు!" అన్నాడు రాజేశ్వర్.

"మామయ్య కొడుకు. గ్రాడ్యుయేటు అయ్యి వూరికే వుంటున్నాడు. నాకు యీ ప్రయాణాల్లో చాలా మటుకు తోడుగా వున్నాడు, మనవూరు చూస్తాడని తీసుకువచ్చాను" అంది నళిని. "మంచి పనిచేశావు" అన్నాడు. నళిని చాలా చురుకుగా ఇంకా రెట్టింపు అందంగా వుంది. ఇంత దీర్ఘప్రయాణంలో ఆమె ఏమీ అలసినట్లు లేదు. ఇల్లంతా నీటుగా వుంది. రాజమ్మ ఆధ్వర్యంలో పనివాళ్ళు ఇంటిపని అశ్రద్ధ చేయలేదు.

"ఏమ్మా! తనివితీరా కాంప్ వేసేసారు!" అంది రాజమ్మ.

"పరవాలేదు. నే నెన్నాళ్ళు వూళ్ళో లేకపోయినా ఇల్లు ఇల్లులానే వుంది. నువ్వు బాగా చూసుకున్నావు ఇంటినీ ఇంటి యజమానినీ" అంది. స్నానాలు, భోజనాలు అన్ని అయినాయి. రాజేశ్వర్ స్కూల్‌చూసి వస్తానని బయటికి వెళ్ళినాడు. సుమన స్టేషన్‌కి రాకపోవటం సరే, ఇంటికి తను వచ్చినా ఇంకా రాకపోవటానికి కారణం ఏమిటి! అని ఆలోచనలో పడింది నళిని. నళిని వచ్చిందని విన్న మహిళామండలివాళ్ళు సాయంకాలం అయ్యేసరికి వచ్చేసారు. ఈ మధ్య ఒక రూరల్ డిస్పెన్సరీ పెట్టటంతో ఒక డాక్టరుగారు కూడా వచ్చేరు వూరికి. ఆయన భార్య, చెల్లెలు చదువుకున్నవాళ్లు. నళినిని ఎప్పుడు చూద్దామా అని తహతహలాడుతున్నారు.

"అమ్మయ్య. మీరు వచ్చేక ఎప్పుడు చూద్దామా అనిపించింది. అంచేతే ఒక్కరోజు మీరు విశ్రాంతి తీసుకుంటారని ఆలోచించక మీ ఇంటికి దండెత్తి వచ్చేము."

అభివృద్ధికి మారు పేరు ఆంధ్రప్రదేశ్

వింధ్యకు దక్షిణాన, ప్రకృతిమాత ఒడిలో ప్రగతి వీణగా వెలుగొందే మన తెనుగునాడులో ప్రతిభావంతులైన కవులు, పరాక్రమ శాలురు, శాస్త్రవేత్తలు, సాంకేతిక విజ్ఞాన వేత్తలు, ఎంతోమంది కృషిచేసి దశాబ్దాల తరబడి నిత్యనూతనంగా వర్ధిల్లే మన దేశ ప్రగతికి బాసటగా నిలిచారు. కీర్తి బావుటాల నెగుర వేశారు.

దేశం నడిబొడ్డున నిలిచిన మన రాష్ట్రానికి అపారమైన వనరులతో ప్రకృతి ఎనలేని వరాలు ప్రసాదించింది. కొత్త పాతల మేలికలయికగా, సమగ్రమయిన సమ్మిళిత సంస్కృతికి పుట్టినిల్లుగా పరిశ్రమల అభివృద్ధికి పట్టుగొమ్మగా నిలిచే భాగ్యనగరం రాజధానిగా వెలుగొందే ఆంధ్రప్రదేశ్ నేడు అందరి దృష్టి ఆకర్షిస్తూంది.

'దక్షిణాది ధాన్యాగారం'గా పేరుపొందిన మన రాష్ట్రంలో ప్రగతిశీలురైన మన రైతాంగం 1977-78 లో 86.60 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను పండించారు. ఈ సంవత్సరం 98 లక్షల టన్నుల వరకూ ఉత్పత్తిని పెంచేందుకు రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించబడ్డాయి. జాతీయ నిల్వలకు మన రాష్ట్రం 10 లక్షల టన్నులకు పైగా ధాన్యం అందించింది.

జాతిని కొరతలకు దూరంగా వుంచేందుకు మన రైతులు అహరహం కృషి చేస్తున్నారు. అందుకే అభివృద్ధికి మారు పేరు ఆంధ్రప్రదేశ్.

సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

27/78-79

అంది డాక్టర్‌గారి చెల్లెలు కాంతి. బి.యస్.సి. ప్యాసయి రెండేళ్ళు అయిందిట.

"వూరికే వున్నారా? జాబ్ చేయలేక పోయేరా?" అంది నళిని.

"పైకి చదవటానికి ఆర్డినరీగా పాస్ అయినాను. జాబ్ దొరకటంలేదు. వదినకి చంటి పిల్లలు. సాయితాగా వుంటానని అన్న తీసుకు వచ్చేడు.

"ఏమో చాలా వూళ్ళు చుట్టివచ్చేరుట. ఆ విశేషాలన్ని మన మండలి మీటింగులో చెప్పాలి మీరు." అంది మహిళామండలి సెక్రటరీ అంబుజం.

"మనదేశంలోవే కదా! విదేశీయాత్ర అయితే చెప్పినా బాగుంటుంది." అంది నళిని.

"ఏ ప్రాంతానికి ఆ ప్రాంతపు అలవాట్లు వుంటుంటాయి. అవి యింకో ప్రాంతంవాళ్ళకి విదేశీయంగానే కనపడుతాయి. మన ఆంధ్ర లోనే చూడండి. తూర్పు జిల్లాలవారు వేరు. పడమటవాళ్ళు వేరు, కోనసీమవాళ్లు వేరు. వాళ్ళ వంటలు, ఆహారపు అలవాట్లు విద్యా విషయాలు, వివాహపు తంతులు అన్నీ భేదం గానే వుంటాయి. వినటానికి వింతగానే వుంటాయి. ఒక రాష్ట్రంలోనే ఇన్ని భేదము లుంటే ఇంక అంతర్రాష్ట్రంగా బోలెడు తేడాలు వుంటాయి. అవి అన్ని తెలుసు కునేందుకు ఆసక్తికరంగా వుంటాయి...." అంది సరళ, డాక్టరుగారి భార్య. "సరే ఒక రోజు ఏర్పాటు చేసుకుందాము." అంది నళిని.

"మన మహిళా మండలిలో సంగీతంకూడా నేర్పితే బాగుంటుంది" అంది ఇంకొక మెంబరు.

"అవును. కళాత్మకంగా కూడా వయోజనుల్లో అభిరుచిని పెంపొందించాలి. ఒక్క సంగీతమేకాదు. ఆటలు, చేతిపనులు కూడా ప్రవేశపెట్టుదాం. రెడీమేడ్ దుస్తుల తయారీకి మంచి ప్రోత్సాహం వచ్చింది కదా! ఇంక ఇప్పుడు అద్దకం పనులు కూడా చేయిద్దాం."

అంది నళిని. ఇంకా మండలిలో చేర్చవలసిన అంశాలు నలుగురూ మాట్లాడుకున్నారు. అందర్ని పంపి తాను భోజనంచేసి మేడమీదకు చేరేసరికి పదకొండు దాటింది. జగన్నాధరావు గారు మేలుకొనే వున్నాడు.

"ఏమిటి ఇప్పటికా తీరిక!" అన్నాడు. నళిని నవ్వింది. తన మంచంమీదికి చేరి దోమ తెర దింపే ప్రయత్నం చేస్తూండగా అతను వచ్చి మంచం అంచున కూర్చున్నాడు.

"చాలా ప్రయాణంచేసి వచ్చేను." అంది నళిని. అలసటగా కనురెప్పలు భారంగా వాలి పోతున్నాయి. ప్రక్కకు తప్పుకున్నాడు. నళిని మంచంమీద ఒత్తిగిలి పడుక్కుంది. జగన్నాధరావు నడుంమీద చేయివేసాడు ప్రక్కన కూర్చుని.

"ఇన్ని రోజులు ఇన్ని వూళ్ళు ఎందుకు తిరిగావో నేను నిన్ను అడగను. కాని ఇక్కడవున్న మనశ్శాంతి నీకు ఎక్కడా కలిగి వుండదని అనుకుంటున్నాను."

"ఎల్లా అనుకుంటున్నారు?"

"లేకపోతే ఎందుకు వస్తావు? తిరిగి రావాలని నీ స్థానం నీవు పటిష్ఠం చేసుకోవాలి లేనిదే నీవు తిరిగిరాలేవు. తాత్కాలికంగా దూరం అయినా, ఆఖరి మజిలీ ఆడదానికిదే! నీకన్నీ తెలుసు. నేనేమీ చెప్పనక్కరలేదు."

"నిజమే! మీతో నేనేకీభవిస్తాను. నేను యిక్కడ వుండేది రెండు నెలలు మాత్రమే! అమెరికా వెళ్ళటానికి పాస్‌పోర్టు అదీ రావటానికి ఫార్మాలిటీస్ పూర్తవటానికి టయిము పడ్తుంది. అందాకా తిరగటమెందుకు? అందరికి అనుమానం కలిగేట్లు ప్రవర్తించటం నా కిష్టం కాలేదు. అక్కడ యిద్దరన్నలున్నారు. నాకు విద్య వుంది. ఇంకా నేర్చుకోవలసింది వుంటే నేర్చుకుందుకు ప్రయత్నిస్తాను. నా విద్య నేర్చుకోవలసిన ఉత్సాహవంతులు దొరికితే నేర్ప ప్రయత్నిస్తాను. ఆఖరి మజిలీ యిదే అన్నమాట నే నెప్పుడూ మర్చిపోను. నా స్థానం నాకు పటిష్ఠంగానే వుంది, వుంటుంది. అది వదులుకోవటంలేదు. అది మన హిందూ

ప్రగతి సౌధానికి ప్రణాళికల నిచ్చెన

ఆంధ్రప్రదేశ్ లో ప్రణాళికా పెట్టుబడులు అంతకంతకూ పెరుగుతున్నాయి. **5**-వ పంచవర్ష ప్రణాళిక తొలి సంవత్సరం **1974-75** వార్షిక ప్రణాళికా పెట్టుబడి రు. 148 కోట్లు వుండగా 1978-79 ప్రణాళికలో యిది రు. 478 కోట్లకు పెరిగింది. ప్రస్తుత సంవత్సరం ప్రణాళికా పెట్టుబడి రు. **449** కోట్లు. ఇది నాలుగవ పంచవర్ష ప్రణాళిక పెట్టుబడికన్నా మించి పోయింది.

ఐదవ ప్రణాళిక ఆర్థిక వనరుల సేకరణ లక్ష్యం రు. **250** కోట్లు. అయితే, దీనిని అధిగమించి రు. 401 కోట్లకు సేకరించారు.

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉజ్జ్వలంగా వుంది. రాష్ట్ర ఆదాయం గత సంవత్సరం రు. 1,498.96 కోట్లు వుండగా 1977-78 సంవత్సరంలో రు. 1,621.23 కోట్లకు, అంటే, 8.2 శాతం మేరకు పెరిగింది. అదే కాలంలో సగటు తలసరి ఆదాయం రు. 305/-ల నుంచి రు. 322/-లకు పెరిగింది.

ప్రణాళికల నిచ్చెన మీదుగా ఆంధ్రప్రదేశ్ ప్రగతి సౌధాన్ని అధిరోహిస్తున్నది.

సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

30/78-79

పద్ధతికాదు" అంది నళిని దృఢంగా.

కొత్తగా పెళ్లికూతురుగా చూసినప్పుడు పాలరాతిబొమ్మ అనుకున్నాడు జగన్నాధరావు గారు. ఇప్పుడు నిజంగా రాతిబొమ్మలాగే అయిపోయింది నళిని.

"అన్ని ఏర్పాట్లు చేసుకున్నావా?" ఏమనాలో అంతకంటే తోచలేదు అతనికి.

"ఆ వ్యవహారమంతా సుభ చూస్తోంది."

"ఎవరూ! మార్వాడీని పెళ్లి చేసుకున్నావిడా!"

"ఆఁ. అదే!"

"తనూవసుందా! తనకి పిల్లలు సంసారం!"

"అన్ని వున్నాయి. భర్త పిల్లలు. ఆభర్తని చూసుకుందుకు ఇంకో భార్య. అన్ని అమరిన సంసారమే తనది."

"ఊ! అయితే నేను నిన్ను వెళ్ళవద్దని అంటే ఏమి చేస్తావు? దెబ్బలాడుతావా?" అన్నాడు నవ్వుతూ.

"ఎప్పుడైనా దేనికయినా మీతో దెబ్బలాడానా? మామూలు వాళ్ళల్లా అల్లా చేశారు, ఇల్లా చేశారు అంటూ భర్తని సాధించటం, తగువులుపడటం నా కిష్టంలేదు. నాదని ఒక లక్ష్యం యేర్పరుకుని ఆ లక్ష్యం సాధనకు కృషి చేస్తూంటే ఆ కృషికి చేతనయినంత సాయం చేయాలికాని అడ్డు తగలటం సత్పురుష లక్షణం కాదుకదా!"

"నేను నీ దృష్టిలో సత్పురుషుణ్ణి కానవసరం లేదులే. ఇంక ఇల్లు వదలి ఆ వూళ్ళూ ఈ వూళ్ళూ పట్టుకు తిరగటం నా కిష్టంకాదు. సంఘసేవ చేయాలంటే దేశాలు తెగించిపోనక్కరలేదు. మన సంసారం మనం చక్కగా నిర్వహించుకుంటే బోలెడు దేశసేవ చేసినట్లే. ఇంట్లో వుండి మన వూరి బాగోగులు చూస్తానంటే నేను వద్దనను" అన్నాడు దృఢంగా.

నళిని లేచి మంచం నడుంగా కూర్చుంది.

"ఏం? ఎందుకని! నా పుట్టింటికి నేను వెళ్ళకూడదా?" అంది.

"పుట్టిల్లు ఏకు అమెరికాలో వుందా?"

"అన్నలున్నారు కదా!"

ప్రతిచోటా నువ్వే!

దేవా!
తెలుసుకున్నాను నిన్ను
నీకు నాలుగు చేతులు వుండవని
ఆరు ముఖాలు అసలే అబద్ధమని!
నువ్వు
పాల సముద్రంలో పాప పానుపుపై
పవ్వళించి, నివ్వాళులు అందుకుంటూండవని
బూరజువా మన స్తత్వంతో
సేవలు చేయించుకుంటూండవని
ఎక్కడో చీకటి గదిలో
గర్భగుడి ఒడిలో, దాగొని వుండవని!
నీకు
శంఖు చక్రాలు అలంకారాలు కావని
అమృతం కోసం, అమ్మాయిల కోసం
నువ్వు వెయ్యి వెర్రివేషాలు వెయ్యవని
తెలుసుకున్నాను!
నిన్ను
మా పాప చిరునవ్వులోనే కాదు
పాపాల పుట్ట అనుకునే
దుర్గంధాల గుట్ట-ఆ-
కుష్ఠురోగి తెగిపోయిన
చేతి వ్రేళ్ళలోనూ చూశాను!
నువ్వు లేనిచోటు లేదని తెలుసుకున్నాను
తెలుసుకున్నాను నీ రూపం
'రాయి' కాదని,
హృదయాలను పల్లవింపజేసే
'హాయి' అని!

— దేవరాజు రవి

"అన్నలుంటే అది అన్నల యిల్లు అవుతుంది. అమ్మ వుంటేనే అమ్మ యిల్లు అవుతుంది. సైట్ సీయింగ్‌కి అంటావా? ఎప్పుడో తీరిగ్గా వెళ్ళవచ్చును. సుభకు రేపే టెలిగ్రాం ఇయ్యి నేను రావటంలేదని."

"చాలా డిసప్పాయింట్ అవుతుంది. ఎంతో ఉత్సాహంతో అది రకరకాల దుస్తులుకూడా

తరతరాల అంతరాలను తొలగించిన తరం

భూకామందు మోచేతికింద బతుకంతా పతనం
నాగేటి చాలున నడిచే నత్తనడక జీవితం
తరం వెంట తరం...యిదే బానిసతనం

గుండెల్లో బాధలు మోస్తూ, దుక్కిటెద్దు నీడన సాగు చేస్తూ నమ్ముకున్న ఊరుమ్మడి చెక్క కాస్తూ పేదవాడి సొంతం.

తర తరాలుగా యీ దురాగతాలు సృష్టించిన అంతరాలను తొలగించింది మా తరం!

1973 భూసంస్కరణల చట్టం మా బతుకు బాటను ప్రగతి వైపుకు మళ్లించింది.

దీనివల్ల 2,95,221 ఎకరాల భూమి ప్రభుత్వాధీనం అయింది.

1978 జూన్ 1 నుండీ భూస్వాధీన పక్షోత్సవాలు జరిగాయి. 1,32,446 ఎకరాల భూమిని 73,847 మంది బలహీన వర్గాల వారికి సాగుకోసం యిచ్చారు. 65,983 మందికి యిళ్లు కట్టుకునేందుకు 4,837 ఎకరాల భూమి అందజేశారు. రాష్ట్రం మొత్తం మీద వున్న 52 శాతం మంది బలహీన వర్గాలవారి సంక్షేమం కోసం 1978-79 బడ్జెట్‌లో రు. 35 కోట్లు కేటాయించారు; రు. 23 కోట్లు సంస్థాగతంగా ఆర్థిక సహాయం అందుతుంది. వెనుకబడిన కులాలు, తదితర బలహీన వర్గాలకోసం ఏర్పాటు చేసిన ఆర్థిక సహాయక సంస్థలు రు. 43 కోట్లు ఖర్చయ్యే వివిధ పథకాలు రూపొందించాయి; యీ పథకాలవల్ల మూడు లక్షల మంది బలహీన వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతారు.

ఆర్థిక, సాంఘిక అంతరాలతో చీకట్లు ముసిరిన వెనకటి తరానికి తెరపడింది.

నేడు బడుగు మనిషి వాకిట నేలతల్లి నూతన తరానికి నాంది పాడింది.

సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

కుట్టించుకుంటోంది."

"ఏం? అవిడేమన్నా డాన్సు ప్రోగ్రాం యిస్తుందా అక్కడ!"

"ఛఛ! దానికి డాన్సేమిటి? కూనిరాగమన్నా తీయటం రాదు" అంది నళిని.

"ఇంకేం? మాడల్‌గా పని చేస్తుందేమో?"

"ఏదో చేస్తుంది-మనకెందుకు....?" అంది నళిని.

"సరే, టెలిగ్రాం ఇచ్చెయ్యి రావటంలేదని! ఈసారికి ఈ ప్రయాణం మానెయ్యి. నా మాట విను."

"మీ మాట విననిదెప్పుడు?"

"వింటావు, బంగారుతల్లివి."

"బంగారు తల్లిని కాగలిగితే నేనింకా మీ పాదాలవద్ద కుక్కలా పడివుందును" అంది నళిని. జగన్నాధరావు నెమ్మదిగా నళిని మంచంమీద జారబడ్డాడు.

* * *

సుమన వారం పదిరోజులులయినా రాక పోవటంతో నళిని చాలా ఆశ్చర్యపోయింది. జగన్నాధరావు మనస్సులో మల్లాగుల్లాలు పడుతున్నా పైకి ఏమీ తేలటంలేదు.

"సుమన ఏమయింది? అసలు రావటం లేదు?" అంది కాఫీలు త్రాగాక ఒకరోజు.

జగన్నాధరావుగారు, "వూళ్లో లేదేమో!" అన్నాడు.

"ఆమె, వాళ్ళమ్మగారు పెద్దమ్మాయిగారి వూరు వెళ్ళారుట! నిన్న వాళ్ళ పాలేరు కనిపించి చెప్పాడు" అంది రాజమ్మ.

"అల్లాగా! అందుకనే రావటంలేదు" అంది నళిని జగజగన్నాధరావుగారు పైకి వెళ్ళాక.

"అమ్మగారూ!" అంది రాజమ్మగారు గొంతు తగ్గించి.

"ఏమిటి?" అంది నళిని.

"సుమన తల్లి కాబోతూంది. అందుకనే మీకు ముఖం చూపెట్టటం ఇష్టంలేక తల్లితో వెళ్ళిపోయింది."

"మరీ మంచిది. అయితే ఇంకేం? సిగ్గెందుకు! అయినా నేనేం చేస్తాను తనని!"

"అయ్యగారేకదా! అయినా మీదీ తప్పే అమ్మగారూ. అయ్యగారిని వదిలి అన్ని రోజులుండిపోయేరు!" తనకి నీతులు చెబ్తోంది రాజమ్మ! వళ్ళు మండింది నళినికి.

"ఎవళ్ళనీతి వాళ్ళకి వుండాలి. మనం కట్టడి చేస్తే కట్టుబడి వుంటారా! అయ్యగారుఅయితే తను పారిపోవటం ఎందుకు? ఇంట్లో నిలబడాలి కాని?"

"నన్ను చెప్పమంది అయ్యగారితో. నాకు ఇల్లాంటి విషయాలు పెద్దవారితో ఎట్లా మాట్లాడాలో తోచదమ్మా! దేవతలా మీరేవచ్చారు. ఆ పిల్ల బతుకు మీ చేతుల్లోనే వుంది." అంటూ వెళ్ళింది రాజమ్మ.

నళినికి వళ్ళంతా ఎంతో తేలికగా అయినట్లు వుంది. ఇప్పుడు ఈ సంసార బంధం మరీ తేలికగా మర్చిపోవచ్చును. ఆ రాత్రి ఎంత నాటకమాడారు. తను విదేశాలకు వెళ్ళటం ఏమాత్రం ఇష్టంలేనట్లు మాట్లాడారు. సుమనను తల్లితో వెళ్ళమని తనే చెప్పి వుంటారు. నా స్థానం ఇప్పుడు పటిష్టంగా వుంటుందా! రాత్రి పగలు పిల్లలతో వంటతో చాకిరీతో మునిగి తేలే "దులారీ" కళ్ళకు కట్టింది.

నేను దులారీ కాలేను. అతను వద్దన్నా విదేశాలకు వెళ్ళితీరుతాను. స్థిర నిశ్చయ్యం చేసుకుంది నళిని. కాని ఆ నిశ్చయం తారుమారు కావటానికి ఇరువయినాలుగ్గంటలుకూడా పట్ట లేదు నళినికి. సాయంత్రం రిజిస్టర్ పోస్టులో పెద్ద కవరు వచ్చింది నళినికి. సంతకంపెట్టి తీసుకుంది. జగన్నాధరావుగారు పొరుగూరు వెళ్ళాడు. చాలాపెద్ద ఉత్తరం. అది సుమనదే అయివుంటుందని ఊహించలేదు నళిని. సుభ వ్రాసి వుంటుందనుకుంది.కాని వ్రాసిందిసుమన.

"నళినిగారూ! నేను మా అమ్మతో ఇక్కడకు వచ్చాను. వినతకు పండంటి కొడుకు పుట్టాడు. అక్క సావిత్రి, బావ వాళ్ళ అత్త మామలు అంతా వినతను యిప్పుడు యెంతో అపురూపంగా చూసుకుంటున్నారు. మా అమ్మ సరేసరి! పెద్దకూతురు సంసారం ఆదుకున్న త్యాగశీలిగా మరీ ముద్దులు చూపెడ్తోంది. అనుకోకుండా పెద్ద త్యాగంచేసిన హీరోయిన్

సిరులు పొంగిన జీవగడ్డ...

నదుల ఆట కట్టింది.

ఈనాడు అవి పల్లం ప్రాంతాల మీదుగా పొంగి ప్రవహించి సముద్రంపాలు కావటం లేదు. విచ్చలవిడిగా పారే నదీ జలాలకి అడ్డుకట్టవేసి, ఆ నీళ్ల చేత రేపటి సమాజ నిర్మాణానికి చాకిరీ చేయించుకుంటున్నాడు నేటి మానవుడు.

నాగార్జునసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు భారత దేశానికే కలికితురాయిగా వెలుగొందుతూంది. కృష్ణమీది యీ ప్రాజెక్టు యిచ్చే విద్యుత్తు పుణ్యమా అని సామాన్యుడి గుండెల్లో ఆశాదీపాలు వెలుగుతున్నాయి. ఆయకట్టు కుడీ, ఎడమా కాలువ నీటివల్ల 21.54 లక్షల ఎకరాలు తడిసి, చేతికి పంట అందివస్తూంది. ఇంకా లెక్కకు మిక్కిలిగా పంట కాలువలు తవ్వుతున్నారు. దాదాపు 12.70 లక్షల ఎకరాలకు నీటిపారుదల వసతి యేర్పడింది.

1978 జూలై 10 న భారత రాష్ట్రపతి ప్రారంభోత్సవం చేసిన సాగర్ జలవిద్యుత్పథకంవల్ల 810 మెగావాట్ల ఉత్పాదకశక్తి ఖాయం. సమీప భవిష్యత్తులో ప్రారంభమయ్యే శ్రీశైలం హైడల్ ప్రాజెక్టువల్ల రాష్ట్రంలో స్థాపిత విద్యుదుత్పాదకశక్తి మరింత అధికమౌతుంది. గోదావరి నదిపై తెలంగాణా ప్రాంతానికి వరప్రసాదంవంటి పోచంపాడు ప్రాజెక్టు త్వరితగతిని నిర్మాణంలో వుంది.

కృష్ణా గోదావరీ జీవనదులు మిట్ట పల్లాల్లో పంట కాలువలై ప్రవహించి బంజరు భూముల్లో బంగారం పండిస్తున్నాయి.

ఇది సిరులు పొంగిన జీవగడ్డ.

అయిపోయింది మా వినత. అందరి ఆశీర్వాదాలు వినత చేసిన పనికి వున్నాయి. నేనూ అల్లాంటి త్యాగం చేద్దామనుకున్నాను. త్యాగం అనుకుని చేతులు కాల్చుకున్నాను. ఫలితంగా నా నించి అందరికీ అపకీర్తి చుట్టుకుంటుంది. ఇంకా మా అమ్మకు తెలియలేదు. మీకు ఈ సరికి రావుగారు చెప్పేసి వుంటారు. ఆయన చాలా ఉదారంగా నా పోషణకు దారి చూస్తానన్నారు. బిడ్డ లేకపోతే రెండవభార్య స్థానం యిస్తానన్నారు. మీరు నన్ను గురించి యెల్లా ఊహిస్తారో నాకు తెలుసును. తిన్న ఇంటి వాసాలు పీకిన కృతఘ్నురాలు అనుకుంటున్నారు కదూ! ఆ బిరుదూ, మీ దూషణ తిరస్కారములకూ, దూరంగా ఒంటరిగా బ్రతకదల్చుకున్నాను. రావుగారు దయగా యిచ్చే రెండవభార్య స్థానం నాకక్కరలేదు. ఆ గౌరవ ప్రతిపత్తిగల రెండవభార్య సానం కంటే నాకు మాతృత్వమే మహోన్నతంగా కనిపిస్తోంది. బిడ్డను పోగొట్టుకొని ఫలానివారి భార్య అనిపించుకోవటంకంటే బిడ్డను ఈ లోకంలోకి తెచ్చి జీవితంతో రాజీపడి బ్రతికి బిడ్డను ప్రయోజకుడ్ని చేసి ఫలానావారి తల్లి అనిపించుకోవటంలో ఒక ఔన్నత్యం వ్యక్తిత్వం వుందనిపించుతోంది. నేను ఒకళ్ళ నీడలో వుంటం కంటే నా నీడన ఒకరిని పెంచటంలో సార్థకతలేదూ జన్మకి! మీరు నేనేదో చేయరాని మహా నేరం చేసి మీకు ముఖం చూపటానికి మనస్సొప్పక పారిపోయివుంటా ననుకుంటున్నారు. నేను నేరం చేయలేదు. పాపం అంత కంటే చేయలేదు. భర్త అంగీకారంతో పంచ భూతాలకీ దిక్పాలకులకీ పిల్లలని కని వంశం నిలబెట్టే పతివ్రతల పురాణాలు మనకు కొల్లలుగా వున్నాయికదా! ఆ దృష్టితో చూస్తే నేనూ పతివ్రతనే అయివుంటున్నాను. ఎటువచ్చి తాళి కట్టని భర్త అంగీకారం తీసుకోలేదు. అంతే! రావుగారు చాలా జాగ్రత్త అయిన మనిషి! ఈ విషయం వినగానే పట్నం వెళ్లి మెడికల్ చెకప్ చేయించుకుని వచ్చేరు. బిడ్డ తన బిడ్డగా లోకంలోకి రావటానికి వీలులేదన్నారు. ఏం చేస్తాం? ఆయన పట్టుదల అది! నాకు ఇదయినా మరీ మంచిది! మీ యిల్లు ఎప్పటికీ శూన్య గృహంగానే వుండివుంటుంది. నాదేంపోయింది! ఒక మంచి పనికి చేయూతనివ్వలేకపోయారు. నేను, తర్వాత మళ్ళీ ఎక్కడకు వెళ్ళేదీ వ్రాస్తాను. నాకేమయినా వ్రాయాల్సివుంటే మా వినోద అడ్రసుకి వ్రాయండి.

ఇట్లు,
మీ
సుమన."

వినోద అడ్రసు వ్రాసింది. ఎంత ధైర్యవంతురాలు సుమన? జగన్నాధరావు అందుకా తనని విదేశాలకు పోవద్దన్నది! ప్రేమించిన పడతి మోసం తట్టుకుందుకు భార్య ఆసరా కావాల్సి వచ్చిందా! సుమన మోసం యేమి చేసింది! ఆమెకు ఒక ఆలంబన కావలిసి వచ్చింది. ఏమీ దాచకుండా నిర్భయంగా చెప్పింది! ఆడదయిన సుమనకున్న నిర్భయం, ధనవంతులయివుండీ మగవాడయివుండీ జగన్నాధరావుకి లేదెందుకని? సుమన అలా చేసింది కనుక తను పతివ్రతగా జగన్నాధరావు మనసులో చోటు చేసుకుందా? ఒకవేళ సుమన బిడ్డ జగన్నాధరావుదే అయితే వాళ్ళ దృష్టిలో తను ఒక గొడ్రాలిక్రిందే నీచస్థానంలో వుండేది కాదా! ఇప్పుడే జగన్నాధరావు చేసిన పనికి ఎదురుదెబ్బ తీయాలి. అగ్నిసాక్షిగా తాళికట్టిన భార్యని, చులకన చేసి కన్నెతో విహరించి పొందిన తీయని అనుభూతికి శిక్ష జగన్నాధరావు జీవితం అంతా మోయాలి. తన కాళ్ళ వద్ద ఇద్దరూ పడివుండేలా చేయగల అవకాశం ఇదే తనకి.

తనలో తనుగా నవ్వుకుంది నళిని.

తనని వెంటనే బయలుదేరి రమ్మని నళిని యిచ్చిన టెలిగ్రాం అందుకుని ఆశ్చర్యపోయింది సుమన. కానున్నది గంధర్వులే తీర్చగలరు, అని బయలుదేరింది సుమన వెంటనే.

"రేపు దేవాలయంలో పెళ్లి చేసుకోండి!" అంది జగన్నాధరావుతో నళిని.

"ఎవర్ని నిన్నా! మన పెళ్లిరోజు రేపా?"

అన్నాడు. సుమన జాబు సంగతి చెప్పింది నళిని.

"నాకు దానికి పెళ్ళేమిటి?" అన్నాడు.

"అలా అనకండి. తల్లి కాబోతోంది వీధిన పడెయ్యటం మంచిదికాదు. మీ వంశ గౌరవం నిలుపుకోండి" అంది వంశ గౌరవం అన్న చోట వత్తి పలుకుతూ నిదానంగా నళిని.

"అదేమిటి నళినీ! నాకు తనని చేసుకోవటం యిష్టంలేదు."

"కాపరం చేయటం యిష్టమయింది.పిల్లల్ని కనటం ఇష్టం అయింది. తాళికట్టి పరువయిన ఆశ్రయం ఇయ్యటం ఇష్టంలేదా? జగన్నాధ రావుగారూ! మీ ఇల్లు శూన్యగృహం అవుతుంది, అని సుమన శాపం యిచ్చింది. కన్నెపిల్ల ఉసురు మీకు వద్దు. కళ్యాణంకు తల వంచండి. ఆర్నెల్లలో మీకు కొడుకునో కూతురునో అందించగలదు సుమన. ఆమెకు మీరు భార్య స్థానం యివ్వటంలో మీ వంశ గౌరవానికి ముప్పురాదు. సుమన రాత్రి బండికి వస్తుంది. రేపు పది దాటాక దేవాలయంలో పెళ్లి చేసుకోండి. సాయంకాలం మా మహిళా మండలిలో సన్మానం చేస్తాము. రాత్రికి వూరిలో అందరికీ విందుభోజనాలు వుంటాయి" అంది నళిని.

"అదికాదు నళినీ! అసలు...." అంటూ ఆ సుమన బిడ్డకు తను తండ్రి కాడని చెప్పబోయాడు నసుగుతూ.

"అసలు విషయం నాకు తెలియనిది కాదు. నేను,చేయలేని ఊహించలేని సాహసం సుమన చేసింది. ఆ పిల్ల అంటే నాకు కోపం అనుకుంది తను. కాని ఆ పిల్ల అంటే నాకు గౌరవం. మీమీది గౌరవం ఆ పిల్ల మీదకు మళ్లింది. తల్లిని గౌరవించలేని మీరంటే నాకు కోపం, అసహ్యం కలుగుతున్నాయి చాలా" అంది నళిని.

"నాకు సుమనఅంటే ప్రేమలేదు. ఇప్పుడు నేనెలా భార్యగా స్వీకరించగలను? తన్నెలా భరించగలను?"

"మీకేకారణం చేతయితే సుమన అంటే

అందని అదృష్టమా!

ప్రతిక్షణం నా గుండెలో
నువ్వుంటావు
దూరాలు దూరంగా వున్నా
నాకు నువ్వు దగ్గరే అనిపిస్తావు
నిజానికి మనమధ్య దూరం....
ఎంతో నాకు తెలియదు
నువ్వు నాకు దూరమా? దగ్గిరా?
గుండెలయలో నీవు స్పందిస్తావు
కనిపిస్తూనే వుండేలా కలల్లో వెలసి
మండిస్తూనే వుండేలా మనస్సులో నిలచి
మంటల్లోని మాధుర్యాన్ని అనుభవిస్తున్నా
ఏదో అశాంతి వండిస్తోంది హృదయాన్ని
రెక్కలుంటే ఎగిరి వచ్చేదాన్ని
నీకు నా గుండె గాయాన్ని చూపించేదాన్ని
ఓ అందని అదృష్టమా!
మనమధ్య దూరమెంతో చెప్పు!

—పాటిబండ్ల విజయలక్ష్మి

ప్రేమ పోయిందో, అదే కారణంచేత నాకూ మీమీద భర్తృభావం పోయింది. కాని కలిసి బ్రతక్క తప్పదు. వంశగౌరవం గాడిదగుడ్డూ బోలెడున్నాయి కదూ! ఇంక వాదించవద్దు. పూల సౌరభంతో విలసిల్లే దాంపత్యబంధాన్ని కంటకావృతం చేసుకున్నారు. అనుభవించక తప్పదు" లైటార్పి పడుకుంది నళిని తృప్తిగా.

యేన భూల్‌నా జహాఁ జహాఁ పర్ ఫూల్ వహాఁ హైకాంటేభీ, జహాఁ జహాఁ పర్ హోతే హాఁ, తుఫాన్, వహీసన్నాటేభీ, కభీ భూల్ కర్ భీ నలగానా జీవన్‌మే తుంచిన్‌గారీ!! ఘర్ ఘర్ కో తుం స్వర్గ్ బనానా, హర్ ఆంగన్ మే ఫుల్‌వారీ దేఖ్ రహీ దునియాసారీ—తుమ్‌పె బడే జిమ్మేదారీ. పూలువున్నచోట ముళ్ళు వుంటాయి. శూన్యంలోంచి తుఫానులు వస్తాయి అన్న హిందీ కవి మాటలు జ్ఞాపకం వచ్చేయి జగన్నాధరావుగారికి.

సమాప్తం!



నాలుగు పాదాల ధర్మాసుపత్రి

సి.వి. రమణ

దేశంలో చాలా ధర్మాసుపత్రులున్నాయి.

వాటిలో ధర్మం మందులూ వుండువు కాని, డాక్టర్లూ, నర్సులూ-రోగులూ వుంటారు.

రోగులు వాళ్ళ మానాన వాళ్లుంటే

కొందరు డాక్టర్లు నర్సుల మానాన వుంటారు.

పురుళ్ళ వార్డులో పచ్చి బాలెంతలూ-పసి కందుల్నెత్తుకుపోవడానికి కుక్కలూ,

అర్జంటు వార్డులో చావ సిద్ధంగా వున్న వాళ్ళూ వాళ్ళ ప్రాణాలు తోడెయ్యడానికి తోటి వాళ్ళూ—

గోడల మీద బల్లులూ-బాల్చీ తన్నేసిన నాయకులూ-ఇవీ ఆ ఆసుపత్రి అలంకారాలు.

ఇంకా—


పక్కబెడ్‌లో రోగి ఆఖరిక్షణాల్లో చావు మూలుగు-మూలుగుతున్నా ఇవతల బెడ్‌లో మేల్ నర్స్‌తో రొమాన్స్ చేసే కరేజీగల నర్సు మీనాక్షి వుంది.

ఆవులిస్తే పేగులెక్కెట్టి-రవిక విప్పేస్తే మనసు లెక్కెట్టి-కోక విప్పేస్తే గుణం లెక్కెట్టగల డాక్టరు శివస్వామి వున్నాడు—అతనిచేత రోజూ గుణాన్నీ మనసునీ లెక్కెట్టించుకునేందుకు ప్రౌఢనర్సు రమామణి వుంది.

రమామణిని తల్లిగా గౌరవించుకుంటూ—రోజుకో తండ్రిని వెతికి తెచ్చే కాంపౌండర్ రామ్మూర్తి వున్నాడు.

'కోమా'లో ఆసుపత్రికొచ్చిన వాళ్ళకు్కూడా తన సొగసుతో సుఖవ్యాధులు సంక్రమింప చేయగల కుర్రనర్సు 'కుమారి' వుంది.

ఇవీ అక్కడి మనుషుల శక్తిసామర్థ్యాలు.



ఇంకా—

మొగుణ్ణి కూడా ప్రియుడిలాగే చూసుకుంటుంది మీనాక్షి-కనక పతివ్రత.

ప్రియుణ్ణి కూడా మొగుడికంటే ఎక్కువగా చూసుకుంటుంది రమామణి కనక మహా పతివ్రత.

మొగుడి ట్రీట్‌మెంట్ మొగుడికీ, ప్రియుడి ట్రీట్‌మెంట్ ప్రియుడికీ పంచియిచ్చే కుమారి కుర్రపతివ్రత.

డాక్టర్ శివస్వామి పుత్రకామేష్టినాటి దశరథ మహారాజులావుంటే కాంపౌండర్ రామ్మూర్తి సీతాస్వయంవరం నాటి జనక భూపతిలా వుంటాడు—

ఇలా కాలం-తెలుగు చలన హిట్ చిత్ర రాజం-సినిమాస్కోప్ ఈస్ట్‌మన్ రంగుల్లో సిల్వర్ జూబ్లీకి ఉరకలు వేస్తున్నట్టు పరుగెత్తు తోంది.

మంచివాళ్ళను చూస్తే దేవుడికైనా కన్నెర్రే కదా!

ఒకానొక శుభదినాన కుర్రది కుమారీ-శివస్వామీ కన్సల్టింగ్ రూమ్‌లో వొంటిమీద స్పృహా-గుడ్డలూ-రెండూ లేకుండా శృంగార క్రీడల్లో-క్లయిమాక్స్‌లో వుండగా ప్రౌఢమీనాక్షి తలుపు కంతలోంచి చూడ్డంతో హాస్పటల్ కలరాపేషంట్ కడుపులా అల్లకల్లోలమై పోయింది.

ఆ కల్లోలంలో కొనవూపిరితోవున్న నలుగురు పేషంట్లలో ముగ్గురు ఈ అశాంతితో హరీ మన్నారు.

కాంపౌండర్ రామ్మూర్తిని అడ్డం పెట్టుకుని చచ్చీచెడీ గొప్ప డిప్లమసీ, స్ట్రేటజీ ప్లే చేసి, శివస్వామి మీనాక్షినీ-కుమారిని యిన్‌స్టాల్‌మెంట్ బేసిస్‌లో ఏలుకోడానికి ఒడంబడిక చేసుకున్న వేళ-నాలుగో బెడ్ పేషంట్—కారుకింద పడబోయిన ఓ ముసిల్దాన్ని రక్షించి, ప్రతిఫలంగా పక్కటెముకలు విరుచుకున్నవాడు, బోలెడు రక్తం పోయినా వొంట్లో మిగిలిన రక్తంలో వేడి మిగుల్చుకున్న వాడూ ధర్మాసుపత్రిలో ధర్మాన్ని భరించలేక ఎప్పుడీ నరకంలోంచి బయట పడదామా అని బాధతో ఏడుస్తున్న వేళ—

ఓ పూర్ణగర్భిణిని స్పృహలేని స్థితిలో నలుగురాడాళ్లు మోసుకొచ్చారు.

ఆమె ముఖం భయంకరమైన తుఫాన్‌ని మోస్తున్న నిండుమేఘంలా గంభీరంగా వుంది.

ఆమె చేతులు మంచు బిందువును మోయ

లేని అలసత్వంతో వాణికిపోయే లేత తమల పాకుల్లా సున్నితంగా నీరసంగా వున్నాయి.

ఆమె పెదాలు వెలిసిపోయిన కెంపుగులాబీ రేకుల్లా బాధాకరంగా వున్నాయి.

మూసుకున్న ఆమె కళ్ళు యుద్ధభూమిలో వీరమరణం చెందిన భర్తను-స్వహస్తాలతో చితిని పేర్చి-అగ్ని రగిల్చిన దానిలా ధైర్యంగా వున్నాయి.

వెంట వచ్చిన ఆ నలుగురు ఆడాళ్ళూ డాక్టర్‌గారికి దండాలెట్టి 'నొప్పులొచ్చి స్పృహ పోయింది-ఎలాగైనా బతికించమని బతిమా లారు' ఆ ఆస్పత్రిలోకి ప్రాణాలతో అడుగెట్టి మళ్ళీ వాటిని పుచ్చుకుని తిరిగిపోయిన వాళ్ళు చాలా తక్కువన్న సంగతి తెలియక—

ఆ సంగతి బాగా తెలిసున్న కాంపౌండర్ రామ్మూర్తి నిత్యహాయిబాబాలా నవ్వాడు. 'పేషంట్‌కేం ఫర్వాలేదు-పైగా పురుడొయ్యా డానికి మనుషుల్లేరు తీసుకుపోండి' అన్నాడు.

వాళ్ళు 'డాక్టరు బాబుని పిలవండి' అంటూ శోకన్నాలు ప్రారంభించారు.

డాక్టరుబాబు గదిలో మీనాక్షి జాకెట్‌నూ అంతరాత్మను చిలక్కొయ్యకి వేళ్ళాడదీసి, చీరనూ,శీలాన్నీ స్టూలుమీదకి గిరవాటెట్టి డాక్టరు గారికి అద్వాన్నుగా ముద్దొకటి యివ్వబోతుం డగా—'డాక్టరుబాబూ' అంటూ వాళ్ళ ఏడ్పే ఏడుపులతో తలుపులు కూడా బద్దలైపోతా యేమోనన్న భయంతో శివస్వామి సభ్యతా యుతంగా దుస్తులు ధరించి మరీ వచ్చాడు.

పరాయిస్త్రీ అయిన రోగిని మునివేళ్ళ నాడి పరీక్షచేసి-మరేం ఫర్వాలేదు-కొంపకి తీసుకు పొమ్మన్నాడు. అప్పటికే ఆ గర్భిణీ స్త్రీ శ్వాస చాలా భారంగా పీలుస్తోంది. చూసేసరికి ఈ క్షణంలోనో-మరో క్షణంలోనో ఆమె చచ్చి పోతుంది-డాక్టరేమైనా చెయ్యకపోతే అన్నది తెలిసిపోతోంది.

కూడా వచ్చిన వాళ్ళలో ఒకామె కొంచెం వయసు మళ్ళినది 'సచ్చిపోద్ది డాక్టరుబాబు— సూది మందిప్పించు' అని పెద్దగొంతుతో ఏడిచింది.

'న్యూసెన్స్-సూది మందూలేదు - దారం మందూ లేదు. గెటవుట్ డర్టీబీస్ట్స్' అన్నాడు శివస్వామి.

తోటీవాళ్ళు వాళ్ళని బయటకు తోసే స్తున్నారు.

ధర్మాసుపత్రులు కష్టజీవులకు కాదని తెలి యక పొరబాటున ఆ గర్భిణీస్త్రీ తాలూకు వాళ్ళ ఆమెను మోసుకుంటూ బయటకి నడిచారు.

"డాక్టరుగారూ" లోపల్నించి మీనాక్షి పిలిచింది.

"కమింగ్" అంటూ శివస్వామి లోపలికి పరిగెత్తాడు. ధర్మాసుపత్రి నరకద్వారాలు దాటిన ఆ గర్భిణీ స్త్రీ భూనభోంతరాళాలు దద్దరిల్లేలా ఓ కేకపెట్టింది.

నాలుగోబెడ్ పేషంట్ ఒక్క దూకులో కిటికీ దగ్గరకు వెళ్ళి బయట దృశ్యాన్ని చూసి కళ్ళు తిరిగి గోడకు చేరగిలపడిపోయాడు.

ఓ ధర్మాత్ములైన ముష్టిది-తన చిరుగు దుప్పటి వీధికి అడ్డంగా పట్టుకుంది.

నెత్తుటి మడుగులో-మందారపువ్వులా వున్న ఓ నిర్జీవ శిశువు మరణించి పుట్టి-పుట్టుకతోనే మరణాన్ని పొందగలిగినందుకు నవ్వు కుంటోంది.

చనుపాలతో చంటిదాన్ని పెంచి-గోరుముద్ద లతో గొప్పదాన్ని చేయవలసిన బాధ్యతనుంచి ఆ తల్లి సుదూర తీరాలకు పయనమైపోయింది.

ఆ ధర్మాసుపత్రి, ప్రసవంలో చనిపోయిన పెళ్ళాంపేర కట్టించి తను శిలా విగ్రహ రూపంలో ఆస్పత్రి కాంపౌండ్‌లో వెలసిన ధర్మదాత నవ్వుకున్నాడు.

ఆసుపత్రి ఎదురుగావున్న ఓ టోపీ రాజ కీయ నాయకుడి సిమ్మెంట్ బొమ్మమీద ఓ కాకి రెట్టవేసి ఎగిరిపోయింది.

'ఆ డాక్టరు పెళ్ళాం ఎప్పుడిలా సస్తదో' అని కూడా వచ్చినవాళ్ళ ఏడుస్తున్నారు.

లోపల మీనాక్షీ శివస్వామీ నవ్వుకుంటు న్నారు. కాంపౌండరూ-రమామణీ నవ్వుకుంటు న్నారు. నాలుగు కాళ్ళతోటీ పశుధర్మం-ధర్మాసు పత్రిలో నడుస్తోంది. □

కాదేదీ కవితకి అనర్హం!

పి.వి.ఆర్.శివకుమార్

"కొంప మునిగిందిరా బాబూ!"

గావుకేక పెట్టుకుంటూ సుడిగాలిలా రూములోకొచ్చి పడ్డాడు కామేశం.

"ఎవరిది?" తాపీగా అడిగాడు రమణీ సౌందర్యాన్ని అన్ని కోణాల్నుంచీ తదేకంగా పరిశీలిస్తున్న బాబు.

"ఎవరిదేమిట్రా? నాదే" కంగారుగా అన్నాడు కామేశం, "నేనిప్పు డర్జంటుగా ఓ కవిత రాసెయ్యాలి."

"రాసి పారెయ్. దానికేం?"

"ఏడిశావు లేవోయ్, బోడి సలహా-నువ్వూనూ! అంత తేలిగ్గా రాసిపారెయ్ గలిగితే ఇంత బాధెందుకు?"

"పోనీ-రాయకు."

"ఒరే బాబిగా! నిన్నూ...."

ఇహ నేను కల్పించుకోకపోతే వీళ్ళిద్దరూ కలయబడి శాంతిభద్రతల సమస్య తెచ్చేలా వున్నారనిపించింది.

"ఒరే కామేశం, నువ్విలా రా! బాబూ నువ్వెంచక్కా రమణి సౌందర్యాన్నే ఆస్వాదించు నాయనా!" అంటూ హోంమంత్రిలా వాళ్ళిద్దరిమధ్యా తల దూర్చాను.

కామేశం ఇంక నామీద పడ్డాడు.

"చూడ్రా, వెధవ బుక్కులూ వాడూనూ! నాలో ఒకప్పుడున్న కవితా శక్తిని ఖూనీ చేసి పారేసింది వాడుకాదూ? వెధవ....ఇంతా చేసి ఏమీ యెరగనట్టు రాసుకో, ఫో! అంటున్నాడు."

"కామేశం, నాలిక జాగర్తగా తిప్పు నాయనా! నా కోపం వచ్చేయ్‌గల్దు!" వార్నింగ్ పడేశాడు బాబి.

"ఏడిశావ్, వెధవా! పత్రికలు కొందాంరా అంటే, రమణీ-లలనా అన్నావ్! శ్రీశ్రీని కొందాంరా అంటే మధుని తెచ్చి పడేశావ్! నాలోని కవితాధార చివరంటా ఇంకిపోయేలా చేసిపారేశావ్! హుం!"

"ఇంతకీ యిప్పుడొచ్చిన నష్టమేమిటి కామేశం?" బుజ్జగింపుగా అడ్డు తగిలాను. మళ్ళీ దారికొచ్చాడు వాడు——

"ఇప్పుణ్నే నర్జంటుగా ఓ కవిత రాయాలి——"

"ఆ ముక్క రూములోకొస్తూనే చెప్పావ్-ఇహ కారణం ఏడువ్" విసుక్కున్నాను.

"చెప్తాన్రా! ఇవాళ కాలేజీలో ఓ గొప్ప రహస్యం తెలిసింది. రహస్యం గనుక ఎవరికీ చెప్పనని మాట యిస్తేనే...."

"సరే! నీకు మాట యిచ్చి చెప్పించుకోవలసినంత అవసరం నాకు యేముందీ? చెప్పకు...."

"అబ్బ! అలాగనకురా! సరే చెప్తానుగానీ-ఎవళ్ళతోనూ అనకేం! సంధ్య....కవిత రాసిందిటరా!"

"ఎవరు?....సంధ్యా!....సరే రాస్తే?"

"అబ్బ! మిడిల్లో రాబోకు. మన కాలేజీ మాగజైన్‌కి కవితలిమ్మన్నారు కదా! మొట్టమొదటి కంట్రిబ్యూషన్ సంధ్యదేనుట! విప్లవాత్మకమయిన గేయం ఒహటిచ్చిందిట నిన్ననే!

అయ్యో, నేనింకెలా ఆగన్రా? ఇంకా ఓ గేయం రాయకుండా యెలా బ్రతకన్రా?"


"అబ్బబ్బ....ఆగరా! అసలామె గేయం సెలక్టవుతుందని గ్యారంటీ ఏమిటి? అయినా, ఎవర్చెప్పారు నీకీ సంగతి?"

"రాజుగాడు. అదేరా, మాగజైన్ కమిటీ మెంబర్! నిన్న సాయంత్రం ఎడిటర్స్ ఫైల్లో చూస్తే-వుందిట!

అయినా యింత త్వరగా యెలా రాసిందిరా-నాల్రోజులైనా కాలేదు నోటీసిచ్చి...."

"లేకపోతే గేయాల్రాసేవాళ్ళకూడా నవలాకారుల్లాగా నెలల తరబడి రాస్తారనుకున్నావా?" బాబిగాడు కామెంట్ విసిరాడు.

"నే బజారుకెళ్తున్నా. కాయితాలూ, ఇంకు బాటిలూ కొని తెచ్చుకోవాలి...." బాబిగాడి కామెంట్ విననట్టే, బయటికి పరిగెడుతూ అన్నాడు కామేశం.



"ఇంతోటి రచనకి రూములో వున్న ఇంక్ పనికిరాదు క్కాబోలు" మళ్ళా రమణిలో దూరాడు బాబిగాడు.

కామేశం బయటికి వెళ్ళగానే జరిగిన దృశ్యం ఓసారి నెమరవేసుకుని వులిక్కిపడ్డాను! కొంపదీసి కామేశంగాడు కవితా రచన్ని పునరుద్ధరిస్తున్నాడా!!

* * *

కామేశం చిన్నప్పుడు కవితల్రాశానంటూ రూములో చేరిన కొత్తల్లో తెగ ఉద్ఘాటించేవాడు. అయితే బాబిగాడూ, నేనూ సదరు కవితలు ప్రచురించబడిన పత్రికలు చూపించమంటూ పోరగా—సదరు అవేవీ ప్రచురితం కాలేదన్న సత్యాన్ని అంగీకరించాడు. కానీ, అందుక్కారణం మాత్రం పత్రికా సంపాదకుల అసమర్థతేగానీ, తన కవితల్లోని భావ దారిద్ర్యం కానే కాదని వక్కాణిస్తూ వుండేవాడు.

అప్పుడప్పుడు, ఏ అర్ధరాత్రివేళనో లేచి కూర్చుని ట్యూబులైటు వెలిగించి, రెండు మూడు లైన్లు గిలికేవాడు. ఇహ అక్కడనించీ మొదలెట్టేవాడు—

"రావైతివే ప్రియా—రయముతో
నను చేర
చేరి రంజింపవే—నా హృదయ
సీమలన్!
రావైతివే ప్రియా....ప్రియా...."

అంటూ నెమ్మదిగా ఎత్తుకుని, పైపైకి పోయి, చెవి కోయబడ్డ మేకల స్థాయికి చేరుకునేవాడు.

ఒకరోజు ఓర్చుకున్నాం. రెండోరోజు సహించాం. ఇక మూడోసారి మంచంమీద నుంచి తాడెత్తున లేచాడు బాబిగాడు.

"ఒరే కాముడూ!నీ దిక్కుమాలిన కవిత్వ సాధన వొదిలిపెడతావా? పెట్టే బెడ్డింగ్‌తో

సహా నిన్ను హాస్టలు బయటికి విసిరేయమంటావా?"

"అది కాదురా! ఈ నిశ్శబ్ద నిశీధిలో నా కవిత్వ సాధన నిరాటంకంగా...."

"అలాగైతే వూరి బయటికి పో! నక్కలు కూడా తోడుంటాయి! ఇలా రూముల్లో కూచుని మా దుంపతెంచావంటే జాగ్రత్త!"

దాంతో, పాపం, కామేశం కవిత్వం ఆగిపోయింది. అప్పట్నించీ బాబిగాడు వాణ్ణి రుద్దటం ప్రారంభించాడు.

"ఈ రోజుల్లో కాలేజీ స్టూడెంట్స్‌కి అమ్మాయిలూ-ప్రేమాయణాలూ ముఖ్యంగానీ, కవిత్వాలూ-కథలు కాదు నాన్నా! అంచేత నా మాట విని, "ప్రేమించడం ఎలా?", "సక్సెస్ ఇన్ కాలేజ్ విథిన్ సింగిల్ టరమ్" లాటి గ్రంధాలు చదువు. థియరీ పూర్తయ్యాక ఏ కోమలాంగినో చూసుకుని ప్రాక్టికల్ ప్రారంభించు. నా గైడెన్స్ ఎప్పుడూ వుంటుంది నీకు!" అంటూ వాడిని బాట మళ్ళించాడు.

అనతి కాలంబుననే సంధ్యారాణి యను చిన్నదానియందు మనంబు కుదిరినవాడై, ఆమె అనుగ్రహంబుకై పడరాని పాట్లు పడుచున్న తరుణంబున....

సంధ్య కవిత రాసినట్లు కబురు తెలిసిందన్నమాట!

ఆంజనేయ దండకం పుస్తకంకోసం నా పుస్తకాల రాక్ అంతా వెతకడం మొదలెట్టాను.

*　　*　　*

ఆ రాత్రి మెస్సులో భోజనాలు పూర్తి కాగానే సినిమాల ఇంటర్వెల్ టైముని సైతం లెక్కజెయ్యకుండా నరాసర్రూముకొచ్చేశాడు కామేశం. బాబు మాత్రం డ్యూటీమీద సినిమా హాల్స్ దగ్గరకు వెళ్ళిపోయాడు. నేనొక్కడినే రూమ్‌లో వున్నాను.

ఒస్తూనే గబగబ నాలుగైదేళ్ళనాటి పత్రికలు తిరగేశాడు. శ్రీశ్రీ బొమ్మ వోటి వెతికి చింపుకున్నాడు. వాడి స్టీల్ ఫ్రేమ్‌లోని జయసుధ ఫోటో తీసి లోపల పడేసి, శ్రీశ్రీని అక్కడ కూచోపెట్టాడు.

కాయితాలూ, కలం చేతబుచ్చుకుని టేబిల్ ముందు కూచున్నాడు. స్వాగతంలాటి భాగోతం ప్రారంభించాడు.

'యూస్‌లెస్ ఫెలో! బాబిగాడి పరిచయం కలక్కండా వుంటే ఈ పాటికి ఆరుద్ర, ఆత్రేయ లెవెల్లో వుండేవాణ్ణి! కాలేజీవాళ్లు స్వయంగా గేయం అడిగి రాయించుకునే వాళ్ళు....

ఇవాళ మళ్ళీ మొదటినించీ మొదలెట్టాల్సిందే!

తలరాత తప్పించ ఎవరి తరము?...."

నేను జవాబు యివ్వకుండా బెడ్డెక్కేశాను.

*　　*　　*

మర్నాడు....

క్లాసుకి రాలేదు కామేశం. సాయంత్రంవేళ మాట్నీల ఇంటర్వెల్లుందంటూ అటే వెళ్ళిపోయాడు బాబు. నేను రూమ్‌కొచ్చేసరికి....

కిచెన్లోంచి పొగ వస్తున్నట్టు పొగ వస్తోంది గదిలోంచి. భయం, భయంగా గది తలుపు నెట్టాను. గదిలో కామేశం లేడు!

వాడి టేబుల్‌ముందు మాత్రం యెవరో ఒకాయన లాల్చీ, లూజు పైజామా ధరించి కూర్చుని వున్నారు. ఆయన సృష్టించినదే ఈ పొగంతా అనటానికి నిదర్శనంగా ఆయన చుట్టూ సిగరెట్ పీకలు గుట్టలుగాపడున్నాయి. ఆయనముందు అగ్గిపెట్టెలున్నాయి. ఓ పెట్టె ఎడంచేతిలో వుంది. కుడిచేతిలో కలముంది. ఎదరగా యాష్ట్రే వుంది. అందులో సగం కాలిన సిగరెట్టుంది.

నెమ్మదిగా కళ్ళు నులుముకుంటూ అడిగాను—

"మా కామేశం లేడాండీ?"

ఒక్కసారి తలెత్తారాయన. కళ్ళజోడు పై నుంచి నన్ను వీక్షించారు.

"ఒరే, వెధవ్వేషాలెయ్యక లోపలికి తగులడు!" అంటూ అరిచారు.

అదిరిపడ్డాను.

"అరె! నువ్వేనుట్రా? ఏమిటీ వేషం? ఈ

సిగరెట్లేమిటి? ఆ అగ్గిపెట్టెలేమిటి?" కంగారుగా అడిగాను.

"వేషమేముందిరా? లాల్చీ, కళ్ళజోడేగా నువ్వనేది? కళ్ళజోడు పాతదే—గేయాలు మానేశాక పెట్టట్లేదు. ఇసా లాల్చీ అంటావా —మరి కవులకి లాల్చీ వుండొద్దూ?"

"ఏడిసినట్టుంది. మరి ఈ సిగిరెట్లు...."

"గురువుగారి అడుగు జాడల్లో నడవాలని-ఇవాల్టినుంచే ప్రాక్టీసు ప్రారంభించాను."

"ఎవడా గురువు?"

"నోర్మూయ్. ఎవ'డా?' శ్రీశ్రీ! వారెప్పుడూ ధూమపానం చేస్తుండబట్టే అంతవారయ్యారు! మరి నేనూనూ...."

"తగలడ్డట్టేవుంది! ఆ అగ్గిపెట్టెలెందుకు మరి?"

"అవి నా కవితా వస్తువులు! అగ్గిపుల్లా, కుక్కపిల్లా....అన్నారు గురూగారు! తేలిగ్గా వుంటాయని అగ్గిపుల్లలమీద మొదలెట్టాను. వింటావా?"

"తంతానొరే, నా జోలిగ్గానీ వచ్చావంటే! నీ ఇష్టంవొచ్చినట్టు ఆ మూలే ఏడువ్!"

"బాబిగాడెలాగూ వినడు. పొద్దుణ్ణించి కాఫీలమీద బతుకుతూ రాస్తున్నాను! కాస్త నువ్వయినా వినరా...."

నా అనుమతితో ప్రమేయం లేకుండానే మొదలెట్టాడు కామేశం—

"మండుతూ, మండిస్తూ........

అనాగరికాన్ని ఖండిస్తూ........

(ఇక్కడ సిగిరెట్లు వెలిగించటమే అనాగరికాన్ని ఖండించటం అన్నమాట—అంటూ వివరించాడు—)

పేదల గుండెల ఆకలి మంటల్ని
గుండీలు విప్పి చూపిస్తూ
నెత్తురు కక్కుతూ మండే
ఓ అగ్గిపుల్లలారా!
వెలుగు చూపించరా! జగతిరక్షించరా!"
ఇక్కడ యతి చూశావ్...."

"యతీలేదు-ప్రాసాలేదు. నా మతి పోగొడుతున్నావొరేయ్! నువ్వు మారావా? నన్ను పొమ్మన్నావా?" కంయ్‌మంటూ అరిచేసరికి, నేను సీరియస్ కావటం అరుదేమో, బూచాడిని చూసినవాడిలా జడుసుకుని వూరుకుండిపోయాడు కామేశం.

మర్నాడు కాలేజీక్కూడా కవికుమారుడి ఫోజులోనే వచ్చాడు కామేశం. నోట్సుల్తో పాటు నిన్నరాసిన కాయితాలుకూడా తీసుకొచ్చాడు.

తెలుగు క్లాసు జరుగుతోంది. సంధ్యవేపే చూస్తూ కూర్చున్నాడు కామేశం. 'నలదమయంతి' చెప్తున్న లెక్చరర్ కామేశం ధోరణి గమనించి, సడెన్‌గా—

"కాబట్టి—హంస రాయబారంలో వుద్దేశమేమిటోయ్?" అంటూ వాడినే ప్రశ్నించారు. కామేశం తడుముకోకుండా లేచి నిలబడి,

"తాను కాలుతూ జగతిని వెలిగించటం సార్!" అనేశాడు. సంధ్యతోసహా అందరూ గొల్లున నవ్వారు.

దాంతో నాకు స్థిరంగా తెల్సిపోయింది—కవిత పూర్తికాందే వీడు మామూలు మనిషి కాడని!

క్లాసు కాగానే తెలుగు లెక్చరర్ని ఫాలో అయ్యాడు. నన్నూ తోడు రమ్మన్నాడు. తప్పలేదు నాకు.

తెలుగు లెక్చరర్ని పదినిముషాలు బోరి, పద్యాలు వినిపించాడు. అభిప్రాయం చెప్పమంటూ నిల్చొశాడు! ఏం చెబుతాడాయన? పాపం, ఆవదం తాగిన మొహంతో,

"ఇలాక్కాదోయ్, కాస్త జీవం వుండాలి కవితలో...." అన్నాడు.

గతంలో వాడి కవితల్ని తిప్పికొట్టిన సంపాదకులు మొదలు ఇవాల్టి కవితని విమర్శించిన తె. లె.గారి వరకూ రసవిహీన హృదయులందర్నీ ఖండిస్తూ క్లాసుకొచ్చి పడ్డాడు కామేశం.

ఆరోస్సాయంత్రం రూము కెళ్తుంటూనే భయంవేసింది-ఓ క్లాసు ముందే వెళ్ళిపోయిన కామేశం రూములో ఏ ప్రళయం సృష్టిస్తున్నాడో-అని! తీరా రూముకెళ్ళేసరికి,

(వి)చిత్ర విజ్ఞానం



చింపంజీలు తమ పళ్ళను ఎంతో శుభ్రంగా వుంచుకుంటాయి. టులేన్ యూనివర్సిటీ జంతు శాస్త్రజ్ఞులు, చింపంజీలు పుల్లలతోనూ, వేళ్ళతోను పళ్ళు తోముకోవడం గమనించారు. పెద్ద చింపంజీలు, తమ పిల్లలకు పళ్ళు తోముకోడం నేర్పిస్తాయట. పుచ్చి పళ్ళను జాగ్రత్తగా ఊడ బీకేయడం కూడా చేస్తాయట!

తాళంకప్ప దర్శనమిచ్చింది!

'అరె! వీడెక్కడికెళ్ళాడబ్బా? రూంలో వుండి నన్నేకాక, వూరిమీదబడి జనాన్నికూడా చంపుతున్నాడా?' అనుకుంటూ తలుపులు తెరిచాను.

ఆరాత్రి పడుకునేదాకా రూముకి రాలేదు వాడు. ఏ అర్ధరాత్రి వేళొచ్చి ఏం కొంప ముంచుతాడోనని భయపడుతూనే పడుకున్నాను.

'కుయ్యో' మన్న అరుపూ, 'ఛయ్. ఛయ్' మన్న కేకా వింటూనే నిద్రలోంచి ఉలిక్కిపడి లేచాను. గదంతా చీకటిగా వుంది.

ఏవో రెండు చింతనిప్పులు కదుల్తున్నాయి పక్కనున్న బెడ్ మీద!

ముచ్చెమట్లు పోశాయి. దెయ్యం.... దెయ్యమొచ్చింది గదిలోకి!

"బాబోయ్" గట్టిగా కళ్ళుమూసుకు కేక పెట్టాను.

'టప్'మని లైటు వెలిగింది.

"ఏమిట్రా ఆ కేక?" మెల్లిగా వినబడింది కామేశం గొంతు.

కళ్ళు తెరచాను భయం భయంగా.

ఎదురుగా కనిపించాడు కామేశం. వాడి చేతిలో ఓ గొలుసుంది. ఆ గొలుసుతాలూకు రింగుకి ఓ కుక్కపిల్ల మెడ తగిలించివుంది.

నే చూసిన రెండు నిప్పులూ దాంతాలూకు కళ్ళు!

ఒళ్ళు మండిపోయింది!

"ఏమిట్రా ఇదంతా? ఇప్పుడు రావటమేమిటి? ఆ కుక్కపిల్లేమిటి? ఏమిటసలిదంతా?"

బెదురుగా అన్నాడు వాడు,

"ఏం లేదురా! ఊరంతా తిరిగి, బయటి గూడెంలో పట్టుకున్నాను దీన్ని! సాయంత్రమంతా సముద్రపొడ్డున కూచుని దీంతో ప్రాక్టీస్ చేసి కొన్ని గేయాల్రాశా!

ఇహ ఫినిషింగ్ టచప్ ఇచ్చి...."

"ఒరేయ్! దయచేసి దాన్ని తీసుకు బయటికెక్కడికన్నా పో నాయనా!...."

దానివంక చూసి వణుకుతూ అన్నాను.

"నీకేం ఫర్లేదురా! నువ్ కళ్లు మూసుకు పడుకో. నే చూసుకుంటా దాన్సంగతి!"

ఓరి వీడి ధైర్యం కూల! బాబిగాడు లేకపోవటంతో ఎంతకి తెగించాడు!

తలనిండా ముసుగు బిగించాను. రాత్రంతా 'కుయ్ కుయ్' మన్న కుక్కపిల్ల అరుపుతో నిద్రపట్టనేలేదు.

తెల్లారి లేచేసరికి, కామేశం బాత్రూంలో వున్నాడు. కుక్కపిల్ల వరండాలో కట్టేసి వుంది.

'ఏం పద్యాలార్శాడు దానిమీద?'

చూద్దామనిపించి, వాడి ఫైల్ తెరిచాను—

"అరుస్తా-అరుస్తా-కుయ్ కుయ్ మని
అరుస్తా

ఖండిస్తా-ఖండిస్తా-అన్యాయం ఖండిస్తా!
కరుస్తా-కరుస్తా-దుండగుల్ని కరుస్తా!
రక్తపు చేరులు పారగ విద్రోహుల
కరుస్తా!
రక్తం ప్రవహింపజేసి విప్లవాగ్ని రగిలిస్తా
విప్లవ జ్వాలల వెలుగున దేశాన్నే
వెలిగిస్తా...."

ఇంతలో వచ్చేశాడు వాడు—

"చూస్తున్నావా? చూడు, చూడు. ఎలా గుంది కవిత్వం? బాగా వొచ్చింది కదూ?"

గబుక్కున టవలందుకుని బాత్‌రూమ్‌వైపు పరుగుతీశా, ఇంకో క్షణం వుంటే మిగిల్నవి కూడా చదివి వినిపిస్తాడేమో!

స్నానం చేస్తూవుంటే, ఓ అనుమానం వచ్చింది. 'అగ్గిపుల్లా కుక్కపిల్లా అయ్యాయి కదా-ఇహ వీడు సబ్బుబిళ్ళలమీద పట్టించడు కదా!' వెంటనే ధన్‌మని దాన్ని బాక్సులోవేసి మూసేసి రూమ్‌లోకి పోగానే నా పెట్టెలో పడేశాను.

ఆవేళ వాడు తెలుగు లెక్చరర్ని వెంబడించాడు. ఐతే, నన్ను పిలవలేదు—బతికిపోయాను! ఆయనేమన్నాడో ఏమోగానీ వాడింక క్లాసుకే రాలేదు.

ఆరోజు సాయంత్రం గదికి రాలేదు. పైగా, గోరుచుట్టు మీది రోకటిపోటులా కుక్కపిల్లా హాటీ! గదిముందే కట్టేసుండటంతో, దాని అరుపులికి నా మతిపోతోంది.

ఓ అరగంట ఓర్చుకున్నాను.

"ఏవాఁయ్! కామేస్రావ్!"

ఎవరో ఉరిమారు రూంబయట.

అదిరిపడి బయటికొచ్చాను.

అక్కడో పెద్ద పులి నుంచునుంది. దాని పేరు మా వార్డెన్!

"ఏవిటోయ్, కామేసర్రావ్ లేడూ?" ఆయన గర్జించాడు.

"లె....లె....లేడండి."

"ఈ కుక్కపిల్లేమిటి? ఈ గోలేమిటి? మీ పక్కరూముల్లో వాళ్ళంతా రిపోర్టిచ్చారు. ఒహటే గొడవట రాత్రినించీ?"

"ఏ....ఏ .... ఏంలేదండి! మావాడు.... కుక్కపుల్ల....అగ్గిబిళ్ళ....కవిత్వం...."

"ఇదిగో, నువ్ దాన్ని ముందు బయటొదిలేసిరా!"

"అమ్మో" కెవ్ మన్నాను.

"ఏవోఁయ్-తేవటానికి లేని భయం...."

"నే కాదండి. వాడేనండి. రాత్రేనండి. నే పట్టుగోలేక...."

పావుగంట గడిచేక, కామేశ్వర్రావ్ రాగానే దాన్ని విడిపించేస్తానన్న అండర్‌స్టాండింగుకొచ్చేక, వో అల్టిమేటం తిసిపించి మరీ కదిలేడాయన!

కామేశాన్ని నమిలి మింగుతూ పడుకున్నాను.

పదిన్నర కావొస్తుండగా ముందసుగా విజిలూ, ఆనక కామేశమూ గదిలో కొచ్చేశాయి.

అరికాలిమంట నెత్తికెక్కింది నాకు.

"ఏమిట్రా బోడిపోజులూ నువ్వూనూ? ఎక్కడ తగలడ్డా వింతసేపు? సాయంత్రం వార్డెనొచ్చి కరిచి వెళ్ళాడు నన్ను....!"

"ఒ.కె. డోంట్ వర్రీ...." అంటూ గబుక్కున బయటికి నడిచి కుక్కపిల్లని బంధించిన గొలుసు వూడదీసి, ఆర్యభట్టులా దూసుకు పోతున్న దాన్ని చూసి నవ్వుతూ లోపలికొచ్చాడు వాడు.

నా మతిపోయింది.


"ఏమిట్రా మాంచి వూపు మీదున్నావ్? నీ కవిత్వం గినా సెలెక్టయిందేమిటి?" కంగారుగా అన్నాను. ఆ మేగజైన్ నాకూ వస్తుంది మరి!!

"అదేం లేదురా! బోడి కవిత్వం అదెలా సెలెక్టవుతుంది? అయినా వెధవ కవిత్వం సెలెక్టు కాకపోతేనేం?"

ఇదేమిటి, వీడి ధోరణి ఇలా మారిపోయింది?

"అదేమిట్రా? మరి సంధ్య...."

"ఆఁ నా మొహం! అసలు ఆ గేయం రాసింది సంధ్యకాదు. సి సెక్షన్‌లోని యస్.



దయానిధిట! కలం పేరుగా 'సంధ్య' అని పెట్టుకున్నాట్ట?"

సంధ్య కసలు పత్రికల్చదవటమే ఎలర్జీట! కవిత్వమంటే డోకుట....

ఇవేళ సంధ్యతో మాటాడేనా?!"

"సంధ్యతోనా?" ఆశ్చర్యపోయాను.

"మధ్యాన్నం తెలుగు లెక్చరర్ నా పద్యాల్చూసి, ఇలా నన్ను బోరావంటే మంచి కవిత్వం రాసినా వేసుకోనంతే'' అన్నారు. ఎలాగరా అని చింతిస్తూ, రాజుగాణ్ణి పట్టాను. ఎలాగయినా సంధ్యతో మాట్లాడితే ఆ కిటుకే వ(న్నా తెలుస్తుందేమో, లంచ్ తర్వాత సంధ్యని కల్సుకున్నాం.

"కవిత్వం ఎలా రాశారో కాస్త చెప్తారా- అని రాజుగాడిచేత అడిగించాను. అప్పుడు బయటపడింది అసలు విషయం! తర్వాత ఫైల్లో చూస్తే-ఆ కవిత్వం రాసినవాడు...."

"సర్సరే! ఇహ బోరకు. ఇంతకూ ఇప్పుడెక్కడినించి?"

"ఫస్ట్ షో....నేనూ సంధ్యా సాయంత్రం ఫస్ట్ షోకి వెళ్ళాం!''

"అఁ!....అప్పుడే...."

"ఆఫ్‌కోర్స్! సంధ్య వాళ్ళ, ఫ్రెండ్స్ మూడున్నర టికెట్‌కి వెళ్ళారు! మనం కాస్త ఆర్థిక ఇబ్బందుల్లో వుండట్టి, రాజుగాడితో కలిసి టూ నైంటీకే వెళ్ళాం....! మొత్తం మీద వెళ్ళింది మాత్రం ఒక్క సినిమాకే! త్వరలోనే కలిసి కూడా వెళ్తామనుకో.... ఎందుకంటే ఇంటర్వెల్లో సంధ్య నన్ను చూసి నవ్వింది!"

"ఊఁ....కవితా సాధన వదిలి సంధ్యోపాసన ప్రారంభించా వన్నమాట!''

"అసలు కవితా సాధనే సంధ్యకోసం కదా!"

ఈలవేసుకుంటూ బట్టలు మార్చుకోసాగాడు కామేశం!

'ఏదయితేనేం-ఈ ప్రళయం ఇంతటితో ఆగిందికదా!' అన్న ఆనందంతో కంటినిండా నిద్రపోదామని ముసుగు తన్నాను!

దేవుడే శిక్షించాడు

శ్రీశ్రీశ్రీ వినయానంద స్వామీజీ విజయం చేసే ట్రెయిన్ మూడు గంటలు లేటు! స్తంభాన్ని ఆనుకొని ఎదురుచూస్తున్న వెంకట్రావుకు విసుగు కలిగింది. నిజానికి అతని మనసు మనసులో లేదు. కారణం? ఎప్పుడూ లేనిది అతడివాళ భార్యమీద చేయి చేసుకున్నాడు. చేసుకోడూ మరి! ఆమె ఎన్నెన్ని మాటలంది! తనను అంటే ఫర్వాలేదు. కాని తాను దైవంగా భావించే శ్రీవారినే శంకించి అనరాని మాటలంది. కళ్ళు పోవూ? ఆమెను కొట్టి, బాగా బుద్ధి చెప్పాడు తను.

మంచి పనిచేసినట్లు నమ్మబోయాడు వెంకట్రావు; కాని అతని హృదయం కాదంటున్నది. వరలక్ష్మి లాంటి భార్య దొరికినందుకు అతడెన్నో సార్లు గర్వించాడు.

ఆమె అందగత్తె. అనురాగమయి. "అది కావాలి; యిదికావాలి" అని యాగీచేయదు. భర్త, భార్యలో కోరుకునే సకల సద్గుణాలూ ఆమెలో వున్నాయి.

ఆలోచనలు ఆమెవైపు మళ్ళగానే— అలాంటి దేవతనా కొట్టావు?—అని హృదయం అతనిని నిలదీసింది!

"బాబూ, ధర్మం చెయ్యి బాబూ...."— బిచ్చగాని ఆక్రందన. చెవిలో రొద! ఆలోచన తెగిపోయి, వళ్లు మండింది వెంకట్రావుకు. "పొమ్మంటే నీక్కాదూ?" అని విసుక్కున్నాడు. వాడెంతకూ కదలకపోతే తనే బయటకు నడిచాడు.

కారువద్ద నిలబడి బీడీ కాల్చుకుంటున్న డ్రైవరు, వెంకట్రావు రాగానే "బాబూ, బండి లేటు కాబోలు. అలా వెళ్ళి యిప్పుడే వస్తా" నంటూ జారుకున్నాడు.

స్వామీజీని మోసే అదృష్టం తనను వరించినందుకు గర్వపడుతూ కలలుకంటున్నది-విమానం అంత-టాప్ లేని కారు! బ్యాండ్ వాద్యగాళ్ళంతా తమ తమ వాయిద్యాలను పరీక్షించుకుంటూ, చెట్లక్రింద కబుర్లు చెప్పుకుంటున్నారు. వెంకట్రావు రాగానే వాళ్ళంతా గౌరవంగా లేచి నిలుచున్నారు.

"సాములోరి బండి నేటుగా రాడం ఏటి సార్! మహిమలు సూపి ఝూమ్మని వచ్చేయక!" అన్నాడొకడు. "ఓరొల్లకోయెహే! సాములారు ఒస్తున్నారని తెలిసి మద్య మద్య తేషన్ల్లో జనాలు బండినాపేసి పూజలు సేస్తున్నారంట. అందుకే నేటయిపోనాది" అంటూ చుట్ట పారేసి తుపుక్కున ఊసాడొకడు.

అక్కడనుండి మరి కాస్త దూరం వెళ్ళాడు వెంకట్రావు. అప్పటికే రోడ్డు కిరువైపులా చేరిన జనాలను పోలీసులు అదుపులో ఉంచుతున్నారు. పురప్రముఖుల కార్లు బారులు తీరి విశ్రాంతిని అనుభవిస్తున్నాయి. యజ

ప్రఫుల్లచంద్ర

మానులు కార్లలోనే కూచుని ట్రెయిన్‌కోసం ఎదురుచూస్తున్నారు. ఒకరిద్దరు వెంకట్రావుని పలుకరించారు కూడా. సాక్షాత్తు లక్షాధికారులు తనను గుర్తించి గౌరవించినందుకు ఆ చిరుద్యోగి చిన్న హృదయం పొంగిపోయింది! హృదయంలోని వరలక్ష్మి తొలగిపోయింది!

దూరంగా ఉన్న చెట్టునానుకొని గతాన్ని నెమరు వేసుకుంటున్నాడు వెంకట్రావు. దైవ చింతన అంతగాలేని అతడు భక్తుడుగా మారడం-అతనికే ఆశ్చర్యం కలిగిస్తూ వుంటుంది.

ఆనాడు అతనికి బాగా గుర్తు.

దినపత్రికలో అతడా వార్త చదవగానే గుండె ఝల్లుమన్నది. అవినీతి నిరోధక శాఖ వలవేసి ఒక ఆఫీసరు లంచం తీసుకుంటూ వుండగా ఎలా పట్టుకున్నదీ వివరిస్తోందా వార్త....అంతే. జేబులోని పది రూపాయిల కాగితం గుండెను కాల్చివేయడం మొదలుపెట్టింది! ఇక ఆరోజు పనిచేయలేకపోయాడు. విషయం తెలుసుకున్న శేషాద్రి ఎంతగానో ధైర్యం నూరిపోసాడు. అతనికేం? నిండా మునిగిన పిండం! అతని ధైర్యం వెంకట్రావు కెలా వస్తుంది? నిజానికి వెంకట్రావుని లంచాలలో ముంచిన దతడే.

ఉద్యోగంలో చేరిన కొత్తలో వెంకట్రావు ఆఫీసులో జరుగుతున్న అన్యాయాలనుచూసి అసహ్యించుకునేవాడు. తనపని సవ్యంగా చేసుకుపోయేవాడు. ఎంత జాగ్రత్తగా చేసినా ఆఫీసరు కస్సు బుస్సు మనేవాడు.



ఎందుకో?

"రోజుకు యిన్ని ఫైళ్ళు పుటప్ చేస్తున్నావ్! ఎంత ముడుతోంది?" అని వ్యంగ్యంగా ప్రశ్నించాడు ఆఫీసరు ఒకనాడు. గుండెలో శూలం గుచ్చినట్టు బాధపడ్డాడు వెంకట్రావు. అప్పుడే శేషాద్రి అతనికి హితబోధ చేసాడు.

"చూడు బ్రదర్....సాధారణం, దారుణం అని లంచాలు రెండురకాలు. రూల్సు ప్రకారం ఆటంకం ఉండదుగాని ఫైలు కదలదు. తోయాలి. అందుకు తైలం కావాలి. ఇది సాధారణం. గుమాస్తా చేతిలో పని. ఇక రూల్సుని అధిగమించి ఫైలు మారుతిలా దూసుకుపోతుంది. అందుకు ఆఫీసరు పూనుకోవాలి. గుమాస్తా లెవెల్లోకాదు. అందుకు లక్ష్మిపూజ జరగాలి. ఈ పూజలో గుమాస్తా పూజారి మాత్రమే. వాటా వుంటుందిగాని స్వతంత్రం వుండదు....ఇదీ దారుణం. కావున ఓ శిష్యా ఇకనుండి ఫైళ్ళను వెంటనే హత్య చేయకు. నీ టేబుల్ మీద ఒక వారం రోజులు హాయిగా బ్రతకనివ్వు. అందువల్ల నువ్వు బ్రతికిపోతావ్." ఈ హితబోధను వెంకట్రావు చెవిలో పెట్టినా, మదిలో పెట్టలేదు!

పాపకు హఠాత్తుగా జ్వరం వచ్చింది. వరలక్ష్మి ధర్మాసుపత్రిలో రోజంతా పడిగాపులు పడితే వాళ్ళిచ్చిన రంగునీళ్ళవల్ల జ్వరం మరింత ఎక్కువైంది. ప్రయివేటు డాక్టరు రాసిన మందులు కొనడాన్కి డబ్బులేక, అప్పు చేయడం యిష్టంకాక, అడ్వాన్సు కావాలని వెంకట్రావు ఆఫీసరుగార్ని అడిగితే "రూల్సు ఒప్పుకోవని" నిక్కర్షగా చెప్పాడాయన!

శేషాద్రి, విషయం గ్రహించి వెంకట్రావుని క్యాంటీన్‌కు లాక్కుపోయి దూరంగా వున్న ఒక పెద్దమనిషిని చూపుతూ చెవిలో గుసగుస లాడాడు. అతని జేబులో 20 రూపాయిల నోటు దూర్చి "సాధారణం!" అని నవ్వాడు.

అంతే. వెంకట్రావు జీవితంలో అదొక మైలురాయి!

రోజులు గడుస్తున్నవి. జేబులు నిండుతున్నవి. కడుపునిండా తిండి, మంచి బట్టలు. వారానికొక సినిమా.

బంధువర్గంలో అతని పరపతి యిప్పుడు పెరిగిపోయింది. ఊళ్ళో ఒక గుర్తింపూ గౌరవం లభించాయి. అంతా బాగానే వుంది.... కాని....

ఏ పాప ఆరోగ్యంకోసం అతడు లంచం మరిగాడో ఆ పాప ఆరోగ్యం బాగుపడనే లేదు. తింటుంది. తిరుగుతుంది. ఆడుకుంటుంది...."అమ్మయ్య!" అనుకునేంతలో మళ్ళి సుస్తీ చేసి మంచం ఎక్కుతుంది.

మళ్ళి డాక్టర్లూ, మందులూను.


అసలు పాపకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందా-అని అనుమానం! ఆ అనుమానం వెనుక-అన్యాయార్జితం యిలానే హరించుకుపోతుందన్న భయం-ఆ భయం వెనుక-తను చేస్తున్న అన్యాయానికి ప్రాయశ్చిత్తం పాప అనుభవిస్తున్నదేమో నన్న బాధ!

అందువల్ల లంచం పట్టినప్పుడల్లా మనసు చివుక్కుమంటూనే వుంది. మనశ్శాంతి పోతూనే వుంది. పైగా ఆనాడు పేపర్లో ఆ వార్త చదివాడు! శేషాద్రి ఎంత ధైర్యం నూరిపోసినా అతని మనసు స్థిమిత పడలేదు. తను పట్టుబడి, తన ఉద్యోగం ఊడితే! హేయ్ రామ్!!

వెంకట్రావు ఆఫీసునుండి యింటికి వెళ్ళగానే పాపకు మళ్ళీ జ్వరం వస్తోందని చెప్పింది వరలక్ష్మి. గుండెల్ని కాల్చివేస్తున్న పది రూపాయిలనోటు తీసి ఆమెకిచ్చి ఉసూరుమని వాలుకుర్చీలో కూలిపోయాడు. అతని మనసుకు విశ్రాంతి లభించలేదు. మనశ్శాంతి వెదుక్కుంటూ అతడు పార్కుకి వెళ్ళాడు కాని అతని చుట్టూ ఉత్సాహం! అతనిలో శూన్యం!! చుట్టూ అందమూ, ఆనందమూ. కాని అతనిలో బాధ!

విసిగిపోయి టౌనుహాలు వైపు బయలు

దాగుడుమూతలాడుకొందామా? బావా??



దేరాడు. అక్కడెవరో స్వామీజీ ఉపన్యసిస్తున్నారు. నిలబడే విన్నాడు వెంకట్రావు.

మృదు గంభీరమూ ఆకర్షణీయమూ అయిన స్వరంతో-చిన్నపిల్లలకు కూడా అర్థం అయేట్టు హిందూమత ప్రాశస్త్యం, పాప పుణ్యాలు, దైవకృప గురించి స్వామీజీ అనర్గళంగా ఉపన్యసిస్తున్నారు. వెంకట్రావు నాస్తికుడు కాకపోయినా, ఎప్పుడూ గుడికి వెళ్ళలేదు. ఇలాంటి వుపన్యాసాలు అసలు వినలేదు. కాని యిప్పుడు వింటూ వుంటే ఏదో తన్మయత్వం కలిగిం దతనికి. ఆ తన్మయత్వంలో "హేయ్‌రామ్! నేను చేస్తున్న అన్యాయాలకు నన్నే శిక్షించు. పాపను రక్షించు" అని మనసులోనే ప్రార్థించుకున్నాడు. విచిత్రంగా అతని మనసుకు ఊరట లభించింది.

అంతే. ఆనాటినుండి వెంకట్రావు పరమ భక్తుడు అయాడు. చెవిలో పూవు, నుదుట తిలకం పెట్టుకోకపోయినా రోజూ పూజ చేయడం ప్రారంభించాడు. మనసు బాగులేక పోతే-సినిమాకు కాదు-గుడికి వెళ్తాడు. భక్తి ఉపన్యాసాలు మిస్ అవడు. తప్పనిసరిగా సినిమాకు వెళ్ళవలసివస్తే "భక్తి సినిమా"లకే వెళ్తాడు. పట్నంలోని ఒక ఆస్తిక సంఘంలో సభ్యుడై ఏకాహాలూ, సప్తాహాలూ భజనలూ నిర్వహించడంలో ప్రముఖ స్థానం వహిస్తున్నాడు. ఆఫీసు పనిమీద అతనివద్దకు వచ్చేవారు-ఇంత చిన్నవయసులో ఎంత భక్తి! పూర్వజన్మ సుకృతం!-అని అతనిని పొగడి "పూజ ఖర్చుకు యిది వుంచండి" అంటూ పదో, పరకో చేతిలోపెట్టి పనులు జరిపించుకునేవారు! లంచం, పూజఖర్చుగా మారింది. భక్తి బాధను పారద్రోలింది! వెంకట్రావు పూజఖర్చు భారీగా వసూలు చేయడానికి కూడా బాధపడటం లేదిప్పుడు. ఆఫీసరు కూడా ప్రసన్నంగానే వుంటున్నాడు. వారింట్లో వ్రతంగానీ పూజగానీ వుంటే వెంకట్రావుని తప్పక ఆహ్వానిస్తున్నాడు. వారి భార్యామణి కూడా అతనిని గౌరవించి, పూజకు కావలసిన సామగ్రి లిస్టు యిస్తుందతనికి. డబ్బు యివ్వదు. అతడు అడగడు! కాని కావలసిన సామగ్రి అంతా తెస్తాడు. పూజసామగ్రి మాత్రమే కాదు. కిరాణాకూడా! దేవుడుకూడా వెంకట్రావు తప్పుల్ని క్షమించినట్టే కనిపిస్తోంది. ఎందువల్లనంటే నాలుగైదు నెలలుగా పాప ఆరోగ్యం బాగానే వుంది.

* * *

శ్రీశ్రీశ్రీ వినయానంద స్వామీజీ తమ పాద ధూళితో తమ పట్నాన్ని పావనం చేయనున్నారన్న వార్త ఆస్తిక సంఘాలన్నిటిని పులకరింపజేసింది. అనునిత్యం సమ

క్షంలోవుండి స్వామీజీని సేవించుకోవాలని ఉబలాటపడ్డాడు వెంకట్రావు. స్వామీజీని ఆహ్వానించి, వారికి సకల సదుపాయాలు సమకూర్చి, ఉపన్యాసాలూ, పూజలూ ఏర్పాటు చేయడానికి ఒక సంఘం ఏర్పడింది. వెంకట్రావు ఆ సంఘ సభ్యుడయ్యాడు. ఆ సంఘం-స్వామీజీ విజయం చేసేలోగా వారి దివ్యచరిత్రను ముద్రించడానికి పూనుకొని వివరాలు సేకరించింది.

శ్రీవారు అతిసామాన్య కుటుంబంలో ఉద్భవించారు. చిన్ననాటినుండి నిరంతరం ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా వుండేవారు. చదువు సంధ్యలబ్బలేదు. ఆ చిన్నతనంలో వారు భక్తపోతన సినిమా చూసారు. అంతే. ఆరాత్రి వారికి నిద్రపట్టలేదు. అర్ధరాత్రి అశరీరవాణి "లే నాయనా. నీవల్ల కాగల కార్యం ఒకటున్నది" అని వినిపించింది. వారు లేచారు. ఆకాశంవైపు దృష్టినిడి నడిచారు. ఏదో అదృశ్య శక్తి వారిని నడిపింది. వారు అలా నడిచి నడిచి దండకారణ్యంలో ఎవరూ చొరరాని ప్రదేశాన్ని చేరుకున్నారు. అలసిపోయి అక్కడే కూర్చున్నారు. అంతే. వారు అక్కడనుండి అసలు లేవనేలేదు. నిద్రాహారాలు లేవు. అన్నపానాలు లేవు. అసలు కదలికే లేదు. రోజులు గడిచాయి. ఋతువులు మారాయి. సంవత్సరాలే దొర్లాయి. ఒక రోజు హటాత్తుగా "లే నాయనా, ప్రపంచానికిప్పుడు నీ అవసరం కలిగింది. లే. లేచి ప్రపంచాన్నుద్ధరించు" అని చెవిలో వినిపించింది. వారు లేచారు. వారికి అక్షరజ్ఞానం అంతంత మాత్రమే. పెద్దగా తెలివితేటలూ లేవు. అలాంటి శ్రీవారికిప్పుడు అమోఘ వాక్పటిమ ఏర్పడింది. ఏ ధర్మసూక్ష్మమైనా యిట్టే విశమరిచే నైపుణి దైవదత్తమైంది. దైవమే వారిని ఆదేశించినపుడు శ్రీవారికి యిక లోటేమిటి?

ఆనాటినుండి వారు విరామ మెరుగక ధర్మోపదేశం చేస్తూ దేశాటన మొదలుపెట్టారు. విదేశాలను సైతం తమ పాదధూళితో పునీతం చేసారు. వారేదేశం ఏగినా ఎందు కాలిడినా, ఆ దేశభాషలోనే అనర్గళంగా ఉపన్యసించేవారు. ఎంత అద్భుతం!

విదేశాల్లో మనవారు తెగతాగి నైట్ క్లబ్బుల్లో దొర్లుతూవుంటే వాళ్ళనుద్ధరించడానికి శ్రీవారు అక్కడికి వెళ్ళేవారు. కాని మూర్ఖులైన పత్రికా విలేఖరులు "నైట్ క్లబ్బుల్లో యిండియన్ సాధూ" అంటూ పత్రికల్లో విమర్శించినా శ్రీవారు పట్టించుకోలేదు. చెప్పి చేయిస్తున్నవాడు భగవంతుడే కనుక పాపపుణ్యాలు నన్ను అంటవు— అంటూ శ్రీవారు నైట్ క్లబ్బుల్లో మరింతగా విజృంభించారు.

వారిలో బ్రహ్మ తేజస్సు వుంది. కళ్ళలో అయస్కాంత శక్తి వుంది. స్వరంలో సంగీతమే వుంది. వారిని దర్శించగానే పరవశించిపోతారు ప్రజలు. స్వరం వినగానే వివశులైపోతారు. విదేశీయులను సైతం వారు శిష్యులుగా స్వీకరించి విశ్వమానవులంతా ఒకటే అని చాటారు. విదేశీ శిష్యులు పెద్ద కారుని పూలపల్లకిలా అలంకరించి స్వామీజీకి సూటు తొడిగి ఊరేగించారట. ఈర్ష్యచెందిన మన భారతీయులే "స్వామీజీ సూటు తొడుక్కోడం ఏమిటని?" ఆక్షేపిస్తే శ్రీవారు కోపగించుకోలేదు సరికదా-ఎంతఅమాయకులు మీరు!—అంటున్నట్టు చిరునవ్వు చిందిస్తూ "దేవుడొక్కడేకదా. మరి ఆ భగవంతునికి పులిచర్మం తొడిగి-శివుడు-అన్నాం. చీని చీనాంబరాలు ధరింపజేసి-విష్ణుమూర్తి-అన్నాం. గోచికట్టి-ఏసుక్రీస్తు - అన్నాం. ఈ అలంకారాలను చూసి భగవంతుడు కోపగిస్తాడా? అవన్నీ భక్తుని ఆనందాన్ని సూచించేవేగాని భగవంతుని బాధించేవి కావు. అలాగే నాకు మీరు గోచికట్టినా, కాషాయాలు తొడిగినా, సూటువేసినా-నాకు కోపం రాదు. అలంకారం కన్నా భక్తి ప్రధానం. భక్తుని ఆనందంకంటే భగవంతునికి కావలసిం దేముంది!!" అని సన్నగా తియ్యగా మందలించారట.

ఇక శ్రీవారు ప్రదర్శించిన అద్భుతాలు

అనేకం. చూస్తుండగానే ఫోటోలనుండి తేనె కారేది. సువాసనలు వెదజల్లే విభూతి ప్రేక్షకులమీద వర్షించేది. శూన్యహస్తంలోంచి గడియారం వచ్చేది. కళ్ళు మూసుకొని దైవ ప్రార్థన చేసుకుంటున్న ప్రేక్షకులకు విభూతి రాసి వారివారి యిష్టదైవాన్ని వారికి ప్రత్యక్షమయేట్టు చేసేవారు! వారికి అంతటి అతిలోక శక్తి వున్నది.

శ్రీవారు అమెరికాలో శివాలయం కట్టించడానికి విరాళాలు పోగుచేస్తున్నారు. అయితే అమెరికా శివుడు మన శివుడిలా చర్మం ధరించడు. చర్మం కట్టుకునేవారిని ఎవరు గౌరవిస్తారు? అందుకని శివవిగ్రహానికి సూటు తొడుగుతారు...."

"నంది విగ్రహం బదులు బెంజి కారు పెడతారు కాబోలు!...." పక పక నవ్వింది వరలక్ష్మి. తన్మయత్వంగా స్వామీజీ మహిమల్ని వివరిస్తున్న వెంకట్రావు పాముని చూసినట్టు ఉలిక్కిపడ్డాడు.

స్వామీజీపట్ల అతని తన్మయత్వాన్ని చూసి ఆమెకు తెరలు తెరలుగా నవ్వు వస్తూనేవుంది. కాని ఆమె నాస్తికురాలు కాదు. నిర్మల మనస్సుతో విగ్రహాన్ని గాని, మనసులోనే గాని దైవాన్ని ప్రార్థిస్తుంది. కాని వరాలు అడగడం, దేవుడికి "లంచం" ఇస్తాననడం ఆమె తత్వానికే విరుద్ధం. నలుగురి ముందూ భక్తిని ప్రదర్శించుకొని "భక్తురాలు" అని పిలిపించుకోడం ఆమెకు సుతరామూ యిష్టంలేదు. ఈ మధ్య భర్తలో కలిగిన "భక్తి" నవ్వు పుట్టిస్తున్నదామెకు. అయినా యెప్పుడూ అతనిని హేళన చేయలేదు. కాని యిప్పుడు మాత్రం నవ్వుని ఆపుకోలేకపోయింది. నవ్వుతూనే, స్నేహ మధురిమ నిండిన స్వరంతో "....మీది మరీ చాదస్తం. మీ స్వామీజీకి నిజంగానే మీరు చెప్పిన మహత్యాలన్నీ ఉంటే విరాళాలు పోగుచేయడం యెందుకు? టుప్‌మని లక్షలాది వాచీలు సృష్టించి అమ్ముకుంటే బోలెడు డబ్బు! అదీకాక అమెరికావారి అనుగ్రహంకోసం శివుడికి సూటు తొడుగుతారా?! రష్యావారి మెప్పు కోసం మహావిష్ణువు చేతిలో శంఖ చక్రాలకు బదులు సుత్తీ కొడవలీ పెడతారు కాబోలు! ఇంగ్లీషువారికి నచ్చాలని మహాలక్ష్మికి 'బికినీ' వేస్తారా?....భలే స్వామీజీ....మీ లాంటి అమాయకులుండబట్టే అలాంటి స్వామీజీలు బయలుదేరుతున్నారు...."

గట్టుతెగిన ప్రవాహంలా ఆమె నవ్వుతూనే ఉంది....చెంప ఛెళ్లుమన్నది. అంతే. ప్రవాహం ఆగిపోయింది. కొట్టినందుకామె భర్తను ఏమీ అనలేదు. కాని తోకతొక్కిన త్రాచులా చివ్వున తల త్రిప్పి, నీళ్ళు నిండిన కళ్ళతో అతనివైపు తీవ్రంగా చూచి, గిరుక్కున తిరిగి లోనికి వెళ్లిపోయింది!

ఆమె తీవ్రతను చూచి వణికిపోయాడు వెంకట్రావు. తరువాత తల పట్టుకొని కుర్చీలో కూలబడిన అతనికి పశ్చాత్తాపం లాంటిది కలిగినా, క్షమార్పణ చెప్పుకోడానికి అభిమానం అడ్డు వచ్చింది. అంతే. లేచి స్వామీజీ విడిది ఏర్పాట్లు పర్యవేక్షించడానికి వెళ్లిపోయాడు.

భాగ్యవంతుడూ, భక్తుడూ అయిన ఒక స్మగ్లరు యింట్లో ఏ.సి. గదిని స్వామీజీకి కేటాయించారు. శిష్యులకూ, శిష్యురాళ్ళకు వారివారి ప్రాముఖ్యతనుబట్టి పెద్ద, చిన్న గదులు కేటాయించారు. అతిథి దేవులకు ఏం కావలసి వచ్చినా తక్షణం అమర్చడానికి ఒక డజను మంది వలంటీర్లు సిద్ధపడ్డారు. వారందరిమీదా అజమాయిషీ వెంకట్రావుదే. అక్కడి ఏర్పాట్లన్నీ సరిచూచి అటునుండి అలాగే స్టేషనుకు వెళ్ళాడు. వెధవ ట్రెయిన్ మూడు గంటలు లేటు!

* * *

"రైలు వస్తోంది!" ఎవరో అరిచారు. వాతావరణం ఒక్కసారిగా మేల్కొంది.

బిలబిల లాడుతూ అంతా స్టేషనులోనికి పరిగెత్తుతున్నారు. ఆలోచనలనుండి మేల్కొన్న వెంకట్రావూ పరుగు ప్రారంభించాడు.

"ధర్మం బాబూ!" అంటూ యిందాకటి ముష్టివాడు మళ్ళా యెదురయాడు.

వళ్ళు మండి, వాణ్ణి ప్రక్కకు గెంటి

ముందుకు సాగిపోయాడు వెంకట్రావు.

అంతమాత్రానికే ఆ ముష్టివాడు కింద పడ్డాడు. హడావుడిగా పరిగెత్తుకు వస్తున్న భక్తులు అతనిని త్రొక్కివేస్తున్నారు. వెంకట్రావు, వచ్చి, అతనిని లేవనెత్తాలనుకున్నాడు గాని అప్పటికే ట్రెయిన్ స్టేషనులోనికి వచ్చేసింది. వెంకట్రావు ముందుకే పరిగెత్తాడు.

స్వామీజీ పాదుకల ధూళి పడి రైల్వే ప్లాటుఫాం ధన్యమైంది. భక్తుల జయజయ ధ్వానాలకు బెదిరి చెట్లమీది పక్షులు భయం భయంగా అరుస్తూ చెల్లాచెదరైనవి. స్వామీజీ శరీరం ఎండలో బంగారంలా ధగధగ మెరుస్తున్నది. మొగంలో అందరినీ వివశుల్ని చేసే దరహాసం, సమ్మోహనకర అర్ధనిమీలిత నేత్రాలు.

జన్మ ధన్యమైనట్టు పరవశించిపోతున్నారు భక్తులు. వారు బారులుతీరి దారి చూపుతుండగా —బాహ్యప్రపంచంతో సంబంధం లేనట్టు, కలలో నడుస్తున్నట్టు అలవోకగా నడుస్తూ— వెళ్ళి కారులో కూర్చున్నారు స్వామీజీ. ఇంత హడావుడిలోనూ—కిందపడ్డ ముష్టివాడేమైనాడా అని—చుట్టూ చూసాడు వెంకట్రావు. దూరంగా చెట్టుకింద ఎవరో అతనికి ఉపచారాలు చేస్తున్నట్టున్నారు. "అమ్మయ్య" అని నిట్టూర్చి కారు పక్కకి చేరుకున్నాడు.

మంగళ వాద్యాలతో దిక్కులు పునీతం అయాయి. జయజయ ధ్వనులను అందుకున్న ఆకాశం అదృష్టం పండింది. కారు బయలు దేరింది, అతి నెమ్మదిగా. రెండువైపులా శిష్యులు వింజామరలు వీస్తూ కదిలిపోతున్నారు. వారి ప్రక్కగా సాగిపోతూ, స్వామీజీ పీల్చే గాలిని తానూ పీల్చగలిగిన అదృష్టం పొందినందుకు పులకరించి పోతున్నాడు వెంకట్రావు!

ఇక విడిదిలో అతని హడావుడి వర్ణనాతీతం. కొందరికి ఆజ్ఞలు జారిచేస్తూ మరికొందరి ఆజ్ఞలు శిరసావహిస్తూ ఆ భవనం అంతటా తానే అయి, ఊపిరి పీల్చుకోడానికి కూడా తీరిక లేకుండా, తిరుగుతున్నాడు.

*　　　*　　　*


స్వామీజీ కార్యక్రమాలు పూజలు, చర్చలు ఉపన్యాసాలతో మూడు రోజులలో విజయవంతంగా ముగిసాయి. శ్రీవారు పలుభాషల గ్రంథాలనుండి ఉదహరిస్తూ తమ వాదనా చమత్కృతితో సునిశిత హాస్యంతో గంభీర పద జాలంతో ప్రజల హృదయాలపై చెరగని ముద్రవేసారు. ప్రవాహంలా ప్రజలు ప్రక్క గ్రామాలనుండి కూడా బళ్ళలో వచ్చి పది రూపాయిలు ముడుపు చెల్లించి శ్రీవారి పాదుకా పద్మాలను స్పృశించి ధన్యులైనారు. ఊళ్ళోని లక్షాధికారులూ, వర్తకులూ, ఆఫీసర్లూ స్వామీజీ ప్రత్యేక దర్శనంకోసం వచ్చి, వెంకట్రావు అనుజ్ఞకోసం వేచి వుండేవారు. అంతగా పెరిగిపోయింది అతని పరపతి! తన ఆఫీసరుకూడా తన అనుమతికోసం వేచి వుండడం అతనికి ప్రత్యేక గర్వకారణం అయింది. తన ఆఫీసరుకు వెంకట్రావు ప్రత్యేక దర్శనం చేయించాడు. ఆయన పొంగిపోయి వెంకట్రావుని తెగ పొగిడాడు.

"ఈ దెబ్బతో నాకు ప్రమోషన్ తప్పదు" అని మురిసిపోయాడు వెంకట్రావు.

మూడు రోజులూ పట్నంలో ఏనోట విన్నా స్వామీజీ ప్రశంసయే. ఏచోట కన్నా స్వామీజీ చిత్రాలే. మూడోరోజు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. ఆరోజు బహిరంగ సభకు లక్షమంది హాజరయారు. ఉపన్యాసం అయిన తరువాత శ్రీవారు కొన్ని అద్భుతాలు చూపారు. శూన్యహస్తంలో శ్రీచందనం తెప్పించారు. ఉంగరాలూ గడియారాల సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆ అద్భుతంకాదు ప్రజలను ఆకర్షిస్తున్నవి!

ఉపన్యాసం మొదలయిన క్షణంనుండీ ముందు వరుసలో కూర్చున్న ఒక ముదివగ్గు దగ్గుతూ ఆయాస పడిపోతూనే వున్నాడు. చుట్టూవున్నవారు విసుక్కుంటూనే వున్నారు. అతడు ఖంగు ఖంగున దగ్గుతూవుంటే శ్రీవారు రెండుసార్లు ఉపన్యాసం ఆపవలసి వచ్చింది. అందుకు ప్రజలు కోపోద్రిక్తులై ఆ ముసలివాణ్ణి బయటకు పొమ్మని కసురుకుంటున్నారు.

(వి)చిత్ర విజ్ఞానం



యుద్ధకాలంలో అమెరికా, వియత్నాంలో తాత్కాలిక విమానాశ్రయాలను నిర్మించడానికి డైయాక్సిన్ అనబడే ఒక వృక్ష సంహారిణి మందును ఉపయోగించింది. ఈ మందు యిప్పుడు వియత్నాం చుట్టూతా సముద్రంలోని చేపల దేహాల్లో పేరుకుపోయింది. ఈ చేపలను తింటే ముఖ్యంగా గర్భవంతులకు తీవ్రమైన హాని కలుగుతుందంటున్నారు — హార్వర్డ్ శాస్త్రజ్ఞులు డా॥ మాత్యూ మెసెల్సన్. ఈ మందు హిందూమహాసముద్రపు చేపలకు కూడ సోకిందట!!

అతడు తన దురదృష్టాన్ని నిందించుకుంటూ లేచి, తూలి పడిపోయాడు. స్వామీజీ ప్రసన్న వదనంతో అతనిని తీసుకురమ్మని సంజ్ఞచేశారు. నలుగురూ సాయంపట్టి అతనిని వేదికమీదకు తెచ్చారు. శ్రీవారు అతని వెన్ను నిమిరి భగవన్నామ సంకీర్తన చేయించారు. అంతే. అతడు దిగ్గున లేచాడు. దగ్గు మాయమయింది. దృఢంగా నడవగలిగాడు. ప్రజలంతా స్వామీజీ అద్భుత శక్తికి దిగ్భ్రమ చెందారు.

అలాంటి స్వామీజీ రేపు ఉదయమే వెళిపోతారని తెలిసి ప్రజలు తీవ్రంగా విచారించారు. కొందరు పెద్దలు స్వామీజీ కాళ్ళమీదపడి ఇంకొక్కరోజు ఉండవలసిందిగా ప్రాధేయపడ్డాడు. కాని శ్రీవారు రేపే బయలుదేరి తీరాలి. భక్తులు చూస్తే ప్రాధేయపడుతున్నారు. ఎలా? అందుకే వారు విశ్రాంతి తీసుకునే కాలాన్ని త్యాగంచేసి, కొంతమంది భక్తులకు ప్రత్యేక దర్శనం యివ్వడానికి దయతో అంగీకరించారు. ఆ కొందరు అదృష్టవంతులు శ్రీవారి పాదపూజచేసి తరించి సంతృప్తినిండిన మొగాలతో వెళిపోయారు.

చిట్టచివర వెంకట్రావు. అసలు శ్రీవారి పాదపూజ చేయడానికి వెయ్యిన్నూటపదహార్లు కానుక చెల్లించాలి. కాని చేసిన సేవలకు గుర్తింపుగా అతనికా సదుపాయం ఉచితంగా లభించింది. పాదపూజ పూర్తి అయినా అతడు లేవలేదు. ఏదో కోరికతో అలముటించిపోతున్నట్టు కూర్చున్నాడు.

కోటి మల్లెలు వికసించినట్టు శ్రీవారు ప్రోత్సాహకరంగా నవ్వారు. అతనికి ధైర్యం కలిగిందిగాని ఎలా చెప్పుకోవాలో తెలియలేదు. భార్య మూర్ఖత్వం, పాప ఆరోగ్యం గురించి శ్రీవారికి విన్నవించుకోవాలని అతని తపన.

ఈ మూడురోజులూ అతడు యింటికి వెళ్ళనేలేదు. పాప, భార్య వస్తారని చూచాడు. జనాలు ప్రక్కగ్రామాలనుండి కూడా ప్రవాహంలా శ్రీవారి పాదపద్మాల చెంతకు వచ్చినా, తనవారు రాలేదు! అతని మనస్సు చివుక్కుమన్నది. రమ్మని కబురు పంపినా ఆమె రాలేదు. కనీసం పాపను పంపలేదు. పాప వస్తే శ్రీవారు ప్రత్యేకంగా ఆశీర్వదిస్తే దాని ఆరోగ్యం కుదుటబడునుకదా. ఈ విషయాలు స్వామీజీకి చెబితే వారికి కోపం వస్తుందేమో. అదీ అతని సంశయం.

"సంశయం ఎందుకు చెప్పు...." కరుణ జాలువారుతున్న స్వరంతో శ్రీవారు అడిగారు.

ధైర్యం తెచ్చుకొని చెప్పాడు వెంకట్రావు. శ్రీవారు గలగల నవ్వారు.

"తమ ఆశీర్వాద భాగ్యంకోసం వారిని యిక్కడకు తీసుకువద్దామనుకున్నా...."

"మేము నిన్ను ఆశీర్వదిస్తాము. చాలు."

వినమ్రుడై పాదాలకు మరల నమస్కరిం

చాడు వెంకట్రావు. అతని నెత్తిమీద చెయ్యి పెట్టారు స్వామీజీ. సర్వలోకాలను జయించినంత సంబరంగా బయటకు వచ్చాడు వెంకట్రావు.

* * *

బయట ఏదో గలాటా జరుగుతోంది. పోలీసులు ఎవరినో లాఠీలతో మోదుతున్నారు. మొదట అతడు ఎదురుతిరిగాడు గాని తరువాత లొంగిపోయాడు. లొంగిపోయినా, పోలీసులు అతనిని మోదుతూనే వున్నారు. అతడు స్పృహ తప్పే స్థితికి వచ్చాక "పోరా వెధవా, మళ్ళా యీ చాయల్లో కనిపిస్తే జైల్లో పడవేస్తాం" అని తోసేసారు.

శక్తి ఉడిగిన వాడు తూలుతూ వచ్చి వెంకట్రావు కాళ్ళముందు పడ్డాడు. వెంకట్రావు గుండె ఝల్లుమన్నది. అతడెవరో కాదు. ఒకనాటి తన స్నేహితుడు. పేరు జ్ఞాపకం లేదుగాని....నిప్పుల్రావు అని పిలిచేవారు అతనిని. అతనివన్నీ తీవ్ర భావాలు. అన్యాయాన్ని సహించేవాడు కాదు. ఎప్పుడూ ఎవరి మీదనో నిప్పులు కక్కుతూ ఉండేవాడు. వాడు హటాత్తుగా యిలా ప్రత్యక్ష్యం అయ్యేసరికి ఆశ్చర్యపోయాడు వెంకట్రావు.

వలంటీర్ల సహాయంతో అతనిని ఒక గదిలో చేర్చి, ఉపచారాలు చేసి, కాఫీ యిస్తే తేరుకున్నాడు.

"ఏమిటిది?" అడిగాడు వెంకట్రావు.

"నువ్వే చెప్పాలి!" కస్సుమన్నాడు నిప్పులాౖవు.

పది సంవత్సరాలతర్వాత కలిసిన స్నేహితుడు మాట్లాడే తీరుచూసి "నువ్వేమీ మారలేదు" అని నవ్వాడు.

"క్షణక్షణానికీ మారేది నువ్వు. నేనుకాదు. ఒకప్పుడు నువ్వు ఆదర్శవాదివి. తరువాత భక్తుడువి. ఇప్పుడు మోసగాడివి."

ఈ ఆరోపణ విని నిర్ఘాంతపోయాడు వెంకట్రావు.


"ఒరేయ్. ఆశ్చర్యపోకు. అమాయకత్వాన్ని నటించకు. నీలో కాస్త నిజాయితీ వుందేమో అనుకున్నా. కానీ నువ్వూ భక్తుల మందలో ఒకడివే. మీరంతా భక్తులు! ముఖం నిండా నామాలు ఒకడికి; చెవిలో పువ్వు మరొకడికి; రుద్రాక్షమాల లొకడు! పేరుకు భక్తులు. చేసేవన్నీ మోసాలే. మీ భక్తులంతా చేరి ఆ రోజు స్టేషన్‌లో ముష్టివాణ్ని తొక్కేసి సరాసరి స్వర్గానికి పంపేవారు! సమయానికి నేనక్కడే వుండబట్టి వాడు బ్రతికిపోయాడు. తిండిలేక చస్తున్న సాటి మానవుడికి పట్టెడన్నం పెట్టలేరు. కనికరం చూపలేరు. కాని ఒక మోసగాడు మోళీకడితే వాడి పాదపూజ చేస్తారు; వెయ్యిన్నూటపదహార్లిచ్చి! పది రూపాయిలిచ్చి పాదుకల పూజ చేస్తారు! ఛీ. మీరు భక్తులా? పరమమూర్ఖులుగాని! గుండె మీద చేయి వేసుకొని నిన్ను నీవే ప్రశ్నించుకో. నువ్వు నిజంగా భక్తుడివా? భక్తి మాటున లంచంకొట్టే మోసగాడివి కాదా? భక్తి ముసుగులో ప్రమోషన్‌కోసం ప్రాకులాడే స్వార్ధపరుడివి కాదా?...."

నిప్పులు కురిపిస్తున్నాడు, లేని ఓపిక తెచ్చుకొని, నిప్పులాౖవు. అతనిని కాదని వాదనలోకి దిగడం మరింత బాధను ఆహ్వానించడమే అని తెలుసు వెంకట్రావుకి. అయినా స్వామి నిందను భరించలేకపోయాడు.

"నీకు స్వామీజీ గురించి తెలియదు" అన్నాడు నెమ్మదిగా.

"అయితే నీకు పూర్తిగా తెలిసే ఈ మోసంలో భాగం పంచుకుంటున్నావన్నమాట. పైగా భక్తుడివి!" వ్యంగ్యంగా ఎత్తి పొడిచాడు నిప్పులు.

తన భక్తిని ఎవరైనా శంకిస్తే వెంకట్రావుకి బాధగానే వుంటుంది. తెచ్చుకుంటున్న జీతం సరిపోక అడపా దడపా కానుకలు స్వీకరించడం భుక్తికోసం. భుక్తి లేకపోతే భక్తి ఎక్కడ?—ఇవన్నీ నిప్పులాౖవుకి అర్థంకావు. ప్రతి విషయాన్నీ రంగు అద్దాలొంచి చూస్తూ "మోసం, మోసం" అని గావుకేకలు పెట్టడం నిప్పులాౖవుకి మొదటి



నుండీ అలవాటే. అందుకే ప్రసంగం మార్చా లనుకున్నాడు వెంకట్రావు.

"పోలీసులు నిన్నెందుకు కొట్టారు?" అడిగాడు.

"నీకు తెలియనట్టు!" గుర్రుమన్నాడు నిప్పులు.

"ప్రతి విషయాన్నీ అనుమానించడం మంచిదికాదు....నాకు నిజంగా తెలియదు."

అతని స్వరంలోని నిజాయితీని గమనించి మెత్తబడ్డాడు నిప్పులు.

"నేను హేతువాదిని. బాబాల బండారం బయటపెట్టడం నా ధ్యేయం. మ్యాజిక్‌లు చేసి పొట్ట గడుపుకోడం నా వృత్తి. మీ బాబా లానే శూన్యహస్తంలోంచి విభూతి రప్పించ గలను....ఇదిగో."

చూసి ఆశ్చర్యపోయాడు వెంకట్రావు.

"ఇదిగో వాచీ....నేను తలచుకుంటే ఈ వెధవకంటే ఎక్కువ 'మహత్యాలు' చూపి లక్షలు ఆర్జించగలను...."

వాడు స్వామీజీని - వెధవ - అన్నందుకు, తను విన్నందుకు మనసులోనే 'లెంపలు' వేసుకున్నాడు వెంకట్రావు.

"మీ సాములారిని సవాలు చేయటానికే నేనిక్కడకు వచ్చాను. అందుకే నా కీ సన్మానం!—ఇంత పట్నంలోనూ నేను ఏకాకిని. నాకు ఒక నలుగురు సాయం వుంటే ఈ బాబా పని పట్టేవాడిని....పోనీ నువ్వు—నువ్వైనా నాకు కాస్త సాయం చేయ కూడదూ?...."

వణికిపోయాడు వెంకట్రావు. "మన దేశంలోని ప్రముఖ శాస్త్రజ్ఞులే అతీంద్రియ శక్తులున్నాయని నమ్ముతున్నారు." అన్నాడు నెమ్మదిగా.

"అందరికంటే సులభంగా శాస్త్రజ్ఞులే బోల్తా పడతారని నా మాజిక్ ద్వారా నిరూపిస్తా" ఛాలెంజి చేస్తున్నట్టు అన్నాడు నిప్పులు.


"స్వామీజీ ఆ ముసలివాణ్ని చిటికెలో బాగుచేసారు."

"రోడ్డుప్రక్క మోళీవాడుకూడా ఆ ట్రిక్ చేయగలడు....ఆ ముసలివాడు ఆ గాంగ్‌లోని మనిషే. అంతా నటన!"

నమ్మలేకపోయాడు వెంకట్రావు.

అతని సంశయమూ, తటపటాయింపూ చూసి మళ్లీ నిప్పులు కురిసాడు నిప్పులార్రావు.

"మన దేశ దౌర్భాగ్యం ఏమిటో గాని



"ఆ రెండూ పక్క పక్కన పెట్టడంలో నీ ఉద్దేశమేమిటో నా కర్థమైంది ప్రమీలా!"

దేశంలో విద్యావంతులు బాగా తక్కువ. వారిలోనూ నీలాంటి మూర్ఖులే ఎక్కువ. నేను నేనుగా చేసే పనులను మాజిక్ అంటారు. అదే సాములారు చేస్తే మహిమ అంటారు. నేను బాబాలను సవాల్ చేస్తే ఎవరూ పట్టించుకోరు. నాకు అవకాశం యివ్వరు. పైగా బాబాలనే సమర్థిస్తారు. శాస్త్రజ్ఞుల ముందు నా విద్యను ప్రదర్శిస్తానంటే నన్ను పరీక్షించడానికి వారు ముందుకు రారు. నేనే బురఖా మార్చేసి స్వామీజీలా వేషం వేస్తే చాలు— మీరంతా — శాస్త్రజ్ఞులతోసహా—నా పాద ధూళిని నెత్తిన వేసుకొని, నా చుట్టూ భజనలు చేస్తారు! లక్షలు కుమ్మరిస్తారు!....సరే నువ్వేం సాయం చేయనక్కర్లేదులే. నేనొక్కణ్ణే ఈ రాత్రి ఈ సాములారి బండారం బయట పెట్టకపోతే నా పేరు...." అంటూ దృఢ ప్రతిజ్ఞ పట్టాడు నిప్పులు.

భయపడుతూ, వణికిపోతూ, అతనివైపు చూసిన వెంకట్రావు గుండె ఝల్లుమన్నది.

ఇందాక పోలీసుల లాటీ దెబ్బలవల్ల నెత్తిమీద చిట్లిన రక్తనాళాలనుండి యిప్పుడు ఆవేశంవల్ల ఉబికి కాలనాగు నాలుకల్లా నుదుటి మీదకు ప్రవహిస్తున్నది. అతని కళ్లు రక్తాన్నే కురుస్తున్నవి. ఆవేశం ఝంఝామారుతంలా అతనిని ఊపివేస్తున్నది. ఆ ఝంఝామారుతంలో జ్వాజల్యమానంగా ప్రజ్వలిస్తున్న చిచ్చరపిడుగులా నిలిచివున్నాడతడు.

ఆ కాంతిని భరించలేనివాడిలా కళ్లు మూసుకున్నాడు వెంకట్రావు. ఆ రాత్రి అక్కడ వుండడం క్షేమం కాదనిపించి, శ్రీవారి సెక్రటరీ వద్ద సెలవు పుచ్చుకొని యింటికి వెళ్ళిపోయాడు.

అతని మెదడులో అనుమానాలు పిశాచ నృత్యం చేస్తూ అతనికా రాత్రి నిద్రను దూరం చేసాయి.

* * *

తెల్లవారుతూనే వేలాది భక్తులు ఆ భవనం చుట్టూ మూగారు. భవనంనుండి కారువరకూ మార్గం అంతటా పూలు పరిచారు. మంగళ వాద్యాలు మోగుతున్నాయి. జయజయ ధ్వానులతో దిక్కులు పిక్కటిల్లాయి. బాలభానునిలా మెరిసిపోతూ శ్రీవారు కారులో ఆసీనులైనారు. కారుతోబాటు భక్తులు స్టేషను వరకూ ఊరేగింపుగా సాగిపోతున్నారు. కాని ఆశ్చర్యం! వెంకట్రావు ఊరేగింపులో లేడు. అప్పుడే మేలుకొన్నట్టు; దేనినో వెదుక్కుంటున్నవాడిలా అక్కడే వుండిపోయాడు. స్వామీజీ ఊరేగింపు కనుమరుగు కాగానే ఇంకో 'ఊరేగింపు' బయలుదేరింది. పోలీసులు భవనంనుండి ఒక శవాన్ని బయటవున్న వ్యాన్‌వద్దకు మోసుకు వస్తున్నారు!

అక్కడే వుండిపోయిన కొందరు భక్తులు శవంచుట్టూ మూగారు, ఆశ్చర్యంగా "వీడు నిన్న స్వామీజీని సవాలు చేయడానికి వచ్చాడు! సవాలు చేయడానికి! వీడెంత? వీడి బ్రతుకెంత? స్వామీజీనే సవాలు చేసేవాడా వీడు? అందుకే దేవుడే శిక్షించాడు. రక్తం కక్కుకొని రాత్రే చచ్చాడు." వివరిస్తున్నాడు పోలీసు.

భక్తులు పరమానందభరితులై "స్వామీజీకి జై" అని అరిచారు. వ్యాన్ కదిలింది.

హృదయం కలుక్కుమనగా "నిప్పు ఆరిపోయింది....కాదు... ఆర్పివేసారు." అనుకున్నాడు వెంకట్రావు. ఆశ్చర్యం! అలాంటి భావం కలిగినందుకు అతడు వణికిపోలేదు! □



"విన్నావా ఆ పకపకలు....నిన్నటివరకూ ఒకరి మీదొకరు దేగర్పు విసురుకుని కారమ్మూ, మిరియమ్మూ నూరుకున్న ఆ శత్రువర్గాలు రెండూ ఈవేళ చెప్పు ఆడేస్తూ నవ్వుల డూయట్ పాడేస్తున్నాయ్........ లోకంలో సిగ్గులేనితనం మరీ పెచ్చ్రేగి పోతోంది...." కలలోకూడా ఊహించని దారుణాన్ని కళ్ళారా చూసి విస్తుపోతున్నవాడిలా ఆశ్చర్యంగానూ, కొంచెం కోపంగానూ రామారావు ఒక చెయ్యి మిస్టర్ సంపత్ (ఇంటాయన) వాటాకేసి చూపి, రెండో చెయ్యి నడ్డి మీద పెట్టుకుని నాటకం ఫక్కీలో అన్నాడు.

చదూతున్న "డ్రీమ్స్ డై ఫస్టు"ని రాక్ లోకి విసిరేసి కుతూహలంగా నేనూ కిటికీ దగ్గరకి మిస్టర్ సంపత్ వాటాకేసి చూసాను.

అవున్నిజంవే!

గొప్ప దారుణం జరిగిపోతోంది.

మీసాల్రావని మేం ముద్దుగా పిలిచే

ఇంటాయన (....వయసు ఒకటి తక్కువ నలభై. ఎత్తు ఓ అంగుళం తక్కువ ఐదడుగులు. వెడల్పు ఓ సెంటీ మీటరు తక్కువ రెండడుగులు. ఆస్తి ఓ సెంటు తక్కువ వందెకరాలు) చదరంగం బల్లమీద పావుల్ని కదుపుతూ ఒకటో రెండో పావుల్ని ఎగరేసుకు పోతున్న గెద్దలా యమ హుషారుగా కుర్చీతో సహా ఊగిపోతూ నవ్వేస్తున్నాడు.

అరుణ ఆయన కెదురుగా మరో కుర్చీలో కుదుమట్టంగా కూర్చుని తన 36-24-35 ఎత్తులతో మిస్టర్ మీసాల్రావుని వెర్రెక్కిస్తూంది. ఆయన్ని నవ్వుల్లో ముంచేసి చదరంగంలో ఎత్తులమీద ఎత్తులు వేస్తూ తికమకాస్త్రం ప్రయోగిస్తోంది.

"ఇలా జరుగుతుందని మనం ఎప్పుడైనా అనుకున్నామా? సిగ్గు సిగ్గు" అని రామారావు యథాశక్తి నాటకం ఫక్కీతో చేతులు నెత్తిమీద పెట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు. (అది ఇనపది కాబట్టి సరిపోయింది.)

చెప్పొద్దూ రామారావు ఓవర్ యాక్షన్ నా కెంత మాత్రం రుచించలేదు.

"ఇలా జరుగుతుందని ముందుగా ఊహించబట్టే ఆ వ్యవహారంలో తల దూర్చకురా మిత్రమా అన్నాను. విన్నావా? ఇప్పుడు ఆశ్చర్యపోయి ఆలోచనల గొడ్డలితో బుర్ర చితగ్గొట్టుకుని చేసేదేముంది?" అని మందలించాను.

"ఒప్పేసుకున్నా మిత్రమా ఒప్పేసుకున్నా! బుద్ధి గడ్డిమేసింది. ఇంకెప్పుడూ వాళ్ళ జోలికి పోను. బుర్ర వేడెక్కి ఒళ్లు స్టీమింజనయి పోయింది. ఓ సిగరెట్టిలా ముఖాన కొట్టు—" అన్నాడు రామారావు.

"అప్పుడే ఏం చూశావ్....ఆ ఆకస్మిక మిత్రవర్గాలు రెండూ మనకి శత్రువులవక పోతే చూడు—" అని సిగరెట్టు నిజంగానే రామారావు మొహాన కొట్టాను.

రామారావు ముఖం ఏడ్చేయడానికి సిద్ధపడుతూ కళ తప్పింది.

* * *

అదో "ఇంటి తగూ!"

రెండు వాటాల్ని కలిపే వరాండాకి పార్టీషన్ పెట్టి దాన్నో వాటాచేసి ఘనత వహించిన భారతీయ రైల్వేకు చెందిన చిరుద్యోగి చిదానందానికి అద్దెకిచ్చాడు మిస్టర్ సంపత్.

అతని పేరు చిదానందం అనబట్టి రిస పోయింది గాని లేకపోతే "ఆనందం" అనే పదానికి, చిదానందానికి బొత్తిగా సంబంధం లేకుండా పోయేది. కారణం!—

చిరుద్యోగి చిదానందానితో విధవప్పగారుంది. ఆవిడ కొడుకు పోలియో వచ్చి కాళ్లు పడిపోయి మంచం మీదున్నాడు.

చిదానందానికి—అతను చస్తే పీడ పోయిందనుకుని హాయిగా బొట్టు చెరిపేసుకొనే ఓ వెర్రి పెళ్ళాం వుంది. మతిలేని ఆవిడ కన్న ముగ్గురు పిల్లల్లో ఒకమ్మాయికి ఎన్నేళ్ళనించి ఎదురుచూసినా నోటమ్మట "అమ్మా" అనే మాటయినా రాకుండా వుంది. చిదానందానికి వ్యథా సరిత్సాగరంలాంటి తనకుటుంబంలో డాల్ఫిన్స్‌నోస్ లాంటి కొండలా అరుణ అనే చెల్లెలుంది.

"నేను ఉక్కు ఫ్యాక్టరీ పైలాన్ స్థంభాన్నైతే, నా చెల్లెలు అరుణ మా ఇంటికి డాల్ఫిన్స్‌నోస్" అని గర్వంగా చిదానందం వీధిలోచెప్పుకోడానికి తగిన లక్షణాలు అరుణకున్నాయి. డాల్ఫిన్స్ నోస్ లాంటి అరుణకి అంతకన్నా పగరు, పొగరువున్న 'నోస్' వుంది. "లేడీ ఆఫ్ ది హౌస్" అరుణ చిదానందానికి అందమైన చెల్లెలు.

చిదానందాన్ని మినహాయించి ఇంట్లో అందర్నీ ఒక్క చూపుతో అదిలించి ఓ మూల కూర్చో బెట్టగల సత్తావున్న టైగ్రస్ అరుణ. (ఆమె కా సత్తాయే లేకపోతే — రోజూ స్కూటర్ మీద ఇంటికొచ్చి—"మీ అరుణని ప్రేమిస్తున్నానండీ — అరుణ లేందే బతకలేను. ఈ ఆస్తి డబ్బు, పెద్ద ఉద్యోగం, సంఘంలో హోదా ఇవన్నీ వృధా అనిపిస్తున్నాయి." అంటూ డైలాగులు చెప్పే ఓన్లీ సన్ ఆఫ్ ది బిజినెస్ మాగ్నెట్ రంజిత్‌ని ఎప్పుడో పెళ్ళాడవలసి వచ్చేది తల్లి పోరు

పడలేక!)

ఎవరెంతటి వారైనా డబ్బు లేకపోతే అంతంత మాత్రం బతుకులే బతక వలసి వస్తుం కదా!

అందుచేత చిరుద్యోగి చిదానందం, టైపిస్టు అరుణ సంపాదనతో ఆ కుటుంబం "టరన్ టర్టిల్" అనిపించుకోకుండా 'టర్టిల్'లా మెల్లగా పాకుతూ వస్తోంది.

ఆ కుటుంబానికి ముందు చవగ్గా ఇల్లు అద్దెకిచ్చి, కరుగ్గా మధ్యలో కాళీ చైమని సతాయిస్తున్నాడు మిస్టర్ సంపత్.

ఏంచూసి ఇచ్చాడోగాని మిస్టర్ సంపత్ అసలా వాటాని నెలకి 60 రూపాయలు (ఓన్లీ సిక్స్టీ రుపీస్)కే అద్దె కిచ్చాడు చిదానందం కుటుంబానికి.

ఏం చూసి చవగ్గా ఇల్లు అద్దెకిచ్చాడో చిదానందం ముందు కనుక్కోలేక పోయినా, తరువాత తెలుసుకున్నాడు.

అసలు మిస్టర్ సంపత్కీ, చిదానందం కుటుంబానికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనడం ఆరోజునించే ప్రారంభమైంది.

ఆ కథాక్రమం బెట్టిదనిన — ఓ రోజు మిస్టర్ సంపత్ పిచ్చాపాటీ మాట్లాడుతూ అరుణ ప్రసక్తి తెచ్చాడు.

"చాలా అందంగా ఉంటుంది—ఎంత పొందిక? ఎంత సొగసు? — బీదపిల్ల అని ఎవ్వరూ అనుకోరు—అవునూ—వా డెవడు ఆ రంజిత్—? రోజూ స్కూటరుమీద వచ్చి పోతూ వుంటాడు. అరుణని పెళ్ళి చేసుకుంటానంటున్నాట్టగా-పోనీ పెళ్ళి చేసెయ్యరాదూ— అప్పుడేంది — పెళ్ళయిం తరవాత ఎలాగూ వాళ్ళదారి వాళ్ళది — ఎలాగూ ఆశపడుతున్నాడు కాబట్టి వాడిదగ్గర్నించి నాలుగురాళ్ళు ఒడుక్కోవాలంటే వెంటనే పెళ్ళి చై కూడదు. అహ మరోలా అనుకోకండిస్మీ! లోకం తీరు గురించి మాట్లాడుతున్నా—" అని అడగని కామెంట్సూ—సజషన్సూ పారేశాడు.

"పోన్లే చవగ్గా ఇల్లు అద్దె కిచ్చినవాడు—తగూ పెట్టుకుంటే కాళీ చైమంటాడు. ఎందుకొచ్చిన రొస్టు" అనుకున్న చిదానందం కోపాన్ని దిగమింగుకుని రాని నవ్వు ముఖానికి పులుముకున్నాడు.

కానీ మర్రొండు రోజులకి—

"మీ సిస్టర్ని మ్యారేజ్ చేసుకుంటానోయ్. రెండో పెళ్ళన్న మాటేగాని నాకేం తక్కువ? — మొన్ననే థర్టీఫైవ్ వెళ్ళి థర్టీసిక్స్ వచ్చాయి—" అనేశాడు మిస్టర్ సంపత్ చిదానందంతో.

"బాబూ! మేం పేదవాళ్ళమే. ఒప్పుకుంటాం—కానీ మా పేదరికం చూసి జాలి పడి అడగని తరుణోపాయాలు సెలవియ్యకండి. దయచేసి—" అని చిదానందం చేతులు జోడించాడు.

"అంటే మీరనేదేమి టసలు! ఆ రంజిత్ గాడికున్న వయసు లేక పోయినా నాకేం తక్కువ? వాడి నాన్నకిలా ప్రెస్సూ, కోళ్ళఫారాలూ, రైస్ మిల్లులూ, పిండిమరలూ లేకపోయినా వందెకరాలు పొలం వుంది. అనుభవించే యోగ్యత మొహాన లేక నావెళ్లాం రెండేళ్ళ క్రితం ఆసుపత్రిలో పురుడోసుకుంటూ పిండం తిరగబడి కన్ను మూయబట్టి రెండో పెళ్ళంటున్నా. పిల్లలా—పిచికలా.... ఎవరూ లేరు...." అని లీడింగ్ లాయర్లా "చిదానందం నువ్వు నాగురించి ఈ విధంగా ఆలోచించాలిస్మీ!" అని చెబుతున్నట్టు మాట్లాడాడు మిస్టర్ సంపత్.

వెంటనే వాళ్ళిద్దరి మధ్యనా నేలమీద ఎక్కడనించో గాలి కెగిరొచ్చి పడిన పచ్చగడ్డి భగ్గుమంది-చిదానందం విసిరిన సిగరెట్టు పీక వల్ల!

ఆ పచ్చ గడ్డిలా చిదానందం కూడా భగ భగ మన్నాడు—

"ఏమిటయ్యా నీ దాష్టకం?—ఏదో ఇల్లు అద్దెకిచ్చిన పెద్ద మనిషివి కదా అని ఊరుకొంటుంటే. నోటికొచ్చి నట్లల్లా మాట్లాడుతున్నావ్. కాస్త మర్యాద నేర్చుకో. అద్దెకున్నాం కదా అని అన్నిమాటలు పడం...." అన్నాడు.

చిదానందం భగ భగలకి ఇల్లు అద్దెకిచ్చిన

వాడి హోదాలో మిస్టర్ సంపత్ చిటపట మన్నాడు.

"ఏదో పేదవాళ్ళు కదా అని జాలిపడి 60 రూపాయలకే వాటా అద్దెకిచ్చాను. ఏం చూసు కుని నీ మిడిసిపాటు? ఇల్లు కళీచై—" అని అల్టిమేటమ్ పారేశాడు.

దానితో చిదానందం దళిత్ పాంథర్లా తిరగ బడి దూరపు చుట్టమైన అడ్వకేట్‌ని సలహా అడిగాడు.

చాలా కాలంగా కేసుల కొరతతో బాధ పడుతున్న ఆ అడ్వకేటు చిదానందం తెచ్చిన కేసు వినీ వినగానే "కుక్క జెట్టీలు వర్ధిల్లాలి" అని మనసులో అనుకుని, "మిస్టర్ సంపత్ అనే దురహంకారి మీకు ఇల్లు అద్దెకిచ్చి తారీ ఖేదో కూడా చూసుకోకుండా మిమ్మల్ని వేపించుకు తింటున్నట్లు కొట్టడానికొచ్చినట్లూ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టండి. కోర్టులో కేసు ఫైట్ చేస్తామని పోలీసులకి గట్టిగా చెప్పండి. ఆ తరవాత నే చూసుకుంటాను—" అని మిస్టర్ సంపత్ మీకొక్కడు ఇక మీద నాకే శత్రువు అన్నట్టు మాట్లాడాడు.

ఆ మేరకు చిదానందం పోలీస్ రిపోర్టు ఇవ్వగానే పోలీస్ యాక్టులో సో అండ్ సో సెక్షన్ క్రింద సో అండ్ సో కేసు బుక్ చేశారు, మిస్టర్ సంపత్‌మీద పోలీసులు. స్టేషనుకి పిలిపించారు. అందుమీద మిస్టర్ సంపత్ అగ్గిరాము డయిపోయి తన ఇంట్లో ఆరునెలల బట్టి అద్దెకున్న చిదానందం కుటుంబం ఒక్క నెలకూడా అద్దె చెల్లించిన పాపాన పోలేదని కౌంటర్ కేసుపెట్టాడు. "పెట్ట నివ్వండి కేసు —కోర్టులో తేల్చు కుంటాం—" అన్నాడు చిదానందం.

"ఏం తేలుస్తాడో నేను చూస్తాలెండీ— కేసు కోర్టుకు నివేదించండి—" అన్నాడు మిస్టర్ సంపత్.

రాజీ ప్రశ్న లేదంటే లేదన్నారు.

కోర్టులూ, ప్లీడర్లూ, విచారణలూ, వాయి దాలూ, ఆ తరవాత తలనొప్పులూ, అనాసిన్‌లు, ఆస్పిరిన్‌లూ అవుర్ అమృతాంజనములూ అలా రొటీన్ అవుతున్నాయే తప్ప ఎప్పటికీ కేసు ఓ కొలిక్కి రాదు. తీర్పంటూ తేలదు.

ఈ కథ అంతవరకూ వచ్చిన తరువాత వెంకట్రావనే నేను, రా మా రా వ నే నా మిత్రుడూ ఆ ఇంట్లో అందమైన మెట్లకింద ఒంటి గది వాటాగా మార్చబడిన కారు గ్యారేజ్‌లోకి నెలకి 60 రూపాయల అద్దెకి దిగడం జరిగింది.

మేం గదిలో యిలా దిగీ దిగగానే ఎక్కడ అపోజిషన్‌లో చేరిపోతామో అనే కంగారుతో మిస్టర్ సంపత్ మమ్మల్ని తన పక్షం లాక్కోడానికి అనేక చిట్కాలు ఉపయోగిం చాడు. మేం వచ్చిన రెండోరోజునే మాకు కాఫీ ఆఫర్ చేయడం, మా నిరుద్యోగి రామా రావుని చదూ సంధ్యలడిగి ఉద్యోగం వేయిస్తా ననడం ఆ చిట్కాలలో ఒక భాగమే.

ఉద్యోగం యిస్తానన్న ఆశ చూపగానే రామారావు ఆలోచించకుండా యింటాయన కుడిభుజమైపోయి, చిదానందం అండ్ ఫామిలీ మీద నిష్కారణంగానే శత్రుత్వం పెంచు కున్నాడు. "మీకెందుకు సార్ సంపత్‌గారూ ....మీరలా నిశ్చింతగా ఉండండి. మిస్టర్ చిదానందాన్ని, వాడి తలపొగరు చెల్లెల్నీ పది రోజుల్లో ముప్ఫైమూడు చెరువుల నీరు తాగిం పించి, ఇల్లు కాళీ చేయడమో, లేకపోతే మీతో రాజీకొచ్చి, కోర్టులో కేసు తాలూకు ఖర్చులు భరించడమో జరిగేట్టు చేస్తాను." అని మిస్టర్ సంపత్ కూర్చున్న కుర్చీ ఎదురుగా గల బల్లని ఘోరంగా గుద్ది శపథం చేసి 'నాటకం'లో తన వంతు పాత్ర తాను నిర్వహించడం ప్రారం భించాడు.

నాటకం ఆడుతున్నంతకాలం నాలుగొందల రూపాయల ఉద్యోగం రెక్కలు కట్టుకుని తన వైపు ఎగురుకుంటూ వచ్చేస్తోందనే రామా రావు గట్టిగా నమ్మాడు. తోటి నిరుద్యోగ మిత్రులు పదిమందిని పోగేసి రాత్రిళ్ళు చిదా నందం ఇంటి వాటాముందు లైటేసుకుని రాత్రిళ్ళు రెండు కొట్టేవరకూ పేకాడ్డం, తా గొచ్చిన వాళ్ళలా రష్యన్ యాక్సెంట్లో



మాట్లాడ్డం, వాళ్ళ యింటిముందే పక్కలు పరచుకుని భళ్ళున తెల్లవారినా ముసుగుతన్ని నిద్ర నటించడం, వాళ్ళడిగినా అడక్కపోయినా "ఈ వరండా యెవడి సొమ్మూ కాదు మూలగడానికి. ఇంటాయన పర్మిషన్ పుచ్చుకొనే పేకాడుతున్నాం, పడుకుంటున్నాం. మా యిష్టం...." అని అవాకూ్స చెవాకూ్స వాగడం సాగించాడు కొన్నాళ్ళు.

చిదానందం అండ్ ఫామిలీ సర్దుకుపోయారేగాని చీమ కుట్టినట్లు కూడా బాధపడలేదు. ఎదురుతిరగలేదు. యిల్లు కాళీ చేయలేదు. ముఖ్యంగా తగాదాకి మూలకారణమైన అరుణ ఈ నాటకంలో బిగించన కొప్పు, ముడిపడ్డ కళ్ళు, ఎగురుతున్న ముక్కుపుటాలతో హఠాత్తుగా రంగప్రవేశంచేసి "మీకు చెల్లెళ్ళు లేరూ....అక్కలు లేరూ....మీరు మనుషులు కారూ....ఇలా వేధిస్తారా ఉత్తి పుణ్యాన...." అని రంకెలువేస్తూ క్లయిమాక్స్ ఇచ్చేస్తుందని పూర్ రామారావు, ఇంటాయన సంపత్ ఆశించిందంతా వట్టిదే అయ్యింది. అసలామె (కనీసం మూసిన కిటికీ సందులోంచయినా సరే) వీళ్ళ కంటపడలేదు.

దానితో మా రామారావు మిత్రబృందం, "చిదానందాన్ని కాళీ చేయించే ఉద్యమం" తీవ్రతరం చేశారు.

ఓ రోజు ప్రత్యక్షంగా దగుల్బాజీతనానికి దిగిపోయారు.

మిస్టర్ సంపత్ వెనకనించి చోద్యం చూస్తూ నిలబడగా, మా రామారావు చిదానందంతో యేదో చిన్న విషయంమీద తగాదా పెంచుకున్నాడు. మాటలు పెరిగి చేతులకి ఫోర్సొచ్చింది. కొట్లాట కూడా అయ్యింది. మొదటిసారి చెయ్యెత్తింది మా రామారావే!

అప్పుడు అరుణ యింట్లోనే ఉంది. కానీ కనీసం మెరుపుతీగలాగ యిలా మెరిసయినా వెళ్ళలేదు.

రామారావు మాత్రం ఆ రాత్రి "తన చేతి దెబ్బ రుచి చూసిన చిదానందం యిక యిల్లు కాళీ చేయడం, నాలుగొందల రూపాయల ఉద్యోగం తెల్లారేసరికి తన ఒళ్ళో వాలడం ఖాయం" అని కలలు కంటూ "ఓ. కె. సార్....ఫైనల్ డ్రాఫ్టింగ్ చేస్తున్నానండి....పూర్తయిన వెంటనే ఫైలు మీదగ్గరికి పంపుతానండి" అంటూ పలవరింతలు పలవరించాడు-కాబోయే ఆఫీసరుతో మాట్లాడుతున్నట్టు కల గని.

కానీ తెల్లారేసరికి___

అంతవరకూ తెర వెనుకవున్న అరుణ హఠాత్తుగా, ఎవరూ ఊహించని విధంగా రంగప్రవేశంచేసి నాటకానికి అనుకోని ముగింపు నిచ్చేసింది.

చక్కగా తలంటు పోసుకుని జుట్టుని వదులుగా చెవులమీంచి గుండెల మీదికి వేసుకుని, మొఖానికి స్నో పౌడరు అద్ది కళ్ళకు నల్లటి కాటుక, ఒంటిమీద తెల్లటి ఫ్రెంచి వాయిల్ చీరతో పొద్దున్నే చెరువులో ఒళ్లు విరుచుకున్న కమలంలా తయారై మిస్టర్ సంపత్ మతి పోగొట్టింది.

వాడితో హఠాత్తుగా మాటకలిపి, చదరంగం ఆడుతూ, నవ్వుతూ, నవ్విస్తూ సమర్ధవంతంగా వ్యవహారాన్ని తనకి అనుకూలంగా మలిచేసింది.

* * *

"అసలు సంపత్ గాడికి సిగ్గుందంటావా? ఒక పక్క వాళ్లని పీడించమని నన్ను ఉసిగొలిపి, మళ్ళీ వాళ్ళతోనే చేతులు కలుపుతాడా?—ఐనా ఆ అరుణమాత్రం పెళ్ళికెదిగిన పిల్ల—సిగ్గుండొద్దా—హఠాత్తుగా వెళ్ళి ఆ బట్టతల సంపత్ గాణ్ని కవ్వించి తనవైపు తిప్పుకుంటుందా? పైగా పళ్లిగ్గానవ్వులా వాడితో కలిపి? ధూ—ధూ—" అని ఆవేశ పడ్డాడు రామారావు మళ్ళీ నాటకం ఫక్కీలో.

ఇంతవరకూ ఈ కథలో అంటీ ముట్టనట్టున్న నేను వెంటనే రంగంలోకి దిగిపోయి ఈ కథకి ఇంతటితో ముగింపు నిచ్చేసి "కథ ముగిసేముందు రామారావుకి జ్ఞానోదయం కలిగించవలసిందే—లాభంలేదు." అనే సదాశయంతో ఇలా అన్నాను.

"చూడు రామారావ్ — ఎవడి బతుకులు వాడివి. ఆ కుటుంబం పెద్ద కుటుంబం. 60 రూపాయలకి ఇల్లు ఈ హైదరాబాద్‌లో దొరికిందంటే దాన్ని వదులుకోడానికి వాళ్ళెలా సిద్ధపడతారు? కోర్టులో ఇంటాయన మీద కేసు పెట్టినా, నువ్వు నీమిత్ర బృందాన్ని వెంచేసుకుని అల్లరి పెట్టినా మౌనంగా భరించడం, ఇప్పు డీవేళ ఇంటివాడితో హఠాత్తుగా స్నేహానికి దిగడం వెనకవున్న విషాదం, అదే— పేదరికం మనిషిని వున్నకాస్త జాగా వదులుకో నివ్వదు." అన్నాను.

రామారావు బుద్ధిమంతుళ్ళా నేను చెప్పినదంతా విని బరువుగా నిట్టూర్చి నిమిషం పాటు మౌనం పాటించాడు. ఆ తరవాత హఠాత్తుగా సిగరెట్ ప్యాకెట్‌లోంచి గంటకు 60 మైళ్ళ వేగంతో ఓ సిగరెట్ లాగి నోట్లో పెట్టుకుని "యువార్ రైట్ గురూ! ముందే నువ్వు నాకీ పాఠం బోధిస్తే యింత వరకూ వచ్చేది కాదు. నేను వెర్రిమొహం వెయ్యవలసిన అవసరం లేకపోయేది. సరే ఏంచేస్తాం....ఇప్పుడైనా కాస్త జాగ్రత్తగా ఉంటా!....ఆ సంపత్ గాడు ఉద్యోగం యిచ్చినతరవాత ఇల్లు మారిపోదాం" అన్నాడు.

నేను పగలబడి నవ్వాను. "పిచ్చివాడా, ఇంకా సంపత్ యిప్పించబోయే ఉద్యోగంమీద ఆశతో ఉన్నావా? ఐపిటీయూ?" అని జాలి జాలిగా అన్నాను.

"ఏం?" అని రామారావు ఆశ్చర్యంగానూ కొంచెం దెబ్బతిన్నట్టుగానూ అడిగాడు.

"శత్రువర్గాలు రెండూ ఒకటవగానే, అందుబాటులో ఉన్న మూడో వర్గాన్ని బలిపెట్టడం ఈ ప్రపంచ గమన సూత్రం నాయనా?" అన్నాను నేనీసారి నాటకం ఫక్కీలో.

వెంటనే రామారావు మాట్లాడకుండా గది లోంచి బైటకి వెళ్ళిపోయాడు—బహుశా కొత్త ఇల్లు వెతకడానికే కాబోలు!!! □

ప్రెస్టేజికి తైక్

శ్రీరాజ్

జీవితంలో తొలిసారి బాబ్జీకి కన్నీళ్ళు వచ్చాయి.

ఎందుకని?

గతుకుల రోడ్డుమీద బురద నీళ్ళలో చతికిలబడ్డ కుష్ఠురోగి ఒంటిమీద కారుతున్న కుళ్లు నెత్తుర్ని, దానిమీద ముసురుతున్న ఈగల్ని చూసినందువల్ల కన్నీళ్ళు రాలేదు. అసలు బాబ్జీ పుట్టిన తర్వాత ఎప్పుడూ అలాంటి మురికి మనుషుల్ని చూడలేదు. అయితే కన్నీళ్ళెందుకు వచ్చాయి?

అతని మనసులో ఓ అపరంజి బొమ్మ అందమైన హరివిల్లులా చోటు చేసుకొని తను నవ్వుతూ అతన్ని నవ్విస్తూ అంతలోనే అతన్ని ఒంటరిచేసి, పిలుపుకి అందనంత సుదూరాలకి వెళ్ళిపోయినందుకు బాబ్జీకి కన్నీళ్ళు రాలేదు. ఆ మాటకి వస్తే ప్రేమించే వయస్సు వచ్చినా, చొరవచేసి ఏ అమ్మాయీ అతని మనసులో చోటుచేసుకోలేదు. ఆశ్చర్యం. మరయితే— కన్నీళ్ళెందుకు వచ్చాయి?

బాబ్జీకి అన్నీ ఉన్నాయి. ఉన్నవాళ్ళకి ఉన్న ఒక్కగానొక్క కొడుకు. అందంగా ఉంటాడు. అంతకన్న ఆరోగ్యంగా ఉంటాడు. కొద్ది రోజుల్లో ఫారిన్ వెళ్ళి, పెద్ద చదువులు చదువుకుంటాడు. తర్వాత—స్వదేశానికి తిరిగివచ్చి, ఏ కార్ల ఫ్యాక్టరీయో పెట్టేస్తాడు. ప్రభుత్వానికి అండగా నిలుస్తాడు. ప్రజానీకానికి సాయపడతాడు. ఇన్ని ఉన్నవాడు, ఇంత గొప్పవాడికి కన్నీళ్ళెందుకు వచ్చాయి? అతను పుస్తకాల్లో సినిమాల్లోనే కన్నీళ్ళగురించి తెలుసుకున్నాడు. కన్నీళ్లు యెలా ఉంటాయో చూశాడు. కానీ నిజజీవితంలో యెలాంటి కన్నీటి కథలు అతన్ని చేరలేదు.

ఎందుకు....ఎందుకు....ఎందుకు....? ఆ మహానుభావుడికి కన్నీళ్ళెందుకు వచ్చాయి?

ఒకసారి బాబ్జీ తన స్నేహితులతో కలిసి, ఓ ఇంగ్లీషు సిన్మా చూశాడు. సిన్మా ఎలా ఉన్నప్పటికీ అందులో చూపించిన ఒక కారు చాలా బాగా నచ్చింది. అలాంటి కారును కొంటే గింటే ఒక్క బాబ్జీయే కొనాలన్నారు, అతని మిత్రులు. అవును. ఉంటే గింటే అలాంటి కారు తనకే ఉండాలనుకున్నాడు, బాబ్జీ. అలాంటి కారు ఆ ఊళ్ళో యెవరికీ ఉండకూడదు. ఎవరి దగ్గరా లేనిది తన దగ్గర ఉంటేనే గొప్పదనం. అదొక సరదా. ప్రెస్టేజ్. అందుకే—అలాంటి కారుకోసం వారంరోజులు అన్వేషణ చేశాడు. అదే కారు కాకపోయినా అలాంటి మరో జయంట్‌లాంటి ఇంపాలా కారు దొరికింది. ఎవరో ఓ దొరగారు-ఇండియా వదిలేస్తూ తన దగ్గర ఉన్న కారూ గట్రా అమ్మేస్తున్నాడని తెలిసి, ఆ దొరగార్ని కారు అమ్మమని బాబ్జీ అడిగాడు. లక్షరూపాయలు యిస్తే, కారు అమ్మేస్తానన్నాడు ఆ దొరగారు.

బాబ్జీ తనకి అర్జంటుగా లక్షరూపాయలిమ్మని, కారు కొనే తన ఉద్దేశాన్ని తండ్రికి తెలియజేశాడు. ఆ తండ్రీకొడుకులు ఏడాదికి ఒకటి, ఒకటిన్నరసార్లు కన్నా ఎక్కువ మాట్లాడకోరు. అదీ టెలిగ్రాఫ్ భాషలో మాట్లాడుకుంటారు.

లాన్స్‌లో తీరిగ్గా కూర్చొని, గులాబిపూలని గడ్డిపూలని వేరువేరుగా చూస్తూ, వాటిలో వర్గభేదాన్ని ఆలోచిస్తూ వాటిని సృష్టించిన దేవుడి తెలివితేటలకి నవ్వుకుంటున్న బాబ్జీ నాన్నగారు 'లక్షరూపాయలు' మాట విని, కొడుకువేపు ఎగాదిగా చూశాడు. లక్షరూపాయలు అడిగే

యెత్తుకి యెప్పుడు యెదిగిపోయాడా అని కాసేపు ఆలోచించి, 'నో' అని టెలిగ్రాఫ్ భాషలో చెప్పాడు. అక్కడ ఉండకుండా వెళ్ళి పోయాడు.

ఆ 'నో' బాబ్జీకి జీవితంలో తొలిసారి కన్నీళ్ళు వచ్చేటట్లు చేసింది.

మూడు రోజుల్లో లక్షరూపాయలిచ్చి, ఆ దొరగారిదగ్గర ఉన్న జయంట్ లాంటి కారు తీసుకోవాలి. తన పరువు నిలబెట్టుకోవాలి. లేక పోతే—అ కోరు మరొకరి చేతికి పోతుంది. ఆ మరొకరు తనకన్న మించిపోతారు. తన స్నేహితులదగ్గర చిన్నబుచ్చుకోవాలి. అందుకే_



లక్షరూపాయలకి వచ్చిన జవాబు 'నో' విన్న వ్వట్నుంచీ బాబ్జీకి కన్నీళ్ళు ఆగడంలేదు.

హైకోర్టుమీద సుప్రీంకోర్టు ఉన్నట్లు— బాబ్జీ తన కన్నీళ్ళు వాళ్ళ అమ్మకి చూపించాడు. ఆ కన్నీటి వెనక దాగిన గాధా బాధా చెప్పుకున్నాడు. రెండు రోజుల్లో లక్షరూపాయలు అడిగి యిమ్మన్నాడు. లేకపోతే తను అందర్నీ విడిచి శాశ్వతంగా వెళ్ళిపోతానన్నాడు, ఆత్మహత్య చేసుకొని.

* * *

జీవితంలో తొలిసారి లావణ్యకి ప్రేమ పుట్టుకొచ్చింది.

ఎవరిమీద?

తన పేగుమీద, నవమాసాలు మోసి కన్న కొడుకుమీద అంటే మీరు నవ్వుతారా? అంతే మరి—కనడంతో తన డ్యూటీ అయిపోయిందని, పిల్లల్ని పెంచడం గించడం డబ్బు తీసుకుంటున్నందుకు నౌకరు వెధవలు చూసుకుంటారని ఊరుకుంది. ఏ రోజూ కొడుకు గురించి విచారించలేదు. అందుకే కొడుకుమీద ప్రేమా, వాత్సల్యం, అనురాగం లాంటివి ఎప్పుడూ పుట్టుకురాలేదు. ఇరవై ఏళ్ళ తర్వాత జీవితంలో తొలిసారి ఆమెకి కొడుకుమీద ప్రేమ పుట్టుకొచ్చింది.

మిసెస్ లావణ్యా వయస్సు ఇరవై సంవత్సరాల క్రితం సరిగ్గా పద్దెనిమిదేళ్ళు. ఆమె వయస్సు గురించి చెప్పుకొనేటప్పుడు ఏ పద్దెనిమిదో, ఇరవయ్యో వినిపించాలి. లేకపోతే— మూతి పళ్ళు రాలగొడుతుంది యెవరైనా సరే!

ఆమె జీవితాంతం మిస్‌గానే ఉండిపోవాలనుకుంది. కానీ, మిస్‌గా ఉంటే జీవితంలో పొందవలసిన చాలా అనుభూతులు మిస్ అయిపోతాయని పెళ్ళి చేసుకుంది. ఆమె పెళ్ళి చేసుకుంది గనుకనే మిసెస్ అయిందిగాని, ఆమెను చూసిన వాళ్ళెవరైనా మిస్సనే ఇప్పటికీ అనుకుంటారని ఆమె అంటుంది. నిజమే. ఆమె అందం వన్నెతరగని ఫాలాబంగారం. ఆ అందం ఆమె వయసుని తగ్గిస్తుంది. డెస్డిమోనో సౌందర్యం లావణ్యముందు వెలవెలపోతుంది.

ఆమె ఆకాశానికి వస్తానంటే చంద్రుడు వెన్నెలకి డైవోర్సు యిచ్చేస్తాడు. ఆ అందాన్ని కాపాడుకోవడంకోసం ఒక సంతానానికి మాత్రమే అంగీకరించింది. 'మళ్ళీ నీళ్ళు పోసుకుంటే చూడాలని ముచ్చటగా ఉందని' పతిదేవుడు ప్రాధేయపడినప్పటికి లావణ్య'లాభం' లేదంది.

లావణ్యకి పుట్టినింటి వాళ్ళన్నా, పుట్టిన దేశం అన్నా ఎలర్జీ. ఈ దేశంలో తనని కనడం తప్పయితే, తన తల్లిదండ్రులు బుద్ధిలేకుండా (ఆస్తి బాగా వుంది గనక) తనని చిన్నప్పట్నించి ఫారిన్‌లో వుంచి చదువు చెప్పించకపోవడం రెండో తప్పు చేశారట. ఆడపిల్లవి, అందులో లైఫ్ సెక్యూరిటీ లేని విదేశాల్లో ఒంటరిగా వుండలేవని ఆమె కోరికని ఎప్పుడుకప్పుడు కొట్టిపారేశారు ఆమె తల్లిదండ్రులు. పోనీ, ఓ ఫారినర్‌తో తన పెళ్ళి జరిపించారంటే అదీ లేదు. సాంప్రదాయం అడ్డువచ్చింది. అదిగో ఆ సాంప్రదాయాలు ముసుగులో ముసలయిపోతున్న ఈ దేశం అంటే మహాకోపం. కట్టుబాట్ల తాడుతో ఆడదాని స్వేచ్ఛనీ, ఆనందాన్నీ ముడివేసి, చీకటిలోవున్న గుంజకి కట్టేసిందీ దేశంలోనే.

'ఈ దేశంలో డిస్సెడ్వేంటేజ్ మరొకటి వుంది. డబ్బున్నప్పటికీ మనం కావాలనుకున్నది, కోరుకున్నది యిక్కడ దొరకదు. ఆనందానికి కత్తెర్లు అడ్డుపెడతారు. జీవితంలో థ్రిల్‌కి నిర్దాక్షిణ్యంగా బ్లాక్ పెయింట్ చేస్తారు' అని అంటుంది కూడా.

లావణ్యకి క్లబ్బుకి వెళ్ళడమన్నా, గంటల తరబడి పేకాడ్డమన్నా మహా సరదా. ఆ ఒక్క సరదా లేకపోతే లావణ్య ఏమైపోయేదో? క్లబ్బుకి తీసుకువెళ్ళిన డబ్బు అయిపోతే, ఫోన్‌లో చెక్కులు డ్రా చేసి మరీ ఆడుతుంది.

ఆరోజు పేకాడుతుంటే డబ్బులు అయిపోయాయి. చెక్కు రాసివ్వడానికి బ్యాంక్ హాలిడే. పేకాట విడిచి బాధగా ఇంటికి తిరిగి వచ్చిన లావణ్యకి-మరింత బాధగావున్న బాబ్జీ

కనిపించాడు. కన్నీళ్ళు చూపించాడు. ఆ కన్నీటి వెనకవున్న కారుకథ వివరించాడు తల్లికి.

ఇంపాలా కారుని కొనాలనే కొడుకుని చూసి లావణ్యా మురిసిపోయింది. అంతమంచి ఆలోచన పెట్టుకొనే ఎత్తుకి ఎప్పుడు ఎదిగి పోయాడని ఆలోచించి-'యస్' అని ప్రేమగా తల నిమిరింది. అదిగో అలాంటప్పుడే కన్న కొడుకుమీద జీవితంలో తొలిసారి ప్రేమ పుట్టుకొచ్చింది.

రాత్రి పడక గదిలో నైట్ గౌను మార్చు కుంటూ, భర్తను ఉద్దేశించి లావణ్యా అంది—

"బాబ్జీ మిమ్మల్ని లక్ష అడిగాడట. మీరు 'నో' అన్నారట. నిజమా?" ఏ సందర్భంలో ఆమె భర్తను అర్థించదు. ఆజ్ఞాపిస్తుంది. అమ్మగారి మాటమీద, బాబుగారి మాట కింద వుండాల్సిందే.

నారింజరంగు లైటు వెలుగులో మెత్తని పరుపుమీద కూర్చొని, బూతు పుస్తకంలో బట్టలేని బొమ్మల్ని-భగవద్గీతలోని శ్రీకృష్ణ భగవాణ్ని చూసి తరిస్తున్నట్లుగా మత్తుగా కసిగా చూస్తున్న అతను, భార్య మాటకి వులిక్కిపడి 'అవును' అని సమాధానం యిచ్చాడు.

అంతే! నారింజ రంగులైటు ఆరిపోయింది. అంతా చీకటి. ఏమీ కనిపించనంత చిక్కటి చీకటి పరుచుకుంది. ఈ సీనులో దృశ్యంలేదు. శబ్దం మాత్రం మహా జోరుగా వుంది.

"చూడండీ! మనకి వున్నది వాడొక్కడే. మనకి వున్నది వాడిదే. లక్ష యివ్వకపోతే చచ్చిపోతానంటున్నాడు. వాడు లేనితర్వాత ఈ లక్షలెందుకు? అయినా-బాబ్జీ ఎంత అడి గాడు. ముష్టి లక్ష. ముష్టి వెధవలకి పంచి పెట్టడానికి అడగడంలేదండీ. ఇంపోర్టెడ్ ఇంపాలా కారు కావాలని ముచ్చటపడు తున్నాడు. వాడికి అంత మంచి ఆలోచన వచ్చినందుకు మీరు ముచ్చటపడాలి. వాడి ఆలోచనల ఖరీదు లక్షల విలువ చేస్తుందని గర్వపడాలి....ఇంట్లో డబ్బే యిస్తారో, వీధిలో సొమ్మే యిస్తారో నాకు తెలేదు. మీరు బాబ్జీకి లక్ష యిచ్చితీరాలి. లేదంటారా....నా నగా గట్రా అమ్మేస్తాను. చాలకపోతే, నే నెవరికైనా అమ్ముడుపోతాను. బాబ్జీకి కావలసిన డబ్బు యిస్తాను. ఆలోచించు కోండి...." ఆమె హెచ్చరికకు తిరుగులేదు. తర్వాత-అంతా నిశ్శబ్దం.

ప్రాబ్లెం రేపటికి సెటిలయిపోతుందనే ధైర్యంతో లావణ్యా తొందరగా నిద్రలోకి జారిపోయింది.

* * *

జీవితంలో తొలిసారి పరమహంసకి దెబ్బ తగిలింది.

అయ్యో, ఎక్కడ?

అతని ఒంటిమీద అనుకుంటే పొరపాటు పొరబడినట్లే. స్వాతంత్ర్య పోరాటంలో ఒళ్ళు విరిచి, ఆంగ్లేయుల తుపాకీ గుళ్ళకి ఎదురుగా నడిచిన రోజుకూడా అతనికి పిసరంత దెబ్బ తగల్లేదు. పోనీ-మనసనే గ్లాసుమీద తగిలి, పగిలిపోయిందనుకుంటున్నారా? అలా అను కుంటే నేను నవ్వుతాను. మురికిపేటలో గుడి సెలు కాలి బూడిద కాగా, వాళ్ళకి అందజేసిన సహాయంలో సగానికిపైగా మిగుల్చు కున్నప్పుడు-అతని మనసు నిజంగా గ్లాసే అయితే పగిలిపోయేది. దారుణంగా ప్రమా దానికి గురైన కార్మికుల కుటుంబాలకు ముట్ట జెప్పిన నెత్తురు కూడులో వాటా తీసుకున్న రోజున అతని మనసు ముక్కలయిపోయేది. బంగారంలాంటి అతని అంతస్తు పునాది రాళ్ళను తడిపి, గట్టిచేసినది పేదవాళ్ళ కన్నీళ్ళూ, ఊపిరే అని తెలుసుకున్న క్షణంలో అతని మనసు బద్దలయిపోయేది. కానీ, అది పగల్లేదు. బద్దలు కాలేదు. కాబట్టి అతని మనసుకి దెబ్బ తగిలిందనుకుంటే పొరబడి నట్లే. తన ఉప్పు తింటున్నవాడు, తన రహ స్యాన్ని బయట కక్కినందుకు ఏళ్ళ తరబడి సంపాదించుకున్న పరమహంస మంచితనం మీద దెబ్బ తగిలింది. అతని గుడ్‌విల్‌కి దెబ్బపడింది. అది అతని వ్యాపారికి కాన్స రవుతుంది.

ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్నవారికి గాంధీ,

నెహ్రూ అంటే యెవరో తెలీదు. అలాంటి వాళ్ళు—తమ కంపెనీలో ఏదో డిపార్టుమెంటులో పనిచేస్తున్నారు కాబోలనుకుంటారు. రాజకీయాలు గురించి, నాయకుల గురించి మాట్లాడుకొనేటప్పుడు వాళ్ళకి శ్రీమాన్ పరమహంసగారే గుర్తుకు వస్తారు. యూనియన్ ప్రెసిడెంటుగా, కార్మికసంఘ నాయకుడుగా కాలనీ పెద్దమనిషిగా, రాజకీయ నీతిపరుడుగా, మలినంలేని మంచివాడుగా, చాలా ఉత్తముడుగా, జాతిరత్నంగా .... ఇలా ఎన్నో రకాలుగా అతన్ని ఎరుగుదురు. వాళ్ల ఉద్యోగాలు నిలబడ్డానికి, జీతాలు పెరగటానికి, వారసత్వం చట్టం అమల్లోకి రావడానికి, కార్మికుడికీ యజమానికీ మధ్య సత్సంబంధాలు కుదరడానికీ.... యిలా యెన్నో సాధించడానికి అతనే కారణం అంటారు. వాళ్ల ఉద్యోగాలు నిలబెట్టినప్పుడు పరమహంస తనవాళ్లకి ఉద్యోగాలు వేయించుకున్నాడని, జీతాలు పెంచినప్పుడు అతను బంకళా కట్టించాడని, వారసత్వం చట్టం వచ్చినప్పుడు కారు కొన్నాడని, కంపెనీకి వర్కర్సుకి మధ్య సత్సంబంధాలు కుదిర్చినప్పుడు పెద్ద మొత్తం కమీషన్ కొట్టేశాడని పూర్ ఫెలోస్ వాళ్ళకి తెలీదు. వాళ్ళకి దొరలా కనిపిస్తూ బ్రతకడమే పరమహంస ప్రత్యేకత.

క్రిందటి రాత్రి—అతని అర్ధాంగి అల్టిమేటం యిచ్చింది, 'లక్ష యిమ్మని'.

'డామిట్....ఒకటికి అయిదు సున్నాలు చేరిస్తేగాని లక్షకాదు. ఒక్కొక్క సున్నా వెనుక యెంత శ్రమ దాగి ఉంటుందో నీకు తెలుసా?' అని మనసులో అనుకున్నాడుగాని పైకి మాత్రం అనలేకపోయాడు. లక్ష ఇవ్వకపోతే లావణ్య అన్నంతపని (ఎవరికైనా అమ్ముడు పోవడం) చేస్తుంది. ఈ అల్టిమేటం గురించి ఆలోచించక తప్పలేదు. 'పుత్ర వెధవకి సరదా తీర్చుకుందుకి లక్ష కావాలిట' పరమహంసకి బాబ్జీమీద కోపం వచ్చింది.

ఇనప్పెట్లోది తీసిగాని, బ్యాంక్‌లోది డ్రా చేసిగాని లక్షరూపాయలు కారుకోసం తగల బెట్టలేడు.గడించినదాంట్లో లక్ష తరిగిపోతుంది. తను ఒక లక్ష కిందికి ఉండాలి. ఇంతవరకు జీవితంలో మీదికే వెళ్లాడు. ఆ రాత్రి లక్ష గురించి లక్ష ఆలోచనలు ఆలోచించాడు. ఆ లక్ష నుండి లక్షలు విలువచేసే లక్షణమైన ఓ ఆలోచన తట్టింది. తన ఇనప్పెట్లోదిగాని, బ్యాంక్‌లోదిగాని డబ్బు తీయవలసిన అవసరం లేదు.

బోనసులు యివ్వటానికి నిరాకరించిన యాజమాన్యాన్ని నిరసిస్తూ, నలభై రోజుల్నుండి సమ్మె సాగిస్తున్నారు కార్మికులంతా. అంతా ఒక్క మాటమీద ఒక బాటమీద నడుస్తున్నారు, కంపెనీ యజమానుల్ని తమ దారికి తీసుకురావటానికి. కానీ, యజమానులు దారికి రాలేదు. అడ్డదారులు వెదికారు. బోనసులు యిస్తే ఏడాదికి పదిలక్షలు ఖర్చవుతుంది కంపెనీకి. ఒకసారి బోనసు ప్రకటిస్తే, అది జన్మహక్కుగా మారిపోతుంది కార్మికులకు. ఇచ్చేవాడుంటే యెన్నిసార్లయినా చెయ్యి చాపి అడుక్కుంటారు. అందుకే—యూనియన్ ప్రెసిడెంటుగారికి కబురు చేశారు. స్ట్రయిక్ కాలాఫ్ చేస్తే, ప్రతిఫలంగా లక్షన్నర నెట్ క్యాష్ ఇస్తానన్నారు. మధ్యవర్తి సంప్రదింపులు సాంప్రదాయ బద్ధంగా జరిపించారు.

సమ్మెలో విజయం సాధిస్తే, కార్మికులకు బోనసులు అందితే కృతజ్ఞత పేరుతో తనకి వచ్చేది ముష్టి పదివేలుకన్న ఎక్కువ ఉండదు. కాని యాజమాన్యంతో తన చేతులు కలిపితే, ఇంట్లో అల్టిమేటంను తట్టుకోవచ్చు. ఇంకా యాభైవేలు యినప్పెట్లో జాగ్రత్త చేయొచ్చు. పరమహంస ఆలోచనకి తిరుగుండదు.

అమోఘమైన తెలివితేట లుపయోగించి, సమ్మెను కార్మికులచేత విరమింపజేశాడు. 'ప్రెసిడెంటుగారు సెప్పారు. మనం పనిలోకి జేరిపోవాల' అందరూ చేరిపోయాడు. పరమహంస చేతికి లక్షన్నర ముట్టింది. 'తొందర్లో బోనసు లిత్తారంట' లాంటి ఆశ కార్మికుల్లో మిగిలింది. బుర్రలో కాస్త తెలివి ఉండాలేగాని మందలాంటి జనాన్ని యెలాగైనా నమ్మించవచ్చును.

ఇరవై ఏళ్లుగా అతను వాళ్ళని నమ్మిస్తున్నాడు. వాళ్ళ మంచితనం పొందుతున్నాడు. కానీ ఈ రోజున ఏళ్ళ తరబడి తను సంపాదించుకున్న మంచితనంమీద దెబ్బ తగిలింది. తను లాలూచీలు చేసి సమ్మెను విరమించినట్లు యజమానుల దగ్గిర డబ్బు తీసుకొని కార్మికులకు అన్యాయం చేసినట్లు వదంతులు మొదలయ్యాయి. అవి అంటురోగంలా అందర్నీ సోకి, తన వినాశనానికి దారి తీస్తాయి. తనలో గుట్టుగా ఉన్న మరో మనిషిని ఎవరు బయటకు లాగారు?

పరమహంస కళ్ళు ఎర్రబడ్డాయి. ఎర్రబడ్డ సూర్యుడిలా కోపం బుసలుకొట్టింది, బుసలు కొట్టే కోడెత్రాచులా. ఆ వేశం వరదలై పొంగింది, పొంగిన వరదలా.

తన ఉప్పు తింటూ బతుకుతున్నవాడు ఎదురుగా నిలబడి వున్నాడు. చేతులు కట్టుకొని, నేలచూపులు చూస్తూ, మంచివాడిలా మంచి పోజు పారేస్తున్నాడు.

"ఈ యింటి ఉప్పు తింటున్న సంగతి యెప్పుడు మరచిపోయేవు?"

"లేదు సార్...."

చెంప ఛెల్లుమంది—ఉప్పు తిని బ్రతుకుతున్నవాడికి.

"నిన్ను నా సొంతమనిషిలా చూసుకున్నాను. నాతో తిప్పుకున్నాను. నేనుచేసే ప్రతి పనీ నీ చేతిమీదుగా జరిపించాను. ఎందుకని? నీ మీద నమ్మకం ఉండటంచేత. నీలో కుక్కకున్న విశ్వాసం ఉందని నమ్మడంచేత. కానీ, నువ్వు మామూలు కుక్కలా వాళ్ళ మధ్యకి పోయావు. వాళ్ళకి బోనసులు లేకుండా, అన్యాయం చేశానని అరిచావు. నా మంచితనానికి మచ్చ పెట్టావు. ఇన్నాళ్ళు లేనిది—ఈ రోజున నీ బుద్ధి యెందుకు మారింది? బాస్‌ని మోసగించి, బాగుపడాలనే ఉద్దేశం యెప్పుడు కలిగింది? డబుల్‌గేమ్‌తో డబ్బు సంపాదించాలనే ఆలోచన యెప్పుడు వచ్చింది? యూ....

చీట్..... రెచెడ్....కట్ త్రోట్....నేను సహించను.

"నిప్పు పెట్టినవాడివి నువ్వు. తొందరగా నీళ్ళుపోసి, రగులుతున్న మంటల్ని ఆర్పు. లేకపోతే నీ నూరేళ్ళ బ్రతుకును ఆర్పేస్తాను. చితి పేర్చి నిప్పు పెట్టేస్తాను. నీకు అన్నీ చేతనవును. చేతనవును గనకనే నీ కీ ఛాన్స్ యిస్తున్నాను. వెళ్ళు.... వెళ్ళు.... వెళ్ళు...."

పరమహంస మాటలకి ఉప్పు తింటూ బ్రతుకుతున్నవాడు గజగజ వణికిపోయాడు. అది గమనించకుండా పరమహంస అక్కడ నుండి విసురుగా వెళ్ళిపోయాడు. తన గుడ్ విల్ పొజిషన్ నార్మల్‌కి తెస్తాడనే నమ్మకం అతని అంతరాల్లో లేకపోలేదు.

* * *

జీవితంలో తొలిసారి నారాయణకి ఆపద వచ్చింది.

ఎలాంటిది?

పుట్టిన బిడ్డకి తల్లిపాల్లేక పాలడబ్బాకోసం బజారుకి వెళితే, అది బ్లాక్‌లో అమ్ముడు పోగా—యేం చేయడానికి పాలుపోక, నిస్పృహా యంగా నిలిచిన సామాన్య తండ్రికి వచ్చిన ఆపదలాంటిది కాదు. కన్నకూతురు గుండెల మీద బరువుకాగా, కట్నాల మార్కెట్టులో బేరం కుదరక, పెళ్ళి చేయలేక, గొంతు పిసికి చంపలేక—తను చావలేక బతకలేక మొండిగా మిగిలిన మధ్య తరగతి మనిషికి వచ్చిన ఆపద కాదు. నారాయణకి వచ్చిన ఆపదకు అర్ధం వేరు.

ఆ ఆపద అర్ధం తెలుసుకోవాలంటే—పరమహంసకి నారాయణకి మధ్య జరిగిన కథా కమామీషూ ముందుగా తెలుసుకొని తీరాలి.

నారాయణ 'మినీ మ్యాన్' అనుకుంటున్నారా? అతను వయసులో, బుద్ధిలో, ఆలోచనలోకూడా చిన్నవాడు కాదు. మధ్యతరగతిలో 'ఏ' వర్గం 'బి' వర్గం రెండు ఉన్నాయి. 'ఏ' బాపతు బాగా చదువుకున్నవాళ్ళు. బతకడం చేతకానివాళ్ళు. నీతీ న్యాయమూ అని వేళ్ళాడుతారు. జీవితంలో ఓడిపోయి, వేలాడిపోతారు. 'బి' వర్గం బ్రిలియంట్స్. చదువు లేకపోయినప్పటికి బతకడం చేతనయినవాళ్ళు. ఓ పెద్దవాడి నీడను చేరి, అతన్ని అండగా చేసుకుంటారు. ఆ నీడను ఆకాశానికి ఎత్తేస్తారు,అడుగులకి మడుగులు వత్తుతారు. బానిసల్లా పడి ఉంటారు. ఆ అండ—ఎంగిలిచేసి విడిచేసినది అందుకుంటారు. ఆ ఎంగిలిమెతుకుల్లో మేలిమి బంగారాన్ని తీసి, మేడలూ మిద్దెలూ కట్టించేస్తారు. బ్లాకులో అమ్ముడయ్యే పాలడబ్బాలు, కట్నాల మార్కెట్టులో బేరం కుదరని గుండె బరువులు, పరీక్ష ఫీజులు కట్టని కాలేజీ చదువులు, డబ్బులేక నిర్లక్ష్యం చేసిన రోగాలు లాంటి ఆపదలు వాళ్ళకి ఉండవు. అదిగో—అలాంటి ఆపదలు లేని వర్గానికి చెందినవాడే నారాయణ.

సింహంలాంటివాడు పరమహంస అయితే—ఆ సింహాన్ని అంటిపెట్టుకొని, నిత్యం తిరిగే గుంటనక్క నారాయణ. ఇది ప్రజల నానుడి. నిజానికి సింహానికి ఆకలిగా ఉన్నప్పుడే వేటాడుతుంది. తనకి కావలసినది, కావలసినంత తిని ఊరుకుంటుంది. కానీ, ఈ సింహం స్వభావం వేరు. కడుపులో దండిగా ఉన్నప్పటికీ అవకాశం దొరికితే వేటాడుతుంది. రక్తం తాగేస్తుంది. మాంసం తినేస్తుంది. నక్కకి మిగిలేవి ఎముకలు బొమికలు మాత్రమే.

ఆ ఎముకలు బొమికలతోనే గుంటనక్క అని పిలవబడే నారాయణ చక్కని మేడలు కట్టించాడు. అద్దెలమీద నెలకి వెయ్యి పైగా గడిస్తున్నాడు. టాక్సీలు నడిపిస్తున్నాడు.వడ్డీలకు డబ్బు తిప్పుతున్నాడు. ఇంకాయేవో లాభసాటి వ్యాపారాలు చేస్తున్నాడు.

"బతకడానికి డబ్బు కావాలి. డబ్బు కావాలంటే నేను పరమహంస బాబుగారిదగ్గర పడి ఉండాలి. నేను నీకు మొగుణ్ణే. కాదనను.కానీ, నీతో కాపురం చేయటానికీ, కబుర్లు చెప్పటానికీ నాకు టైం ఉండదు. వీలుంటే వచ్చే జన్మలో కాపురం చేసుకుందాం" భార్యతో కాపురం చేయడం మానుకున్నాడు, నారాయణ. అయ్యగారి చీకటి వ్యవహారాలన్నీ అతనే చూడాలి. చీకటినుండే పసిబిడ్డ పుడుతుంది.

చీకటినుండె తెలివి ఉద్భవిస్తుంది. చీకటినుండే డబ్బు వస్తుంది. బాబుగారికి బ్రాందీ అందివ్వడం మొదలుకొని, ఇనప్పెట్లో డబ్బు దాచేవరకు అన్నీ నారాయణ చేతులమీదుగా జరగాల్సిందే. పరమహంసబాబు యింట్లో ఉన్నా, వీధిలో తిరిగినా, ఢిల్లీ కెళ్ళినా, కంపెనీలో కాలు పెట్టినా, కారులో కదిలినా, విమానంలో ప్రయాణం చేసినా—అతనిప్రక్క నారాయణ ఉండాల్సిందే. అతనికీ బాబుగారి సమక్షంలోనే కాలం గడిచిపోతుంది. కాపురం చేయడానికి తీరిక దొరికేది ఎప్పుడు?

ఒక సందర్భంలో అంతటి భక్తుడికి స్వామి ద్రోహం చేయాలనే తలంపు కలిగింది.

ఆ రోజు—లక్షన్నర కంపెనీ మేనేజ్ మెంటువారినుండి తీసుకొని, పరమహంస బాబు యినప్పెట్లో దాచేటప్పుడు, ఎంగిలి మెతుకులమీద ఏవగింపు కలిగింది నారాయణకి.

ఎన్నాళ్లు ఎంగిలి మెతుకులతో సరిపుచ్చుకోవాలి? బాబుగారు ఏం కష్టపడ్డారు గనక లక్షన్నర తీసుకుంటున్నారు? ఆ సొమ్ములో తనకీ వాటా యెందుకు యివ్వకూడదు? ఇలాంటి ఆలోచనలు నారాయణ బుర్రలో కలిగాయి.

"బాబుగారూ! ఇది అన్యాయం. ఆలోచన నాది. శ్రమ నాది. మీ గురించి నా పెళ్ళాంతో కాపురం చేయడం మరిచిపోయాను. కానీ, నాకు ఎంగిలి మెతుకులతో సరిపెట్టేస్తున్నారు. న్యాయంగా నాకూ వాటా యివ్వాలి. మీరు పెద్ద దొంగయితే, నేను చిన్న దొంగను. మీ సుపుత్రుడికి ఇంపాలా కొంటే, మా కుర్రాడికి స్కూటరయినా కొనాలిగదా! మీరు కాదంటే —మీ జాతకం పదిమందిలో చదివేస్తాను. తర్వాత మీ యిష్టం" అని బెదిరించాలనుకున్నాడు, మనసులో. కానీ, అలా అడగలేదు. అడగలేకపోయాడు.

"బాబుగారూ! అయిదువేలు నా మొహాన్ని కొట్టండి. చాలా అవసరాలున్నాయి అని" చాలా వినయంగా అడిగాడు, ఇనప్పెట్టె తాళంచెవులు పరమహంస చేతికిస్తూ.

నారాయణవేపు ఎగాదిగా రెండుసార్లు కోపంగా చూశాడు! పరమహంస. రెండువందలు తీసి, నారాయణ మొహానికేసి కొట్టాడు, మళ్ళీ అలా అడగొద్దని వార్నింగిస్తూ.

నారాయణకి ఉక్రోషం పొడుచుకొచ్చింది. ఆ క్షణంలో తన తెలివితేటలతో బాబుగార్ని సర్వనాశనం చేయాలనిపించింది. బోనసుల విషయంలో అయ్యగారు చేసిన అన్యాయాన్ని జనాలకి చెప్పేస్తే, తర్వాత కథ దానంతట అదే నడిచిపోతుందని ఆలోచించాడు.


అక్కడ ఉన్న జనాలు ఒక గొర్రెమంద. ఆ మందని మాయచేసి యెటైనా తీసుకుపోవచ్చును. ఏ గోతిలోకైనా దించవచ్చును. అలాంటి మందలో ఒక గొర్రెపిల్ల ఉంది. అది అప్పుడప్పుడు మందని అనుసరించకుండా వెనక్కి ఆగిపోతుంది. పైగా మెడ తిప్పుతూ అన్నివేపులకి చూస్తుంది. ఆ విషయాన్ని—చాలాసార్లు గమనించిన నారాయణ, గొర్రెపిల్లను చేతుల్లోకి ప్రేమగా తీసుకొని—'అయ్యగారు చేసిన అన్యాయాన్ని' చెవిలో ఊదాడు.

అదీ సింహానికి గుంటనక్కకి మధ్య జరిగిన కథాకమామిషూ.

పరమహంస—ఆవులించకుండానే ఎదుటివాడి పేగులు ఎన్నో లెక్కకట్టేస్తాడు. ఆవులిస్తే పేగులు బయటకి లాగి, పేగులు గలాన్నె లెక్క చూసుకోమంటాడు. ముందు రోజున అయిదువేలు అడగడం, మర్నాడు జనాల్లో వదంతులు లేవడంవలన—నారాయణ 'నమక్ హారామ్'లా దొరికిపోయాడు.

నారాయణ తెలివితేటలు బాగానే ఉపయోగించాడుగాని తొందరపడ్డాడు. తొందరపడి, తన పేగులు లెక్కకి యిచ్చేశాడు. బాబుగారు అన్నంత పని చేస్తారు. మనిషిని కాల్చి బూడిద చేస్తారు. దీనికి మరో అర్థమే ఆపద. చాలా మందికి ఆపదలు వచ్చాయి. కానీ, కాలి బూడిద కాకముందే బాబుగారు చెప్పినట్లు చేసి, ఆపదలు తప్పించుకున్నారు. ఇప్పుడు—తను బాబుగారు చెప్పినట్లు చేయకపోతే ఆపదకి గురైన మొదటి వ్యక్తి నారాయణే అవుతాడు.

జీవితంలో తొలిసారి నారాయణకి ఆపద



వచ్చింది. ఆ ఆపదనుండి బ్రతికి బయట పడాలి.

ఆ రోజు బాబుగార్ని అడిగి, సెలవు తీసుకున్నాడు. ఆ రోజంతా మందు కొట్టాడు. మందు కొడుతూ ఆలోచించాడు.

మందు బాగా పని చేసింది. మంచి ఆలోచన తట్టింది.

గొర్రెపిల్ల దగ్గరకి నారాయణ మళ్ళీ పరుగెత్తాడు.

"చూడబ్బాయ్....నువ్వేదో చదువుకున్న వాడివని, తెలివైనవాడివని, చురుకైనవాడివని అనుకున్నాను. యూనియన్ ప్రెసిడెంట్ గార్ని యెదిరించి అడిగే గుండెనిబ్బరం ఉందని అంతా నీతో చెప్పాను. కానీ, విని నువ్వూరుకున్నావు. మరో పదిమందితో చెప్పేస్తే, నీ డ్యూటీ అయిపోయిందనుకున్నావు. అవునా? పదిమంది పదిమంది చెవులు కొరుక్కోవడంతో సరిపోతుంది. అందరూ కలిసి రావాలి. నువ్వు నడుంకట్టి ముందుకి సాగాలంటే—అక్కడ అయ్యగారు మీకోసం ఎదురుచూస్తూ ఉండరు. ఏదో ఆలోచిస్తాడు. తనని తాను ఉద్ధరించుకోవడానికి ఏమైనా చేస్తాడు. నష్టపోయేది నువ్వూ.... నీ జనాలూ....

"ఆలస్యం చెయ్యకుండా యిప్పుడే పరమహంసగాడింటికి వెళ్ళు. ఇంతమంది కార్మికుల కంట్లో కారం జల్లి; అన్యాయం యెలా చెయ్యగలిగావు? నువ్వు లక్షలు సంపాదించుకోవడం కోసమా నలభై రోజులు మాచేత సమ్మె చేయించావు? నిన్ను నమ్ముకొని బతుకుతున్న మా నెత్తురుకూడే నీక్కావలసి వచ్చిందా? అని గట్టిగా అడుగు. అణ్ని బయటకి లాగు. వీలుంటే పదవినుండి తప్పించు. నువ్వు నడిపించు. నీవాళ్ళ కష్టాల్ని నువ్వే చూడు. నన్ను సాయంగా ఉండమంటావా? ఉంటాను. సాక్ష్యం రమ్మంటావా? వస్తాను." ఇంకా చాలా చాలా నూరిపోశాడు గొర్రెపిల్ల బుర్రలో. ఆవేశం పుట్టించాడు. గుండెబలం యిచ్చాడు. తన జాతి మనుషులకోసం యేదో చెయ్యాలనే తపన కలిగించాడు.

గొర్రెపిల్ల ఆలోచనలో పడగానే—నారాయణ తర్వాత జరిపించవలసిన కార్యక్రమాన్ని నెమరువేసుకుంటూ వెళ్ళిపోయాడు.

* * *

జీవితంలో తొలిసారి వివేకం ఓడిపోయాడు.

ఎప్పుడండీ?

అసలు వివేకం యెప్పుడు ఓడిపోలేదు గనుక. శ్రీరామచంద్రుణ్ణి మోసంచేసి, అతని అర్ధాంగి సీతాదేవిని రావణాసురుడు లంకకు తీసుకొని పోయినప్పుడు వివేకం ఓడిపోలేదా? జూదంలో ధర్మరాజుని ఓడించి, కౌరవులు—అన్నదమ్ములనికూడా అలోచించకుండా పాండవుల్ని అడవులకి పంపించిన రోజున వివేకం ఓడిపోలేదా? ఇప్పుడూ అదే పరిస్థితి.

డిగ్రీలు చేతబట్టుకొని ఇంటర్వ్యూకి వెళ్ళి, ఆశగా ఉద్యోగంకోసం యెదురుచూస్తున్నప్పుడు—మినిస్టరుగారి బంధువు రికమెండేషన్‌తో అది కాస్తా యెగరేసుకుపోయినప్పుడు వివేకం ఓడిపోవడంలేదా? ఒంటరిగా నిస్సహాయంగా జీవితంలో మిగిలిన అందమైన అమ్మాయిల్ని జాలితో చేరదీసి, విదేశాలకు అమ్ముకున్నప్పుడు వివేకం ఓడిపోవడంలేదా? డబ్బుకోసం మమకారాన్ని చంపుకొని, కన్నబిడ్డలకి తల్లిదండ్రులకు మధ్య అగాధాలు యేర్పడినప్పుడు వివేకం ఓడిపోవడంలేదా? ప్రతి రోజు, ప్రతి చోట ఎన్నో రకాలుగా వివేకం ఓడిపోతున్నప్పుడు—ఈ వివేకం ఓడిపోవడంలో వింత లేదు. ఆశ్చర్యంలేదు.

అయితే—ఈ వివేకం యెలా ఓడిపోయాడనే ఆసక్తి మీకుంది కదూ?

వివేకానికి పాతికేళ్ళ వయస్సు. చిన్నప్పట్నుంచి మురికిపేటలో పెరగడంచేత యెన్నో కష్టాలు అనుభవంలోకి వచ్చాయి. ఆ వయసులోనే అతనికి చాలా విషయాలు తెలిసిపోయాయి. ఆకాశం కిందికి దిగిరాదని, మురికిలో ఉండేవాడు మీదికి రాలేడని, పేదవాడి చెమటతో లేచిన కట్టడాల్లో కులికేది ఉన్నవాడేనని, కర్మాగారపు పొగగొట్టాల్లో కాలి బూడిదయ్యేది కార్మికులేనని, రిక్షా రాముడు తన పిల్లలకి డబ్బు లేకపోవడంవల్లే చదువు చెప్పించలేదని, రాజయ్య కూతురు లేచిపోవడానికి కారణం అతని పేదరికమేనని....ఇలా ఎన్నో ఎన్నో అతనికి తెలుసు. ఏదో ఏదో చేసి—ఈ వ్యవస్థనీ, ఈ మనుషుల్నీ మార్చాలని ఉంది. నింగీ నేలా ఒకటిచేసి, మనసుకి మనసుకి మధ్య ఉన్న తేడాల్ని తుడిచేయాలని ఉంది.

అతను అనుకుంటున్నాడే గాని—అతన్ని ఒక్క అడుగు ముందుకి వెయ్యనివ్వడం లేదు, తనతో కలిసి బతుకుతున్న మనుషులే.

అక్కడ ఉన్న కంపెనీలో అతనూ ఓ చిన్న కార్మికుడు. అతను చదువుకోలేదు. కానీ, జీవితంనుండి చాలా పాఠాలు నేర్చుకున్నాడు. అతనికి అమ్మా, అక్కా, నాన్నా, అన్నా ఎవరూ లేరు. ఆ మురికిపేటలో ఉన్నవాళ్ళందరూ అతని తల్లిదండ్రులే. అన్నదమ్ములే. అక్కచెల్లెళ్ళే. ఆత్మీయులే. వాళ్ళకోసం తను కాలిపోయినా ఫరవాలేదు. వాళ్ళ బతుకులోకి కాంతి రావాలి. ఆ బతుకులు తెల్లవారిపోకూడదు. ప్రతి క్షణమూ వివేకం ఆలోచిస్తుంటాడు.

మొన్నటికి మొన్న కార్మికులంతా సమ్మె చేసినప్పుడు ఏమైంది?


ఒక్క మాటకోసం, ఒక్క ప్రయోజనం కోసం అంతా కట్టుబడి వున్నారు. కష్టాల్ని దిగమింగుతూ, జీవిత పోరాటం సాగించారు. మురికిపేటలో ఉన్నవాళ్ళంతా పస్తులతో మలమల మాడిపోయారు. ఆ సమయంలోనే—పన్నెండేళ్ళ సత్తిబాబు బ్లాక్‌లో టిక్కెట్లు అమ్ముతుండే దొమ్ములాట జరిగి, కాలు విరగ్గొట్టుకున్నాడు. చిన్నతాత మందులు కొనలేక, దగ్గి దగ్గి దగ్గి చచ్చిపోయాడు. పిల్లల ఆకలి తీర్చడంకోసం కాలు జారినందుకు తాయార్ని కత్తితో పొడిచేశాడు, వెంకటేశం. కాలేజీ కుర్రాళ్ళ క్యారేజీల్లో అన్నం దొంగతనం చేసినందుకు పదహారేళ్ళ పంకజాన్ని పోలీసులకు అప్పగించారు. చాలా జరిగిపోయాయి.

ఎన్ని ఆపదలు వచ్చినా, ఎవరూ జంకలేదు. అన్నిటికీ ఆ పరమహంసబాబు ఉన్నాడనుకున్నారు. కానీ, ఆ బాబు ఏం చేశాడు?

అర్ధాంతరంగా సమ్మెను అపుజేశాడు.

అతను సాధించినది యేమిటో చెప్పలేదు. ఇంతకాలం చూస్తూ బతుకుతున్న కార్మికులకు చల్లని కబురు వినిపించలేదు. పరమహంస మాట విని, అంతా పనిలో చేరిపోయారు.

ఆ బాబుమీద వివేకానికి యెప్పుడో అపనమ్మకం యేర్పడింది. నిజంగా అతను కష్ట



"శృంగాభలం తైలం వాడానా? లేకపోతే పందక్కి అల్లుడొచ్చాడా?"

"రెండూ లేదు! తిరపతి వెళ్ళొచ్చాను!"

జీవుల్ని ఆదుకునేవాడైతే—అంత కలిమి అతనికెలా వచ్చింది? కష్టాల్ని పంచుకోవలసినవాడే తమ కష్టాన్ని కాజేస్తున్నాడు. నమ్ముకున్న నాయకుడే తమని నాశనం చేస్తున్నాడు. అతను చేస్తున్న అన్యాయాన్ని వదిలించాలి. ఆ మాట వివేకం అందరిముందూ చెప్పాడు.

పరమహంసబాబు మంచిచేస్తాడని నమ్మడం చేతనో, పెద్దవాణ్ని ఎదిరించే దమ్ము లేకనో, వివేకం మనసు యెదగలేదనో, చీకట్నుంచి బయటపడాలనే బుద్ధి వాళ్ళకి లేకనో—మరి యెందుచేతనో యెవరూ వివేకం మాట వినిపించుకోలేదు.

అదిగో—అలాంటప్పుడు నారాయణ నారాయణుడిలా ప్రత్యక్షమై, వివేకానికి రామకృష్ణ పరమహంసలా బోధ చేశాడు. వివేకం మనసులో అనుమానం బలపడింది. అక్రమాన్ని చూస్తూ వివేకంగా సహించలేకపోయాడు.

వివేకం ఒంటరిగా ముందుకు నడిచాడు.

"అమ్మా! బాబుగారున్నారా?" వివేకం చేతులు కట్టుకొని అడిగాడు. అతని మాటలో ఆవేశం అయితే వుందిగాని తరతరాలుగా పెద్దవాడి ముందు కైమోడ్పు చేతులతో ఒదిగి ఉండాలనే యేదో ఆచారం లాంటిది ఆ క్షణంలో అతన్ని ఆవహించింది.

డాఫ్న డి మారియర్ రాసిన 'రెబకా' నవల చదువుతున్న—'అమ్మా' అని పిలవబడిన లావణ్య పుస్తకంనుండి చూపు మరల్చి, తలపైకెత్తి చూసింది. వివేకం రాకకోసమే ఎదురుచూస్తున్నట్లు చిరునవ్వు నవ్వింది.

అతని ప్రశ్నకి జవాబులేదు. అతన్ని రమ్మంది. ఏదోలా చూస్తూంది. మరేదోలా మాట్లాడుతుంది. ఎందుకని? ఏమో తెలీదు అనుకున్నాడు, వివేకం.

"అమ్మా! మీతో కబుర్లు చెప్పటానికి నేను రాలేదు. మా కడుపులు మండుతున్నాయి. ఆ మంటకి కారణమైన బాబుగార్ని పిలవండి. ఇన్నాళ్ళు బాబుగార్ని నమ్మి అతను చూపించిన దారిలో నడిచాం. మేం వెర్రివాళ్ళం. మాకు యేమీ తెలీదు. కానీ, నొప్పి కలిగిన తర్వాత-బాబుగారు మమ్మల్ని ముళ్ళదొంకలుమీదికి లాగడంలేదని యెలా అనుకోమంటారు?....ఈ యింట్లో పరుచుకున్న ప్రతి అంగుళం సుఖం మా కన్నీటి బొట్టేనమ్మా. ఇప్పుడు మా కన్నీరు ఆవిరైపోయింది. నలభై రోజులు సమ్మె చేసి, అలిసిపోయాం—అయ్యగారితో చెప్పండి. మురికిపేట మనిషి వచ్చాడని. బోనసుల విషయమై జవాబు కావాలంటున్నాడని చెప్పండి. ఇంకా మమ్మల్ని మోసం చేయొద్దని తప్పించుకోవడానికి ప్రయత్నం చేయొద్దనికూడా చెప్పండి. మా శక్తి కదిలితే—మమ్మల్ని యెవరూ ఆపలేరు. చేనును మేసే కంచె అవసరం మాకు లేదమ్మా... పిలవండి. పిలవండి. పిలవండి" మొదటిసారి పేదరికం పెదవి విప్పింది. వివేకంలో కొత్త రక్తం ప్రవహించింది.'

అతని మాటలకి లావణ్య చీదరించుకుంది. గబ గబా ఒకటి....రెండు....పది మెట్లు యెక్కింది. యెక్కినంత తొందరగా కిందికి జారిపోయింది. కెవ్వున అరిచింది. స్టెయిర్‌కేస్ మీది నుండి దొర్లుకుంటూ కింద పడిపోయింది.

వివేకం ఆదుర్దాగా ఆమెని చేతుల్లోకి తీసుకొని సోఫామీద వేయబోయాడు.

అంతే! లావణ్య దిగ్గున లేచింది. రెండు చేతులతో అతని గుండెలమీద దబ దబా

బాదింది. అతని చొక్కా. బనీనూ పిచ్చిగా చింపేసింది. ఆమె చీరా, బ్లవుజూ, గాజులూ, జడ, పూలూ, ఒహ టేమిటి అవసరమైన వాటిని చిందరవందర చేసింది.

"హెల్ప్.... హెల్ప్...." అంటూ పెద్ద కేక పెట్టింది.

వివేకం విసుపోయాడు.

నాటకంలో చంద్రమతిని నరకడానికి హరిశ్చంద్రుడు సిద్ధపడినప్పుడు విశ్వామిత్రుడు, నక్షత్రకుడు, దేవతలు స్టేజీ నాలుగు వింగుల్నించీ పరుగెత్తుకువచ్చినట్లు—పరమహంస, నారాయణ, ఆ రోజు ఆ యింటికి అతిధిగా విచ్చేసిన ఓయస్సయిగారు ఆ క్షణంలో ప్రత్యక్షమయ్యారు. ఆశ్చర్యం, ఎలా వచ్చారు? ఆ మాత్రం పాఠకులు ఊహించగలరు.

"ప్లీజ్, యిన్‌స్పెక్టర్.... హెల్ప్‌మీ.... హెల్ప్‌మీ...." ఒక్కసారి పదిమంది దుశ్శాసనులు మీదపడి, పాడుచేసిన ద్రౌపదిలా ఉంది లావణ్య.

ఇన్‌స్పెక్టర్ హెల్ప్ చేయటానికే కదా వచ్చాడు.

చేయాల్సిన హెల్పంతా చేశాడు.

వివేకానికి—కార్మికుల్ని రెచ్చగొట్టడమన్నా యజమానుల్ని యెదిరించడమన్నా, సమ్మెలు జరిపించడమన్నా, యూనియన్ ప్రెసిడెంట్ పదవన్నా ఇష్టం. అందుకే—జరిగిన సమ్మెలో కార్మికులకు పరమహంసబాబు చాలా అన్యాయం చేశాడని, యాజమాన్యందగ్గర డబ్బు తీసుకున్నాడని పుకార్లు లేవదీశాడు. పదిమందిని కూడదీసుకోవడానికి ప్రయత్నాలు చేశాడు. ఆ మిషతో బాబుగారింట్లో ప్రవేశించాడు. తనకి అడ్డు ఉన్న ప్రెసిడెంట్‌గార్ని తొలగించడానికి వచ్చాడని చెప్పటానికి అతని జేబులో కనిపించిన చాకు చాలు. అతని ఆవేశాన్ని, కుట్రని పసిగట్టిన లావణ్య—ఇంట్లో పరమహంస బాబు లేరని చెప్పింది. బాబుగారిమీద పగతో కోపంతోఅమ్మగార్ని బలాత్కరించబోయాడు. అమానుషంగా ప్రవర్తించాడు. ఇరవై ఏళ్ళుగా ఒళ్ళు మరిచి, అలసటా స్వార్థమూ లేకుండా, కార్మికులకోసం రాత్రి పగలూ పనిచేస్తున్న బాబుగారు యే రోజూ వివేకంలో వక్రబుద్ధిని గమనించలేదు. అతని ఉప్పు తిని, బతుకుతున్న నారాయణ ముందుగా హెచ్చరించకపోతే—బాబుగారు ప్రమాదంలో పడేవాడు. ఇలా ఎన్నో ఎన్నో ఆరోపణలు వివేకంమీద బనాయించారు హెల్ప్ చేయటానికి వచ్చిన యస్సయిగారు.

అందరూ కుమ్మక్కయిపోయారు. కుట్ర చేశారు. తనవాళ్ళ చేతనే 'ఛీఛీ' అనిపించారు. పేదవాడి నోటిని—పలుకుబడి, అధికారం అనే ముతక దారాలతో కుట్టివేశారు.

వివేకానికి సంకెళ్ళు వేశారు.

మనిషి వివేకంలాగే, మన వివేకం కూడా జీవితంలో ఓడిపోయాడు. తొలిసారి ఓడిపోయాడు.

"కార్మికులందర్నీ నమ్మించడంకోసం, వివేకాన్ని మోసగించవచ్చు. జారిపోయిందనుకున్న మంచితనం వాళ్ళదగ్గర మళ్ళీ పరమహంసబాబు సంపాదించుకోవచ్చును. నారాయణ ఉప్పుతిని బతుకుతున్నందుకు మళ్ళీ స్వామిద్రోహం తలపెట్టక పోవచ్చును. లక్షరూపాయలు యిచ్చి కొడుకు ముచ్చట తీర్చినందుకు మొగుణ్ణి—లావణ్య మెచ్చుకోవచ్చును. ఇంపాలా కారులో రాజకుమారుడిలా బాబ్జీ తిరగవచ్చును. వెలుగుని చీకటి మింగేస్తూ ఉండవచ్చును.

"కానీ, ఈ కథ ఇంతటితో ఆగిపోయేది కాదు.

"ఈ రోజు వివేకాన్ని 'ఛీఛీ' అనిన అతని జాతి మనుషుల్లోనే రేపు మరో వివేకం పుడతాడు. అతని తర్వాత యింకొక వివేకం. మళ్ళీ వివేకం. వివేకం. వివేకం. వివేకం. ఒక రోజున — వెలుగుని చూసి చీకటి పారిపోతుంది. అప్పుడు—ఈ వ్యవస్థా, పరమహంసబాబు చీకటిలో కలిసిపోతారు."

జైలు గోడల నడుమ ఒక నంబరుగా కుంచించుకుపోయిన వివేకంలో చైతన్య స్రవంతి సాగిపోతుంది. □

తిరుగులేని తీర్పు

కావ్యకంఠ, గణపతిముని అంటే మనవారికి నూటికితొంభై ఎనిమిదిమందికి తెలియదనేది నాకు బాగా తెలుసు. కారణం ఆయన గాయకుడు కాడు, నటుడు కాడు, రాజకీయ నాయకుడు కాడు, పత్రికా సంపాదకుడు కాడు, పత్రికలకు కథలూ వ్యాసాలూ రాసిన రచయిత కాడు. అందువల్ల మనవారికి చాలామందికి తెలియదు.

ఆయన సంస్కృతభాషలో మహా విద్వాంసుడు, గొప్ప కవి. వ్రాసినదంతా సంస్కృతములోనే వ్రాసి మృదుమధుర పదబంధానికి రెండవ వాల్మీకిగా ప్రసిద్ధుడయిన రచయిత, తపస్వి, మంత్రద్రష్ట. కఠోర నియమాలతో ఒక కొండ గుహలో తపస్సు చేస్తూండగా తపస్సిద్ధి రూపంగా కపాలభేదమయి తిరిగి అది కలిసి ఆ తరువాత సుమారు పదహారు సంవత్సరాలు దివ్యతేజస్సుతో భాసిస్తూ అటు వారణాసి నుంచి ఇటు సేతువువరకు నిరాక్షేపంగా, నిరాయాసంగా తిరిగిన మహామహుడు. అందువల్లనే మనవారికి చాలామందికి ఆయనను గూర్చి తెలియదు.

భారతదేశం పర ప్రభుత్వ బంధమునుంచి తప్పించుకుని ప్రాచీన వైభవముతో భారతజాతి సమున్నత స్థితితో జీవించాలని తన తపశ్శక్తిని ధారపోసి 'ఇంద్రాణి'ని ప్రార్థిస్తూ ఒక మహా గ్రంథం వ్రాసిన భారతీయరత్నం, . ఆశ్వాసాంతం ఖద్దరుకట్టి అస్పృశ్యతా నివారణకు పాటుపడి స్త్రీ స్వాతంత్ర్యాన్ని కోరుతూ వేద శాస్త్ర ప్రమాణ వాక్కులతో మహిళలకు ఉద్బోధించి, మగవారికి కళ్ళు తెరిపించిన ఉత్తమ సంఘ సంస్కర్త, ఆంధ్ర జనని అనుంగు బిడ్డడు ఆ మహనీయుడు.

ఇన్ని మంచిగుణాలున్న మహాత్ముడు మన తెలుగువాడు. కాని ఆయనను గురించి మన వారికి తెలియదు. ఇదివరకు ఒకమారు అన్నాను, ఇప్పుడు మళ్ళీ అంటున్నాను. మన జాతిలో పుట్టడం మన అదృష్టం, అది అతని దురదృష్టం!!!........

1923—డిసెంబరునెలలో కాకినాడలో కాంగ్రెస్ మహాసభలు జరిగాయి. ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ బులుసు సాంబమూర్తి. కావ్యకంఠ గణపతిమునికి ఆహ్వానం వచ్చింది. దేవుడా? దెయ్యమా? అని హృదయ విద్యతో కుస్తీపట్లు పట్టుతూన్న గణపతిముని వెళ్ళనా మాననా అని తటపటాయిస్తూ ఉండగా రైలు కర్చులకుగాను ముప్పై రూపాయల మని ఆర్డర్ వచ్చింది. 'తప్పదు వెళ్ళి' రమ్మన్నాడు ప్రక్కనే కూర్చున్న గురువు. గడ్డం తడుముకుంటూ లేచాడు గణపతి. ఎలాగో ప్రయాణం చేసి కాకినాడ చేరాడు. మర్నాడు సభ. పిన్నలూ, పెద్దలూ, విద్యావంతులూ, నిరక్షరాస్యులూ, పేరుపొందిన కాంగ్రెస్ పెద్దలూ.... సభ కోలాహలంగా ఉంది. బుద్ధిమంతుడైన బులుసు సాంబమూర్తి గణపతిని సభకి ఎరుక పరిచాడు. అలవాటు ప్రకారం అందరూ చప్పట్లు చరిచారు. గణపతి కుర్చీలోంచి మెల్లగా

యామిజాల పద్మనాభస్వామి




గణపతి ముని

లేచి సభను కలయ చూసి గొంతు సవరించాడు.

"స్త్రీల హక్కులను గురించి పెద్దలు ఏమేమో మాటాడేరు. నాకు తోచినవీ భారతీయులు పరమ ప్రమాణముగా ఎంచుకునే వేద శాస్త్ర విషయం నా బుద్ధికి అర్థమయినంతనూ చెప్తున్నాను.

పాపపు పనులు చేస్తే నరకం వస్తుందనే భయం, పుణ్యకార్యాలు చేస్తే స్వర్గసుఖం వస్తుందనే సంతోషం ఆస్తికులకు సహజమైన విశ్వాసం ఉంది. కనుక వేదాధ్యయనం, శాస్త్ర పఠనం, ఉపనయనం, వ్రతాచరణం, యజ్ఞాలు చెయ్యడం అనేవి మనవారికి అవశ్య కర్తవ్యములుగా చలామణీ అవుతున్నాయి. అయితే ప్రాచీన కాలమందు యీ కర్మకాండ వగైరా ఆచరించే హక్కు స్త్రీలకు ఉందా? అని ఎవరికైనా యిప్పటివారికి సందేహం కలగవచ్చు. స్త్రీలకు మగవారికి ఉన్నట్టే యీ హక్కు సంపూర్ణంగా ఉందని నేను నొక్కి వక్కాణిస్తున్నాను. కాలక్రమాన వచ్చిన మార్పులకు లొంగి ఆర్థికశాస్త్రం వగైరా కొన్ని సూత్రాలు కల్పించిన ప్రబుద్ధులు స్త్రీలకు మునుపున్న హక్కులను తొలగించినట్టు చారిత్రకమైన సాక్ష్యాలు ఉన్నవి. సనాతనమైన వేదశాస్త్రానుశాసనాన్ని మరిపించే కొత్త మార్గాన నడుస్తూ స్త్రీల హక్కులనుగురించి ఇప్పుడు రభస చెయ్యడం అవివేకం. నా మాటలు సరిగా అర్థం చేసుకుని స్త్రీలకు వేదశాస్త్ర పఠనం వగైరా ప్రాచీనపు హక్కులను పునః కలిగించి వారిని సంఘములో శక్తిసంపన్నులుగా చేసే ఉద్యమానికి మీరు పూనుకుంటే భారతజాతికి త్వరలోనే క్షేమాభ్యుదయాభివృద్ధి కలుగుతుంది. నేల విడిచి సాముచేసే మతిమాలిన పని మానండి. శక్తిస్వరూపిణి, మాతృదేవత, సుసంపన్నమైన జాతి అభివృద్ధికి కారకురాలు స్త్రీ. అలాటి స్త్రీ జనాన్ని అలక్ష్యం చేసినంతకాలం పురుషప్రయత్నానికి పూర్ణఫలం సిద్ధించదు. ప్రాచీనమైన కర్మకాండాధికారాన్ని మన మహిళలకు కలిగించినపుడు ఆ స్త్రీ హక్కులూ, ఉద్యోగాల హక్కులూ వగైరా వాటంతట అవే సంక్రమిస్తాయి. ప్రస్తుతం స్త్రీ స్వాతంత్ర్యం గురించి నేను చెప్పేది యింతే. దీనిని మీరు సరిగా అర్థం చేసుకుని నడిస్తే స్త్రీపురుషులు పరస్పర క్షేమలాభమును పొంది సుఖిస్తారు. మన భారత జాతి ఆనాటి ఉన్నత స్థితికి వచ్చుగాక! అని నా ఆకాంక్ష—"

ఈ మాటలను సంస్కృతములోనూ తెలుగులోనూ గణపతి నిర్వచించి తన ప్రసంగం ముగించి కూర్చున్నాడు. ఆ సమయములో అంత దూరాన ఉన్న కడలి కెరటాలమీంచి అమృతమందానిలం వీచినంత సంతోషాన్నీ, కోకిల కాకవీధ్వని విన్నంత పారవశ్యాన్నీ అనుభవించింది సభ.



ఒకనాడు గణపతి తన ఆశ్రమములో ఏదో గ్రంథం వ్రాసుకుంటూ కూర్చున్నాడు. కుంభఘోణ ప్రాంతములో కాంగ్రెస్ కార్యకర్త, వ. వేం. సుబ్రహ్మణ్య అయ్యర్ 'భారద్వాజ గురుకులాశ్రమం' అనే విద్యాసంస్థ నెలకొల్పి వివిధ వర్ణాల బాలురకు వసతి కల్పించి తానే విద్య నేర్పుకున్నాడు. అన్ని జాతుల బాలురూ సోదరత్వమూ, సమరసభావమూ, దేశాభిమానమూ సజాతీయతా అనే భావాలతో కలసి మెలసి పెరగాలని సహపంక్తి భోజనం యేర్పాటు చెయ్యాలని సంకల్పించాడు. ఆ బాలుర తల్లిదండ్రులు అతని సంకల్పం బాగున్నాదని అంగీకరించారు. వంటకి ఒక బ్రాహ్మణుణ్ణి నియమించాడు. కాంగ్రెస్ సంస్థకి సంబంధించి ఆ ఆశ్రమానికి ధన సహాయం చేసేవారిలో కొందరు బ్రాహ్మణేతరులు ఇ. వి. రామస్వామి నాయకర్ సలహా ననుసరించి వంటకి తమ జాతివాణ్ణి నియమించాలని అయ్యరుని శాసించారు. అది పనికిరాదు బ్రాహ్మడే వంటకి ఉండాలి అన్నాడు అయ్యరు. అలా కాదన్నారు వారు. వాద ప్రతివాదాలు జోరుగా వీచాయి. ఈ తగువు ఎలా తెగుతుంది? ఆలోచించారు అందరూ ఒకచోట కూర్చుని. 'ఆ- మన తమిళనాడు కాంగ్రెస్ సంస్థకి ప్రస్తుతం కావ్యకంఠ గణపతిముని అధ్యక్షుడు కదా! ఆయన తీర్పు ననుసరించి నడుద్దాము" అన్నారు. భేష్ అంటే భేష్ అన్నారు. తిరువణ్ణామలైలో ఉన్న గణపతి దగ్గరకు వచ్చి తమ వాద ప్రతివాదాలు చెప్పి తీర్పు చెప్పవలసిందిగా కోరారు. ఆయన ఒక్క క్షణం ఆలోచించి—

"వినండయ్యా ఏజాతి గొప్పతనం చూడవద్దు.
అందరూ ఈశ్వరసృష్టిలో ఏక జాతీయులే.
నా తీర్పు వినండి—
మీ జాతివాడూ వద్దు మీ జాతివాడూ వద్దు.
ఒక హరిజనుణ్ణి ఏర్పాటు చెయ్యండి వంటకి—"

అని ఊరుకున్నాడు. అందరి మొగాలూ వెలవెల లాడాయి.

"తిరుగులేని తీర్పు" నాయనది—అని చిరునవ్వుతో అన్నాడు రమణమహర్షి.... గాలివాన వెలిసింది....

('గణపతిముని' అంటేనే మనవారికి తెలియదు' 'నాయన' అంటే ఏమి తెలుస్తుంది. 'అంపం' అంటే తెలియనివాడికి 'క్రకచం' అంటే తెలుస్తుందా? పాఠకులు కోరితే 'జ్యోతి' యాజమాన్యం ప్రోత్సహిస్తే గణపతిమునిని గూర్చి వరసగా వ్రాస్తాను. ఈ సంవత్సరం ఆ మహనీయుని శతజయంతి ఉత్సవాలు జరిపేది జరుపుతారట కొందరు పెద్దలు చూదాం.) □

ఈ తరం స్త్రీ

రాజ్యలక్ష్మి

"అమ్మా ఓ ముద్ద అన్నం పడెయమ్మా"

వాకిట్లో నిలబడి అరుస్తోంది ముష్టిది. వంటయింట్లోంచి రుక్మిణమ్మ, దొడ్లోనుండి విజయ ఒకేసారి పనిమీద ముందుగదిలోకి వచ్చారు. మరోసారి "బుడ్డోడికి గుప్పెడన్నం పెట్టమ్మా" అని అరిచింది ముష్టిది.

రుక్మిణమ్మ దాని గిన్నెలో అన్నం పడేసి వస్తూ, "అందరికి వుంటారు పిల్లలు, ఎక్కడో పాపిష్టిదానికి తప్ప. ముష్టిదానికన్నా హీనమయి పోయే" అంది.

ఆవిడ విసిరిన వాగ్బాణం యెవరికి తగలాలనుకుందో వాళ్ళను బాగానే గాయపరిచింది. కాస్త దూరంలో కూర్చుని గడ్డం గీసుకుంటున్న మూర్తి తనేం విననట్టు కూర్చున్నాడు. విజయ అభిమానం దెబ్బతింది. ఆ రోజంతా అన్యమనస్కంగానే వుంది మనసంతా.

ఆ సాయంకాలం మూర్తి హడావిడిగా వచ్చి, "త్వరగా తయారవు. సినిమాకు వెడదాం" అన్నాడు.

"ఇప్పుడా? నేను రాలేను. మీరు వెళ్ళండి" అంది విజయ నిరాసక్తిగా.

"ఏమైంది రాలేకపోవటానికి? వెనక పిల్లలు ఏడుస్తారని భయమా, బాధా?" చప్పున అన్నాడు.

చటుక్కున తలెత్తి చూసింది విజయ.

"పిల్లల్ని కని సంతోషపెట్టకపోతే మానె. మొగుడితో సరదాగా సినిమాకు వెళ్ళటానికి కూడ కష్టంగానే వుందా?" మరో మాట వాడిగా విసిరింది అత్తగారు.

విజయ చప్పునలేచి, తయారయిపోయి వచ్చి, "లేవండి" అంది.

మూర్తి తాపిగా లేచి ముఖం కడుక్కుని వచ్చాడు. తీరికగా తల దువ్వుకుని, చెప్పుల్లో కాళ్ళు పెడుతూ, "నేను సరదాగా వెడదామని రమ్మన్నాను. కాని ముఖం ముడుచుకుని కాదు. యిష్టం లేకపోతే మానెయ్యి" అన్నాడు.

విజయ మారు మాట్లాడకుండా చెప్పులేసుకుని అతన్ని అనుసరించింది.


దారిలోగాని, సినిమా హాలులోగాని అతను మామూలుగా మాట్లాడించినా మాట్లాడలేకపోయింది. ఓ వైపు మనసుకు వాతలుపెడుతూ మరోవైపు ఏం జరగనట్టుగా మాట్లాడిస్తున్నాడు. కాని బాధ అనుభవించే తను అలా మామూలుగా మాట్లాడటానికి మనసులేని మరబొమ్మ కాదు గదా. మనసులో అనుకుని నిట్టూర్పు విడిచింది.

తిరిగి పదిన్నరకు యింటికి చేరారు. అత్తగారు తలుపులుతీసి వెళ్ళి పడుకుంది.

విజయకు ఆకలి చచ్చిపోయింది. అతనికి ఒక్కడికే వడ్డించింది.

అతను తినబోతూ, "నువ్వు వడ్డించుకోలేదేం? దేనికి అలకలు, సాధింపులు?" అన్నాడు.

"అలక తీర్చేవాళ్ళుంటే అలిగినా అందం. సాధింపుకు విలువ వుంటే సాధించిన అర్థం



వుంటుంది. నేనెవరిమీద అలగాలి?" నిర్లిప్తంగా అంది.

"మరి ఇంకెందుకో, అసలేమైనదని?" చిరాకుగా అన్నాడు.

విజయ మాట్లాడలేదు. అతను రెట్టించలేదు తిరిగి.

'ఏమైంది?' ఎంత తేలికగా అడుగుతున్నాడు!? అవును మరి, దెబ్బతినేవాడికే దాని రుచి తెలుస్తుందికాని, కొట్టేవాడికెలా తెలుస్తుంది?

అతను భోజనం చేశాక వంటిల్లు సర్ది గదిలోకి వచ్చింది. సిగరెట్ కాలుస్తూకూర్చున్నాడు మూర్తి. విజయ టేబుల్‌మీది 'ఫిలింఫేర్' అందుకుని పేజీలు తిప్పుతూ కూర్చుంది.

మూర్తి సిగరెట్ పీక బయటకు విసిరేసి, "సినిమా మనసు కెక్కనప్పుడు, పుస్తకాలు బుర్ర కెక్కుతాయా? లైట్ తీసేయ్" అని పడుకున్నాడు.

లైట్ తీసేసింది. అతను మరో 5 నిమిషాలకు నిద్రపోయాడు. విజయకు నిద్ర రావటంలేదు. కళ్ళు తెరుచుకుని చీకట్లోకి చూస్తూ కూర్చుంది.

పెరటివైపుకున్న తలుపు తెరిచింది. వెంటనే చల్లటిగాలి, వెన్నెలవెలుగు లోపలికి వచ్చాయి. ఆ మెట్లమీద గుమ్మానికి చేరబడి కూర్చుంది.

'ఈయనెందుకిలా తయారవుతున్నాడు? పిల్లలను పుట్టవద్దని తనందా? వాళ్ళు పుట్టకపోవటానికి, పుట్టటానికి తనా బాధ్యురాలు?తను కూడ పిల్లలు కావాలనే కోరుకుంటోంది కాని వద్దని కాదుకదా? ఇంతమాత్రం ఆలోచన ఈయన కెందుకు లేదు. ప్రతిదానికి ఏదో ఒక వ్యంగ్యోక్తి విసిరి బాధ పెడుతున్నాడు.

విజయ అలా ఆలోచించటానికి కారణం లేకపోలేదు. విజయ పెళ్ళి అయి ఆరు సంవత్సరాలయింది. మూర్తి విజయ అంటే చాలా

ప్రేమగా,అభిమానంగా వుండేవాడు. పెళ్ళయిన క్రొత్తలో యెవరైనా "మళ్ళీ ఈ రోజుకు కొడుకు నెత్తుకుంటావని" పిల్లల గురించి హాస్యమాడితే చిరాకు పడిపోయేవాడు.

"వీళ్ళ కెందుకో యింత కుళ్ళు. మనిద్దరం సరదాగా, హాయిగా వుండటం చూడలేరు కాబోలు. అసలు మన కిప్పుడప్పుడే పిల్లలు పుట్టటం యెంత మాత్రం యిష్టంలేదు. పిల్లలు పుడితే నీకు వాళ్ళను సర్దటం, వాళ్ళకు కావలసినవి సమకూర్చటంతో సరిపోతుంది. ఇంక లైఫ్ ఎంజాయ్ చేసేదెక్కడ?" అనేవాడు.

అత్తగారు విజయ నెప్పుడూ సాధించటం గాని చెప్పటంగాని చేసేదికాదు. అందుకు విజయ ప్రవర్తన కొంతవరకు కారణమైనా, మరి కొంత కొడుకు ఏమంటాడో అనే జంకు వుండేది. అటువంటి ఆవిడ పిల్లి మీదపెట్టి, ఎలికమీద పెట్టి యేదో మాట అనటం మొదలెట్టి, ఇప్పుడు డైరెక్టుగానే యే మాటపడితే ఆ మాట అంటోంది. ఇదంతా మూర్తి చేసిన చులకన. మొగుడు 'ముండ' అంటే ముష్టికొచ్చిన వాడు కూడ 'ముండ' అంటాడని సామెత. నిజమే కాబోలు!

విజయ మెదడు ఆలోచనలతో వేడెక్కిపోతోంది. గుండెల్లో బాధ పేరుకుంటోంది.

'అసలు ఈయనకు తనంటే యింత నిర్లక్ష్యం, నిరసన యెందుకేర్పడినట్టు? పెద్ద నేరస్థురాలిని చూసినట్టు చూస్తున్నాడు. ఇదంతా ఏమిటి? క్రొత్త మోజులో సరదాలు తీరవని పిల్లలొద్దన్నాడు. ఇప్పుడు ఆ మోజులన్నీ తీరిపోయాయని పిల్లలు కావాలంటున్నాడు. వద్దంటే పిల్లలు పుట్టకపోవటానికి, కావాలంటే పుట్టటానికి అది తన చేతిలో పనా? ఇంత స్పష్టంగా కనిపించే విషయం అతనెందుకు అర్థం చేసుకోడు! ఇంతకాలంగా అతను తన కర్థం అయ్యాడనుకుని పొరపాటుపడింది. కాని అతని అభిప్రాయాలు యిప్పుడు తెలుస్తున్నాయి. మారిపోతున్నాడని తను అనుకుంటోంది కాని, అది మారిపోవటం కాదు. సందర్భాన్నిబట్టి అసలు స్వభావం యిప్పుడు బయటపడుతోంది' ఆలోచించేకొలది బాధతో గుండెలు బరువెక్కుతున్నాయి. పిల్లలు లేరనే బాధ కంటే ఆమెను అతని ప్రవర్తన నెక్కువగా బాధిస్తోంది. లేచి తలుపు వేసి వచ్చి, బలవంతంగా నిద్ర తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ కళ్ళు మూసుకు పడుకుంది.

రోజులు గడిచేకొలది యిలాటి సంఘటనలు యెక్కువ అవుతున్నాయి. మనిషి బుర్రలో చెడుగాని మంచిగాని ఆలోచన పుడితే వూరికే పోదు. మూర్తికూడ ప్రస్తుతం అలాటి స్థితిలోనే వున్నాడు.

మధ్యాహ్నం వేళలో పిల్లో కవరుమీద ఎంబ్రాయిడరీ చేస్తూ కూర్చుంది విజయ. రుక్మిణమ్మ వంటింటి గడపమీద తలపెట్టి పడుకుంది.

"ఇదేనా మూర్తిగారిల్లు?" బయట యెవరో అడగటం వినిపించి వాకిట్లోకి వచ్చింది విజయ. ఎదురుగా ఉమ. చంకలో బాబు, చేతిని పట్టుకుని పాప. నమ్మలేకపోయింది విజయ. అలా సంభ్రమంతో చూస్తూ నిల్చుండిపోయింది.

"ఏమిటే తల్లీ, ఆ చూపు? రమ్మంటావా, పొమ్మంటావా...?" ముందుకొస్తూనవ్వింది ఉమ.

"అబ్బ! ఇంత హఠాత్తుగా దర్శనం ఇస్తే నమ్మలేకపోతున్నాను. ఏమిటీ సర్‌ప్రయిజ్ విజిట్?" ముందుకొచ్చి ఉమ భుజంమీద చెయ్యేసి అంది.

"నయం, పొమ్మనకు. కావాలంటే నేను నేనేనని సాక్ష్యాధారాలతో ఋజువు చేసుకుంటాను. ముందయితే నన్ను లోపలకు రానివ్వు" అంది ఉమ.

"చాల్లే, నడువు లోపలకు" పాప చెయ్యందుకుంటూ అంది విజయ.

విజయ, ఉమ మంచి ఫ్రెండ్స్. కాలేజి మొదలెట్టిన దగ్గరనుండి బి. ఏ. పూర్తయ్యే వరకు కలిసి చదువుకున్నారు. పెళ్ళిళ్ళు అయి విడిపోయినారెగ్యులర్‌గాలెటర్స్ వ్రాసుకుంటారు

"ఏమిటింత హఠాత్తుగా దయ కలిగింది. నా మీద" అంది విజయ!

"ఎంతోకాలం నెలవుకోసం ప్రయత్నిస్తుంటే ఆయనకు యిప్పుడు దొరికింది. అందరినీ ఓసారి చూసిపోదామని బయలుదేరాం.మా

ఆడబిడ్డగారుకూడ యిక్కడే వుంటున్నారు. నువ్వున్నావు. అందుకని యిక్కడో మజిలీ వేశాం."

"అలా చెప్పు. ఇదంతా నామీద ప్రేమ కాదు. ఆడబిడ్డ దగ్గరకు వచ్చి, అలాగే నామీద కూడ ఓ చూపు పారేసిపోవటానికి వచ్చావన్న మాట" కినుకుగా అంది విజయ.

"పోని అలాగే అనుకో. నీ యిష్టం" అంది ఉమ.

పిల్లలిద్దరూ క్రొత్త పరిసరాలు కలయ చూస్తూ కూర్చున్నారు. ముద్దుగా చూడ ముచ్చటగా వున్నారు. విజయ దగ్గరకు తీసుకుంటే క్రొత్త లేకుండా వచ్చారు.

సందడికి రుక్మిణమ్మ లేచి ముందుగదిలోకి వచ్చింది. "మా అత్తగారు" అంది విజయ.

వినయంగా చేతులు జోడించింది ఉమ. "నా స్నేహితురాలు ఉమ. మా ఊరే" అంది.

చాల రోజులుగా అత్తగారితో ముభావంగా వుంటోంది. పరిచయంచేసి లోపలకు వెళ్ళింది కాఫీ ప్రయత్నంకోసం. రుక్మిణమ్మ ఉమతో కబుర్లు మొదలెట్టింది.

కాస్సాగి మూర్తి ఆఫీసునుండి వచ్చాడు. ముందు యెవరో కొత్తవాళ్ళు వచ్చారని వెనకాడినా తరువాత ఉమను గుర్తించాడు. విజయ తల్లిగారింట్లో చూశాడు ఆమెను.

"బాగున్నారా? ఎప్పుడొచ్చారు?" పలకరించి అక్కడే కూర్చున్నాడు.

విజయ ట్రేతో కాఫీకప్పులు తెచ్చింది. అందరికి అందించి, తను కూడ కూర్చుంది.

"అయితే పిల్లలెందరమ్మాయ్?" రుక్మిణమ్మ అడిగింది.

"వీళ్ళిద్దరేనండి" చెప్పింది ఉమ.

"రత్నాల్లా వున్నారు. అందరికి కళ కళలాడుతూ పిల్లలుంటారు. ఎక్కడో మాలాటి దరిద్రులకే ముచ్చటగా యెత్తుకుని మురిసిపోయే జాతకం వుండదు" సాధింపుగా అంది.

"అదేమిటి అలా బాధపడతారు? పుట్టే కాలం అప్పుడే అయిపోయిందా....?" ఉమ అంది.

"ఆ, ఇంక ఒకటే పుట్టటం. వీడికంటే వీడెనకాల పెళ్ళయింది మా చిన్నవాడికి అమ్మాయికీను. అప్పుడే ఒక్కొక్కరికి ముగ్గురేసి పుట్టారు. ఎంతమందికి పుట్టి ఏం లాభం? జేష్టుడికి పుడితే వంశం నిలుస్తుంది. పేరు వుంటుంది" జేష్టుడి పిల్లలు తప్ప మిగిలిన పిల్లలు పిల్లలుకారు కాబోలు ఈవిడ దృష్టిలో అనుకుంది ఉమ.

"దాన్దేముంది లెండి. ఒక్కొక్కళ్ళకి ఆలస్యంగా పుడతారు. ఒక్కొక్కరికి త్వరగా పుడతారు" పైకి అంది.

"అవన్నీ మన ఏడుపు తుడుచుకోవటానికి అనుకునే మాటలు. మాలో యెవరికీ ఆలస్యంగా పుట్టటమనేది లేదు. వీళ్ళ నాన్నగారు ముందు ఒకావిడను చేసుకొన్నారు. నాలుగేళ్ళయినా పిల్లలు పుట్టకపోయేసరికి నన్ను చేసుకొన్నారు. సంవత్సరం తిరిగేసరికి వీడు పుట్టాడు" కొడుకును చూపి అంది రుక్మిణమ్మ.

విజయ కాఫీకప్పులోకి చూస్తూ కూర్చుంది.

"ఏమిటీ? ఆవిడ బ్రతికివుండగా మిమ్మల్ని చేసుకున్నారా?" ఆశ్చర్యపోయింది ఉమ.

"ఆ" అంది ఆవిడ.

"ఇప్పుడున్నారా ఆవిడ....?" అడిగింది ఉమ.

"లేదు. మా మూర్తి పుట్టాక ఏడాదికే పోయింది" 'అవును. పోక యింకెలా వుంటుంది? మొగుడు చేసిన పనికి మనసులోనే కుళ్ళిపోయి అప్పుడే చచ్చిపోయి వుంటుంది' లోపల అనుకొంది ఉమ.

"అయినా యెక్కడలేని విడ్డూరాలు పుడుతున్నాయిగాని, మా కాలంలో యెరుగుదుమా? యేమిటో కాలం తిరగబడింది. పిల్లలు లేకపోయినా ఆ గొడ్రాలితోనేగాని పెళ్ళి చేసుకోకూడదట. పిల్లలు లేకపోయాక ఇహమా, పరమా?" మనసులోదంతా కక్కేసింది ఆవిడ.

ఉమ తెల్లబోయింది. మొదట్లో ముసలావిడ గనుక చాదస్తంగా మాట్లాడుతోందనుకొంది. కాని ఈ సాధింపు ఎత్తిపొడుపులు విన్నాక అలా అనిపించటంలేదు. విజయవైపు ప్రశ్నార్థకంగా చూసింది. విజయ ఎరుపెక్కిన ముఖం పైపంటితో క్రింది పెదవి నొక్కిపట్టి

తల కొద్దిగా వాల్చి కూర్చుంది. మూర్తి చాల ఏకాగ్రతగా పేపరు చూస్తున్నట్టు పేపరు పట్టుకుని కూర్చున్నాడు. ఉమ యిబ్బందిగా ఫీలయ్యింది. ముసలావిడ మరికొద్దిసేపు కూర్చుని లేచిపోయింది. మూర్తి తిరిగి బయట కెళ్ళాడు.

ఉమ ముందు సిగ్గుతో అవమానంతో తల పైకెత్తలేకపోయింది విజయ.

ఉమ మనసు అభిమానంతో ఆర్ద్రమైంది. విజయనింక యిబ్బంది పెట్టలేక, "ఇంక నేను వెళతాను విజయా. నువ్వోసారి రేపు అక్కడికి రాకూడదూ. మేము రేపు సాయంత్రం బండికి వెళ్ళిపోతాం" అంది.

విజయ గొంతు పెగల్చుకుని, "ఈ పూటకు యిక్కడుండు ఉమా. రేపు వెడుదువులే!" అంది.

"ఇప్పటికేమనుకోకు. ఈసారి వచ్చినప్పుడు తప్పకుండా వుంటాను" అంది.

విజయ యింకేమీ మాట్లాడలేదు. తనను కించపరచే ఆ యింట్లో తన స్నేహితురాలిని సుండమనటానికి అభిమానం అడ్డు వచ్చింది. అందుకే బలవంతం చెయ్యలేదు.

ఆ రాత్రి—బయటనుండి వచ్చిన మూర్తి బట్టలు మార్చుకోవటానికి గదిలోకి వచ్చాడు. విజయ మంచంమీద బోర్లా పడుకుని వుంది. విజయనేం మాట్లాడించకుండా తల్లి నడిగి అన్నం పెట్టించుకున్నాడు. ఆవిడ కొసరి కొసరి పెడుతూ, కాలక్షేపానికి కబుర్లు చెబుతోంది. ఆవిడ కబుర్లు పూర్తికాకముందే అతని భోజనం పూర్తయిపోయింది. గదిలోకి వెళ్ళి వక్కపొడి కోసం చూశాడు. కనిపించలేదు.

"ఇదిగో వక్కపొడి యెక్కడుంది? పడుకున్నావేం?" విజయ నుద్దేశించి అన్నాడు.

విజయ లేచి వక్కపొడి భరిణె ఇచ్చింది.

"ఇదిగో అన్నం వడ్డిస్తున్నాను. నేను మళ్ళీ యిల్లు సర్దుకోవాలి. త్వరగా రా" అత్తగారు పిలిచింది.

"నాకు ఆకలి లేదు. మీరు తినండి" అంది విజయ.

"ఏం వున్నా లేకపోయినా ఈ రోషాలకేం తరుగులేదు. 'ఊ' అంటే వుపరాధం. 'ఆ' అంటే అపరాధం. మహారాణిలా పడుకున్నది గాక నడ్డి విరిగేలా పనిచేసి, వండి వడ్డిస్తే తిన టానికి కష్టంగా వుందా?" విజయ ఏ పనీ చెయ్యకపోయినా సహిస్తున్నదానిలా, ఎంతో వుదారంగా వండి వడ్డిస్తున్నట్టు మాట్లాడింది.

"నా ఆకలి నాకు తెలుసు. ఒకరు చెప్ప నవసరంలేదు" కోపం నిగ్రహించుకొని అంది.

"అవును, చెపక్కర్లేదు. చెబితే మాత్రం పెద్దవాళ్ళ మాట అని నీకు లక్ష్యమా? విన యమా? ఏముంది గనుక? చెప్పి నా నోరే నొప్పెడుతుంది."

"పోనీ అదయినా తెలుసుకున్నారుగా. మరో సారి చెప్పకండి" నిష్కర్షగా అంది విజయ.

"విజయా!" కాస్త గట్టిగా అసహనంగా అన్నాడు మూర్తి.

"పెద్దా చిన్నా లేకుండా యేమిటా మాటలు?"

"పెద్దవాళ్ళయినా చిన్నవాళ్ళయినా మర్యాద యిచ్చి పుచ్చుకోవాలి. సహనానికి కూడా హద్దుంది."


"ఏం, మళ్ళీ ఈవేళ ఏమైంది? భోజనమెందుకు చెయ్యలేదు? అసలు రోజు రోజుకు చిత్రంగా తయారవుతున్నావు. ఈ సత్యాగ్రహా లేమిటి? రాను రాను యిల్లు నరకమౌతోంది."

తాను విచిత్రంగా తయారవుతోందా? తిప్పి మాట్లాడుతున్నాడు. ప్రతిక్షణం తనను ఎత్తి పొడుస్తూ, నరకం చూపుతున్నారు. తిరిగి తననే అంటున్నారు. ఇంక అణుచుకోవటం దుస్సాధ్యమైంది. "నేనూ అదే అడగాలనుకుంటున్నాను. రోజు రోజుకు మీరెందుకిలా మారిపోతున్నారు?" అంది.

"మారిపోతున్నానా, నేనా?" కించిత్ ఆశ్చర్యంగా, అదోలా అన్నాడు.

"అవును మీరే. మీ మనసులో ఏముందో సూటిగా చెప్పక, వ్యంగ్యంగా మాట్లాడి నన్నెందుకు బాధిస్తున్నారు?"

"నేనేం మారలేదు. నువ్వే చీటికి మాటికి తగాదాకు తయారవుతున్నావు. ప్రతి చిన్నదానికి రాద్ధాంతం చెయ్యటం నేర్చావు. మనిషన్న



తరువాత కాస్త ఓర్పు, సహనం ఉండాలి. సర్దుకుపోవాలి."

తెల్లబోయింది విజయ. దేనికి సర్దుకుపోవాలి? అతను రెండో పెళ్ళి చేసుకోవటానికా? ఓ నిముషం తరువాత తేరుకుని "ఒక్క క్షణం మనస్సాక్షితో ఆలోచించి అనండా మాట" అంది.

"నేను అబద్ధాలు చెప్పటంలేదు, మనస్సాక్షితో ఆలోచించటానికి."

"పోనీ యిదయినా చెప్పండి. పిల్లలు పుట్టటం నా చేతిలో పని? నేను వద్దన్నానా?"

"నువ్వు ఏమంటే యేం? నేను పిల్లలు లేని వాడిననే బాధ తప్పదుగా."

"నాకేనా బాధ లేనిది?" ఆవేదనగా అంది.

"నీ బాధ నాకేం తెలుసు? నా బాధ నాకు తెలుసు. నా కెంత వెలితిగా వుందో నీకు తెలుసా!"

"అవును. నా బాధ మీకు తెలియదు. కనకనే యే మాట పడితే ఆ మాట అని అవమానించగలుగుతున్నారు."

"విజయా, నన్ను అనవసరంగా విసిగించకు. ఇప్పుడు నిన్నెవరవమానించారంటావ్?" చిరాకుగా అన్నాడు.

"రోజూ మీ అమ్మగారనే మాటలు, మీ యెత్తిపొడుపులు అన్నీ మంచిమాటలే. ఈ రోజు ఉమ ముందు ఆవిడ మాట్లాడినవి అవమానించేవి కావా, చెప్పండి?"

"అంత పెద్ద విషయం ఆవిదేమంది? చిన్నది కూడ కొండంత చేస్తావు?" కరుకుగా అన్నాడు.

"చిన్న విషయం! రెండో పెళ్ళి చేస్తాననటం కూడ చిన్న విషయమేనా?" ఆవేశంగా అడిగింది.

"చిన్న విషయం కాక పెద్ద విషయమా? ఏం మహా గింజుకుంటున్నావు. చేసుకుంటాడు మళ్ళీ పెళ్ళి. యేం చేస్తావేం?" అంది ఆదరా బదరా అన్నం పూర్తిగా తినకుండానే వచ్చిన అత్తగారు.

"నేను మీతో మాట్లాడటంలేదు" తీక్షణంగా అంది విజయ.

అయినా ఆవిడ లెక్క-చెయ్యలేదు. "ఏం నిలదీసి అడుగుతున్నావు? ఎల్లకాలం నిన్నే పూజిస్తూ కూర్చుంటాడనుకున్నావా? మహా తల్లివి వంశాన్ని వుద్ధరిస్తావని"

మూర్తి మాట్లాడకపోయేసరికి తిరిగి తనే అంది.

విజయ విసురుగా మూర్తికేసి తిరిగి, "మీరు నిర్లక్ష్యం చెయ్యబట్టేకదూ ఆవిడిలా మాట్లాడేది. నేను మీతోనా ఆవిడతోనా మాట్లాడుతున్నది" అంది.

"అవును వాడలా మాట్లాడకపోబట్టే నువ్విలా పెట్రేగిపోతున్నావు?" చేతులు తిప్పుతూ అంది రుక్మిణమ్మ.

"ఏమిటి మీ మౌనం? మీరు ఆవిడను సమర్థిస్తున్నట్లా?"

"ముందు నువ్వు కాస్త నోరు మూసుకో" అని "అమ్మా, నువ్వెళ్ళు" అని 'ఛీ, వెధవ కొంప' అనుకుంటూ బయటకు వెళ్ళాడు.

విజయ మనసు భగ్గుమంది. అంతకు ముందు కలిగిన బాధ-కోపంగా, అసహ్యంగా మారింది.

ర ర ర

ఆ తరువాత ఒకటి రెండుసార్లు తాను యింట్లో లేని సమయంలో గుసగుస లాడు కోవటం, తను రాగానే మానెయ్యటం గమ నించింది.

అందుకు ముందు మూర్తిమీద ఏ మూల నుండో పీకుతున్న ప్రేమకూడ విరిగిపోయింది. అత్తరంటే చాదస్తురాలు, పాతకాలపుమనిషి. కాని మూర్తి? చదువు, సంస్కారం, విచక్షణ అన్నీ వున్నాయని గర్వించే ఆధునికుడు! ఇంత సంకుచితమా? ఇలాటి మనిషిని తన మన సులో మనసుగా నమ్మిన భర్త అనుకుంటేనే సిగ్గుగా, భరింపరానిదిగా అనిపిస్తోంది. ఇంత సంకుచితులమధ్య,తననుహీనపరచే వాళ్ళమధ్య తనెలా వుండగలదు? ఏదీ ఖచ్చితంగా నిర్ణ యించుకోలేకపోతోంది.

అనుకోకుండా ఆ మరుసటిరోజే ప్రసాద్ వచ్చాడు. హఠాత్తుగా వచ్చిన అన్నను చూసి ముందు విజయకు సంతోషం కలిగినా, ఇలాటి పరిస్థితుల్లో అతను రావటం ఇబ్బందిగా అని పించింది. విజయే వుత్తరం వ్రాసి రప్పించిం దనుకున్నారు తల్లీ కొడుకులు.

"ఏం బాబూ, యిదేనా రావటం?" అంటూ బాగానే పలకరించింది రుక్మిణమ్మ.

"లేదండి, రాత్రి 10 గం॥ల ట్రెయిన్‌కు వచ్చాను" అన్నాడు.

"ఏం బావగారూ, కులాసాయేనా?" అని తనే పలకరించాడు మూర్తిని ప్రసాద్.

తరువాత కూడ అతను అది యిది మాట్లాడు తుంటే మూర్తి ఫ్రీగా మాట్లాడలేకపోతు న్నాడు.

"సరేలే, ముందు భోజనాలకు లేవండి" అంటూ తనే వడ్డించింది రుక్మిణమ్మ.

ఆవిడ తీరు విజయకు చాల ఆశ్చర్యంగా వుంది. ప్రసాద్‌ను చూడగానే, 'ఈ పిల్లలు పుట్టని కోడలు మా కెందుకు? నీతోనే తీసుకు పో' అంటుందనుకుంది.

ప్రసాద్‌కు అసలే ఓపాలు ఆవేశం యెక్కువ. ఏం జరుగుతుందో అని భయ పడింది.

"బావగారూ! మిమ్మల్ని, విజయను ఓసారి రమ్మని చెప్పమన్నారు అమ్మా, నాన్నగారు. విజయకోసం వాళ్ళు వదిన కలవరిస్తోంది.. తప్పక రావాలి" అన్నాడు ప్రసాద్.

మూర్తి మాట్లాడలేదు.

ప్రసాద్, "మాట్లాడరేమండీ?" అంటూ రెట్టించాడు.

"సెలవు దొరకదు" పొడిగా అన్నాడు మూర్తి.

"మీరలా అంటే కుదరదు. ఎలాగైనా రావలసిందే. ఏమే విజయ మాట్లాడవు...." అన్నాడు.

విజయ మాట్లాడలేదు.

"ఏమిటేవ్, బావగారు నీకుకూడ అంటిం చారా తన మౌనాన్ని. నువ్వేమిటి అసలు మాట్లాడటంలేదు? కొంపదీసి మీరిద్దరు కోర్ట్

వార్‌లో గాని లేరుకదా?" నవ్వాడు.

ఎవ్వరూ నవ్వలేదు అతని హాస్యానికి. ప్రశ్నార్థకంగా విజయకేసి చూశాడు. కాని విజయ అతనివైపు చూడటంలేదు.

మరో అరగంట తరువాత "మరి నేను వెడతాను. మీరు తప్పక రావాలి. నాన్నగారు విజయను చూడాలని చాల యెదురు చూస్తున్నారు" అన్నాడు.

వెంటనే రుక్మిణమ్మ, "కూర్చో బాబు, అసలు నేనే మీ వూరు వద్దామనుకుంటున్నాను. ఇంతలో నువ్వే వచ్చావు" అంది.

"అలాగా, అయితే మాత్రం ఏం లెండి. అందరూ కలిసిరండి. నాకు టైమ్‌లేదు. రేపు కోర్టులో కేసు వుంది. ఈ ట్రెయిన్‌కు వెళ్ళిపోవాలి" అన్నాడు.

"అదికాదు, నీతో కొంచెం మాట్లాడాలి. ఓ రెండు నిమిషాలు కూర్చో" అంది ఆవిడ.

తిరిగి కూర్చున్నాడు. "ఏమిటి, చెప్పండి" అడిగాడు.

"ఏంలేదు? పిల్లాపాపలతో కళకళలాడాల్సిన యిల్లు. ఆ గీతే వున్నట్టు లేదు."

"నిజమేనండి. ఎందుకో ఆలస్యమైంది. విజయ అక్కడకు వస్తుందిగా. టెస్టు చేయిద్దాం."

"ఏమో మరి. నాకయితే యింక పుడతారని నమ్మకంలేదు."

"సరే, మనం చేసేది మనం చేద్దాం. ఇంతకంటే ఆలస్యంగా పిల్లలు పుట్టినవారు లేరూ?"

"మనవల్ని చూసుకోవాలని నా ప్రాణం తపించిపోతోంది. వాళ్ళ పిల్లల్ని, వీళ్ళ పిల్లల్ని చూసి మురిస్తే మనవాళ్ళవుతారా? మనకు లేకపోయాక ఏం సార్థకత."

ఆవిడ వుద్దేశ్యం అర్థంకాలేదు ప్రసాద్‌కు. "ముందు డాక్టరుకు చూపుదాం. అంతకంటే చేసేదేముంది?" అన్నాడు.

"అదే నేను చెప్పబోయేది. ఇప్పటి కాలాన్నిబట్టి కాస్త యిదిగా వుంటుంది. కాని, మా రోజుల్లో పిల్లలు పుట్టకపోతే రెండు మూడు పెళ్ళిళ్ళు చేసుకునేవారు" మెల్లగా బయట పెట్టింది ఆవిడ.

ప్రసాద్ అప్రతిభుడయ్యాడు. ఆవిడ వుపోద్ఘాతమంతా దేనికో అర్థమయింది. ముఖం జేవురించింది. "అయితే యేమిటి మీరనేది?" తీవ్రంగా అడిగాడు.

"[illegible]దే విజయకూడ యిక్కడే వుంటుంది. వాడికి మళ్ళీ ఏ పేదింటి పిల్లనో ముడిపెడదామని. లోకంలో యెంతమందికి యిద్దరేసి పెళ్ళాలు లేరు. వంశం పోతుందని నా బాధ."

ప్రసాద్ అగ్గి అయిపోయాడు. "మీరేం మాట్లాడుతున్నారో వంటిమీద తెలివి వుండే మాట్లాడుతున్నారా? పెళ్ళంటే బొమ్మలాటనుకున్నారా? పైగా యిద్దరు పెళ్ళాలవాళ్ళున్నారని సమర్థింపా? ఛీ" చీత్కారంగా అన్నాడు.

రుక్మిణమ్మ అప్పటివరకు సహనంతో వుంచుకున్న ఆప్యాత ముసుగు కాస్త తీసిపారేసింది. "ఏదో వియ్యాలవేపువాడివని మర్యాద యిచ్చి సంగతీ, సందర్భం మాట్లాడాను. ఏం మహా గుంజుకుంటున్నావు. పెళ్ళి చెయ్యక నీ చెల్లెల్నే పూజిస్తామనుకున్నావా?" అంది.

అక్కడే వున్న మూర్తి పేపరులోంచి తల బయటకు తియ్యలేదు. విజయ మాత్రం అవమానంతో క్రుంగిపోయింది. తల పైకెత్తి అన్నకేసి చూడలేకపోయింది.

"మరో అమ్మాయికి మాత్రం పుడతారని నమ్మకమేమిటి?" లాయర్‌లా క్రాస్ చేశాడు ప్రసాద్.

"ఏం, నీ చెల్లెలు గొడ్రాలయిందని దేశం మీద అందరు గొడ్డుపోతారా?"

'గొడ్రాలు' అనేసరికి ప్రసాద్ నిగ్రహించుకోలేకపోయాడు.

"మర్యాదగా మాట్లాడండి" నిప్పులు కురిపిస్తూ చూశాడు. ఆ వెంటనే మూర్తివైపు తిరిగి, "ఏం బావగారూ మీ అభిప్రాయంకూడ యిదేనా?" అన్నాడు.

మూర్తి మాట్లాడలేదు.

"మాట్లాడండి" గద్దిస్తున్నట్టే వుంది ప్రసాద్ కంఠం. "ఇంతసేపటినుండి ఆవిడ మాటలు వింటూ కూడ మాట్లాడలేదంటే మీ

వుద్దేశ్యం ఆవిడతో చెప్పిస్తున్నారన్నమాట. అంతేనా?"

"ఇదిగో, వాడు చెబితే ఒకటి నేను చెబితే ఒకటి కాదు. మేం చెప్పేది చెప్పాం. ఇష్టమైతే వుంచు, లేకపోతే తీసుకుపో. అంతే" ఖరాఖండితంగా చెప్పింది రుక్మిణమ్మ.

"విజయ భర్త ఆయన కాని, మీరు కాదు. నోరు విప్పి చెప్పలేని అసమర్థుడా?"

"ప్రసాద్!" రోషంగా పేపరులోంచి తల బయటపెట్టి అన్నాడు మూర్తి.

"అంత రోషం కలవారు నేను అడిగేదానికి జవాబు చెప్పండి!" హేళనగా అన్నాడు ప్రసాద్.

"అవును. మా అమ్మ మాట నిజమే."

"ఇప్పుడు వాడి నోటితో విన్నావుగా. తృప్తిగా వుందా?" అంది రుక్మిణమ్మ.

"అలాగా, చూస్తాను. పెళ్ళి ఎలా చేస్తారో? నేను లాయర్‌నని మర్చిపోకండి" అన్నాడు.

"ఏం చేసుకుంటావో చేసుకో. కోర్టులకు మాత్రం న్యాయం, ధర్మం లేవా? గోడ్డుదానితో వుట్టిగట్టుకు వూరేగమంటాయా!"

"గొడ్రాలని మీకు రుజువేమిటి?" కట్టలు తెంచుకుంటున్న ఆగ్రహాన్ని పళ్ళ బిగువునా ఆపుతున్నాడు.

"పెళ్ళయి ఆరేడు ఏళ్ళు అవుతోంది. పుట్టి చావటమేనా లేదు. ఇంక పుడతారా?"

"సరే, అదీ తేల్చుకుందాం. డాక్టర్ దగ్గరకు వెడదాం" అని "విజయా, లే!" అన్నాడు.

ఇంతదూరం వచ్చాక నిజంగా తనకు తల్లి అయ్యే యోగ్యత వుందో లేదో తేల్చుకోవాలనిపించింది విజయకు. రెండు నిముషాల్లో వచ్చింది.

"లేవండి, వెడదాం" మూర్తి నుద్దేశించి అన్నాడు ప్రసాద్.

"వెళ్ళరా, వీళ్ళు నిజమే చెబుతారో, ఆ డాక్టర్‌తో అబద్ధమే చెప్పిస్తారో, యేమిటి నమ్మకం?" ప్రసాద్‌ను, విజయను కొరకొర చూస్తూ అంది.

"ఓహో! మీ అబ్బాయిని మామీద నిఘాకు పంపుతున్నారన్నమాట. కాని నేనందుకు తీసుకు వెళ్ళటంలేదు. మీ అబ్బాయికి పిల్లలు పుడతారో లేదో పరీక్ష చేయించటానికి."

రుక్మిణమ్మ నిర్ఘాంతపోయింది. "ఇదిగో, ఇప్పుడంటే అన్నావుగాని, మరోసారి ఇలాటి అప్రాచ్యపు మాటలు మాట్లాడకు. పిల్లలు పుట్టకపోవటం మా యింటావంటా లేదు" తెప్పరిల్లి అసహనంగా అంది.

ఇంకా ఏదైనా అని ఆవిడను ఏడిపించాలనిపించింది ప్రసాద్‌కు. క్షణానికోసారి విజయను గొడ్రాలన్న మనిషికి తన కొడుకు విషయంలో యెంత బాధ, కోపం? కాని అందరూ అలాటి మనుషులు కారనుకుందేమో!

డాక్టర్ శ్రీకాంత్ ఫారిన్ రిటరన్డు దగ్గరకు వెళ్ళారు.

§ § §

విజయ సూట్‌కేస్ సర్దుకుంటోంది.

మూర్తి అక్కడే వున్న కుర్చీలో కూర్చుని వున్నాడు. ఆ క్రితంరోజే డాక్టర్ దగ్గరనుండి టెస్టు ఫలితాలు వచ్చాయి.


"విజయా! నీ నిర్ణయం మారదా?" జాలిగా వుంది మూర్తి స్వరం. అతని ముఖంలో తనకు అవసరమైనది, అతి ముఖ్యమైనది కోల్పోతున్న దైన్యం వుంది.

"ప్లీజ్, విజయా! నాకోసం మార్చుకో."

విజయ సూట్‌కేస్ సర్దటం ఆపి గిరుక్కున వెనక్కి తిరిగింది. "మీకోసం!? హు, యెంత నిస్సంకోచంగా అడుగుతున్నారు. ఒక్కసారి వెనుతిరిగి ఆలోచించుకోండి. నా కోసం మీ నిర్ణయాలను మార్చుకోవటం కాదు కదా, కనీసం సానుభూతితోనయినా ఆలోచించారా? భార్యననే అభిమానం, తోటిమనిషిననే మానవత్వం అయినా లేకుండా మీ కనుకూలంగా నిర్ణయాలు తీసుకున్న మీరు, నాకేమవుతారని నేను నా నిర్ణయం మార్చుకోను?"

"విజయా!" తెల్లబోయాడు. "నేను నీకేం కాను."

"ఎందుకలా తెల్లబోతారు? మీరు మరో పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు మీకు నేనేమయ్యాను? ఈ వూరు కా వూరు యెంత దూరమో ఆ వూరుకు ఈ వూరు అంతే.



దూరం వుంటుంది.''

మూర్తి అసహనంగా చూశాడు. "విజయా! ఈ వాదోపవాదాలు అనవసరం? నువ్వు వెళ్ళటానికి వీల్లేదు" గట్టిగా అన్నాడు.

"అలా ఆజ్ఞాపించే హక్కు మీ చేతులతో మీరే పోగొట్టుకున్నారు" అటు తిరిగి పోయింది.

మూర్తి మాట్లాడలేకపోయాడు. విజయ సర్దుతున్న చీర మడతల్లోంచి ఓ చిన్న ఫ్రాక్ జారి క్రింద పడింది. అది రెండు సంవత్సరాల క్రితం తన జాకెట్ పీస్‌లో మిగిలిన బట్టతో కుట్టింది విజయ. ఎంతో చక్కగా ముద్దుగా కుదిరింది. పుట్టని పాపాయికోసం యెదురు చూస్తూ పెట్టెలోనే వుండిపోయింది ఇన్నాళ్ళు.

విజయ వంగి క్రింద పడిన ఫ్రాక్ చేతిలోకి తీసుకొంది. కళ్ళు చెమర్చాయి.

"విజయా! నీకు బాధ అనిపించటంలేదూ," చాలా సేపటికి అడిగాడు మూర్తి.

"బాధ?! నాకు బాధ లేదని యెలా అనుకోగలుగుతున్నారు? ఇటు చూడండి" ఫ్రాక్ పైకి యెత్తి చూపుతూ, "పిల్లలకోసం అసలు మగవాడికంటె ఆడదానికే యెక్కువ తహతహనేమో! ప్రతి స్త్రీ బలంగా కోరుకునేవాటిల్లో మాతృత్వం ముఖ్యమైనది. అమ్మను కావాలని వాళ్ళ ఆటపాటలతో మురిసిపోవాలనే కోరిక అతి సహజం. కాని....కాని మీ కారణంగా వాట్ని కోల్పోయాను" అంది.

మూర్తి ముఖం దించుకున్నాడు.

"అయినా నే నెప్పుడు దీనికి కారణం ఎవరని ఆలోచించలేదు. మనకు ఆ అదృష్టం లేదనుకున్నాను. అంతే!" ఉబికిన కంటినీరు క్రిందికి జారకుండానే తుడుచుకుంది.

బట్టలు సర్దటమయింది. షెల్ఫ్‌లోంచి తను మనసుపడితే ప్రసాద్ కొని యిచ్చిన పుస్తకాలు ఒక్కొక్కటి తీసిపెట్టి కట్టకట్టింది.

"విజయా. ప్లీజ్! ముందు నువ్వాపని ఆపెయ్యి. ఇటు కూర్చుని నేను చెప్పేది విను" అర్థింపుగా అడిగాడు.

"మనిద్దరం అలా కూర్చుని సమస్య గురించి చర్చించుకొనే సమయం దాటిపోయింది. ఒకసారి నే నందుకు ప్రయత్నించినప్పుడు మీరు నిర్లక్ష్యంగా వెళ్ళిపోయారు. ఇప్పుడా అవసరంలేదు. గతం యెప్పుడూ భవిష్యత్తులో తిరిగిరాదు" చేస్తున్న పని ఆపకుండానే చెప్పింది.

"విజయా! నన్ను నువ్వు అర్థం చేసుకోవటంలేదు. నా మనసు మారింది."

చప్పున యిటు తిరిగింది విజయ. "అవును,

మీ మనసు మారింది. అవసరం మీదయినప్పుడు యెందుకు మారదు? మీరు అవకాశవాదులు. ఎలాపడితే అలా మారగల సమర్థులు. చూడండి. ఎలాగూ విడిపోతున్నాం. ఇంక మాటలనుకోవటం అసహ్యం."

"ముందు నా మాట పూర్తిగా వినవేందుకు? అసలు నేను చేసుకోవాలన్నది కేవలం పిల్లల కోసం. నిన్ను విడిచిపెటాలని నేనెప్పుడూ అనుకోలేదు నేను. కాకపోతే ఇంత బాధపడతావని అనుకోలేదు నేను. అదే పొరపాటు."

"అయితే ఇది చెప్పి మళ్ళీ పొరపాటు చేస్తున్నారు? ఇంత జరిగినా పెళ్ళి పిల్లలకోసమని, భార్య అంటే పిల్లలు కనే యంత్రమనే మారని మీ అభిప్రాయాలు వింటుంటే....వుహూ, నా నోటితో చెప్పలేను. మీ ప్రేమంతా నామీద ఒలికించి, వచ్చే ఆమె కేవలం పిల్లలకోసమే అంటే నేను సంతోషిస్తానని అనుకుంటే మీరు చాలా పొరపాటుపడ్డారు. అదే నా స్వభావమైతే యిప్పుడు విడిపోయే ప్రసక్తే రాదు. అయినా మీరు ఏది చెబితే అది నమ్మే విజయను కాను ఇప్పుడు. ఒకప్పుడు మీరేది చెబితే అదే నిజమని గుడ్డిగా నమ్మేదాన్ని. మీరే మార్చేశారు. ఈ పిల్లల ప్రసక్తే లేకపోతే మీ ప్రేమంతా నిజమేననే భ్రమలో వుండేదాన్ని. మీరా భ్రమలో కూడా వుండనివ్వలేదు నన్ను."

సర్దుకోవటం పూర్తి అయింది. ముఖం కడుక్కుని వచ్చింది.

అప్పటివరకూ మూర్తి యెక్కడ కూర్చుని వున్నాడో అక్కడే కూర్చుని వుండి పోయాడు.

అద్దంలో చూస్తూ జడ అల్లుకుంటోంది. అద్దంలోంచి మూర్తి దగ్గరకు రావటం కనిపించింది విజయకు. అనుకోని విధంగా మీద చేతులేసి ఆమెను తనవైపు తిప్పుకున్నాడు. "విజయా, జరిగింది మర్చిపోయి నన్ను క్షమించలేవా?" అడిగాడు.

విజయ మాట్లాడలేదు. కాని ఆమె ముఖంలో కనిపిస్తున్న ఏహ్యాత, కఠినత్వం చూసి, అతనే అప్రయత్నంగా వదిలేశాడు.

"అంత క్షమాశక్తి నాకులేదు. అసలు క్షమ యెవరికో తెలుసా? తెలియక తప్పు చేసిన వారికి. తెలిసి చేసేవాళ్ళకు కాదు. జరిగింది నేనెంతమాత్రం మర్చిపోలేను. కొద్దిరోజుల క్రితం మీకు నా మనసులో యెంతో వున్నతమైన స్థానం వుంది. మీరు ఊసరవెల్లిలాటివారని తెలిశాక మళ్ళీ అలా చూడలేను. మీరే నేను, నేనే మీరని నమ్మాను. మీకు మీ కోరికలు, అవసరాలే ప్రధానం కాని వ్యక్తిప్రధానం కాదని ఆలస్యంగా తెలుసుకోగలిగాను. తెలిసాక యిక్కడుండలేను. నన్ను నేను వంచించుకోలేను."

"అయితే....అయితే, నువ్వు విడిపోవటం పిల్లలకోసం మళ్ళీ పెళ్ళి చేసుకోవటానికేనా?" ఏం చెయ్యలేని నిస్సహాయ క్రోధంతో అడిగాడు.

"పిల్లలు పుట్టరని నన్ను విడిచి మరొకరిని చేసుకోవాలని మీరు అనుకోలేదా? డాక్టర్ మీకు సంతానం కలగదని నిర్ధారణగా చెప్పాక ఆ పిల్లలకోసం నేను పెళ్ళి చేసుకోవటంలో తప్పేముంది? కోరిక అందరికి ఒకటే. ఆడవాళ్ళకు ఒక న్యాయం, మగవాళ్ళకో న్యాయమా?" నిశితంగా చూస్తూ అడిగింది.

మూర్తి ముఖం వివర్ణమైంది. విజయ బ్యాగ్ చేతిలోకి తీసుకుంది.

"కానీ మనిషి పెళ్ళి చేసుకునేది కష్టసుఖాలలో తోడునీడగా వుండే మరో మనిషి సామీప్యంకోసం అని నా అభిప్రాయం. పెళ్ళి తరువాత పిల్లలుకాని, పిల్లలకోసం పెళ్ళికాదు. అలాటి పొరపాటు నే నెప్పుడు చెయ్యను" దృఢంగా పలికింది.

"వెళ్తాను" అని ముందుకు నడిచింది.

తనను దాటుకుని ముందుకు వెళ్ళిపోతున్న ఆమెను చూస్తూ నిలబడిపోయాడు మూర్తి.

సినిమా

దాసరి హీరోగా పెద్దిల్లు-చిన్నిల్లు

దాసరి నారాయణరావు దర్శకుడిగానే గాక నటుడుగాకూడా తన ప్రతిభను సమర్థవంతంగా నిరూపించుకున్నారు 'స్వర్గం-నరకం' చిత్రం ద్వారా. తెలుగులో దాసరి నిర్వహించిన ఆ పాత్రను సంజీవ్‌కుమార్ పోషించిన హిందీ చిత్రం 'స్వర్గ్-నరక్' దాసరి దర్శకత్వంలోనే తయారయింది. బి. నాగిరెడ్డి నిర్మించారా చిత్రాన్ని. ఇప్పుడు మరోసారి తాను కథానాయకుడిగా నటిస్తూ దాసరి నారాయణరావు 'పెద్దిల్లు చిన్నిల్లు' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మావుళ్ళయ్య నిర్మాత. ఈచిత్రం ప్రారంభోత్సవానికి వచ్చిన పత్రికా ప్రతినిధులతో దాసరి ఇష్టాగోష్టిగా చాలా విషయాలు చర్చించారు. ప్రముఖ హిందీనటుడు జితేంద్ర హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న 'కటకటాల రుద్రయ్య' హిందీ వెర్షన్‌కు దర్శకత్వం వహిస్తున్నారు దాసరి. ప్రయోగాత్మకంగా తను నిర్మించ తలపెట్టిన 'నీడ' చిత్రంకూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు దాసరి. పెద్దిల్లు చిన్నిల్లు చిత్రం వినోదభరితంగా వుండటమేగాక సంసార జీవితంలో ఒక సమస్యను ప్రతిబింబిస్తూ ప్రయోజనాత్మకంగా కూడా వుంటుందన్నారు దర్శకనటుడు దాసరి నారాయణరావు. ఈ చిత్రంలో దాసరి సరసన కథానాయికలుగా ప్రభ, దీప నటిస్తున్నారు.

ఆడదంటే అలుసా!

అదేమో తెలియదుగానీ యీ చిత్రానికి సెన్సారు సర్టిఫికేటు తెచ్చుకోవడం అంతసులువు కాలేదు. ఒక స్థితిలో సెన్సారువారిచే సర్టిఫికేట్

'ఎంకి-నాయుడు బావ'లో జానకి, శోభన్ బాబు, చంద్రమోహన్





బాపు సన్మానసభలో సన్మానితునికి పుష్పగుచ్ఛాన్నందించి అభినందిస్తున్న స్వాతి సంపాదకుడు బలరాం

నిరాకరించబడిందీ చిత్రం. ఈ చిత్రాన్ని నిర్మించిన నవభారత్ డిస్ట్రిబ్యూటర్స్ అధినేత 'బాబూరావు' తమ కార్యాలయంలో ఏర్పాటు

'పెద్దలు–చిన్నల్లు'లో
దాసరి నారాయణరావు



చేసిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో యీ విషయాన్ని వివరించారు. కన్నడంలో నిర్మించబడ్డ ఓ చిత్రం ఆధారంగా తయారయిన యీ చిత్రం సెన్సార్ సర్టిఫికేటు నిరాకరించబడ్డ తర్వాత తిరిగి ఎన్నో మార్పులతో (రివైజ్డ్) 'పెద్దలకు మాత్రమే' మార్కుతో సెన్సార్ సర్టిఫికేటు పొందింది. చిత్రమేమిటంటే యీ చిత్రానికి మూలమైన కన్నడ చిత్రంకూడా ఇన్ని బాధలూ అనుభవించింది. మురళీమోహన్, నరసింహరాజు, ఈశ్వరరావు, గోకిన రామారావు, ప్రభ, కాంచన మొదలయినవారు నటించిన ఈచిత్రం త్వరలో విడుదల కాబోతోంది.


బాపుకు సన్మానం!

తెలుగు చిత్రానికి విదేశాలలో ఖ్యాతినార్జించి పెట్టిన దర్శకుడు బాపు, తెల్లవాడికి తెలుగు 'వాడి' చూపి స్వదేశానికి తిరిగొచ్చిన సందర్భంలో స్వాతి మాసపత్రిక ఆయనను ఘనంగా సన్మానించింది. డిసెంబర్ పదిహేనున విజయవాడలో జరిగిన సన్మానసభకు నటుడు కృష్ణంరాజు అధ్యక్షత వహించారు. కృష్ణాజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్. వీరనారాయణరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ సభా వేదికపై బాపుపేరు వినగానే గుర్తొచ్చే మరో వ్యక్తి ముళ్ళపూడి వెంకటరమణకూడా వుండి ఈ సంతోషాన్ని పంచుకున్నారు. స్వాతిసంపాదకుడు వేమూరి బలరాం బాపును పుష్పమాలా



'కమలమ్మ కమతం'లో కృష్ణంరాజు, జయంతి

లంకృతుడ్నిచేసి ఆయనచేతికి స్వర్ణకంకణాన్ని అలంకరించారు. 'బాపు గీసిన బొమ్మలు ఎంత అందంగా వుంటాయో ఆయనతీసిన బొమ్మలు కూడా అంత అందంగా వుంటాయ్' అన్నారు ఈ సందర్భంలో ఉపన్యసించిన డా॥ కొమ్మూరి వేణుగోపాలరావు. రచయిత, నిర్మాత ఎమ్వీయల్ బాపు జోకుల్తోపాటు తనజోకులూ కలిపి బాపు బర్త్‌డే ప్రెజెంటేషన్‌గా ఇచ్చారు. ఈ సన్మానం జరిగినరోజే బాపు జన్మదినం కావడం విశేషం. వివిధ సంస్థలు, పత్రికా ప్రతినిధులు బాపుని పుష్పమాలాలంకృతుల్ని చేసి అభినందించారు. స్వాతి సినిమా ప్రతినిధి డి. ప్రభాకర్ సన్మానపత్రం సమర్పించారు బాపుకి. జ్యోతి మాసపత్రిక రూపశిల్పుల్లో ఒకరయిన'సంతకం అక్కర్లేని చిత్రకారుడు' బాపుకి సన్మానం జరగడం మాకెంతో ఆనందాన్ని కలిగించింది. బాపు మరిన్ని విజయాలు సాధించాలనీ, మరిన్ని సన్మానాలు ఆయనకు జరగాలనీ జ్యోతి ఆకాంక్షిస్తోంది—సన్మానం జరిపిన సోదరమాస పత్రిక స్వాతిని అభినందిస్తోంది.



'మా వారి మంచితనం'లో వాణిశ్రీ, రామారావు



'ఇంటింటి రామాయణ 'లో జయసుధ, చంద్రమోహన్, పి. ఎల్. నారాయణ

పినిశెట్టికి సన్మానం

ప్రముఖ రచయిత పినిశెట్టి శ్రీరామమూర్తికి చలనచిత్ర రంగంలో రచయితగా 25 సంవత్సరాలు పూర్తి అయింది. ఆయనకు 60 సంవత్సరాల వయసు రావడంతోపాటు, ఆయన రచన చేసిన చిత్రాల సంఖ్యకూడా 60కి చేరింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన షష్ఠిపూర్తి మహోత్సవం మద్రాసులో ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు పరకాల శేషావతారంగారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో. దర్శక సంఘ అధ్యక్షులు దాసరి నారాయణరావు సన్మాన పత్రాన్ని సమర్పించారు. ప్రముఖ నిర్మాత డి. వి. యస్. రాజు స్వాగతోపన్యాసం, నటుడు జగ్గయ్య ప్రారంభోపన్యాసం చేసి పినిశెట్టి ప్రతిభను కొనియాడారు. చిత్రరంగంలో వివిధ శాఖల వారు పినిశెట్టికి పుష్పమాలలు సమర్పించి అభినందనలు అందజేశారు. పలువురు చిత్ర ప్రముఖులు పినిశెట్టిని అభినందిస్తూ ప్రసంగిం



'ముత్తయిదువ'లో జయచిత్ర



'కలియుగ మహాభారతం'లో మాధవి, నరసింహారాజు


చారు. సన్మానితుడు తనకు జరిగిన సన్మానానికి ఉచితరీతిని సమాధానమిచ్చారు.

శోభన్‌బాబుతో నలుగురు నాయికలు!

కవితా ఫిలింస్‌వారు నిర్మించే వర్ణచిత్రంలో శోభన్‌బాబు హీరోగా నటిస్తున్నాడు. శారద, శ్రీదేవి, గీత, రోజారమణి, అల్లు రామలింగయ్య, రమాప్రభకూడా నటిస్తున్నారీ చిత్రంలో. నటుడు ప్రభాకరరెడ్డి కథ సమకూర్చిన ఈ చిత్రానికి మద్దిపట్ల సూరి సంభాషణలు సమకూరుస్తున్నారు. దర్శకత్వం లక్ష్మీదీపక్.

"రావణుడే-రాముడైతే?"

లక్ష్మీఫిలింస్ కంబైన్స్ స్కోప్‌లో భారీయెత్తున నిర్మిస్తున్న వర్ణచిత్రం "రావణుడే—



'ఇద్దరూ అసాధ్యులే'లో కృష్ణ, గీత

రాముడైతే....?". అక్కినేని కొత్త తరహా పాత్రధారణ చేస్తున్న యీ సాంఘిక చిత్రానికి కథ, మాటలు, చిత్రానువాదం దర్శకత్వాన్ని దాసరి నారాయణరావు చేపట్టారు.

నాగేశ్వరరావు, మురళీమోహన్, ప్రభాకరరెడ్డి, మోహన్‌బాబు, మాడా, కె. వి. చలం జయచిత్ర, లత నటిస్తున్నారీ చిత్రంలో.

శ్రీమతి ఎస్. ఆర్. అనురాధాదేవి నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి. కె. వెంకటేష్ సంగీతాన్ని, కె. ఎస్. మణి ఛాయాగ్రహణాన్ని నిర్వహిస్తున్నారు.

మావారి మంచితనం

'ఆస్తులు - అంతస్తులకంటే అనురాగమే గొప్పది' అని చక్కని సందేశాన్ని అందించే కథాసారంగల 'మావారి మంచితనం' చిత్రాన్ని ఈస్ట్‌మన్ కలర్‌లో శ్రీ భాస్కరచిత్ర పతాకం కింద ప్రముఖ దర్శకుడు బి. ఎ. సుబ్బారావు దర్శకత్వంలో రూపొందించారు. సంగీతం: మాస్టర్ వేణు, కెమెరా: ఎం. ఏ. రహమాన్, నిర్మాత ఎ. పుండరీకాక్షయ్య. ఎన్. టి. రామారావు, వాణిశ్రీ, జగ్గయ్య, పద్మనాభం, హరిబాబు, మిక్కిలినేని, దేవిక, పుష్పకుమారి, ఛాయాదేవి మొదలగువారు నటిస్తున్నారీ చిత్రంలో.

పట్నం పిల్ల

ఇంతవరకూ అందాల నటుడిగా, శృంగార పురుషుడిగా తెరపై మిమ్ముల్ని అలరింపజేసిన మీ అభిమాన నటుడు కమల్‌హాసన్ యిప్పుడు ఉమాదేవి పిక్చర్స్‌వారి "పట్నం పిల్ల" చిత్రంద్వారా కొత్తతరహా పాత్రలో మీముందు నిలుస్తాడు. మురళీమోహన్, కమలహాసన్ జంట నాయకులుగా నటించు మొదటిచిత్రం ఇది.

మోహన్‌బాబు, శ్రీదేవి, రమాప్రభ, పి. ఆర్. వరలక్ష్మి తదితరులు నటించిన యీ చిత్రానికి దర్శకులు కె. సత్యం, సంగీతం చక్రవర్తి, మాటలు వీటూరి, ఫోటోగ్రఫీ సాయిప్రసాద్, నిర్మాత కె. తాతాజీ.


— యస్వీ నారాయణ



'తాయారమ్మ-బంగారయ్య'లో రంగనాథ్, సంగీత

ఫోన్ : 53737

ఉబ్బస వ్యాధికి ఉత్తమ చికిత్స



గౌతమి ప్రజా వైద్యశాల

డాక్టరు సుంకు బలరాం, L. A. M. & S.
ఫిజిషియన్ అండ్ సర్జన్ క్లాస్ 'ఏ'
మెడికల్ ప్రాక్టిషనర్

హెచ్. నం. **4-2-1069.** సుంకు భవనం
జయసూర్య మార్గ్, రామ్‌కోటి,

హైదరాబాదు-500 001

ప్రతినెల డాక్టరుగారి క్యాంపుల వివరములు


సరికొత్త క్యాంపులు

ప్రతినెల 2 వ తేది ఏలూరు కేసర్లపల్లి ఆంజనేయ ధర్మశాల (బస్‌స్టాండుదగ్గర) మ. 1 గం నుండి 2 గం.

ప్రతినెల 14 వ తేదీ తిరుపతి హోటల్ విక్రమ్ (ఆర్.టి.సి. బస్‌స్టాండుదగ్గర) ఉ. 8 గం. నుండి 12 గం.

1వ తేదీ	గుంటూరు	కన్యకాపరమేశ్వరి దేవస్థానం (లాలాపేట)	ఉ. 9 గం. నుండి 2 గం.
1వ తేదీ	విజయవాడ	బృందావన్ లాడ్జి, (కాంగ్రెస్ ఆఫీసురోడ్డు)	సా. 6 గం. నుండి 9 గం.
2వ తేదీ	గుడివాడ	మంజు లాడ్జి, (బస్టాండువద్ద)	ఉ. 8 గం. నుండి 11 గం.
2వ తేదీ	ఏలూరు	కేసరపల్లి ఆంజనేయ ధర్మశాల (బస్టాండు దగ్గర)	మ. 1 గం. నుండి 2 గం.
2వ తేదీ	రాజమండ్రి	హోటల్ అప్సర (గోదావరి స్టేషన్‌దగ్గర)	సా. 6 గం. నుండి 9 గం.
3వ తేదీ	విశాఖపట్నం	హోటల్ మనోరమ (జ్యోతిథియేటర్ దగ్గర)	ఉ. 10 గం.నుండి మ. 2 గం
4వ తేదీ	ఖమ్మం	మయూర లాడ్జి	ఉ. 8 గం. నుండి 11 గం.
10వ తేదీ	ఒంగోలు,	గౌతమీ క్లినిక్ (జిల్లా పరిషత్ దగ్గర)	ఉ. 8 గం. నుండి 11 గం.
మరియు	నర్సారావుపేట	శ్రీనివాసా లాడ్జి	సా. 4 గం. నుండి 6 గం.
25వ తేదీ	చిలకలూరిపేట	శ్రీ గంగాభవన్ లాడ్జి	రా. 7-30 నుండి 9 గం.
14వ తేదీ	అనంతపురం	బృందావన్‌లాడ్జి (శ్రీ రఘువీర టాకీస్‌వద్ద)	ఉ. 8 గం. నుండి 2 గం.
15వ తేదీ	తిరుపతి	హోటల్ విక్రమ్	ఉ. 8 గం. నుండి 12 గం.
15వ తేదీ	పలమనేరు	ఆర్.బి. ట్రావెలర్స్ బంగ్లా	12 నుండి 5 గం. వరకు

ఎన్. బి: పై క్యాంపులన్నిటికి డాక్టరుగారు తప్పక హాజరు కాగలరు.



Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam,Madras-600024,& Printed by D. Hanuman-